కృష్ణా జిల్లా

# స్వాతంత్ర్య పోరాటు చరిత్ర

సంకలనం:

కలపాల సూర్యప్రకాశరావు, ఎమ్. ఎల్. సి.

కృష్ణా జిల్లా కాంగ్రెసు సంఘం

పట్టాభి భవనం - మచిలీపట్నం

ప్రథమ ముద్రణ : 4-12-1975

ప్రతులు : 1000

ద్వితీయ ముద్రణ : 8-5-1976

ప్రతులు : 2500

954.8417
సూ.క--క్రి

48761 C.1993)

ప్రింటింగు : చంద్రకళా ప్రెస్ - మచిలీపట్టణం

ముఖచిత్రం : లితో కృష్ణమూర్తి - మచిలీపట్టణం

# ముందుమాట

కృష్ణాజిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్రను సంకలనముచేసే బాధ్యత తను జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు నాపై ఉంచినారు. నేను ఎందరో మిత్రులకు యీ భోగట్టా నిమిత్తము వుత్తరాలు వ్రాశాను. వారందరు శ్రద్ధ వహించి, కొంత సమాచారము అందజేశారు. 1936 వరకు జరిగిన చరిత్రను తూర్పు, పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘాలు, కాంగ్రెసు స్వర్ణోత్సవ సందర్భములో చెరియొక గ్రంథముద్వారా ప్రకటించియున్నవి. అవి సమగ్రముగానే యున్నవి. అందలి ముఖ్య భాగములతోసహా అనంతర విషయాన్ని సేకరించి, ప్రకటించడము మంచిదని భావించి, ఆ రెండు గ్రంథాలలోని విషయమంతా తీసుకున్నాము.

ముఖ్యముగా 1942 క్విట్ ఇండియా ఉద్యమ చరిత్ర సేకరించడము జటిలమైన సమస్య. దీనిని సేకరించుటకు అనేక గ్రామాలు స్వయముగా తిరగవలసి వచ్చినది. ఆనాడు ఉద్యమములో పనిచేసినవారిని కల్సుకొని సమాచారము సేకరించుట జరిగినది. ఈ ఉద్యమములో జైళ్ళకు వెళ్ళకుండా అజ్ఞాతముగావుండి పనిచేసిన దేశభక్తులెందరో యున్నారు. వారందరిని వెలుగులోనికి తేవాలని ప్రయత్నించాము. అయితే 33 యేండ్లకు పూర్వపు సంగతి గనుక చాలవరకు ఆ నాటి ఘట్టాలు మరుగున పడిపోయినవి. ఆనాడు రంగములో వుండి నడిపిన వ్యక్తులు చాలమంది యీ నాడు లేరు. వున్నవారిలో ఎక్కువమందికి జ్ఞాపకాలే లేవు. అందుచేత 42 నుంచి 45 వరకు జరిగిన యదార్థగాథలు యింకా యెన్నో మరుగునపడివున్నవని మా నమ్మిక. అయినమా శక్తివంచన లేకుండా ప్రయత్నించి, అందినంతవరకు యీ సమాచారమును మీ ముందు వుంచగలిగినాము.

స్వాతంత్ర్యోద్యమము ప్రక్కన అనేక సహ ఉద్యమాలుకూడ కాంగ్రెసు నడిపినది. రైతు సమస్యలు, కార్మిక సమస్యలు, స్త్రీల సమస్యలు, ఖాదీ, స్వదేశీ ఉద్యమాలు, స్వతంత్ర పోరాటముతోపాటు విరామ సమయాలలో నిర్మాణ కార్యక్రమ భాగముగా నడుపబడి, ప్రజలను చైతన్య వంతులను చేసింది. అందుకని, ఆయా రంగాలకు చెందిన వివరాలుకూడ సూక్ష్మంగా యివ్వబడినవి.

మహాత్మా గాంధీగారు యీ జిల్లాలో మొత్తము 7 సార్లు వివిధ విషయాలకై చేసిన సంచార వివరాలుకూడ సేకరించినాము. ఈ వివరాలు అందించిన గాంధీ స్మారక నిధి కార్యదర్శి శ్రీ కోదాటి నారాయణరావు గారికి కృతజ్ఞులము.

ఈ దేశములో కమ్యూనిష్టుపార్టీది మొదటినుంచీ ఒక విచిత్రమైన పద్ధతి. కాంగ్రెసు సాగించిన ప్రతి ఉద్యమాన్ని అది వ్యతిరేకించినది. స్వాతంత్ర్యా నంతరము యీ జిల్లాలో అనేకమంది కాంగ్రెసు కార్యకర్తలను రాత్రిపూట దాడులుచేసి, చంపివేసినది. ఆ వివరాలుకూడ కొంతవరకు యివ్వబడినవి.

ఈ పోరాట చరిత్రలో ముఖ్యముగా గమనించవలసినది యేమనగా 1905 నుంచి 1921 వరకు ఆంగ్ల విద్యాధికులైన నగరవాసులు తప్ప పల్లెవాసులు చాల అరుదుగా పాల్గొన్నారు. 1930 ఉప్పు సత్యాగ్రహము నాటికి దాదాపు జిల్లాలో అన్ని గ్రామాలలోని రైతు యువకులు యీ ఉద్యమమునందు దూకినారు. వారు అనేక త్యాగాలు చేసినారు. లాఠీ దెబ్బలకు గురియైనారు. జైళ్ళకు వందలాది సంఖ్యలో వెళ్ళినారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమ రోజులలో వీరు వారు అను విచక్షణ లేకుండా అన్ని వర్గాలవారు ఉద్యమములో పాల్గొని, ప్రజా విప్లవము సాగించినారు. ఈ అన్ని ఉద్యమాలలోను జైళ్ళకు వెళ్ళినవారివి, లాఠీ ఛార్జీలకు గురియైనవారివి, ఉద్యమములో పాల్గొన్నవారివి పేర్లు గ్రంథము చివరి భాగములో వివిధ అనుబంధములలో తెలియజేయబడినవి.

ఈ వివరాల సేకరణలో తోడ్పడిన మిత్రులకు మరొకసారి అభివందనములు తెలుపుతున్నాం. ముఖ్యముగా నాతోపాటు విషయ సేకరణలో అనేక గ్రామాలుతిరిగి, అనేక గ్రంథాలు చదివి అందలి ముఖ్య విషయాలు సేకరించి, చిత్తుప్రతి వ్రాయుటలోను, తరువాత మేలుప్రతిని తయారు చేయుటలోను, పూర్తిగా సహాయపడిన, స్వాతంత్ర్య సమర యోధుడు శ్రీ నాగులపల్లి సీతారామయ్యగారికి ప్రత్యేక అభివందనములు.

ఈ జిల్లాకు సంబంధించినంతవరకు ఈ చరిత్రను సేకరించే అవకాశం నాకు యిచ్చినందుకు, చిరకాల మిత్రులు, జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్టిగారికి కృతజ్ఞతలు. పైన తెలుపుకున్నట్లుగా యిందు లోపములున్నచో సహృదయులు మన్నింతురుగాక ! వున్న లోపములు మా దృష్టికితెచ్చి, మరుసటి ముద్రణలో సరిచేయింతురు గాక !

ఇట్లు,

ముదునూరు
1-9-75

కలపాల సూర్యప్రకాశరావు, ఎమ్. ఎల్. సి.
సంకలనకర్త

**జలగం వెంగళరావు**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

# సందేశము

ప్రపంచంలో అనేక దేశాల్లో అనేక విప్లవాలు జరిగాయి. అనేక పద్ధతులను అనుసరించి జరిగాయి. కాని భారతదేశంలో పరప్రభుత్వానికి వ్యతిరేకముగా జరిగిన రాజకీయ విప్లవం వంటిది ప్రపంచంలో ఎక్కడా జరుగలేదు. పైగా దాని ప్రభావం విదేశాలలోని అనేకమంది రాజకీయ నాయకులమీద పడి ప్రపంచమంతటిని విస్మయ పరచింది.

భారత స్వాతంత్ర్యోద్యమచరిత్ర ప్రధానముగా అహింసా సిద్ధాంత చరిత్ర. మారణాయుధాలతో నిరాయుధులైన ప్రజలమీద పాలకవర్గంచేసే హింసాత్మకమైన దాడిని ఓర్పుతో, మంచితనముతో, శత్రువుమీద ప్రేమతో ద్వేషభావము లేకుండా ఎదుర్కొన్న సామాన్య ప్రజల త్యాగాల చరిత్ర. అందుకే మన స్వాతంత్ర్యోద్యమానికి ప్రపంచ రాజకీయ చరిత్రలో ప్రముఖ స్థానం వుంది.

దేశ స్వాతంత్ర్య చరిత్రలో అంధ్రప్రదేశ్ వహించే పాత్ర, అందులో కృష్ణాజిల్లా వహించిన పాత్ర ప్రత్యేకంగా పేర్కొనవలసిన పనిలేదు. యావద్భారత దృష్టిని ఆకర్షించిన డా॥ పట్టాభి, అయ్యదేవర కాళేశ్వర రావు, కాశీనాధుని నాగేశ్వరరావు, పింగళి వెంకయ్యా, అన్నె అంజయ్యా, గొట్టిపాటి బ్రహ్మయ్య ప్రభృతులైన మహానాయకులకు పుట్టినిల్లు కృష్ణాజిల్లా. ఈ జిల్లా ప్రజలు స్వాతంత్ర్య సాధన కృషిలో చేసిన త్యాగాలు చిరస్మరణీయాలు.

మొదటినుంచి కృష్ణాజిల్లా జమీందారులకు నిలయముగా వున్నది. భూస్వామ్యవర్గము యొక్క ప్రభావం ఈ జిల్లా ఆర్థిక జీవితంమీద అధికంగా ఉండేది. ప్రజలు అనేకసార్లు పోరాటాలు జరపడం, ప్రభుత్వం జమీందారీల రద్దు చట్టం చేయడం మొదలగు చర్యలవల్ల వారి పలుకుబడి తగ్గిపోయి ఇప్పుడు సామాన్యప్రజల పలుకుబడిలోనే జిల్లారాజకీయాలు నడుస్తున్నవి. మనం ఈనాడు అనుసరిస్తున్న భూ సంస్కరణల వల్ల కూడా సామాన్య ప్రజలకు ఇంకా ఎంతో లాభం చేకూరుతుంది.

ఈ జిల్లాలో అనేక క్షేత్రాలు వివిధ రకాలుగా ప్రాధాన్యము కలిగిన స్థలాలు వున్నాయి. విజయవాడ ఆంధ్రదేశానికి గుండెకాయ వంటిది. వ్యాపారరంగంలోను, సాంస్కృతిక విషయాలలోను ఇది అతి ప్రధానం అయిన నగరము. ఇప్పుడు ప్రచురించిన గ్రంథములో అనేక విషయాలు ఈనాడు యువతరం వారికి తెలియదగినవి, వారు నేర్చుకోవలసినవి ఉన్నాయి. ఈ కృషి ప్రశంసనీయం అయినదని నా అభిప్రాయం.

ఇటీవలనే గుంటూరుజిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్రను శ్రీ మాదల వీరభద్రరావు వ్రాసి ప్రకటించారు. ఈ విధముగా మన రాష్ట్రములో ప్రతి జిల్లాకు సంబంధించిన స్వాతంత్ర్యోద్యమ చరిత్రలు వ్రాసి ముందు తరాలవారికి ఉత్సాహాన్ని కల్పించవలసిన అవసరం ఎంతోవుంది.

కృష్ణాజిల్లా చరిత్రను ప్రకటించడంలో మీరు చేసిన కృషిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

హైద్రాబాదు
24-10-1975

(సం.) జలగం వెంగళరావు

**వీరమాచనేని వెంకటనారాయణ**
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంఘం

# సందేశము

కృష్ణాజిల్లా స్వతంత్రపోరాట చరిత్ర సమగ్రముగా చదివి ఎంతో ఉత్తేజపడినాను. కృష్ణాజిల్లా చరిత్ర మాత్రమేగాక ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ ఉద్యమాల చరిత్రకూడ అయియున్నది. ముఖ్యముగా అశేషమయిన స్వతంత్ర సమరయోధులు ఆ రోజులలో అనుభవించిన కష్టనష్టములు, ప్రజానీకాన్ని సమాయత్తముచేయు కార్యక్రమములో వారు ఎదుర్కొన్న సంఘటనలు, స్వాతంత్ర్య సముపార్జన సఫలీకృతము అగు సమయానికి ముందు దేశవ్యాప్తముగా కాంగ్రెసుపైనున్న నిషేధము, ఆ పరిస్థితులలో రాష్ట్ర కాంగ్రెసు అసెంబ్లీ అనే సంస్థను స్థాపించి దానికి- శ్రీ కల్లూరు చంద్రమౌళిగారని అధ్యక్షులుగాను, శ్రీ నీలం సంజీవరెడ్డిగారిని కార్యదర్శిగాను ఏలూరులో ఎన్నుకొని రాష్ట్రవ్యాప్తంగా బహుళ ప్రచారం సాగించి ఆంధ్రప్రజలను ఉత్తేజపరచిన సంగతులు మరువజాలని యదార్థములు.

కృష్ణాజిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్య శ్రేష్ఠిగారు ఈ పుస్తకమును వెలువరించడములో తీసుకున్న శ్రద్ధ, సల్పిన కృషి అద్వితీయము, ముదావహము, అభినందనీయము.

హైదరాబాదు
7-11-1975

(సం.) వీరమాచనేని వెంకట నారాయణ

# కృ త జ్ఞ త

స్వాతంత్ర్యోద్యమములో కృష్ణాజిల్లాలో జరిగిన పోరాట చరిత్రను ప్రకటించవలెనను కోరిక చిరకాలమునుండి కోరికగానే వుండిపోయినది. నేటికి ఆ చరిత్రను ప్రచురించు అవకాశము కలిగినందుకు సంతోషపడు చున్నాను. ది 6-4-1975-వ తేదీన గుడివాడలో జిల్లా కాంగ్రెసు సర్వ సభ్య సమావేశము జరిగినపుడు జిల్లా కాంగ్రెసు కార్యకర్తల శిక్షణ శిబిరం నడుపుటకున్నూ, ఆ సందర్భములో జిల్లా సమర చరిత్రను ప్రచురించుట కున్నూ నిర్ణయం చేయడం జరిగినది.

ఆ తీర్మాన ఫలితంగా విషయసేకరణకు పూనుకున్నాం. పత్రికలలో అనేక ప్రకటనలుచేసి తమకు లభ్యమైన విషయమును జిల్లా కాంగ్రెసు సంఘానికి పంపవలసినదిగా కోరియున్నాము. మరెందరో ముఖ్య కార్య కర్తలకు, పెద్దలకు ఉత్తరాలుకూడా వ్రాసినాము. అందరూ సహకరించి అనేక వివరాలు అందజేశారు. అంతేగాక మిత్రులు శ్రీ కలపాల సూర్యప్రకాశరావు, యమ్. యల్. సి. గారు ఆ నాడు స్వాతంత్ర్యోద్యమ ములో విశేషముగా త్యాగాలుచేసిన గ్రామాలను స్వయముగా దర్శించి అక్కడి మిత్రులద్వారా కొంత విషయము సేకరించారు.

ఎంత ప్రయత్నించినా, ఎందరు విషయజాలమందజేసినా యింకా చరిత్రలో మరుగునపడిన సంఘటనలెన్నో మిగిలిపోయి వుండవచ్చును. అతిత్వరగా ప్రథమ ముద్రణ గ్రంథాన్ని పూర్తిచేసి నెహ్రూ జయంతి నాటికి చదువరులకందించాలనే ఆదుర్దాతో మరికొన్ని విషయములు విస్మరించబడి వుండవచ్చు. ఈ తక్కువ వ్యవధిలోనే శక్తికొలది ప్రయత్నముచేసి సాధ్యమైనంతమేరకు విషయాన్ని సేకరించడం జరిగినది. ఒకవేళ యే

కారణముచేతనయినా యింకా యిందులో పొందుపరచబడని విషయాలుంటే మన్నించి మా కందజేస్తే వాటిని అనుబంధముగానయినా ప్రచురించే ప్రయత్నము చేస్తాము.

ఈ గ్రంథ ప్రచురణకు విషయ సేకరణలో సహాకరించిన మిత్రులకు, తక్కువ వ్యవధిలో సంకలనం పూర్తిచేసి అందించిన మిత్రులు శ్రీ కలపాల సూర్యప్రకాశరావు, యమ్. యల్. సి. గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మరియు ప్రథమ, ద్వితీయ గ్రంథ ప్రచురణలకు విరాళములొసంగి సహాకరించిన దాతలకు ప్రత్యేక వందనాలర్పించుచున్నాను

జైహింద్ !

మచిలీపట్టణం
8-5-1976

రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠి
అధ్యక్షులు
కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘం

# పీ ఠి క

20 వ శతాబ్దము నాటికే కృష్ణాజిల్లా జాతీయ భావాలకు పుట్టినిల్లు. నేటి గుంటూరు, పశ్చిమ గోదావరి జిల్లాలలో హెచ్చుభాగము ఆనాడు కృష్ణాజిల్లాలోనే ఉండేది.

అఖిలభారత కాంగ్రెసు సమావేశాలలోని తీర్మానాలు మితవాద సరణిని వెల్లడించుచున్న కాలంలోనే, 1902 లో కృష్ణాజిల్లా సంఘస్థాపన జరుగుట, ఆ సంస్థతరపున భారతదేశ జీవనాడియగు పల్లెటూరు ప్రజలను రాజకీయంగానూ, సంఘ సంస్కరణలోను చైతన్యవంతులను చేయుటకు ప్రచారము చేయుట జరిగినది. యీ ప్రభోధానికి కృష్ణాపత్రికను 1902లో స్థాపించుట; ఆపత్రికా ప్రభోధమువల్ల ఎందరో యువకులు జాతీయ వీరులై స్వరాజ్య సంరంభ యోధులగుట క్రమపరిణామం.

బెంగాల్ విభజన, వందేమాతరం ఉద్యమం, 1906లో కలకత్తా కాంగ్రెసు అధ్యక్షత వహించిన భారతభీష్మ పితామహ దాదాభాయి నౌరోజి మహాశయుడు, స్వరాజ్యం, స్వదేశీ, జాతీయవిద్య మంత్రత్రయం; 1907లో లోకమాన్యుని స్వరాజ్యం నా జన్మహక్కు నేను దానిని సాధింతును అనే శంఖారవం కృష్ణాజిల్లా నాయకులను సత్వర కార్యోన్ముఖులను చేసింది. లోకమాన్యుని ఆధ్వర్యమున నడచు మరాఠా, కేసరి పత్రికలను దృష్టిలో వుంచుకుని 1908లో ఆంధ్రపత్రిక స్థాపన జరిగినది. విజయవాడలోనే స్వరాజ్యపత్రిక స్థాపనీయం జరుగుట, ఆ పత్రికలోని ఘాటైన వ్యాసాలకై సంపాదకులకు జైలుప్రాప్తి, లోకమాన్యుని అడుగుజాడలలో నడచుట జరిగినది. ఆంధ్రదేశమున గ్రంథాలయోద్యమము సహకారోద్యమము స్థాపించిన పితామహులు కృష్ణాజిల్లావారే అగుట గణనీయము. హరిజనోద్యమమునకై తమ జీవితమును అంకితము చేసిన సర్వసంగ పరిత్యాగులకున్నూ నిలయమై ప్రఖ్యాతినొందిన ఘనత కృష్ణాజిల్లాకు 1920కి పూర్వమే సిద్ధించినది. ఈకార్యనిర్వహణ సాగించిన పెద్దలను గూర్చి విపులంగా ఈగ్రంథమున గలదు. అహింస, సత్య, ధర్మములను అపూర్వమైన ఆయుధంగా సంధించి ఒక సామ్రాజ్యమును

అస్తమింపజేసి, స్వరాజ్యాన్ని స్థాపించిన జాతిపిత మహాత్ముని నాయకత్వాన, అనేక యుద్ధముల నారితేరిన యీ అతిరథ మహారథులు భారత వీరులగు భీష్మ, ద్రోణ, కృపాచార్యులతో పోల్చదగినవారు. యువకిశోరాలు వీరాభిమన్యునితో సరితూగ గలవారు. స్వరాజ్యం వచ్చిన తరువాత దానిని సురాజ్యంగా తీర్చిదిద్దుటలో మనవారు చూపిన, దీక్షా దక్షతలు, వహించినపాత్ర, రాజకీయ కౌశలము స్తవనీయము.

యీ చరిత్రనంతా విపులముగా విశదీకరించి ప్రజలకు అందుబాటులో వుంచి, యువకులను చదివించి, ప్రభావితులనుచేసి, దేశసౌభాగ్యాన్ని యినుమడింప జేయుటలో దీక్షాబద్ధులను చేయుటకు కృష్ణాజిల్లా కాంగ్రెసు అధ్యక్షులు పడిన ఆరాటం, కనిన కలలు కృష్ణాజిల్లా పోరాటచరిత్రగా రూపురేఖలను దిద్దుకొన్నది. దేశభక్తుడు, ప్రజానాయకుడు, మన ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు యిచ్చిన సందేశం ఈచరిత్రకు తలమానికమైనది. ఇందులకు నా ఆనందాన్ని తెలుపుతున్నాను.

యీగ్రంథరచన భారము వహించిన శ్రీ కలపాల సూర్యప్రకాశ రావుగారు దేశభక్తుడు, దేశస్వాతంత్ర్య సంరంభ యోధుడు, రాష్ట్రశాసన సభలో సభ్యుడు. కృష్ణాజిల్లా కాంగ్రెసుకు పూర్వాధ్యక్షులు కూడా. వీరు జిల్లాలోని మారుమూల గ్రామాలలోకూడ తిరిగి విషయసేకరణచేసి రచించిన సమగ్రమయిన చరిత్రయిది. దీనిని 4-12-75న జిల్లాకాంగ్రెసు భవనమున జరిగిన ఉత్సవములో రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షులు శ్రీవీరమాచనేని వెంకట నారాయణగారు ఆవిష్కరించి యుండిరి. తిరిగి స్వల్ప వ్యవధిలోనే, యింకా హెచ్చు విషయాన్ని సేకరించి 2వముద్రణ తీసుకు వచ్చిన యీ మిత్రద్వయం కృష్ణాజిల్లా నాయకద్వయం - రేపాల బుచ్చి రామశేషయ్యశ్రేష్ఠి, కలపాల సూర్యప్రకాశరావుగార్లను అభినందించు చున్నాను. వీరుభయులకున్నూ, కాంగ్రెసు సభ్యులెల్లరికిన్ని దైవాశీర్వచనము ఎల్లప్పుడూ వుండుగాక.

జైహింద్

ఘంటసాల
3-5-76

గొట్టిపాటి బ్రహ్మయ్య

# తదుపరి

# సందేశములు

# All India Congress Committee

V. B. RAJU — NEW DELHI

*General Secretary* — *3-1-1976*

I learn that you are publishng the 2nd Edition of the history of the freedom struggle of your district. It is a good thing that records of local participation in the freedom struggle should be maintained through such publications as these events may not find place in the history books which are published at the State and National levals.

The Krishna District has contributed many stalwarts for participation in the freedom struggle.

With best regards,

Yours Sincerely,

V. B. RAJU

* * *

Ch. VENKATA RAO — HYDERABAD

*Minister for P. W. D.* — *27-2-1976*

అనేక ఇక్కట్లకు గురియై, అశేష త్యాగాలుచేసి, కులమత వర్గరహితంగా, అహింసాత్మకంగా స్వాతంత్ర సముపార్జనకొరకు భారత దేశములో సాగించిన ప్రజా విప్లవము ప్రపంచ దేశములలో కని విని ఎరుగని చరిత్ర అందరికీ విశదమే. ఈ స్వాతంత్ర నిర్విరామ సమరములో ఆంధ్రులు వహించిన పాత్ర అతి ముఖ్యముగా కృష్ణాజిల్లాలో జరిగిన సంఘటనలు దేశ వ్యాప్తముగా ఆకర్షించబడినవి. ప్రముఖపాత్ర వహించిన నాయకులు కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు, డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు, అయ్యదేవర కాళేశ్వరరావుగారు, కాకాని వెంకట రత్నంగారు, గొట్టిపాటి బ్రహ్మయ్యగారు మరి ఇతర పెద్దలు చేసిన కృషి, త్యాగాలు ప్రశంసనీయమైనవేగాక, చిరస్మరణీయాలు.

నా మిత్రులు, సహచరులు, జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు అయిన శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠిగారు తగు శ్రద్ధ వహించి అనేక సంఘటనలను సేకరించి, సమకూర్చి ఈ పుస్తకమును ప్రచురించినందుకు నా అభివందనములు కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాను.

Ch. VENKATA RAO

**D. MUNUSWAMY, B. A., B. L.** HYDERABAD
*Minister for Fisheries, Ports,* *27-2-1976*
*Commerce and Export Promotion*

కృష్ణాజిల్లా కాంగ్రెసు కమిటీవారు ఆ జిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర గ్రంథమును ద్వితీయ ముద్రణ చేయబూనుట చాలా ఆనందదాయకము. యిందులకు ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కారకులైన వారినందరను నేను అభినందిస్తున్నాను. స్వాతంత్ర్య సమర పోరాటంలో కృష్ణాజిల్లా ప్రముఖ పాత్ర వహించుట జగద్విదితము. కృష్ణాజిల్లాలోగల రాజకీయ చైతన్యం అసాధారణమనుటలో అతిశయోక్తి లేదు. స్వాతంత్ర్య పోరాట చరిత్ర గ్రంథమును ప్రచురించుటలోగూడ కృష్ణాజిల్లాయే ముందంజవేయుట ముదావహము. యిందులకు కారకులైన శ్రీ శ్రేష్ఠిగారిని నేను హృదయ పూర్వకముగా అభినందిస్తున్నాను.

భవదీయుడు

డి. మునుస్వామి

* * *

**BHATTAM SRIRAMA MURTY** HYDERABAD
*Minister for Harijan and Tribal Welfare* *3-3-1976*
*and Technical Education*

మీరు పంపించిన పుస్తకం అందినది. చాలా బాగుంది. ఒక జిల్లా కాంగ్రెసు సంఘం యింత గొప్ప పనిచేయడం ప్రశంసనీయం. ఈ కృషికి బాధ్యులైన అందరినీ ముఖ్యంగా జిల్లా కాంగ్రెసు కమిటీ అధ్యక్షుడిని హృదయపూర్వకముగా అభినందిస్తున్నాను.

భట్టం శ్రీరామమూర్తి

* * *

**PIDATHALA RANGA REDDI** HYDERABAD
*Minister For Finance* *19-3-1976*

"కృష్ణాజిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర" అను గ్రంథమును జిల్లా కాంగ్రెసు సంఘం ప్రచురించుట చాలా సంతోషము.

దేశ స్వాతంత్ర్యమునకై సర్వస్వమును దారపోసి నిస్వార్థ సేవచేసిన త్యాగశీలుర గ్రంథము నేటి యువకులకు, ముందు తరాలవారికి ఎంతైన అవసరం. ఇట్టి కార్యక్రమమును చేపట్టిన జిల్లా కాంగ్రెసు కార్యవర్గమును అభినందిస్తున్నాను.

పిడతల రంగారెడ్డి

**ASIF PASHA** HYDERABAD

*Minister for Law, Courts, Prisons, Stationery & Printing* *27-2-1976*

మన జిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర గ్రంథము ద్వితీయ ముద్రణ చేయించుట శ్లాఘనీయము. మీలాంటి పెద్దల కృషివల్ల, మన జిల్లా నాయకుల చరిత్ర భావితరాలవారికి ఎంతో ఉపకరిస్తుందని, దేశ స్వాతంత్ర్య సమరంలో వారి పాత్రలు, వారి త్యాగనిరతి, దేశభక్తి ముందుతరాలవారిని ఉద్దీపింప జేస్తుందనడంలో సందేహంలేదు. మీ ప్రయత్నం సర్వవిధముల సఫలీకృతం కావాలని ఆకాంక్షిస్తున్నాను.

ఆసిఫ్ పాషా

*　　*　　*

**L. LAKSHMANADAS** HYDERABAD

*Minister for Panchayat Raj* *27-2-1976*

I have gone through the book - 'The History of Freedom Fighters of Krishna District' - with great interest and pleasure. It portrays not only the history of Freedom Fighters of Krishna District but also the History of Andhra Pradesh as well. The troubles and turmoils through which the Country has passed through during the years of stuggle for Independence, the sufferings and sacrifices cheerfully shouldered by the Freedom Fighters in those days, the activities of the Congress Party before and after a ban was imposed on the organisation and the activities of the organisation in Andhra Pradesh till the attainment of Independence are graphically and vividly described. I very much appreciate the trouble taken by Sri R. Buchi Rama Seshayya Sresty in collecting information and in bringing out this Book. I congratulate him on the work and commend that similar publications may be undertaken in respect of other districts so that we may adore and preserve the history of the Freedom Fighters for posterity.

L. LAKSHMANADAS

**R. S. SURYANARAYANA RAJU** HYDERABAD

*Minister for Endowments* *13-3-1976*

"కృష్ణాజిల్లా స్వాతంత్ర్య పోరాటము" జిల్లా కాంగ్రెసు సంఘం తరఫున ప్రచురించేరని, హెచ్చు ప్రతులు ముద్రించి అన్ని ప్రాంతాల్లో అందజేయాలని అనుకొంటున్నారనీ విని ఎంతో ఆనందించేను.

ఇది ఎంతో అవసరమని నా ప్రగాఢ విశ్వాసం. ఎందుచేతనంటే స్వాతంత్ర పోరాటంలో కృష్ణాజిల్లా యోధులెంతమందో ఎన్నో త్యాగాలు చేసేరు. వారి చరిత్ర విన్నవారకీ చదివినవారికీ చైతన్యం కలగక తప్పదు. దేశ సేవకు నూతనోత్సాహం కలగకనూ తప్పదు. యువకులని దేశ అభ్యున్నతి కార్యక్రమంలో భాగస్వాముల్ని చెయ్యడానికి ఇది తోడ్పడి తీరుతుంది. ఈ ప్రయత్నంలో కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘం కృతకృత్యులు కావాలని కోరుతున్నాను.

R. S. SURYANARAYANA RAJU

* * *

*Dr. Ch. DEVANANDA RAO* *HYDERABAD*

*Minister for Tourism* *20-3-1976*

Extremely happy to learn that "Krishna Zilla Swatantra Porata Charitra's Second Edition is proposed to be brought out in large number for distribution among all. The book contains various details about the Independence movement and the sacrifices made by several elders for the cause thereof in Krishna District. The very fact that the copies first published on *4-12-75* only have been exhausted and a second edition is being thought of shows the value and utility of the publication. I wish the venture all success.

With regards,

Yours Sincerely

Ch. DEVANANDA RAO

టి. వెంకట్రామయ్య    హైద్రాబాదు

ప్రధాన కార్యదర్శి - ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు సంఘం    31-3-1976

కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘం ఇటీవల ప్రచురించిన "కృష్ణాజిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర"ను చదివే అవకాశం లభించినది. దేశ స్వాతంత్ర్యోద్యమములో కృష్ణాజిల్లా నాయకులు, ప్రజలు ప్రదర్శించిన అంకుఠిత దేశభక్తి, అపూర్వమైన త్యాగం, మొక్కవోని ధైర్య సాహసాలను గురించి తెలుసుకొన్నకొలది ఒళ్ళు పులకరించినది. సంభ్రమాశ్చర్యాలతోపాటు సంతోషాన్ని గర్వాన్నిగూడ పొందాను.

జిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్రను, జాతీయ రాష్ట్రస్థాయి స్వాతంత్ర్య పోరాట అంతర్భాగంగా విపులంగా వివరిస్తూ, ఎంతో శ్రమ, పట్టుదలతో ఈ పుస్తక ప్రచురణకు తోడ్పడిన సంకలనకర్త శ్రీ కలపాల సూర్యప్రకాశ రావు, ఎ. ఎల్. సి. గారికి, జిల్లా కాంగ్రెసు సంఘాధ్యక్షులు శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠిగారికి నా అభినందనలు. ఇతర జిల్లాలలోగూడ ఇదేమాదిరి అక్కడి స్వాతంత్ర్య పోరాట చరిత్రల ప్రచురణా ప్రయత్నం జరిగితే చాలా బాగుంటుంది.

తలశిల వెంకట్రామయ్య

* *

మండలి వెంకట కృష్ణారావు    హైద్రాబాదు

విద్య, సాంస్కృతిక శాఖామాత్యులు    13-4-1976

"కృష్ణాజిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర" భావి తరములవారిని ఉత్తేజితుల జేయుటకు మీరు ఎంతో శ్రమించి ప్రచురించినందులకు అభినందించుచున్నాను.

స్వాతంత్ర్య సముపార్జనకు మన జిల్లాలో జరిగిన ఈ అమరగాథ ముందు తరాలవారికి ఎంతో వుపకరించుటయేగాక, వారిని దేశభక్తి ప్రపూరితులుగా తీర్చిదిద్దగలదని నా ప్రగాఢ విశ్వాసము. త్యాగములుచేసి సాధించిన ఈ స్వరాజ్యాన్ని సర్వజనులకు సుఖశాంతులు చేకూర్చు సురాజ్యముగా రూపొందించుటలో మనమంతా త్యాగముచేసి క్రమశిక్షణతో కృషిచేద్దాం!

మండలి వెంకట కృష్ణారావు

# కృష్ణా జిల్లా
# స్వాతంత్ర్య పోరాట చరిత్ర

## ప్రాచీన చరిత్ర

అవనిగడ్డ తాలూకాలోని శ్రీకాకుళము ఆంధ్రులకు ప్రప్రథమ రాజధానీ నగరం. క్రీస్తుశకానికి పూర్వం 400 సంవత్సరాల ప్రాంతంలో "నిశంభుడను" నాగరాజు పరిపాలన చేస్తున్నట్లు చరిత్ర చాటుచున్నది. మహాపద్మనందుడనే శాతవాహనరాజు ఇతనిని జయించి, ఈ నగరమును శాతవాహనుల ముఖ్యపట్టణంగా చేసుకొనెను. మౌర్య సామ్రాజ్యమునకు సామంతులుగావున్న వీరు అశోకుని మరణానంతరం ఆంధ్రవిష్ణువు కాలంలో స్వతంత్ర రాజ్యముగా ప్రకటించుకున్నారు. వీరి రాజ్యపాలన మూడు పువ్వులు ఆరు కాయలుగా వికసించినది. ఇక్కడనుంచే విదేశాలకు నౌకా వ్యాపారమును వీరు సాగించినారు. మచిలీపట్టణము, ఘంటసాల, గూడూరు, అనిగడ్డ రేవులద్వారా పడవలపై వ్యాపారము నడిచేది. ఆంధ్రవిష్ణువు స్మారక చిహ్నముగా ఒక దేవాలయముకూడ నిర్మించినారు. నేటికీ పూజార్చనలు జరుగుచున్నవి

బౌద్ధమతము శాతవాహనులకు ముందే ఈ జిల్లాలో ప్రవేశించినది. విజయపురనుంచి ఘంటసాలవరకు కృష్ణకు ఇరువైపుల ఎన్నో బౌద్ధ క్షేత్రములు నెలకొల్పబడియున్నవి. చరిత్ర ప్రసిద్ధమైన బౌద్ధ విశ్వవిద్యాలయం అనేక బౌద్ధ ఆరామములు విజయపురిలో నిర్మించారు. జగ్గయ్యపేటలో జన్మించిన సిద్ధనాగార్జునిచే నిర్మించబడిన స్థూపం నేటికీ చూపరులను ఆకర్షించుచున్నది. ఈయన గొప్ప వైద్యశాస్త్రజ్ఞుడు. వనమూలికల వైద్యములో నిపుణుడు. ఇతని చివరిరోజులు విజయపురిలో నాగార్జుననివద్ద గడిపినాడు. అమరావతిలోని చైత్యవిహారము, విశ్వవిద్యాలయము ప్రశంసనీయమైనవి. నందిగామ తాలూకా రామిరెడ్డిపల్లెలో కొండపైనగల స్థూపము ఇప్పటికీ చెక్కుచెదరకుండావుంది గుడివాడలో శిథిలమైపోయిన స్థూపావశేషాలు వున్నవి. స్థానికులు దీనిని లంజదిబ్బ అని పిలుస్తారు. కైకలూరు తాలూకా చిగురుకోటలో ఒక బౌద్ధరామం శిథిలాలు వున్నవి. గుడిమెట్ల, అల్లూరు, ఏలూరు తాలూకా గుంటుపల్లి గ్రామాలలోకూడ బౌద్ధ చిహ్నాలు వున్నవి. నాగార్జునకొండ శాసనములో కంటకశాల సంఘారామముగా పేర్కొనియున్న ఘంటసాలలో గొప్ప బౌద్ధ ఆరామ

నిక్షేపములున్నవి. ఇంత అందమైన స్థూపము దక్షిణ దేశంలో మరెక్కడ లేదని ప్రతీతి. ఇది మొహింజదారో శిల్పానికి చెందినదని వూహిస్తున్నారు. శ్రీకాకుళమును పాలించిన నాగరాజులు, వారి తర్వాతవారైన శాతవాహనులు వీటి నిర్మాణమునకు కారకులైనట్లు తెలుస్తున్నది.

దివి తాలూకా కోడూరు గ్రామము "జయవర్మ" అను బృహత్ఫలాయన రాజుకు రాజధానిగా కొంతకాలం వున్నట్లు తెలుస్తున్నది. ఆ కాలంలో దీనికి "కూడూరుహార" మని పేరుండేది. ఇక్కడ అనేక శిథిలాలు బయటపడుచున్నవి. ఈ బృహత్ఫలాయనులు శాతవాహనుల అనంతరపువారు.

విష్ణుకుండిన రాజుల కాలంలో నిర్మించబడిన బెజవాడ కనకదుర్గాలయము, మల్లిఖార్జునాలయము, మొగలాలజపురంలోని గుహాలయాలు ఇప్పటికీ ప్రాచీన కృష్ణామండల చరిత్రను, చిత్రకళను చాటుచున్నవి. ఇదే ఇంద్రకీలాద్రి పర్వతముపై అర్జునుడు తపస్సుచేసి పాశుపతాస్త్రమును సంపాదించినట్లు పురాణగాధ. బౌద్ధమతం క్షీణదశలో వున్నప్పుడు జైన సాంప్రదాయాన్ని విస్తరించుటకు విష్ణుకుండినులు బాగా తోడ్పడినారు. బౌద్ధ మతానంతరం జైన, శైవ మతాలకు బెజవాడ కేంద్రముగావున్నట్లు అనేక ఆధారాలు కనుపించుచున్నవి.

బెజవాడ, గుడిమెట్ల రాజధానిగా చేసుకొని "చాగిరాజ"వంశీకులు కొంతకాలం కృష్ణాజిల్లాను పాలించినారు.

కాకతీయుల అనంతరం స్వతంత్ర రాజ్యాలు ఏర్పరచినవారిలో రెడ్డిరాజులు ముఖ్యులు. కొండవీటి రాజ్యస్థాపకుడయిన ప్రోలయవేమారెడ్డి కొండపల్లి దుర్గాన్ని నిర్మించినాడు. కొంత కాలానికి ఒరిస్సా గజపతులు దీనిని ఆక్రమించుకున్నారు. అనంతరం తన ఉత్తర దిగ్విజయ యాత్రలో శ్రీకృష్ణ దేవరాయలు కొండపల్లి దుర్గాన్ని స్వాధీనం చేసుకున్నాడు. విజయానంతరం విజయవాడ దుర్గాలయాన్ని, శ్రీకాకుళము వెళ్ళి ఆంధ్ర విష్ణు ఆలయాన్ని సందర్శించాడు. ఆ రాత్రి ఆంధ్రవిష్ణువు కలలో ప్రత్యక్షమయి "ఆముక్తమాల్యద" అను కావ్యమును వ్రాయవలసినదిగా కోరినట్లున్నూ, రాయలు అందుకు పూనుకుని ఆ మహాకావ్యము

వ్రాసినట్లును ప్రతీతి. ఈ యాత్రలో కృష్ణాజిల్లాను ఆయన దర్శించి ఎన్నో దాన, ధర్మాలు చేసినట్లున్నది.

శ్రీకృష్ణదేవరాయల చైత్రయాత్ర అనంతరము కృష్ణామండలము నైజాం నవాబుల వశమైనది. కొండపల్లి జిల్లాను ప్రధాన కేంద్రముగా చేసుకొని, నైజాం ఏజెంటు పరిపాలన సాగించేవారు. ఈ కాలములో బందరు పెద్ద ఓడరేవుగా ప్రసిద్ధిచెందియుండెను. ఇంగ్లీషువారు మొట్ట మొదటగా యీ బందరు రేవులో దిగి ఒక ఫ్యాక్టరీని నిర్మించినారు. వీరి తర్వాత డచ్చివారు, అనంతరం ఫ్రెంచివారు బందరులోదిగి వ్యాపారము ప్రారంభించినారు. వీరు నైజాం మంత్రులైన అక్కన్న, మాదన్నలవద్ద ఆంధ్ర జిల్లాలలో వ్యాపారము పెంచుకొనుటకు అనుమతిని పొందినారు. వీరిలో వీరికి వ్యాపార స్పర్థలు పెరిగి, డచ్చివారిని, ఫ్రెంచివారిని వెడల గొట్టి, ఇంగ్లీషువారు యీ జిల్లాలపై ఆధిపత్యము సంపాదించినారు. క్రమేణా కోస్తాజిల్లాలన్నీ ఈస్టు ఇండియా కంపెనీ అధీనమైనవి.

"విడదీసి పాలించు" అనే బ్రిటీషు రాజనీతితో స్థానికులలో కలతలు పెంచారు. ప్రజలను అదుపులోవుంచే తాబేదారులు వారికి అవుసర మయ్యారు. తత్ఫలితంగానే, నామమాత్రంగావున్న జమీందారీవ్యవస్థను బలపర్చినారు. వీరందరు బ్రిటీషువారికి ఏజెంటులుగా వ్యవహరించసాగినారు.

ఇంతటితో ఆగక క్రైస్తవమత ప్రచారముద్వారా మరికొందరికి ఉన్నతస్థానములు కల్పించి, సాంఘిక విభేదాలు సృష్టించినారు. ఇంగ్లీషు భాషను ప్రవేశపెట్టి దేశ భాషలకన్నా దీనికి అత్యంత ప్రాధాన్యత కల్పించి, ధనికవర్గాన్ని లోబరచుకున్నారు. అందువల్ల సంపన్న కుటుంబీకులు రాజభక్తిపరాయణులుగా తయారు అయినారు. జాతిలో ఏర్పడిన యీ బలహీనతలను ఆధారం చేసుకొని, దేశ సంపదను దోపిడీచేయ నారంభించారు. అనేక గృహపరిశ్రమలను, వృత్తికళలను నశింపుచేసి, వాటి స్థానములో బ్రిటీషు వస్తువులను దిగుమతి చేయసాగారు. ఇందువల్ల ప్రజలలో నానాటికీ అసంతృప్తి ఎక్కువ కాజొచ్చినది.

ఈ అసంతృప్తి కారణంగా 19వ శతాబ్దం చివరి భాగంలోను, 20వ శతాబ్దం మొదట్లోను బ్రిటీషు సామ్రాజ్యవాదులపై జాతీయ పోరాటాలు తలయెత్తినవి. భారతప్రజల, బ్రిటీషుప్రజల మధ్యగల ఆర్థిక ప్రయోజ

గాల వైరుధ్యాల వలననే యీ పోరాటాలు రాబడినవి. బ్రిటిషు పరిపాలన భారత ప్రజానీకంలో చాలా అసంతృప్తికి గురియై జాతీయ భావాలు చిగురించ మొదలిడినవి. తత్ఫలితంగా దేశంలో రాజకీయ సంచలనం ప్రారంభమైనది.

భారతీయ సామాజిక జీవితములో ప్రతిరంగంమీద బ్రిటిషు పెత్తందారీతనము ఆధిపత్యం వహించినది. అన్నిరకాల ప్రజలను పీడింప సాగినది. దీనివల్ల సంస్థానాధిపతులు, జమీందారులు, మాజీ సైనికులు, చేతిపనులవారు, రైతులు, ఆమాంబాతు జనం బ్రిటిషు ప్రభుత్వముమీద 1757 నుండి 1857 వరకు చెదురుమదురుగా అనేక తిరుగుబాట్లు జరిపారు. దాదాపు నూరు సంవత్సరములు ప్రజలలో కలిగిన యీ అసంతృప్తివలన భారత సంస్థానాధీశుల నాయకత్వాన సాయుధ తిరుగుబాట్లు చేశారు. తమ స్వంత కష్టనిష్టూరాలవలన అనేకమంది కర్షకులు, వృత్తిపనివారలు తిరుగుబాటులో పాల్గొన్నారు. భూమి శిస్తు ఎక్కువ చేయడం, వృత్తిపని వారి వృత్తులను నశింపచేయడం, సంస్థానాధిపతులను తొలగించడం వలన యీ తిరుగుబాట్లు తలయెత్తాయి. ప్రతిచోట ప్రజాతిరుగుబాట్లు జరిగాయి. మఠాధిపతులు, సన్యాసులుకూడ యీ తిరుగుబాటులో పాల్గొన్నారు. ఇదేమోస్తరు తిరుగుబాట్లు ఆంధ్ర, ఒరిస్సా జమీందార్లుకూడ చేశారు. తమిళనాడులో పాళెగారుల తిరుగుబాటున్ను, మలబారు, దిండిగల్లులలో మాప్లా తిరుగుబాటులున్ను, తిరువాన్కూరులో రైతుల తిరుగుబాట్లు జరిగాయి. పశ్చిమ భారతదేశంలో సౌరాష్ట్రాధిపతులు, గుజరాత్ కూలీలు, మహారాష్ట్ర జమీందారులు తిరుగుబాట్లు జరుపుతూనే వున్నారు.

## ప్రథమ స్వాతంత్ర్య పోరాటము

బ్రిటిషువారి కుటిల రాజనీతిద్వారా తండ్రికి-కొడుకుకు, భార్యకు-భర్తకు తగవులు పెట్టి, మధ్య తాము ప్రవేశించి, స్వదేశ సంస్థానాధిపతులను తొలగించుచు, వారి రాజ్యములను హరించుచుండిరి. మైనరు పిల్లల రాజ్యాలకు తామే ధర్మకర్తలుగ పాలింపసాగిరి. దేశీయ చేతివృత్తులను నశింపచేయుచుండిరి. సైనికులలో మతభ్రష్టతకలిగించాలని క్రొవ్వుతోటాలు వాడుకలోనికి తెచ్చిరి. తెల్ల సైనికులకు యిచ్చిన మర్యాద దేశీయ సైనికులకు యివ్వరైరి. ఈఅసంతృప్తులన్నీ ఒకసారి ప్రజ్వరిలించి, శిపాయి

తిరుగుబాటుగా పరిణమించెను ఝాన్సీలక్ష్మిభాయి, పీష్వానానాసాహేబు, తాంతియాతోపే యీ తిరుగుబాటుకు నాయకత్వము వహించిరి.

1857 మార్చి 29వ తేదీన మంగళ పాండ్యా అను సైనికుడు ఒక చిన్న సంఘటనకు రెచ్చిపోయి, మొదటి తోటాను పేల్చాడు. విప్లవానికి నిర్ణయించిన తేది 1857 మే 31 తేదీ అయియున్నది. ఆనాడు దేశమంతా ఒకేసారి విప్లవం ప్రారంభించాలనుకున్నారు. అయితే మంగళ పాండ్యా అంతవరకు ఆగలేకపోయినాడు. తనను అవమానించిన యిద్దరు బ్రిటిషు సైనికాధికారులను చంపివేసినాడు. తోటి సైనికులు కలుగజేసుకుంటే, రహస్యము బయటపడిపోతుందని అతనికి ఎవ్వరు సహకరించలేదు. ఇంతలో ఇంగ్లీషు సైనికులు అతనినిపట్టుకొని బంధించినారు. అతని వద్దనుండి కుట్ర రహస్యాన్ని రాబట్టడానికి ప్రయత్నించారు. అతను ఏమాత్రము చెప్పలేదు. అతనిని కోర్టుమార్షలుచేసి ఉరితీసినారు.

అనంతరం సాగిన తిరుగుబాటు చాలకాలం జరిగినది. ఎందరో దేశభక్తులు మరణించారు. పేరుగల తెల్లదొరలెందరినో చంపివేసినారు. చివరకు శిక్కులను, రాజపుత్రులను, తమవైపుకు త్రిప్పుకొని, ప్రభుత్వము విప్లవాన్ని అణచివేయగలిగినది. 1857 ఆఖరునకు బ్రిటిష్‌పాలన భారతదేశంలో స్థిరపడిపోయి ఈస్టు ఇండియా కంపెనీ పాలననుండి బ్రిటిషు పార్లమెంటుకు ఆధీనమైనది. ఇంగ్లండు చక్రవర్తి భారత దేశానికికూడ చక్రవర్తి అయినాడు.

## సావర్కారు యుగము

1857 తిరుగుబాటు అనంతరం అక్కడక్కడ వ్యక్తిగత దౌర్జన్య చర్యలు జరుగుచునేయున్నవి. ప్రజలను పీడించే బ్రిటిషు అధికారులను, భారత నాయకులను అవమానపరిచే దొరలను, బహిరంగ ప్రదేశములలో కాల్చి చంపుట మొదలగు చర్యలు జరుగుచూనేయున్నవి. మహారాష్ట్రంలో చాపేకర సోదరులు, సావర్కారు సోదరులు, బెంగాలుదేశంలో మరికొందరు సాహసులైన యువకులు యీ ఉద్యమం సాగించుచుండిరి. తిలక్ మహాశయుడు, అరవిందఘోషు మొదలగు అతివాదనాయకులు ఈ యువకులకు అండదండలుగా వుండిరి. భారతదేశంలోనేగాక, ఇంగ్లీషు అధికారులపై

పగబట్టిన యువకులు ఇండియాలో అనేక ఘోరాలుచేసి ఉద్యోగానంతరం స్వదేశానికిపోయిన ఇంగ్లీషు అధికారులను, ఇంగ్లాండుకు విద్యార్థులుగాపోయి అక్కడ సమయంచిక్కినప్పుడు వారిని హతమార్చిన ఘట్టాలు అనేకంకలవు, భారతదేశం అంతటా అన్ని రాష్ట్రాలకు యీ విప్లవకారుల సంచలనము వ్యాపించినది. చిన్నచిన్న ముఠాలతోకూడిన విప్లవ సంఘాలు దేశము అంతటా ఏర్పడినవి. ఇంగ్లీషు అధికారులను చంపుటలో వీరిలోవీరు పోటీలు పడడం కద్దు. ఈ శతాబ్దం ఆఖరువరకు యీ విధమైన ప్రతీకార దౌర్జన్య కాండ జరుగుతూనే వచ్చింది. ఎంతోమంది దేశభక్తులగు యువకులను ప్రభుత్వం ఉరికంబాలకు ఎక్కించినది. అయినను దౌర్జన్యచర్యలు ఆగేటట్లు కన్పించలేదు. అప్పటికి బ్రిటిషు అధికారులు కండ్లుతెరచి భారతదేశపు మనోభావాలను అంచనావేసికొనడంలో వారి పొరపాటును గ్రహించి తమ ఆలోచనా పద్ధతిని మార్చుకున్నారు. సంక్షుభితమైన దౌర్జన్య వాతా వరణంనుంచి భారతీయుల మనస్సులను శాంతియుత పద్ధతులలో నడుపుటకు యోచనచేయసాగారు.

## కాంగ్రెసు పుట్టుక

1885 సంవత్సరంలో ఒక బ్రిటిషు ఐ. సి. ఎస్. ఆఫీసరుద్వారా భారత జాతీయ కాంగ్రెసు అను సంస్థ స్థాపింపజేశారు. ఈ సంస్థ నిర్మాణములో వారిభావము వేరు. ఆయన ఆనాటి సాంఘిక జీవనములో పేరుప్రఖ్యాతులు గడించిన డబ్ల్యు. సి. బెనర్జీ, దాదాభాయి నౌరోజీవగైరా ప్రముఖుల సహాయముతో యీ సంస్థను స్థాపించారు. భారత జాతీయ కాంగ్రెసు పుట్టుకనుగురించి డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు 'కాంగ్రెసు చరిత్ర'లో ఈ క్రిందివిధముగా వ్రాశారు. "1884లో ఎ. ఒ. హ్యూము (సి. బి) భారతదేశంలో ప్రధాన రాజకీయవేత్తలందరును సంవత్సరమున కొకసారి సాంఘిక విషయములను చర్చించుటకుగాను ఒకచోట సమావేశమై పరస్పర స్నేహభావమును పెంపొందించుకొనేయెడల అది చాలా ప్రయోజకరము కాగలదని భావించెను. ఈ మహాసభలో రాజకీయ విషయములు చర్చించరాదని ఆయన అభిప్రాయము. కలకత్తా, బొంబాయి, మద్రాసు రాష్ట్రములలోను, ఇండియాలోని తదితర ప్రాంతములందుకూడా రాజకీయవిషయ చర్చలకు తగినసంస్థలుండగా, ఈఅఖిలభారతసంస్థయే ఆపని

చేయబూనినయెడల వాటి ప్రాముఖ్యము పోవునని ఆయన ఊహ. అదీగాక ఈ రాజకీయవేత్తలందరును సమావేశమైన రాష్ట్రములోని గవర్నరు ఆ సభకు అధ్యక్షుడుగా ఎన్నుకోబడవలెనని, అందువలన అధికారవర్గము వారికిన్నీ, జాతీయనాయకులకున్నూ, పరస్పర మిత్రభావములు ఏర్పడగలవనికూడా ఆయన తలంపు." ఇన్ని భావాలతో ఆయన 1885 ప్రారంభదశలో సిమ్లాలో డఫరిన్ ప్రభువును దర్శించెను. డఫరిన్ ఆ జరిగిన డిశంబరు నెలలోనే వైస్రాయిపదవిని స్వీకరించి యుండెను. హ్యూముగారు మాట్లాడిన విషయమునుగూర్చి డఫరిన్ ప్రభువు జాగ్రత్తగా ఆలోచించి అది అంత ప్రయోజనకరముగా తనకు కనిపించలేదని ఆయనతో చెప్పెను. "ఇంగ్లండులో రాణీగారికి వ్యతిరేక కక్షుదారు చేసేపని ఇండియాలో ఎవరును చేసేవారులేరు. పత్రికలు నిజంగా ప్రజాభిప్రాయమునే ప్రకటించినప్పటికీ వాటిని విశ్వసింప వీలులేదు. అందువలన ఇంగ్లీషువారు తమనుగూర్చి దేశీయులు ఏమనుకుంటూవుండిరో తెలుసుకొనజాలకుండిరి. కాబట్టి పాలకుల శ్రేయస్సుకోసము పాలితుల క్షేమముకోసముకూడా భారత రాజకీయవేత్తలు సంవత్సరమునకు ఒకసారి సమావేశమై, పరిపాలనలోని లోపములను చర్చించి, వాటిని సవరించుటకు తగిన మార్గములనుకూడా సూచించుచుండుట అవసరం. అంతేగాక అటువంటి సభలకు స్థానిక గవర్నరు అధ్యక్షుడుగా వుండగూడదు. ఆయన ఎదుట ప్రజలు తమ అభిప్రాయములను ప్రకటింప ఇష్టపడరు" అనికూడ డఫరిన్ ప్రభువు హ్యూముకు చెప్పియుండెను. హ్యూము డఫరిన్ ప్రభువు వాదనను అంగీకరించి తమ యిరువురి ప్రణాళికలనుగూర్చి మదారాసు, బొంబాయి, కలకత్తా తదితర ప్రాంతములలోని ప్రముఖులైన రాజకీయ నాయకులతో సంప్రదించెను. వారందరును యేకగ్రీవముగా డఫరిన్‌గారి సిద్ధాంతమే బాగున్నదని కార్యాచరణకు కడంగిరి. డఫరిన్ ప్రభువు తానిండియాలో ఉన్నంతకాలం, కాంగ్రెసు ప్రణాళికకు సంబంధించి, తన పేరును బయట పెట్టకుండునట్లు హ్యూముగారిచే వాగ్దానం చేయించుకొనెను. ఆ వాగ్దానం ప్రకారమే హ్యూముగారు సంప్రదించినవారికి తప్ప తదితరులకు యీ రహస్యము తెలియదు.

## కృష్ణాజిల్లాలో రాజకీయ సంచలనము

1902 నాటికి గుంటూరు, పశ్చిమ గోదావరి, కృష్ణాజిల్లాలు ఒకే

మండలంగా వుండేది. ఈసంగతి పైన తెలుపబడినది. ఈమండల కేంద్ర స్థానం - మచిలీపట్టణం. కాంగ్రెసు పుట్టిననాటినుండి దేశంలో నెమ్మదిగా కలుగుచున్న రాజకీయ సంచలనం యీ మండలమునకూడ కలుగజొచ్చెను. దేశీయుల భావ దాస్యమును మరింత గాఢమొనర్చుటకై ఆంగ్లేయులు, క్రైస్తవ మిషనరీలు నెలకొల్పిన విద్యాకూటములు, కాలేజీలు తమ సంకల్పమును చాలావరకు నెరవేర్చుకొన్నను, కీడులో మేలన్నట్లు, అవి ప్రజలలో స్వాతంత్ర్యేచ్ఛనుకూడ మేల్కొల్పెను. ఈ మేల్కొల్పు ఫలితంగా 1902వ సంవత్సరమున "కృష్ణాడిస్ట్రిక్టు అసోసియేషన్" అను పేరుతో బందరులో ఒకజిల్లా జాతీయ సంస్థ స్థాపింపబడెను. ఈ అసోసియేషన్ స్థాపించినవారు అందరూ ఆంగ్ల విద్యాధికులే. శ్రీ వేమూరి సుబ్బారావుపంతులు, శ్రీ కట్టమూడి చిదంబరరావుపంతులు, శ్రీ సెడింబి హనుమంతరావుపంతులు, శ్రీ దాసు నారాయణరావు, శ్రీ కొండా వెంకటప్పయ్యపంతులు, శ్రీ పురాణం వెంకటప్పయ్య, శ్రీ కొడాలి శివరామకృష్ణారావు, శ్రీ వేమవరపు రామదాసుపంతులుగార్లు యీ సందర్భమున పేర్కొనదగియున్నారు. ఈఅసోసియేషన్ ప్రజలలో జాతీయభావములను బహుముఖాల వ్యాప్తిజేసెను. ఈ అసోసియేషన్ తరపుననే 'కృష్ణాపత్రిక' అను జాతీయ వారపత్రిక స్థాపింపబడినది. దీని మొదటి సంపాదకులు శ్రీ కొండా వెంకటప్పయ్య, ఉపసంపాదకులు శ్రీ అవుటపల్లి నారాయణరావు. తదుపరి శ్రీ వేమవరపు రామదాసు, శ్రీ ముట్నూరి కృష్ణారావుపంతులున్నూ, మరికొంతకాలం శ్రీ పట్టాభి సీతారామయ్యగారు ఎడిట్ చేశారు. నేటికిని ఈ పత్రికను అవిచ్ఛిన్నంగా నడుపుచూవున్న విషయం అందరకు తెలిసినదే. ఆంధ్రమండలంలో ఇటీవల ప్రఖ్యాత నాయకులై నెగడిన యువకబృంద మంతయు ఈ కృష్ణాపత్రిక పోసిన ఉగ్గుబాలచే పెరిగి పెద్దవారైనారని చెప్పినచో అది అతిశయోక్తికాదు. ఇంగ్లీషురాని ఇంతమంది యువకులకు, స్త్రీలకు, పురుషులకు కూడ దేశభక్తి, ఉత్సాహములను పురికొల్పి కార్య రంగమునకు దుముకించినదికూడ ఈ కృష్ణాపత్రిక వ్రాతలే. ఈ కాల మునవే ఈ మండలములోని యలకుర్రు వాస్తవ్యులు కాశీనాధుని నాగేశ్వర రావుపంతులుగారు 1908లో బొంబాయిపట్టణంలో ఆంధ్రపత్రికను వార పత్రికగా స్థాపించిరి. పిమ్మట దీనిని 1914లో మద్రాసునకు మార్చి దినపత్రికగా నడుపుచున్నారు. ఇటీవల విజయవాడనుండిన్ని, ప్రస్తుతం హైదరాబాదు కేంద్రకార్యస్థానంతో ఈ పత్రిక నడుపబడుచున్నది.

## వందేమాతర ఉద్యమం

1906లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలో స్వరాజ్యము కొరకు పోరాటము సాగించవలెనని, స్వదేశీవ్రతము స్వీకరించవలయునని బ్రిటిషు వస్తువులను బహిష్కరించవలయునని, జాతీయ విద్యను ప్రోత్సహించవలయునని తీర్మానించబడినది. ఈ తీర్మానం విద్యార్థులుగావున్న శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు, శ్రీ గొల్లపూడి సీతారామశాస్త్రిగార్లను ప్రభావితులను చేసినది. అక్కడ నుండి పశ్చిమ కృష్ణాజిల్లాలోకూడ కాంగ్రెసు ఉద్యమము ప్రారంభమైనది. ఈ కలకత్తా కాంగ్రెసునకు విజయవాడనుండి పింగళి లక్ష్మినారాయణ, మునగాల రాజా, కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ప్రతినిధులుగా వెళ్ళి పాల్గొనిరి. అదే సంవత్సరం శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు వకీలుగా విజయవాడలో నివాసం యేర్పరచుకొనిరి. అప్పటినుండి పింగళి లక్ష్మినారాయణ, పెద్దిభొట్ల వీరయ్య, సూరి వెంకట నరసింహశాస్త్రి, అబ్బూరి శ్రీరంగశాయి, అయ్యదేవర కాళేశ్వరరావుగార్లు బహిరంగసభలు, ఉత్సవాలు, జాతీయకీర్తనలు, కరపత్రములు మొదలగు వాటిమూలమున విజయవాడలోను, చుట్టుప్రక్కల తాలూకాలలోను కాంగ్రెసు ఉద్యమ ప్రచారము చేయసాగిరి.

1907 సంవత్సరమున జాతీయ పక్షనాయకులు బిపిన్ చంద్రపాలు గారు మచిలీపట్టణంలోను, విజయవాడలోను గంభీరోపన్యాసములనిచ్చిరి. బిపిన్ చంద్రపాలుగారి ఆగమనముతో ఉద్యమములో విప్లవాత్మకధోరణి ప్రారంభమైనది. ఇతని ఆదర్శాలపట్ల యువకులు, విద్యార్థులు ఎక్కువగా ఆకర్షితులైనారు. వందేమాతరం ఉద్యమం వీరివలన దేశవ్యాప్తమైనది. వీరి పర్యటనను ముట్నూరి కృష్ణారావుపంతులుగారు ఏర్పాటుచేశారు. పర్యటన తుదివరకు ఆయనతోవుండి, అన్నికార్యక్రమాలలోనుపాల్గొన్నారు. ముట్నూరి కృష్ణారావుగారు, బిపిన్ చంద్రపాల్‌గారితో ఆరు నెలలు బెంగాలులో పర్యటనచేసి, అనేక విషయాలు తెలుసుకున్నారు. అందువల్ల చంద్రపాల్‌గారికి కృష్ణారావుగారు ఆత్మీయులయ్యారు.

1907 సూరత్ కాంగ్రెసులో అతివాద, మితవాదులమధ్య విభేదాలు పొడసూపినవి. అతివాదులకు తిలక్, అరవింద్‌ఘోష్‌లు నాయకత్వం

వహించగా సర్ ఫిరోజిషా మెహతా, సర్ దిన్‌షా వాచాలు మితవాదులకు నాయకత్వం వహించారు. తీవ్రమైన వాదోపవాదములు జరిగినవి. ప్రతినిధులమధ్య గందరగోళమేర్పడి కుర్చీలతో కొట్టుకున్నారు. కృష్ణా జిల్లానుండి సూరత్ సభలకు ప్రతినిధులుగా వెళ్ళిన శ్రీ హరి సర్వోత్తమరావు, శ్రీ పెద్దిభొట్ల వీరయ్య, శ్రీ కోపల్లె హనుమంతరావు, శ్రీ గంటి లక్ష్మన్నగార్లు అతివాదుల కార్యక్రమానికి మద్దతునిచ్చిరి. తిలక్ వర్గము నెగ్గినది.

ఆ సంవత్సరమే కృష్ణాజిల్లా సాంఘిక రాజకీయ మహాసభలు నంది గామలో జరిగెను. ఈ సభకు మునగాల జమీందారుగారు ఆహ్వాన సంఘాధ్యక్షులు, శ్రీ కాశేశ్వరరావు కార్యదర్శిగావుండి పనిచేసిరి. రాజకీయ మహాసభకు శ్రీ వల్లూరి సూర్యనారాయణరావు అధ్యక్షత వహించిరి. అక్కడ జరిగిన సాంఘిక మహాసభకు శ్రీ కొండా వెంకటప్పయ్యగారు అధ్యక్షత వహించిరి. అస్పృశ్యతను పారద్రోలవలెనని తీర్మానముచేయ బడినది. ఆ సభలో హరిజనులను శ్రీ కాశేశ్వరరావు వగైరాలు తీసుకొని వచ్చి పగసన కూర్చొనబెట్టిరి. వీరు ఆ రాత్రి వితంతువివాహము చేసుకున్న వారితోను, హరిజనులతోను కలిసి సహపంక్తిభోజనము చేసిరి. ఇలా సహ పంక్తిభోజనంచేసిన కారణంగా శ్రీ పెద్దిభొట్ల వీరయ్య, శ్రీ కాశేశ్వరరావు, శ్రీ దాసు మధుసూదనరావు, శ్రీ చింతకింది సూర్యనారాయణమూర్తి, శ్రీ పింగళి లక్ష్మీనారాయణ, శ్రీ పాటిబండ్ల సుబ్రహ్మణ్యం మొదలగు తొమ్మిది మందిని బెజవాడలోని పూర్వాచారపరాయణులు 2 సంవత్సరములు వెలివేసిరి. బెజవాడలోని కాంగ్రెసు బృందము తిలక్ మహాశయుని అనుచరులుగా పనిచేయసాగిరి. 'స్వరాజ్' అను ఇంగ్లీషు పత్రికను స్థాపించిరి. దానికి హరి సర్వోత్తమరావు సంపాదకులుగాను, బోడి నారాయణరావు ప్రింటరుగాను పింగళి లక్ష్మీనారాయణగారు ప్రొప్రయిటరుగానువుండి నడుపసాగిరి. ఈ పత్రికద్వారా తిలక్ అతివాద ఆశయములను ప్రచారము చేయసాగిరి.

13-7-1908 తేదీన శ్రీ హరి సర్వోత్తమరావు, శ్రీ బోడి నారా యణరావుగార్లను అరెస్టుచేసిరి. శ్రీ పింగళి లక్ష్మీనారాయణగారు ఫ్రెంచి ఇండియా (పాండిచేరి)కి పోయిరి. తిరిగి వారు 1912లో ప్రభుత్వ నిర్బంధం సడలింపు ఫలితంగా విజయవాడచేరిరి. ఈసందర్భంలో శ్రీ హరి సర్వోత్తమ రావుకు 3 సంవత్సరములు కఠిన కారాగారము, శ్రీ బోడి నారాయణరావు

గారికి 9 నెలలు విడిఖైదులో నిర్బంధించిరి. దేశంలో నిర్బంధములు హెచ్చుగా వుండెను. ప్రజలలో ఉత్సాహం కలిగెను. ఇది పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు చరిత్రలో ప్రథమ రంగం.

## బెజవాడ డివిజనల్ కాంగ్రెసు

1908 లో మద్రాసులో జరిగిన కాంగ్రెసు మహాసభలో యీ జిల్లా ముఖ్యులందరు ప్రతినిధులుగా పాల్గొనిరి. అనంతరం కాంగ్రెసుకు అనుబంధముగా విజయవాడ డివిజనల్ కాంగ్రెసు కమిటీ ఏర్పాటు గావించబడెను. ఈకమిటీకి రావుబహద్దర్ తాడంకి వెంకట నర్సయ్యపంతులు అధ్యక్షులుగా, అయ్యదేవర కాళేశ్వరరావుగారు కార్యదర్శిగా వుండిరి. 1920వ సంవత్సరం వరకు యీ సంఘం బాగుగా పనిచేసినది. రైతులమీద విధించిన అదనపు పన్నులను గురించి తీవ్రమైన ఆందోళనము కావించి ప్రజలలో ప్రచారం చేసిరి. దాని ఫలితంగా అప్పటికి ఆ పన్నులు నిలుపుదల చేయబడినవి.

## హోమ్ రూల్ ఉద్యమము

1916లో శ్రీమతి అనిబిసెంటుగారిని ఆహ్వానించి, విజయవాడలో గొప్ప సభను ఏర్పాటుచేసిరి. దీని ఫలితముగా అప్పటివరకు కాంగ్రెసుకు వ్యతిరేకంగావున్న బెజవాడ దివ్యజ్ఞాన సమాజికులు కాంగ్రెసులోచేరి సంఘ సంస్కరణ ప్రచారము చేయసాగిరి.

1917 వ సంవత్సరంలో మాంటేగువద్దకు రాయబారము పంపుటకు ఒకప్రత్యేక ఆంధ్రమహాసభ విజయవాడలోజరిగినది. దానికి శ్రీ చింతలపాటి నరసింహరాజు అధ్యక్షత వహించిరి. శ్రీ కాళేశ్వరరావు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా వుండిరి. ఒక రాయబార వర్గమును ఎన్నుకొనిరి. అందు శ్రీ న్యాపతి సుబ్బారావు, శ్రీ కొండా వెంకటప్పయ్య, డా॥ పట్టాభి సీతారామయ్య, శ్రీ మోచర్ల రామచంద్రరావుగార్లు వుండి, విజయవాడలో సమావేశమై తమ రాయబారపత్రమును తయారుచేసిరి. తరువాత దీనికి ప్రతిగా జస్టిసు పక్షమువారి మహాసభకూడ విజయవాడలో జరిగినది. దానికి పోటీగా దేశహితైక బ్రాహ్మణేతర మహాసభ విజయవాడలో బహు విజయవంతముగా జరిగినది. దానికి శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరిగారు అధ్యక్షులుగా వుండిరి. ఆ వెనువెంటనే, ఆంధ్రదేశ్ ప్రథమ

పంచమ మహాసభ విజయవాడలో జరిగినది. ఆ సభకు శ్రీ చుండ్రు వెంకయ్య ఆహ్వాన సంఘాధ్యక్షులు, శ్రీ భాగ్యరెడ్డి వర్మ అధ్యక్షులుగా వుండిరి. శ్రీ రాయుడు గంగయ్యగారు సభను ప్రారంభించిరి. ఆ సభలోనే పంచములు ఆదిఆంధ్రులు అను పేరుపెట్టుకొనుటకు తీర్మానించిరి.

1919 సం॥రమున మహాత్మాగాంధీగారు విజయవాడను సందర్శించి, రౌలట్ సత్యాగ్రహమునుగూర్చి ఉపన్యసించిరి. విజయవాడలో శ్రీ కాళేశ్వరరావు, వారి సత్యాగ్రహమునందుచేరిరి. కాని ఈ సత్యాగ్రహము ఆంధ్రదేశమునందు మొదలుపెట్టకముందే జలియన్‌వాలాబాగ్ హత్యలు జరిగి ఆపివేయబడినది.

1918లో గాంధీగారు రౌలట్ చట్టాన్ని వ్యతిరేకించుతూ నడిపిన వుద్యమము సందర్భంలో కృష్ణాజిల్లాకు వచ్చివెళ్ళిన అనంతరం 1919 ఏప్రిల్ 6న విజయవాడపౌరులు రౌలట్ సత్యాగ్రహదీక్ష వహించిరి. శ్రీ కాళేశ్వర రావుగారి ఆధ్వర్యమున అన్ని మతములవారు, అన్ని కులములవారు పెద్ద ఊరేగింపుగా కృష్ణానదికివెళ్ళి స్నానంచేసి రౌలట్ చట్టము రద్దు కావలెనని సామూహిక ప్రార్థనలుచేసిరి. సాయంత్రం పెద్ద సభ జరిగినది. న్యాయవాదులు, డాక్టర్లు, వ్యాపారస్తులు అందరూ పాల్గొనిరి.

చిరివాడలో శ్రీ వేలూరు యజ్ఞనారాయణగారి నాయకత్వమున శివాలయమందు గ్రామస్తులందరు సమావేశమై రౌలట్ చట్టము రద్దు కావలెనని ప్రార్థన చేసిరి.

గంపలగూడెంలో శ్రీ రాజా కోటగిరి వెంకటకృష్ణారావుగారి ఆధ్వర్యమున పెద్ద బహిరంగసభ జరిగినది. రౌలట్ చట్టం రద్దుకావలెనని తీర్మానించిరి. అనంతరం భజనలతో ఊరేగింపుగా దేవాలయమునకువెళ్ళి ప్రార్థనలు చేసిరి.

ఘంటసాలలో యువకులు శ్రీ వేమూరి లక్ష్మయ్యగారి నాయకత్వమున ఉదయం స్నానములుచేసి, దేవాలయమునకువెళ్ళి సత్యాగ్రహదీక్ష వహించి, ఉపవాసములు చేసిరి. సాయంకాలము శ్రీ వేమూరి వెంకయ్యగారి అధ్యక్షతన బహిరంగసభ జరిగెను. శ్రీ వేమూరి రత్తయ్యగారు రౌలట్ చట్టముగురించి విపులముగా తెలియపర్చిరి. అనంతరం రౌలట్ చట్టం రద్దు కావలెనని తీర్మానించిరి.

గుడివాడలో దేవాలయములలోను, మసీదులలోను సామూహిక ప్రార్థనలు జరిగినవి. సాయంత్రం పెద్దసభ జరిగినది. రౌలట్ చట్టం రద్దు కావలెనని తీర్మానించిరి.

కోలవెన్నులో ఏప్రిల్ 6వ తేదీన పెద్ద బహిరంగసభ పిన్నమనేని నరసయ్యగారి అధిపత్యమున యార్లగడ్డ వెంకటసుబ్బయ్యగారి చావడిలో జరిగినది. ఈ సభలో కుందేరు, కంకిపాడు, నెప్పల్లె, ప్రొద్దుటూరు, పునాదిపాడు, పెనములూరు, రొయ్యూరు, గోసాల, ఈడుప్గల్లు, పోరంకి, ఉప్పలూరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు. రౌలట్ చట్టాన్ని రద్దుచేయుటకు తీర్మానించారు.

మేడూరు వాస్తవ్యులు యలమంచి అంకయ్యగారు రౌలట్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ కోడూరు ఫిర్కా గ్రామాలన్నీ తిరిగి ప్రజంలో సంతకములు సేకరించారు. అన్నిచోట్ల సభలుజరిపి రౌలట్ చట్టం రద్దు చేయవలసినదిగాతీర్మానముచేయించి పట్టాభి సీతారామయ్యగారికిపంపినారు.

పిన్నమనేని వెంకటచలంగారి అధ్యక్షతన ఇందుపల్లిలో బహిరంగసభ జరిగినది. రౌలట్ చట్టం రద్దుకు తీర్మానముచేశారు.

ముదునూరు, కాటూరు, బోళ్ళపాడు గ్రామాలనుంచి శ్రీ తుమ్మల కోటయ్యగారి ఆధ్వర్యమున రౌలట్ సత్యాగ్రహదీక్ష వహించి, ఉపవాసములుచేసి, సాయంత్రం కాటూరులో బహిరంగసభజరిపి, రౌలట్ చట్టము రద్దు కావలెనని తీర్మానించిరి.

శ్రీ కోటగిరి వెంకట కృష్ణారావు హోమ్‌రూలు అందోళనాకాలమున కాంగ్రెసులోచేరి, కాంగ్రెసుకు పట్టుకొమ్మఅయిరి. 1919 సంవత్సరమున గంపలగూడెంలో జరిగిన కృష్ణామండల రాజకీయ మహాసభకు ఆహ్వాన సంఘాధ్యక్షులుగావుండి గంభీరోపన్యాసము గావించిరి. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు ఈ సభకు అధ్యక్షత వహించిరి.

## కాంగ్రెసు - లీగు

హోమ్‌రూలు ఆందోళనలో కాంగ్రెసు - ముస్లిమ్‌లీగు కలిసి తయారుచేసిన స్కీముమీద సంతకములు చేయించుటలో డా॥ పట్టాభిగారి నాయకత్వమున కృష్ణాజిల్లా ఎక్కువ కృషిసల్పెను. గ్రామగ్రామమున

సభలు, ఉపన్యాసములు విరివిగా జరిగెను. కొతరం గ్రామములో స్థాపించబడిన జాతీయ పాఠశాల ఉపాధ్యాయులు గ్రామముల వెంటతిరిగి, సంతకములు విరివిగాచేయించి పంపించిరి. హోమ్‌రూలు అందోళన విద్యార్థులను ఎక్కువగా ఆకర్షించెను. అందువలన విద్యార్థులెవ్వరు రాజకీయ సభలకు పోరాదని నిషేధిస్తూ మదాసుప్రభుత్వం ఒకఉత్తర్వును జారీచేసినది. ఈ అక్రమ ఉత్తర్వును ఉల్లంఘించమని అనిబిసెంటు ప్రబోధించెను. ఈ ఉల్లంఘనా పత్రముపై చాలామంది సంతకములుచేసిరి. ఈ మండలమున శ్రీ కోపల్లె హనుమంతరావు, శ్రీ ముట్నూరి కృష్ణారావు, డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యగార్లు ఈ పత్రముపై సంతకాలుచేసి, జైలుకుసిద్ధమైరి.

కృష్ణాజిల్లా పెదమద్దాలి గ్రామంలోజరిగిన జస్టిస్‌పార్టీ మహాసభలో మాంటేగు సంస్కరణలను సమర్థిస్తూ, బ్రాహ్మణేతరులకు హెచ్చు ప్రాతినిధ్యము కావలయునని జమీందారులతోకూడిన సదరుపార్టీ తీర్మానించినది. ఈ సభకు జిల్లాలోని ప్రముఖ జమీందారులందరు అట్టహాసముతో హాజరైరి. ఈ సభకు శ్రీ కుర్మా వెంకటరెడ్డినాయుడు, శ్రీ పానుగల్లు రాజా, శ్రీ ఎ. పి. పాత్రో వగైరా మంత్రులుకూడ హాజరైనారు.

అయితే దానికి పోటీగా ప్రక్కనేవున్న బల్లిపర్రు గ్రామములో దేశహితైషులు, కాంగ్రెసు అభిమానులు అయిన జిల్లా జాతీయ నాయకులందరు సమావేశమై, కాంగ్రెసు-లీగు తయారుచేసిన స్కీమును ప్రజలు ఆమోదించవలసినదిగా ప్రబోధము గావించిరి. ఈ సభకు శ్రీ గంపలగూడెం కుమారరాజా శ్రీ రాజా కోటగిరి వెంకట కృష్ణారావు బహద్దరుగారు అధ్యక్షత వహించిరి. జయంతిపురం రాజా శ్రీ రాజా వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వరప్రసాదు, శ్రీ కాశేశ్వరరావు, డా॥ పట్టాభి, శ్రీ ముట్నూరి కృష్ణారావు వగైరా కాంగ్రెసు నాయకులుకూడ హాజరైరి. ప్రధానవక్తలు కాకుమాను లక్ష్మయ్య, కానూరి చినవెంకటదాసయ్య, ఎర్నేని సుబ్రహ్మణ్యం, యలమంచి వెంకటప్పయ్యగార్లు. ఆహ్వాన సంఘాధ్యక్షులు వల్లభనేని రామకృష్ణయ్యగారు. ఈయన పండితుడు. కానూరి పెదవెంకటదాసయ్య, గొట్టిపాటి బ్రహ్మయ్యగార్లుకూడ హాజరయ్యారు.

## ఆంధ్ర కాంగ్రెసు సంఘ నిర్మాణం

1917లో డా॥ అనిబిసెంటు అధ్యక్షతను జరిగిన కలకత్తాకాంగ్రెసు

మహాసభలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమును ఏర్పాటు చేయుటకు తీర్మానించబడినది. డా॥ పట్టాభిగారు తీర్మానంప్రతిపాదించారు. దీని ఫలితంగా మద్రాసునుండి ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసు సంఘం విడదీయ బడనది. కలకత్తా కాంగ్రెసు తీర్మానానుసారంగా 20-1-1918 తేదీన విజయవాడ టౌనుహాలునందు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్‌వాదుల మహాసభ జరుపబడినది. ఆ సభలో ప్రథమ ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘానికి అధ్యక్షులుగా శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారిని ఎన్నుకొనిరి. కార్యదర్శిగా శ్రీ జొన్నవిత్తుల గురునాథంగారిని ఎన్నుకొనిరి.

1923వ సం॥న రు 15,000లను వెచ్చించి, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘంవారు విజయవాడలో ఒక భవనమును సంఘ కార్యస్థానము నిమిత్తం ఖరీదుచేశారు. దేశ స్వాతంత్ర్యముకొరకు ప్రాణములర్పించిన శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి స్మారక చిహ్నంగా దానికి "ఆధ్రరత్న భవనము" అను పేరిడిరి. ఆనాటినుండి విజయవాడలో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘ కార్యాలయం ఆభవనములో పనిచేయసాగినది.

## ప్రత్యేక జిల్లా కాంగ్రెసు సంఘ నిర్మాణం

1918లో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘము ఏర్పడి నప్పటికీ 1920లో గాని జిల్లా కాంగ్రెసు సంఘాలు యేర్పడలేదు. అంతవరకు మండల జాతీయోప సంఘాల పేరుతోను, డివిజనుల అసోసి యేషనుల పేరుతోను పనిచేస్తూ వుండేవి. వీటి అన్నిటినీ రాష్ట్ర కాంగ్రెసు సంఘ అనుబంధ సంఘాలుగా గుర్తిస్తూ 1919 జనవరి 20 తేదీన విజయవాడలో శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారి అధ్యక్షతను జరిగిన కాంగ్రెసు సంఘసభ తీర్మానించినది. అప్పటివరకు పనిచేస్తూవున్న కృష్ణా మండల జాతీయోపసంఘం, విజయవాడ మండల జాతీయోప సంఘాలు రద్దుకాబడి తూర్పు, పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘాలుగా మార్పు చెందినవి.

## విజయవాడలో ఎ. ఐ. సి. సి. మహాసభలు

1921 సం॥లో ఏప్రిల్ నెలలో బెజవాడలో సమావేశమైన అఖిల భారత కాంగ్రెసు కమిటీవారిచే నిర్ణయించబడిన కార్యప్రణాళిక ప్రకారము

జిల్లాలో సహాయ నిరాకరణోద్యమం జోరుగా జరిగినది. ఈసమావేశము మార్చి 31, ఏప్రిల్ 1వ తేదీలలో మహావైభవముగా జరిగినది. కొన్ని చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకొనబడినవి. తిలక్ స్వరాజ్యనిధికి కోటి రూపాయలు వసూలు చేయుటకున్నూ, ఒక కోటిమందిని కాంగ్రెసు సభ్యులను చేర్పించుటకున్నూ, దేశమంతటా 20 లక్షల రాట్నములు నెలకొల్పుటకున్నూ తీర్మానించబడినవి. కాంగ్రెసుకు ఎరుపు - తెలుపు - ఆకుపచ్చ రంగులుగల ఖద్దరు గుడ్డపై మధ్య రాట్నచిహ్నముగల జాతీయ పతాకము యీ సమావేశములోనే నెలకొల్పబడినది. గాంధీగారి కోరికపైన శ్రీ పింగళి వెంకయ్యగారు యీ జెండాను తయారుచేసి యిచ్చిరి. శ్రీ వెంకయ్యగారిని గాంధీగారు అభినందించిరి. ఈ సభకు మహాత్మాగాంధి, దేశబంధు చిత్తరంజన్‌దాసు, లాలా లజపతిరాయ్, మౌ: తాలీ, హకీం అజ్మల్‌ఖాన్, పండిత మోతీలాల్ నెహ్రూ, సరళాదేవి చౌదరాణీ, సేలం విజయరాఘవచారి, జమ్నాలాల్ బజాజ్, దేశభక్త కొండా వెంకటప్పయ్య, డా॥ పట్టాభి సీతారామయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు, టంగుటూరు ప్రకాశం పంతులు, యస్.సి. కేల్కార్, బాబు రాజేంద్రప్రసాద్, గంగాధరరావు దేశపాండ్యా, సి. రాజగోపాలాచారి మొదలగు అఖిలభారత నాయకులెల్లరు విచ్చేసిరి. ఆంధ్రప్రదేశ్ అంతటి నుండి లక్షలకొలది ప్రజలు యీ దేశనాయకులను వీక్షించుటకు అరుదెంచిరి. దూరప్రాంతములనుండి జట్లు, జట్లుగా భజనలతో నడచి వచ్చి విజయవాడలో నాయకులను దర్శించిరి. విజయవాడ నేత్రపర్వంగా అలంకరించబడినది. చీరాల నుండి దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు వందలకొలది కాషాయరంగు దుస్తులు ధరించిన రామదండుతో సభాప్రవేశము చేసిరి. జగ్గయ్యపేట నుండి సాధు రామకృష్ణయ్యగారు బాలభట దళంతోవచ్చి సభానిర్వాహణలో తోడ్పడిరి. కీ॥ శే॥ మాగంటి అన్నపూర్ణాదేవి తన నగలన్నిటినీ కాంగ్రెసుకు సమర్పించి, ముతక గుడ్డలతో స్వతంత్ర శపథమును యీ సభలోనే తీసుకొనెను. యీ మహాసభవల్ల కృష్ణాజిల్లాలో గొప్ప రాజకీయ సంచలనం కలిగినది. అదే సం॥రం సెప్టెంబరు నెలలో కృష్ణా పుష్కరములు వచ్చినవి. వందలకొలది కాంగ్రెసు శాంతి సైనికులు యాత్రికులకు సేవలుచేసిరి. గాంధీమైదానంలో ప్రతిదినం గుమికూడిన వేలాది జనులకు ఆంధ్రదేశం నుండి విచ్చేసిన నాయకులు స్వతంత్ర సందేశముల నిచ్చుచుండిరి. ఈ మహాపర్వముకూడ ఆంధ్రదేశము

నందు దేశభక్తిని ఎక్కువగా ప్రజ్వలింపజేసెను. ప్రస్తుతం గాంధీనగరం అనబడే ప్రాంతమే గాంధీమైదానమని ఆనాడు పేరుపొందెను. ఇక్కడనే ఎ. ఐ. సి. సి. సభలు జరిగినవి.

1921 అక్టోబరు నెలలో బరంపురంనందు ఆంధ్రమహాసభ జరిగినది. గంపలగూడెం కుమార రాజాగారు ఆ సభకు అధ్యక్షత వహించిరి. వారి అధ్యక్షోపన్యాసం దేశద్రోహకరముగా ఉన్నదని అరెస్టుచేసి, 108 క్రిమినల్ ప్రొసీజరుకోడుక్రింద ఒక సంవత్సరం హామీ యివ్వవలసినదిగా ప్రభుత్వం కోరినది. అందుకు ఆయన నిరాకరించిరి. వారికి ఒక సంవత్సరం శిక్ష విధించి జైలు పంపిరి. అదే సందర్భంలో బరంపురంలో జరిగిన రాజకీయ మహాసభకు పట్టాభి సీతారామయ్యగారు అధ్యక్షత వహించిరి. అనేక మంది ప్రముఖ నాయకులు పాల్గొని ఉపన్యసించిరి. ఈ రెండు సభలు ఒకే వేదికమీద వరుసగా జరిగినవి. రాజకీయ మహాసభలో చేసిన ఉపన్యాసములు ఘాటుగా లేనందువలన ఎవరిని అరెస్టు చేయలేదు. కానీ ఆంధ్రమహాసభ వేదికపై ఉపన్యసించిన శ్రీ గంపలగూడెం కుమార రాజాగారిని, ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని, వారి ఉపన్యాసములు తీవ్రమైనవిగాను, దేశద్రోహకరముగా వున్నవని ప్రభుత్వం వీరిద్దరిని అరెస్టుచేసినది.

## శాసనోల్లంఘన ఉద్యమము

1921లో సహాయ నిరాకరణ ఉద్యమ సందర్భములో ఉభయకృష్ణా జిల్లాలలో బ్రహ్మాండమైన ఉద్యమ ప్రచారము జరిగినది. శ్రీ చెరుకువాడ నరసింహంగారు తమ అనర్గళ ఉపన్యాసములచే జిల్లా అంతటా ప్రజా సమూహములను ఉర్రూత లూగించిరి. జిల్లాలో వీరు తిరగని గ్రామంలేదు. వీరు రచించిన "స్వరాజ్యదర్పణం" "శాసనసభలు" అను గ్రంథాలు ఆ నాడు కాంగ్రెసు కార్యకర్తలకు వేద పఠనములైనవి.

కాంగ్రెసు ప్రబోధానుసారం ఈ క్రింది పేర్లుగల గ్రామోద్యోగులు రాజీనామాలను యిచ్చిరి.

1. శ్రీ బొడ్డపాటి వెంకటేశ్వరరావు - రామన్నపూడి
2. ,, ఆదూరి సోమసూర్యప్రకాశరావు - తటివర్రు

3. శ్రీ మానికొండ వెంకటరామయ్య - ఉరుటూరు
4. ,, నందివాడ లక్ష్మీనారాయణ - నందివాడ
5. ,, నందివాడ ఆదినారాయణమూర్తి - నూతులపాడు
6. ,, పింగళి కుటుంబరావు - పెదలింగాల
7. ,, ధనికొండ వెంకటసుబ్బారావు - శ్రీరంగపురం
8. ,, తుమ్మలపల్లి వెంకటకృష్ణయ్య - గుడివాడ
9. ,, నిభానుపూడి ప్రకాశరావు - నిభానుపూడి
10. ,, సుబ్బయ్య (వెట్టి) - ఉరుటూరు
11. ,, కోడేబోయిన కోటయ్య (గ్రామ నాయకుడు) - ఉరుటూరు
12. ,, చామర్తి చలపతిరావు - కోడూరు } వీరిని డిస్‌మిస్ చేసిరి
13. ,, యలకుర్రు శాస్త్రుల్లు - యలకుర్రు }

1919లో జరిగిన జలియన్‌వాలాబాగ్ దురంతములకు మహాత్ముడు చాల వ్యథచెందెను. ఖిలాఫత్ ఉద్యమ సందర్భములో ముస్లింలకు జరిగిన అన్యాయమును కాంగ్రెసు పూర్తిగా ఖండించినది. 1920 ఆగష్టు 1వ తేదీన ఆసహాయోద్యమమును ప్రారంభింతునని గాంధీగారు ప్రకటించిరి. 'స్వరాజ్యము నా జన్మహక్కు' అని ఎలుగెత్తిచాటిన లోకమాన్య తిలక్ మహాశయుడు అదేరోజున పరమపదించిరి. అప్పుడు గాంధీగారు ఆయన ప్రక్కనే వున్నారు. ఆయన పరమపదించుటకు ముందు మహాత్ముడు ఆయననుండి ఆశీర్వచనములు పొందుట జరిగినది. దీనినే అవతార పరివర్తనగా పత్రికలలో వ్రాయుట జరిగినది.

మహాత్ముని అసహాయోద్యమ కార్యక్రమంలో కోర్టులను, ప్రభుత్వ విద్యాలయములను, శాసనసభలను, విదేశ వస్త్రములను, కల్లు-సారాయిలను బహిష్కరించుట అను పంచవిధ బహిష్కారము కాంగ్రెసువాదులకు కర్తవ్యమైనది. తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ ముట్నూరి కృష్ణారావు, ప్రధాన కార్యదర్శి శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు తాలూకా సభలను జరుపుటకు ప్రోత్సహించినారు. ఘంటసాలలో శ్రీ కిలారి కోదండరామయ్యగారి అధ్యక్షతను దివితాలూకా సభ జరిగినది. దానికి ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ గొర్రెపాటి రత్తయ్య, అందు శ్రీ చెరుకువాడ వెంకట నరసింహం, శ్రీ కానూరి వెంకటాచలపతయ్య, శ్రీ కాజ శివరామకృష్ణారావుగార్లు ఉపన్యసించిరి. శ్రీ వేమూరి

లక్ష్మయ్య, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, శ్రీ గోరెంట్లపాటి వెంకట సుబ్బయ్యగార్లు సభాకార్యక్రమములు నిర్వహించిరి. ఈసభలో ప్రార్థనా గీతం పాడినందుకు దివితాలూకా ఆఫీసు గుమాస్తా శ్రీ విశ్వనాథ వెంకటేశ్వర్లుగారిని ప్రభుత్వం సంజాయిషీ కోరినది. ఆయన వెంటనే రాజీనామాయిచ్చి, కృష్ణాపత్రికలో ఉపసంపాదకులుగా చాలాకాలము పనిచేసిరి.

అలాగే అవనిగడ్డలో మరొక సభ జరిగినది. సభకు అందరూ రావలసినదిగా విజ్ఞప్తి చేసినందుకుగాను, దివితాలూకా సబ్ మేజిస్ట్రేటుకోర్టులో రెండవ గుమాస్తాగా పనిచేస్తున్న శ్రీ కొడాలి ఆంజనేయులుగారిని ప్రభుత్వం సంజాయిషీ కోరినది. ఆయన వెంటనే రాజీనామా ఇచ్చారు. వీరు స్వరాజ్య సంరంభంలో అన్నిఘట్టాలలోను పాల్గొని 5 సం॥ 6 నెలలు జైలు శిక్షలు అనుభవించిరి లాఠీదెబ్బలకు కూడా గురియైరి. తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘానికి ప్రధాన కార్యదర్శిగాను, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గ సభ్యులుగానువుండి, ప్రముఖ నాయకులుగా గౌరవించబడినారు. వీరు చెల్లపిళ్ల వెంకట కవిగారి శిష్యులు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారితో జంటకవిత్వం వ్రాస్తూండేవారు. వీరు వ్రాసిన 'తిలక్ నిర్యాణం' కృష్ణాజిల్లాలో అనేకచోట్ల ప్రదర్శించారు. డా॥ పట్టాభి సీతారామయ్యగారు ఆంగ్లంలో వ్రాసిన 'కాంగ్రెసు చరిత్ర'ను తెలుగు లోనికి అనువదించారు. ఇంకా అనేక రాజకీయ ఉద్గ్రంథములను తెలుగు లోనికి అనువదించారు. అవనిగడ్డలో జరిగిన తాలూకా సభకు శ్రీ చింతమనేని తావయ్యచౌదరిగారు అధ్యక్షత వహించారు. బందరు తాలూకా బోర్డు ఉపాధ్యక్షులైన శ్రీ గద్దె నారయ్యగారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా వున్నారు. ఈ సభను నిర్వహించిన కార్యకర్తలు శ్రీ గొల్లపూడి పురుషోత్తమరావు, శ్రీ గొల్లపూడి చలపతిరావు, శ్రీ గొల్లపూడి ప్రకాశం, శ్రీ పరుచూరి బైరాగి, శ్రీ రేపల్లె వెంకటకృష్ణయ్య, శ్రీ వేములపల్లి వెంకట గోపాలరావు. వీరిలో శ్రీ చలపతిరావు, శ్రీ పురుషోత్తమరావుగార్లు పి. డబ్ల్యు. డి. సూపర్వైజరు, గుమాస్తాలుగావుండి తమ పదవులకు రాజీనామాలనిచ్చి ఉద్యమములో చేరిరి.

తర్వాత దివితాలూకా కోడూరులో శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి అధ్యక్షతను మరొక సభజరిగినది. ఆహ్వాన సంఘాధ్యక్షులుగా శ్రీ యద్దన

పూడి గోపాలకృష్ణయ్యగారు వుండిరి. శ్రీ ముట్నూరి, శ్రీ చెరుకువాడ వగైరాలు ఉపన్యసించిరి. ఆనాడు వీరికి ఆతిథ్యమిచ్చినందులకు కోడూరు కరణముగారైన చామర్తి చలపతిరావుగారిని ప్రభుత్వం తొలగించివేసినది. 1938లో ప్రకాశంగారు రివెన్యూ మంత్రి అయినప్పుడు, మరల వీరికి ఆ ఉద్యోగము యివ్వబడినది. మరొక కార్యకర్త కోనేరు కుటుంబరావుగారు తాలూకాఅంతటా కాంగ్రెసు ప్రచారములో ఉత్సాహముగాపాల్గొనేవారు. ఆనాటి టెర్రరిస్టు ఉద్యమము చరిత్ర వీరికి కూలంకషంగా తెలిసివుండేది. తోటి ప్రచారకులకు ఆ చరిత్రనుచెప్పి ఉత్తేజితులనుచేసేవారు. మరొక కార్యకర్త శ్రీ సుసర్ల కృష్ణమూర్తిగారు మంచి సంగీత విద్వాంసులు. ఫిడేలును అవతలపెట్టి ఖద్దరు ఉద్యమానికి వారు జీవితాన్ని అంకితంచేశారు. వారి కుటుంబం అంతా చేనేతకుటుంబంగా మారిపోయినది.

దివితాలూకాఅంతటా 1924 ఎన్నికలు కాంగ్రెసు బహిష్కరించినది. శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి కృషివలన పోలింగురోజున ఓట్లుపడకుండా కార్యకర్తలు ప్రశంసనీయంగా పనిచేశారు. 13 గ్రామాలకు సంబంధించిన ఘంటసాల పోలింగులో మున్సబు, కరణాలనుకూడ ఓటుచేయనీయలేదు. ఖాళీపెట్టెలు సీలుచేసి పంపడం జరిగినది. మద్రాసురాజధాని మొత్తంమీద ఒక్కఓటుకూడ పడనిపోలింగు ఘంటసాలమాత్రమే. శ్రీ బ్రహ్మయ్యగారిని, అక్కడి కార్యకర్తలను పెద్దలందరు ప్రశంసించారు.

1981వ సంవత్సరంలో శ్రీ గంటేల రంగారావుగారు జగ్గయ్యపేట పంచాయితీ ఆఫీసుమీద కాంగ్రెసు పతాకమును ఎగురవేసిరి. ఆయన ఆ గ్రామమునకు మునసబుగా వుండిరి. జమాబందిరోజున సబ్‌కలెక్టరు ఆయనను పిలిచి మందలించిరి. ఆయనకుగల తుపాకీ లైసెన్సును రద్దు పరచి తుపాకిని స్వాధీనము చేసుకొనిరి.

శ్రీ రావిరాల గోపాలకృష్ణమూర్తిగారు తమ గ్రామ కరణీకమునకు రాజీనామా యిచ్చిరి.

చిలావర్తుల రామకృష్ణయ్య, కళా వెంకటారావుగార్లు బందరు నోబుల్ కాలేజీలో బి. ఎ. చదువుతూ, చదువు మానుకొని ఉద్యమములో ప్రవేశించిరి. శ్రీ మానికొండ సత్యనారాయణశాస్త్రి మద్రాసులో బి. ఎల్.

చదువుతూ, మానుకొని ఉద్యమంలో పాల్గొనిరి. భైరవభట్ల వెంకట సుబ్బారావు ప్లీడరీపని మానివేసిరి. శ్రీ సూరంపూడి కనకరాజు, శ్రీ కొడాలి ఆంజనేయులు, శ్రీ గురుజాడ రాఘవశర్మ, శ్రీ గడియారం సాంబయ్య, శ్రీ బొన్నులగడ్డ సూర్యనారాయణమూర్తిగార్లు ప్రభుత్వోద్యోగములకు రాజీనామాలిచ్చిరి. శ్రీ కామినేని వెంకటప్పయ్య హిందూ హైస్కూలులో మానుకొని జాతీయ కళాశాలలో ప్రవేశించిరి.

విజయవాడలో శ్రీ దాసు మధుసూదనరావు శ్రీ దోర్బల శేషాద్రిశాస్త్రి శ్రీ చోడవరపు విశ్వేశ్వరశాస్త్రిగార్లు ఒక సంవత్సరమువరకు తమ న్యాయ వాద వృత్తులను విసర్జించిరి. 1921 మార్చి నెలలో శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు తమ న్యాయవాద వృత్తిని శాశ్వతముగా విసర్జించిరి.

విజయవాడలో ఒక జాతీయ పాఠశాల నిర్మాణము చేయబడెను. తిరువూరు, గంపలగూడెం, పటమట, గొడవర్రు, జగ్గయ్యపేట, ఉయ్యూరు వగైరా గ్రామాలలోకూడ జాతీయ పాఠశాలలు యేర్పడినవి. దాసు మధుసూదనరావుగారు విజయవాడలో ఒక ఖద్దరు దుకాణమును స్థాపించిరి. దీని ద్వారా ఆంధ్రా ఖద్దరును ఉత్తర హిందూస్థానమునకు రవాణాచేయు చుండిరి. శ్రీ వేముల కూర్మయ్య అను ఆదిఆంధ్ర విద్యార్థి శ్రీ అయ్య దేవర కాళేశ్వరరావుగారి యింట నివసిస్తూ, జాతీయ ఉన్నత పాఠశాలలో మెట్రిక్యులేషన్ పాసయ్యెను. అతనిని గాంధీగారిద్వారా పండితమదన మోహన మాలవ్యాగారికి శిఫార్సు చేయించి, కాశీ హిందూ విశ్వవిద్యా లయములో చేర్పించిరి. కాశీ హిందూ విశ్వవిద్యాలయములో చేరిన మొట్ట మొదటి హరిజన విద్యార్థి ఈయనయే. తరువాత యీయన ఆంధ్ర దేశంలో గొప్ప హరిజన నాయకుడుగా పేరుపొందిరి. మద్రాసు శాసన సభలోను, ఆంధ్రప్రదేశ్‌లోను చాలాకాలం శాసన సభ్యులుగా వుండి, కాంగ్రెసు ప్రభుత్వంలో మంత్రి పదవులనుకూడ ఈయన నిర్వహించిరి.

పశ్చిమ కృష్ణాజిల్లాలో నూకల వీరరాఘవయ్య - కానుమోలు, ముదునూరు హరినారాయణ, పిల్లలమర్రి సుబ్రహ్మణ్యం, కానుకొలను రాజశేఖరం మొదలగు 14 మంది సర్కారు ఉద్యోగములకు రాజీనామాల నిచ్చిరి. కాంగ్రెసు పక్షమున జిల్లా అంతటా బాగుగా ప్రచారము జరిగిన కొలది ప్రభుత్వంవారి నిర్బంధ విధానము చెలరేగెను. ముదునూరు

11874

వాస్తవ్యులైన శ్రీ అన్నే సుబ్రహ్మణ్యం, శ్రీ పాలడుగు సుబ్బారావు, శ్రీ మఠం బాలసుబ్రహ్మణ్యంగార్లు ప్రగార్లు జిల్లా అంతటను సంచారముచేసి, ఉద్రేకపూరితమైన ఉపన్యాసములతో సహాయ నిరాకరణోద్యమమును ప్రబోధించారు. గంపలగూడెంలో శ్రీ పేట బాపయ్య, ఆయనతోపాటు 6 గురిని అరెస్టుగావించి జైలుకు పంపిరి. ఉయ్యూరులో శ్రీ వల్లభనేని వెంకటాద్రి, శ్రీ గాయత్రి అనంతరామయ్య, గొడవర్రులో శ్రీ జొన్నవిత్తుల కుటుంబసుబ్బారావు వగైరా 17 మందిని అరెస్టుగావించి జైళ్ళకుపంపిరి. నూజివీడులో దశిక సూర్యప్రకాశరావు, కొత్వాలు అబ్బాస్ అల్లీ, తటవర్తి రంగయ్య మొదలగు 12 మందిని జైళ్లకు పంపిరి. శనగవరపు ఆంజనేయ శాస్త్రి, సుబ్బయ్యశాస్త్రి సోదరులను విజయవాడతాలూకా కొండూరులో అటవీ సత్యాగ్రహము జరిపినందున చెరసాలకు పంపిరి. పింగళి లక్ష్మి నారాయణగారు కొండపల్లిలో సారాయి దుకాణాలవద్ద పికిటింగు చేయగా అరెస్టు చేసిరి. వేదాంతం శంభుశాస్త్రిగారిని నందిగామ తాలూకాలో పన్నుల నిరాకరణ ప్రచారము చేయుచున్నారని పెనుగంచిప్రోలులో తీవ్రమైన లాఠీచార్జీచేసి, అరెస్టుచేసి సంవత్సరం శిక్ష వేసిరి. జగ్గయ్యపేటలో సాధు రామకృష్ణయ్య, ఈశ్వరప్రగడ జగన్నాధరావు వగైరాలు సహాయ నిరాకరణోద్యమ సభలు పెట్టిరి. డా॥ పట్టాభి సీతారామయ్య, కాశేశ్వరరావుపంతులు, చెరుకువాడ వెంకట నరసింహంగార్లు ఆ సభలో ఉపన్యసించిరి. అనంతరం జగ్గయ్యపేట కార్యకర్తలు పరిసర గ్రామములు కాలి నడకను తిరిగి గ్రామోద్యోగులచే రాజీనామాలను యిప్పించిరి. జలియన్ వాలాబాగ్ దురంతాలు, పన్నుల నిరాకరణ మొదలగు కార్యక్రమాలను గురించి ప్రబోధము గావించిరి. విదేశీ వస్త్ర దహనము, ఖద్దరుధారణ, ఖద్దరు ఉత్పత్తిగురించి సభలు జరిపిరి.

1922 జనవరి నెలలో విజయవాడ మ్యునిసిపాలిటీకి ఎన్నికలు జరిపించవలసినదిగా గొప్ప ఆందోళన లేవదీయబడినది. ఈ ఆందోళన కారణముగా శ్రీ కాశేశ్వరరావుగారిని, శ్రీ అద్దేపల్లి వెంకట గురునాధరామ శేషయ్యగారిని ఫిబ్రవరి నెలలో అరెస్టుచేసి ఒక సంవత్సరం శిక్ష విధించిరి. పిమ్మట ప్రభుత్వము రాజీకివచ్చి ఎన్నికలు జరుపగా విజయవాడ మ్యునిసిపాలిటీ కాంగ్రెసు హస్తగతమయ్యెను. అప్పటి పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు అధ్యక్షులగు శ్రీ ధన్వాడ రామచంద్రరావుగారు మ్యునిసిపల్

ఛైర్మన్‌గా ఎన్నుకొనబడిరి.. వారు 1925 ఏప్రిల్ నెలలో రాజీనామా యివ్వగా శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు ఛైర్మన్‌గా ఎన్నుకొనబడి 1930 ఏప్రిల్ వరకు ఛైర్మన్‌గా పనిచేసిరి.

## స్వ రా జ్య పా ర్టీ

1924 సంవత్సరంలో శాసనసభా కార్యక్రమములో పాల్గొనవలెనని శ్రీ చిత్తరంజన్ దాసు, మోతీలాల్ నెహ్రూ నాయకత్వాన 'స్వరాజ్యపార్టీ' స్థాపించబడినది. 1924 లో గాంధీగారు జైలునుండి వచ్చిన పిమ్మట, స్వరాజ్యపార్టీతో సమాధానపడి యీ అభిప్రాయముకలవారు శాసనసభలకు పోవుటకు అనుమతినిచ్చుచూ, కాంగ్రెసుచేతకూడ ఒప్పించిరి. 1926 లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెసువారు పాల్గొనిరి. కృష్ణాజిల్లా తరపున అయ్యదేవర కాళేశ్వరరావు, కొల్లిపర సూరయ్యగారలు కాంగ్రెసు అభ్యర్థులుగా నిర్ణయించబడిరి. అందు కాళేశ్వరరావుగారు శాసనసభకు ఎన్నుకొనబడిరి. మద్రాసు శాసన సభలో మంచి మెజారిటీ వచ్చెను. మంత్రి పదవులు స్వీకరించవలసినదిగా మద్రాసు గవర్నరు కాంగ్రెసుపార్టీ నాయకుడు శ్రీ సి. యస్. నరసింహరాజుగారిని కోరినప్పటికీ, మంత్రి పదవులను స్వీకరించుటకు కాంగ్రెసు విధానమునకు వ్యతిరేకమగుటచేత, ఆయన నిరాకరించెను. అదే సంవత్సరములో కృష్ణా, గోదావరి జిల్లాల పక్షమున ఢిల్లీ కేంద్ర శాసన సభకు ప్రకాశం పంతులుగారు కాంగ్రెసు అభ్యర్థిగా విజయమందిరి.

ఇదే సంవత్సరములో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కృష్ణాజిల్లా కాంగ్రెసు నాయకులు పాల్గొన్నారు. మొత్తం 9 తాలూకాబోర్డులు కాంగ్రెసు వశమైనవి. శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు బందరుతాలూకా బోర్డునకు అధ్యక్షులుగావుండి ఆదర్శవంతమైన పరిపాలన చేశారు. సైమన్ కమీషన్ రాకకు నిరసనగా బోర్డు ఆఫీసుపై నల్లజెండా ఎగురవేశారు. వారు గ్రామాలవెరట ఎక్కువగా సంచారం చేసేవారు. వారితోపాటు శ్రీ చెరుకువాడ వెంకటనరసింహం, శ్రీ కొడాలి ఆంజనేయులుగార్లను తీసుకొని వెళ్ళేవారు. అంటు దోష నిర్మూలన గురించి, ఖద్దరుధారణ గురించి బహిరంగ సభలలో ప్రబోధించేవారు. తమవెంట ఖద్దరు గుడ్డలను తీసుకొనివెళ్ళి, అమ్మకం చేయించేవారు. ఉపాధ్యాయుల నందరను

ప్రోత్సహించి, ఖద్దరు ధరించేటట్లుచేశారు. ఉపాధ్యాయులను వారి కష్టాలను చెప్పుకొనుటకు ఆఫీసుకు వెళ్ళపనిలేకుండా నేరుగా తమవద్దకే వచ్చునట్లు ప్రోత్సహించి, వారి సమస్యలను అప్పటికప్పుడే పరిష్కరించి పంపేవారు. ఆ వచ్చినవారిని ఖద్దరు కట్టుతున్నావా? లేదా? అని అడిగేవారు. అందువల్ల వారందరు ఖద్దరు దుస్తులతో వారిదగ్గరకు వెళ్ళినట్లయితే, వారు సంతోషంగా వుంటారని, తమ కష్టాలను త్వరలో తీర్చివేస్తారని నమ్మకం కలిగి ఉపాధ్యాయులందరు నిత్యము ఖద్దరు కట్టుటకు అలవాటుపడిపోయినారు. సైమన్ కమీషన్ వచ్చినప్పుడు నిరసనగా పాఠశాలలన్నిటికి సెలవుయిచ్చి, మూయించివేసినారు. అప్పుడు దివి, బందరు తాలూకాలు రెండూ బందరుతాలూకా బోర్డుగా వ్యవహరించ బడివుండేవి. విజయవాడ మ్యునిసిపాలిటీవారు తమ నిరసన పత్రమును 'డఫేదారు' ద్వారా సైమనుకు పంపిరి. శ్రీ ధన్వాడ రామచంద్రరావు గారు ప్రథమ జిల్లాబోర్డుకు అధ్యక్షులయిరి. అన్ని స్థానిక సంస్థలు నిరసనగా తమ ఆఫీసులపై నల్ల జెండాలను ఎగురవేసిరి. ఇది మొదటి సైమన్ కమీషన్ వచ్చినప్పుడు జరిగినపని, మరల 1928లో సైమన్ కమీషన్ రెండవసారి మద్రాసు వచ్చినప్పుడు. కృష్ణాజిల్లా తరఫున ప్రకాశంగారితో పాటు బ్రహ్మయ్యగారు పాల్గొనిరి. పోలీసు కాల్పులు జరిగినవి.

## నిర్మాణ కార్యక్రమము

1925 నుండి 1930 వరకు ఉభయ కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘాలు నిర్మాణ కార్యక్రమ ప్రచారము విరివిగా సాగించినవి. డా. పట్టాభి సీతారామయ్యగారి ప్రత్యేక కృషివలన, బందరులో ఆంధ్రాబ్యాంకు, ఇన్సూరెన్సు కంపెనీలు స్థాపించబడినవి. ఈ బ్యాంకింగు, ఇన్సూరెన్సులద్వారా ఎంతో ధనము యేటా విదేశస్థులు దోపిడీచేయుచున్నారు. అందుకని, దీని నరికట్టుటకు స్వదేశీయుల మూలధనముతోనే స్వదేశీయుల మేనేజిమెంటులో యీ సంస్థలు స్థాపించబడినవి దీనితోపాటు సహకార ఉద్యమముకూడ విరివిగా ప్రచారముగావించి జిల్లా అంతటా గ్రామ సహకార సంఘములు స్థాపించి, ప్రజలకు ఋణ సౌకర్యములను కల్పించు టకుకూడ పట్టాభిగారి నాయకత్వాన విశేషమైన కార్యక్రమము సాగింప బడినది. ఇదేసమయంలో గుడ్లవల్లేరు భూమి తనఖా బ్యాంకు స్థాపించ

బడెను. బందరు పట్టణములో 'జన్మభూమి' అను ఇంగ్లీషు వారపత్రికను 1919లో స్థాపించి, 1930లో పట్టాభిగారు జైలుకు వెళ్ళువరకు జయప్రదముగా నడిపిరి. ఈ పత్రిక గాంధీమహాత్ముని మన్ననలనుకూడ పొందెను.

1921 మొదలు 23 వరకు ఒక ఖద్దరు సంస్థను ధన్వాడ రామచంద్ర రావుగారి యాజమాన్యమున విజయవాడలో వుండెను. తర్వాత అద్దేపల్లి వెంకట గురునాధ రామశేషయ్యగారి యాజమాన్యమున కొన్ని సంవత్సరాలు పనిచేసెను. తిలక్ పేటలో (శ్రీ) కాట్రగడ్డ రఘురామయ్య, నల్లూరి పాపయ్య, పేట బాపయ్యగార్ల యాజమాన్యమున కొంతకాలము ఒక ఖద్దరు సంస్థ పనిచేసెను. జగ్గయ్యపేట, రమణక్కపేట, కానుమోలు, కేసరపల్లి మొదలగుచోట్ల ఖద్దరు ఉత్పత్తి స్థానములు నెలకొల్పి పనిచేసెను. తర్వాత కొంతకాలానికి అఖిలభారత చరఖాసంఘం ఆంధ్ర శాఖవారి యాజమాన్యమున వీటిని తీసుకొనబడి వారియొక్క ఖద్దరు విక్రయశాలలు నెలకొల్పబడినవి. కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమములో ముఖ్యముగా పేర్కొనదగినది గుణదల ఖద్దరు సంస్థానము. ఉప్పులూరు వెంకట కృష్ణయ్యగారు 21 వేలు స్వంత ద్రవ్యము యిచ్చివేయుటతోపాటు, తన పిల్లలనుకూడ బాబు రాజేంద్రప్రసాదుగారు వచ్చినప్పుడు దేశమునకు అర్పించినారు. అచ్చట వ్యవసాయం, ఖద్దరు ఉత్పత్తి సాగించబడి అన్న వస్త్రములకు సంపూర్ణస్వయం సహాయ సిద్ధాంతములు అమలు జరుపబడు చున్నవి. స్వంత ఆస్థి వుండకూడదని, ఆస్థి అంతయు సంస్థకు అర్పణ చేయవలయునని ఉత్కృష్ట ఆశయంతో సభ్యులు పనిచేయుచున్నారు. ముఖ్యముగా అన్నవస్త్రముల విషయములో నోట్లు, నాణెములు లేకుండా, వస్తుమార్పిడి పద్ధతిని మరల వ్యాపింపజేయవలెనని వారి సిద్ధాంతం.

## ఉప్పు సత్యాగ్రహము

1930 మార్చి నెలలో గాంధీమహాత్ముడు 80 మంది అనుచరులతో సబర్మతీ ఆశ్రమమునుండి ఉప్పు సత్యాగ్రహము చేయుటకై దండి గ్రామమునకు బయలుదేరి వెళ్ళిరి. ఆంధ్రదేశం తరఫున కృష్ణాజిల్లా అంగలూరు వాస్తవ్యులు శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యంగారు యీ చారిత్రాత్మక యాత్రలో పాల్గొనిరి. ఆదేసమయంలో కొండా వెంకటప్పయ్య, కాశేశ్వరరావు-

సాంబమూర్తి, దండు నారాయణరాజుగార్లు గుజరాత్‌లోని బోర్సాదువద్ద గాంధీమహాత్ముని దర్శించి వారి సలహాలను పొందివచ్చిరి. మార్చి నెల 31వ తేదీన గుంటూరులో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు కమిటీ సమావేశమై శాసనోల్లంఘనము చేయుటకు తీర్మానించిరి. పశ్చిమ కృష్ణా కాంగ్రెసు సంఘం కాకుమాను లక్ష్మయ్య చౌదరిగారి అధ్యక్షతక్రింద సమావేశమై శాసనోల్లంఘనం చేయుటకు తీర్మానించిరి. కొంతమంది శాంతిసైనికులు బందరువెళ్ళి తూర్పు కృష్ణా శాంతి సైనికులతో కలిసి పనిచేయుటకు తీర్మానించుకొనిరి. శ్రీ కోటగిరి వెంకట కృష్ణారావుగారిని ప్రథమ సర్వ సేనాధిపతిగా ఎన్నుకొనిరి. వారి ఆధ్వర్యాన ఏప్రిల్ 2వ తేదీన విజయవాడ ఆంధ్రరత్న భవనమునందు సత్యాగ్రహ శిబిరము కాశేశ్వరరావు గారిచే ప్రారంభించబడెను. మరునాడు కాశేశ్వరరావుగారు బందరుచేరిరి. 6వ తేదీన డా॥ పట్టాభి సీతారామయ్య, కాశేశ్వరరావు, ముట్నూరి కృష్ణా రావుగార్లు బందరు సముద్ర తీరమునకుపోయి, నిషేధించబడిన ఉప్పును తీసుకొనివచ్చి ఆ సాయంత్రం తిలక్‌చౌక్ నందు జరిగిన బహిరంగ సభలో ప్రదర్శించిరి.

1930 ఏప్రిల్ నెలలో షుమారు 300 మంది సత్యాగ్రహులు ఆంధ్రరత్న భవనంలోని శిబిరంలో చేరిరి. నానాటికి ఆ సంఖ్య వృద్ధికా జొచ్చెను. వారికికావలసిన భోజనసౌకర్యములు విజయవాడ వర్తకులుచేసిరి.

1930 ఏప్రిల్ 9వ తేదీ ఉదయం సర్వసేనాధిపతి కోటగిరి వెంకట కృష్ణారావు నాయకత్వాన 63గురు శాంతి సైనికులు జాతీయ పతాకము లను పూని, వాయిద్యములు మ్రోగుచుండగా, స్త్రీలు మంగళహారతు లివ్వగా, ప్రజాసమూహములు గుమికూడి చూచుచుండగా, శ్రీ కొండా వెంకటప్పయ్య, టంగుటూరు ప్రకాశం, కాశేశ్వరరావుగార్లు ఆశీస్సులు చెప్ప, ఆంధ్రరత్న భవనమునుండి గవర్నరుపేట ముఖ్యమైన వీధులగుండా తిరిగి, అచ్చటచట స్త్రీలు యిచ్చు మంగళహారతులను పుష్పమాలలను గైకొనుచు, కాలినడకను బందరురోడ్డుమీద ప్రయాణమైపోయిరి. త్రోవలో మొగల్రాజపురం, పటమట, పటమటలంక, పోరంకి, ఈడ్పుగల్లు, పునాదిపాడు, నెప్పల్లె, ఆకునూరు, ఉయ్యూరు, కుమ్మమూరు గ్రామము లందు మకాములుచేసి, దారిలో మరొక 17 మంది కొత్త సైనికులను దళములో చేర్చుకొని, విరాళములు పోగుచేసి 11-4-30 సాయంత్రము

బందరు చేరిరి. అచ్చట గంపలగూడెం కుమార రాజాగారు తూర్పు పశ్చిమ కృష్ణాజిల్లాలు కలిపి యావత్తు దళమునకు నాయకత్వము వహించి, చిన్నాపురం అను గ్రామమునకేగి, అచట 3 రోజులు తన దళములతో సముద్రతీరమున ఉప్పును విశేషముగా పోగుచేసిరి. తిరిగి 14వ తేదీన బందరు వచ్చిరి. ఈ లోపున వేలూరి యజ్ఞనారాయణశాస్త్రిగారు 5 గురు సత్యాగ్రహులతో 9వ తేదీన బందరుచేరి, సముద్రతీరమునందు ఉప్పుతెచ్చి, బహిరంగసభలో ఉప్పును విక్రయించిరి.

## బందరులో మద్రాసు గవర్నరును నిషేధించుట

ది 8-2-1930 న మద్రాసు గవర్నరు బందరు వచ్చినప్పుడు బహిష్కరించుటకై తూర్పుకృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘంవారు 2వ తేదీన బ్రహ్మయ్యగారి అధ్యక్షతన ఘంటసాలలో సమావేశమై తీర్మానించిరి. ఆ తీర్మానానుసారం బందరులో "గో బాక్ గవర్నరు" అను కేకలతో నల్లజెండాల ఊరేగింపు జరిగినది. పోలీసువారు ఆప్రదర్శనను నిషేధించిరి. నిషేధపుటుత్తరువును ఉల్లంఘించిన 32 మంది స్వయం సేవకులు అరెస్టు చేయబడిరి. కాని 11 మందిమీద మాత్రమే కేసు పెట్టబడి 15-3-30 తేదీన వారికి శిక్ష విధించిరి. ఈ శిక్షించబడినవారిలో శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, శ్రీ బొబ్బా వెంకట శేషయ్య, శ్రీ కొడాలి ఆంజనేయులు మొదలగువారు జిల్లా కాంగ్రెస్‌లో ప్రముఖులగుటచేత, శిక్షలు కృష్ణా మండలమున ప్రజలలో సత్యాగ్రహోద్యమమునకు ప్రోద్బలముచేకూరెను.

ఈ అరెస్టుల అనంతరం కురుమద్దాలి వాస్తవ్యులు శ్రీ పిన్నమనేని వీరయ్యగారు టౌనుహాలు ఆవరణలోనికి గవర్నరు కారు వెళ్ళుచున్నప్పుడు ఒక నల్లజెండాను వుండగాచుట్టి, ఆ కారులోనికి వేశారు. అది గవర్నరు గారి ఎ. డి. సి. వళ్ళో పడినది. వెంటనే శ్రీ వీరయ్యగారిని అరెస్టుచేసి, విచారించి నెలరోజులు కఠినశిక్ష వేశారు. స్థానిక పోలీసులు తగిన బందోబస్తు చేయలేదని ఎ. డి సి. వారిపై ధూం, ధూములుచేశారు.

## బందరు శిబిరము

తూర్పు కృష్ణాజిల్లాలో ముఖ్యమగు గ్రామము లన్నిటియందు కాంగ్రెసు సంఘము లేర్పడియుండెను. జిల్లా కాంగ్రెసు అధ్యక్షులైన

శ్రీ కానూరి చినవెంకటదాసయ్య, శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్య, శ్రీ ముట్నూరి కృష్ణారావు, శ్రీ చెరుకువాడ వెంకటనరసింహం మున్నగు పెద్దలు, షుమారు 100 గ్రామములు సంచారంచేసి, ప్రతి గ్రామంలోను యువకులతో వాలంటీరు ప్రమాణ పత్రములు స్వీకరింపజేసిరి. ధనరూపం లోను, ధాన్యరూపంలోను ప్రజలు వీరికి చందాలిచ్చిరి. బందరు సత్యాగ్రహ శిబిర స్థాపనకై గొడుగుపేట నాటకశాలను స్థిరపర్చుకొనిరి. కాని పోలీసు సూపరిన్‌టెండెంటు హాలు యజమానిని బెదిరించినందున, అతను భయపడి వీలులేదనెను. ఆంధ్ర చరఖానంఘ ఆవరణలో శిబిరము స్థాపించబడెను. పురాణం సూరిశాస్త్రిగారు తాను వలంటీరుగా చేరుటయే గాక, వలంటీర్ల భోజన, వసతి సదుపాయములకు ప్రక్కనున్న తన పెద్ద భవనము నొసంగిరి. పట్టణంలోని వర్తకులందరు శిబిరమును పోషించిరి. ఈ శిబిరము 2-4-30న శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారిచే ప్రారంభించ బడెను. ఒక వారంరోజులు సత్యాగ్రహులకు శిక్షణ గరపబడెను. గ్రామాలనుండి శిబిరమునకు ప్రతిదినము వాలంటీర్లువచ్చి చేరుచుండిరి. వాలంటీర్ల సంఖ్య 250కి పెరుగుటతోడనే 12 దళములుగా విభజింపబడి, ఈ దిగువ పేర్కొనబడిన దళపతుల ఆధిపత్యమున గ్రామములవెంట కాలి నడకను ప్రచారము గావించబడెను — 1. శ్రీ గోనుగుంట్ల వెంకట సుబ్రహ్మణ్యంగుప్త 2. శ్రీ కామినేని వెంకటప్పయ్య 3. శ్రీ వల్లభనేని రామబ్రహ్మం 4. శ్రీ కొల్లిపర సూరయ్య 5. శ్రీ కాశీనాధుని వీరమల్లయ్య 6. శ్రీ సూరపనేని గోపాలకృష్ణయ్య—మిగిలిన ఆరు దళములుమాత్రము శిబిరములో నిలవవుంచబడెను. ఉప్పుచేయుటకు తగిన స్థలము వెతకుటకై పట్టాభి సీతారామయ్య మున్నగు నాయకులు యాదర, కోన, చిన్నాపురం, తాళ్లపాలెం మొదలగు సముద్రతీర ప్రాంతములకు పోయి పరీక్షించిరి. చిన్నాపురం దగ్గర పల్లపు ప్రదేశములందు పర్వదినములలో సముద్రము పొంగవచ్చి నీరు నిలువవుండి, ఎండి, స్ఫటికమువలె గడ్డగట్టి సహజముగానే ఉప్పు తయారగు ప్రదేశంకలదు. అక్కడకు సముద్రం నాలుగు మైళ్ళు కలదు. ఆ ప్రదేశమును ఉప్పుచేయుటకు నిశ్చయింపబడి, చిన్నాపురం లోనే శిబిరము నిర్మించబడెను. అక్కడ శిబిరమునకు కావలసిన వసతు లన్నింటిని గ్రామ వాస్తవ్యులు సమకూర్చిరి. శాంతి సైనికులు చిన్నా పురం వెళ్ళివచ్చుటకు ప్రయాణ సౌకర్యార్థము వల్లభనేని రామబ్రహ్మం గారు తన స్వంత బస్సు సప్లయిచేయగా బస్సు లై సెన్సులను రద్దుపర్చుచూ,

శ్రీ రామబ్రహ్మంగారికి 500 లు జరిమానావేసి, వెంటనే వసూలుచేసిరి. ఈ సందర్భమున బస్సు డ్రైవరు అన్నె వెంకట శివుడుగార్కి 4 మాసాలు శిక్ష విధించిరి. 10-4-30 తేదీన టంగుటూరు ప్రకాశంపంతులు, కొండా వెంకటప్పయ్య, కాశీనాధుని నాగేశ్వరరావు మొదలగు నాయకులు సత్యాగ్రహకేంద్రము దర్శించి, రిక్తహస్తములతో వచ్చుట పాడిగాదు, గుప్పిళ్ళతో ఉప్పును తీసుకొనివచ్చిరి. దారిలో పోలీసులు వారిని అడ్డగించి బలప్రయోగంతో ఆ ఉప్పును తీసుకొనిరి. ఆ సాయంత్రం బందరు చౌక్‌లో బహిరంగసభ జరిగెను. ఆ సభలో చిన్నాపురంనుండి తెచ్చిన ఉప్పు అమ్మబడెను. సముద్రపునీరు కుండలతోకూడ తెచ్చి అమ్మిరి.

విజయవాడలో డా॥ వెలిదండ్ల హనుమంతరావుగారి నాయకత్వంలో బయలుదేరిన రెండవ దళం 34గురు సత్యాగ్రహులతో ఆంధ్రరత్న భవనం నుండి ప్రజల కోలాహలముమధ్య బయలుదేరి పోరంకి, పెనమలూరు, వేల్పూరు, ఉప్పులూరు, మంతెన, తెన్నేరు, మానికొండ, కల్వపాముల, ముదునూరు, మంటాడ గ్రామాలను దర్శించి, 13-4-30 తేదీన బందరు చేరిరి. దారిలో వీరు సభలు జరుపుతూ, ఉప్పు పొట్లములు విక్రయించుచూ, సత్యాగ్రహ ప్రచారము చేయుచూ పోయిరి.

గంపలగూడెం కుమారరాజా, డా॥ వెలిదండ్ల హనుమంతరావు, ఘంటసాల సీతారామశర్మగార్లు కృష్ణాజిల్లా మేజిస్ట్రేటుగారికి తాము జరుపుతున్న సత్యాగ్రహమునుగూర్చి నోటీసును యిచ్చిరి. 16-4-30న గంపలగూడెం కుమారరాజా తన దళంతో విజయవాడకు విచ్చేసి, సముద్రమునుండి తెచ్చిన ఉప్పును బహిరంగ సభలయందు అమ్మిరి. తరువాత తమ దళమును 6 చిన్నదళములుగా విభజించి, గ్రామాలలో ఉప్పు అమ్ముటకున్నూ, సత్యాగ్రహమును బోధించుటకు జిల్లాలోనికి పంపిరి. వీరు 64 గ్రామాలు దర్శించి, గొప్ప ప్రబోధము గావించిరి.

శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు 6 గురు శాంతి సైనికులతో బయలుదేరి, నందిగామ తాలూకాలో కాలినడకను కొన్ని ముఖ్యమగు గ్రామాలలో బహిరంగసభలుజరిపి, చాలామంది క్రొత్తవారిని తమదళంలో చేర్చుకొని విజయవాడకు వచ్చిరి. 12-4-30 తేది సాయంత్రం జాతీయ పతాకాలతో అలంకరించబడిన ఒక ప్రత్యేక రైలు బోగీలోఎక్కి 80మంది

సత్యాగ్రహులతో విజయవాడ స్టేషన్‌లో పౌరుల వీడ్కోలు తీసుకొని, జై! జై! ధ్వానాలు చెలరేగుచుండ బందరుకు ప్రయాణమైపోయిరి. వీరి దళములో సాధు రామకృష్ణయ్య, శ్రీరాం అప్పన్న, వెంట్రప్రగడ రామకృష్ణయ్య, మొరిశెట్టి బసవరాజు, కప్పగంతుల వెంకటరామనరసింహారావు, చింతలపాటి హనుమంతరావు, ఘంటసాల నరసింహులు, జగరికపాటి కృష్ణమూర్తి, అనుముల రామగోవిందశర్మ, రేపాల బుచ్చిరామ శేషయ్య శ్రేష్ఠి, మందడపు బాలవీరరాఘవయ్య, మంగళ సుబ్బారావుగార్లు కలరు. బందరులో వీరి దళం వెలిదండ్ల హనుమంతరావుగారి దళముతో కలిసినది. మరునాడు ఉదయము స్వామి నారాయణానందను విజయవాడలో అరెస్టుచేసి బందరు సబ్ జైలుకు తీసుకొనివచ్చిరి. వీరి అసలు పేరు శ్రీ పింగళి లక్ష్మీనారాయణగారు. డా॥ హనుమంతరావు, కాశేశ్వరరావుగారలు, తమ దళములతో సముద్రతీరమునకు వెళ్ళి, ఉప్పు సత్యాగ్రహము గావించిరి. తిరిగి శిబిరమునకు రాగానే కాశేశ్వరరావుగారిని అరెస్టుచేసి, మెజిస్ట్రేటు ఎదుట బెట్టి అప్పటికప్పుడే విచారణ పూర్తిచేసి, సంవత్సరం కారాగారశిక్ష విధించి రాజమండ్రి జైలుకు పంపించిరి. ఆ మరునాడు నారాయణానందస్వామిగారికి ఒక సంవత్సరం శిక్షవిధించి రాజమహేంద్రవరం పంపిరి.

శ్రీ హనుమంతరావుగారు మిగిలిన సత్యాగ్రహులతో విజయవాడ వచ్చి ఉద్యమమును నడుపుచుండిరి. విజయవాడ పట్టణమునందు కల్లు సారాయి కొట్లముందు పికెటింగు మొదలిడిరి. పోలీసువారిని నౌకరీలు వదలుకొమ్మని ఉపన్యాసములు చేసిరి. సైక్లోస్టయిల్ చేసిన కరపత్రములను పంచిపెట్టిరి. అందుకుగాను గంపలగూడెం కుమారరాజా, వెలిదండ్ల హనుమంతరావు, కాకుమాను లక్ష్మయ్యగార్లను అరెస్టుచేసి, శిక్షలువిధించి జైలుకు పంపిరి. 21-6-30న ఆంధ్రరత్న భవనమును స్వాధీనపర్చుకొని శిబిరములోని సత్యాగ్రహులను కొట్టి వెడలగొట్టిరి. సభలు చేయరాదని 144వ సెక్షను ప్రయోగించిరి. శ్రీ అనుముల రామగోవిందశర్మగారు తమ గ్రామములో ఉప్పు తయారుచేయుచున్నట్లు నందిగామ తహశీలుదారుకు నోటీసు ఇచ్చిరి. వెంటనే వారిని అరెస్టుచేసి జైలుకు పంపిరి. కాంగ్రెసు సంస్థలు అక్రమ సంఘముగా పరిగణించిరి. 144వ సెక్షను ఉల్లంఘించినందుకు కొంతమంది సత్యాగ్రహులను అరెస్టుచేసి శిక్షించిరి. నిషిద్ధ వాఙ్మయమును ప్రకటించి పెట్టినందుకు "సత్యాగ్రహ సమాచారం" అను

అనుజ్ఞలేని సైక్లోస్టయిల్ వార్తా పత్రికను ప్రకటించినందుకు, తాటిచెట్ల
తెల్లలు నరికివేసినందుకు పెక్కుమంది సత్యాగ్రహులు అరెస్టుగాబడి శిక్షింప
బడిరి. విదేశ వస్త్ర దుకాణముల వద్దను, కల్లు సారాయి దుకాణముల
వద్దను పికెటింగు చేసినందుకు శ్రీ మరుపిళ్ళ చిట్టి అను చిన అప్పలస్వామి
గారిని, వారి బృందాన్ని అరెస్టుచేసి శిక్షించిరి. పెక్కుచోట్ల లాఠీ
చార్జీలు కూడ చేయబడెను. శ్రీ కాట్రగడ్డ మధుసూదనరావుగారిని కొట్టిరి.
విజయవాడ శిబిర నిర్వహణ బాధ్యతను ఈయన వహించి చాల కట్టుదిట్ట
ముగా నడుపుచుండిరి. తర్వాత వీరినికూడ అరెస్టుచేసి జైలుకు పంపిరి.
మరొక పుట్టు గుడ్డియగు భువనగిరియం నాగభూషణంగారికి 2 సంవత్సరాల
కఠిన శిక్ష విధించిరి. పీసపాటి సీతాకాంతం అనువకీలును తిరువూరులో
పోలీసు ఉద్యోగి రోడ్డుమీద ఇద్దరు బట్టలను విప్పించి విదేశ వస్త్రములు
కట్టించినందుకు ఆ పోలీసుపై క్రిమినల్ కేసు పెట్టబడెను. ఆ పోలీసునకు
జరిమానా విధించబడెను.

శ్రీ దగవల్లి శివరావు, శ్రీ చెరుకుపల్లి వేంకటప్పయ్యగార్ల
ఆధ్వర్యాన ఒక ప్రచురణశాఖ నెలకొల్పబడి ప్రజలలో బాగుగా ప్రబోధం
గావించబడెను. "సత్యాగ్రహ చరిత్ర" అను గ్రంథం 400 ప్రతులు ప్రచా
రకులు ఉచితంగానిచ్చిరి. నిర్భాగ్య భారతం, ఆంధ్రపౌరుషం, ఉప్పుసత్యా
గ్రహం, నిర్మాణ కార్యక్రమం, బార్డోలీ సత్యాగ్రహ విజయం, నిర్మాణ
కార్యక్రమగీతాలు, పాంచజన్యగీతాలు, దరిద్రనారాయణం, విదేశ వస్త్ర
బహిష్కారం, సత్యాగ్రహబోధిని, బ్రిటిషు వస్త్ర బహిష్కారం, త్యాగుడు
మానుడు అను కరపత్రములను పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెస్సు పక్షమున
ప్రచురించబడి పంచిపెట్టబడినవి. వీటిలో కొన్నింటిని ప్రభుత్వంవారు
నిషేధించినారు. ఈ ఉద్యమములో మొత్తంమీద జైలుకుపోయినవారిలో
రైతు యువకులే ఎక్కువమంది కలరు. నాయకులు అరెస్టుకాగానే
వర్తకులు తమంతతామే హర్తాలను జరిపిరి. ఈసత్యాగ్రహ సమయంలో
పొదుర్తి సుందరమ్మ, పెరంబదూరి సుభద్రమ్మగార్లతో సహా 168 మంది
సత్యాగ్రహులు జైళ్ళకు వెళ్ళిరి.

గాంధీగారి దండియాత్రలో పాల్గొనిన శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యం
గారు ఏప్రిల్ 15వ తేదీన బందరు వచ్చిరి. వారికి బ్రహ్మాండమగు
స్వాగతము జరిగెను. బందరుచౌకులో వారు గంభీరోపన్యాసమువిచ్చి

దండినుండి తెచ్చిన ఉప్పును అమ్మిరి. తరువాత శాంతిసేనను తీసుకొని జిల్లాలోని గ్రామాలన్నిటను సంచారముచేసి, దండి ఉప్పును అమ్ముచూ కల్లు దుకాణముల పికిటింగు, తాటిగెలలు నరుకుట విరివిగా సాగించెను. శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారు తమ జట్టుతోసహా కొమరవోలువద్ద తాటిగెలలు నరికించి, 6 మాసాలు ప్రభుత్వ శిక్షకు గురియైరి. ఏప్రిల్ చివరలో పట్టాభిగారిని, చెరుకువాడ నరసింహంగారిని అరెస్టుచేసి చెరిఒక సంవత్సరం శిక్ష విధించిరి. పట్టణమంతయు హర్తాలు జరిగెను. ఆ రోజు ప్లీడరు గుమాస్తాలెవ్వరు కోర్టులకు పోలేదు. ఇంటింట జెండాలు ఎగుర వేయబడినవి. పట్టాభిగారి అనంతరం డా॥ కోకా అవఘోబలరావునాయ్డు గారు నాయకత్వము వహించుటచేత జిల్లా ప్రజల వుత్సాహము యినుమ డించెను. నాయుడుగారు ఇంటింటికి, చుట్టుపక్కల పల్లెలకువెళ్ళి ఖద్దరు ప్రచారమును మద్యపాన నిషేధ ప్రచారము గావించిరి. తటవర్తి నాగ పోతరావుగారితో యికనుండి సీమగుడ్డలకు ఆర్డరు యివ్వనని శపథము చేయించిరి. శ్రీ పెదశింగు వెంకట రంగయ్యగారు మద్య నిషేధ ప్రచారమునకు హెచ్చుగా సహాయపడిరి.

## బందరు కుందుమీద జండా యుద్ధం

కొండిపర్తి వీరభద్రాచార్యులుగారు (తత్త్వానందస్వామి పూర్వా శ్రమములో) రాబర్టుసన్ కుందుమీద జెండాను ప్రతిష్టించిరి. మే నెల 6వ తేదీ తెల్లవారేసరికల్లా గాంధీగారి అరెస్టువార్త బందరు పట్టణమంతా వ్యాపించెను. వెంటనే బ్యాండు వాయిద్యములతో శాంతిసైనికులు శిబిరమునుండి ఊరేగింపుతో బయలుదేరిరి. ఊరేగింపు కొంతదూరము సాగేసరికి, కుందుమీదనున్న జెండాను పోలీసులు విరిచిపారవేసిరనువార్త వచ్చెను. ఊరేగింపు అంతట కుందువద్దకువచ్చి జెండాను పునః ప్రతిష్ఠింప ప్రయత్నించిరి. తత్త్వానందులవారు నిచ్చెనమీదుగా కుందు స్తంభమునెక్కి జెండా పెట్టబోగా అంతకు పూర్వమే అక్కడ బెడ్రిస్సులో కూర్చునివున్న పోలీసుభటుడొకడు స్వాములవారి చేతిలో జెండాను గుంజుకొని విరిచి పారవేసెను. స్వాములవారిని ఒక మూటగాకట్టి క్రిందికి త్రోసివేయు వరకు వారు పెనుగులాడిరి. వెంటనే తక్కిన వాలంటీర్లు ఎట్లయిననుసరే కుందుమీద జెండాను ప్రతిష్ఠించుటకు హోరాహోరిగా పోలీసు భటులతో పెనుగులాడిరి. ఈ పెనుగులాటలో పోలీసు లాఠీచార్జీలకు, రోడ్లమీద

ఈడ్పులకు మరియితర హింసలకు గురియైనవారు శ్రీ సాయం వరదదాసు, చలసాని నాగభూషణం, గురుజాడ రాఘవశర్మ, తాడికొండ వీరభద్రయ్య, టి. పి. ఆళ్వారు, ఈడ్పుగంటి సుబ్బారావుగార్లు ముఖ్యులు. చెరువు సుబ్బారావుగారి బట్టలను చించివేసి పోలీసులు దిగంబరునిచేసిరి. వైద్య సహాయము చేయడానికివచ్చిన డా॥ పోతరాజు చలపతిరావుగారినికూడా వెనుకకు నెట్టివేసిరి.

ఆనాటి యుద్ధంలో వీరందరిది ఒకఎత్తు, వస్తాదు తోట నరసయ్య నాయుడుగారిది ఒకఎత్తు. వీరు మంచి వస్తాదులగుటచేత 15 మంది పోలీసులు ఒక్కుమ్మడిగా వీరిమీదపడి, బాది, తన్ని, సృహతప్పినతరువాతనే ఆయనను క్రిందకు లాగగలిగిరి. మహాత్మా నీవేగతి అని స్మరించుచు, నరసయ్యనాయుడుగారు ధీరతతో ఎదురునిలిచిరి. పట్టణమంతయు గగ్గోలుపుట్టెను. హర్తాలు జరిగెను. ప్రజలలో చెలరేగిన ఉద్రేకమును శాంతింపచేయుటకై బందరు మునిసిపల్ ఛైర్మన్ శ్రీ శీలం జగన్నాధరావు నాయుడుగారు ఖద్దరుధారులై ధైర్య సాహసములతో ముందుకువచ్చి, ప్రజలకు అభయహస్తమిచ్చి స్వయంగా తన చేతులతో మ్యునిసిపల్ ఆఫీస్ మీద జెండాను కట్టిరి. కుందుమీద జెండాను కట్టుకొనుటకు అనుమతి నిచ్చుచూ కౌన్సిల్ లో తీర్మానింపజేసిరి. ఇంతటితో జెండాకు విజయమును ప్రజల మనస్సులలో శాంతము యేర్పడినది. ఆనాటి పోలీసు దౌర్జన్యమును బందరు వకీళ్ళందరు ఖండించిరి. ఈ బందరు కుందు స్తంభంమీద జెండాయుద్ధమున్నూ, అందు తోట నరసయ్యగారు చూపిన ధైర్యసాహసములను ఆంధ్రదేశమంతటా నూతనోత్సాహం ప్రజ్వరిల్లజేసినది.

బందరు పట్టణంలోని శిబిరవాసుల నందరిని జట్లుజట్లుగా అరెస్టుచేసి కృష్ణ జన్మస్థానమునకు పంపించిరి. చివరకు శిబిరముమీదికి పోలీసులు దండెత్తివచ్చిరి. శిబిరమునకు ఇల్లు ఇచ్చిన పురాణం సూరిశాస్త్రిగారికి 6 మాసాలు కఠినశిక్ష వేసిరి. శిబిర నిర్వాహకులు శ్రీ కోడే గోపాల కృష్ణయ్యగారికి, శ్రీ గొట్టిపాటి సూర్యనారాయణగారికి జైలు ప్రవేశం కలిగెను. కృష్ణాపత్రిక ప్రచురణ 6 మాసాలు ఆగిపోయెను. ఈ అరెస్టులకు నిరసనగా మద్రాసు శాసనసభకు నామినేటెడ్ మెంబరు అయిన వేమూరి రాంజీరావు తమ శాసనసభా సభ్యత్వమునకు రాజీనామానిచ్చిరి. అట్లే పర్వతనేని భూషయ్యగారుకూడ శాసనసభాసభ్యత్వమునువదలుకొనిరి.

పట్టాభిగారి యింట్లో స్త్రీల కొరకు ప్రత్యేకంగా బస ఏర్పాటుచేయ బడినది. శ్రీమతి కొర్రపాటి అంకమ్మగారు వారికి నాయకురాలై నడి పించెను. ఈ స్త్రీ వాలంటీర్లందరు ప్రతిదినం నగర సంకీర్తనముచేసి, ఖద్దరు ప్రచారం, పికిటింగుచేసిరి. రిటైర్డ్ జడ్జి వారణాసి సుబ్రహ్మణ్యంగారి కుమార్డు వెంకటాచలంగారు బి. ఎ. పరీక్షకు పోవుట మానుకొని, ఉద్యమంలోనికి దిగెను. అహోబలరావుగారితో కలిసి వీరు సత్యాగ్రహ ప్రచారము గావించిరి. వీరికి శిక్ష విధించబడినది. బెజవాడ కో-ఆపరేటివ్ ట్రెయినింగు మానుకొని శ్రీ తంగిరాల వీరరాఘవరావు ఉద్యమంలో పాల్గొని 6 మాసాలు శిక్షపడిరి. అట్లే దాసురాజు పట్టాభి రామారావు ప్రభుత్వో ద్యోగం మానుకొని ఉద్యమంలోచేరి జైలుకు వెళ్ళిరి. జిల్లాలో యీ దిగువ సెంటరులలో తీవ్రప్రచారము జరిగెను —

1 లింగాల 2. ముక్కొల్లు 3. కపిలేశ్వరపురం 4. అర్తమూరు 5. మల్లవోలు 6. జమీగొల్వేపల్లి 7. భట్లపెనుమర్రు 8. చవుటపల్లి 9. నందివాడ 10. కురుమద్దాలి 11. ఘంటసాల 12 వెంట్రప్రగడ 13. కాజ 14. కౌతరం 15. గుడ్లవల్లేరు 16. అంగలూరు 17. కొమరవోలు 18. మొవ్వ మొదలగు గ్రామాలలో కల్లుదుకాణములవద్ద పికిటింగ్, తాటిగెలలు నరుకుట, జెండా ప్రతిష్ఠాపనలు, ఉప్పుచేయుట, అమ్ముట, ఊరేగింపులు మొదలగు కార్యక్రమాలు అత్యుత్సాహంతో జరుపబడెను. పోలీసులు శాసనంతో నిమిత్తంలేకుండా అడ్డదిడ్డముగా ప్రవర్తింపసాగిరి. గ్రామాలవెంటబడి ఖద్దరు కట్టుకొన్నవారిని, గాంధీ టోపిని పెట్టుకొన్న వారిని లాఠీలతో బాదియు, గాంధీపటములను, దేశనాయకుల పటములను, జెండాలను ఊడబెరికి, చింపి పారవేసియు, తగులబెట్టియు, ఖద్దరు దుకాణ ములు బ్రద్దలుగొట్టియు, గ్రంథాలయములలోని పుస్తకములను మంటలలో వేసియు సామాన్య ప్రజలను దద్దరిల్లజేసిరి. ఈ భీభత్సము కల్పించిన వారిలో ప్రముఖులు గుడివాడ సర్కిల్ ఇన్‌స్పెక్టరు దావూద్ ఖాన్ సాహెబుగారి పేరుప్రఖ్యాతి గాంచెను. 1931 జనవరి 6న జిల్లా కేంద్రం మచిలీపట్నంలో అఖిలభారత కాంగ్రెస్ ఆదేశానుసారం 144వ సెక్షన్ ధిక్కరించి జెండాను ప్రతిష్టించుటకని ఎవరూ సాహసించరైరి. తమ మొదటిదఫా శిక్షాకాలము పూర్తిచేసుకొని అప్పుడే జైలునుండి తిరిగివచ్చిన శ్రీ వల్లభనేని రామబ్రహ్మం, శ్రీ గుళ్లపల్లి రామబ్రహ్మంగార్లు అనారోగ్య

ముగావుండికూడా సాహసంతో జెండాను కుందుస్థంభముమీద స్థాపించిరి. పోలీసులు వీరిపై తీవ్రమైన లాఠీచార్జీ చేసి స్పృహతప్పునట్లు కొట్టి శిక్షలువేసి మరల జైలుకు పంపిరి. ఆనాటి కృష్ణాపత్రిక వీరి సాహసమును కొనియాడినది. తర్వాత గాంధి ఇర్విను ప్యాక్టులో వీరు విడుదలకాబడిరి.

ఘంటసాలలో (శ్రీ) గొర్రెపాటి నరసింహంగారి నాయకత్వమున తాటిగెలునరికే కార్యక్రమము చుట్టుపక్కల గ్రామాలన్నింటిలో ఉధృతంగా సాగించబడినది. ఆ గ్రామ అక్టింగ్ మునసబు (శ్రీ) లక్ష్మయ్య గారు పరోక్షంగా ఉద్యమానికి చేయూత నిచ్చుచుండేవారు. ఒకరోజున సబ్ ఇన్స్పెక్టర్ నీలి వెంకటేశ్వరరావుగారు కొంతమంది రిజర్వుపోలీసులతో యీ మునసబుగారి యింటికి వచ్చిరి. పోలీసులలోకూడ యీ మునసబు గారికి మంచి పలుకుబడికలదు. వారందరికి మంచి భోజనాలు పెట్టి, కావలసిన వసతులు యేర్పాటుచేసి పండుకొనబెట్టారు. అనంతరం కార్యకర్తల నందరిని ప్రోత్సహించి ఆ రాత్రి చుట్టుప్రక్కల గ్రామాలలో తాటిగెలలు నరికించివేశారు. ఇది అధికారులను దిగ్భ్రాంతిని కలిగించినది. లక్ష్మయ్యగారిపైన తహశ్శీలుదారుగారు ధూం, ధాములు చేశారు. నన్ను అనుమానిస్తే రాజీనామా తీసుకొనండి అని తహశ్శీలుదారుగారికి చెప్పారు. ఆయన మిన్నకుండుటచూచి ప్రక్కన గ్రామాధికారులంతా ఆశ్చర్యపడినారు. ఆనాడు యిలాగే అనేక గ్రామాధికారులు పరోక్షంగా ఉద్యమాన్ని బలపర్చేవారు.

1930 ఏప్రిల్ నెలలో తుమ్మల కోటయ్యగారి నాయకత్వాన మొవ్వ సత్యనారాయణ, కుర్ర వెంకటరత్నం, అన్నే సత్యనారాయణ (కోటయ్య), అన్నే మల్లికార్జునరావు, మైనేని వెంకట సుబ్బయ్యగార్లు ముదునూరు, కల్వపాముల, నందమూరు గ్రామాలలో పొలాలవెంటతిరిగి తాటిగెలలు నరికివేస్తూ జైత్రయాత్రగా ముందుకు సాగిపోతూవుండగా నందమూరులో వీరినందరును అరెస్టుచేసి శిక్షలు విధించిరి. ఇందు కోటయ్య గారు అరెస్టుగాకుండా తప్పుకొనిరి.

మరల మే నెలలో తుమ్మల కోటయ్య, తుమ్మల పెద సత్యనారా యణ మరికొందరు యువకులను వెంటబెట్టుకొని ముదునూరు, అప్పికట్ల

గ్రామాలలో తాటిగెలలు నరికించిరి. వీరిని అరెస్టుచేయుటకు సర్కిల్ ఇనస్పెక్టరు రామలింగయ్యపంతులుగారు, ఒక సబ్ ఇనస్పెక్టరు 6 గురు కానిస్టేబుల్సు గ్రామములోనికి వచ్చిరి. వారు మున్సబుగారి యింటివద్ద వుండగా చీకటిపడేసమయంలో షుమారు 200 మంది గ్రామస్తులు వారిపై దాడికివెళ్ళి గడ్డలు, రాళ్ళు విసరసాగిరి—రెచ్చిపోతున్న జనసమూహాన్ని గ్రామ పెద్దలు అదుపులో పెట్టిరి. ఆనాటికి ఏమీచేయలేక పోలీసులు వెళ్ళిపోయిరి. మరునాడు ఫైరింగుకు ఆర్డరుతీసుకొని మిలిటరీని గ్రామములో దింపచూచిన సర్కిలుగారిని వెలిదండ్ల హనుమంతరావు, అన్నె అంజయ్య, నూకల వీరరాఘవయ్యగార్లు సమాధానపర్చి, వారంట్లువున్న వారు స్వచ్ఛందముగా అరెస్టు అగుటకున్నూ, మిలటరీ గ్రామములోకి రాకుండుటకున్నూ వప్పించిరి. ఆనాటి వారంట్లున్న శ్రీ తుమ్మల కోటయ్య, తుమ్మల పెద సత్యనారాయణగార్లను చిన్నకారులో గ్రామమంతా ఊరేగించి మంగళహారతులిచ్చి కోలాహలంగా వీడ్కోలుచెప్పి పంపిరి. వారు స్వచ్ఛందంగా హాజరయిరి. వారికి చెరివొక సంవత్సరం శిక్ష విధించిరి.

## గుడివాడ కాల్పులు

1930 జూన్ నెలలో జిల్లా కాంగ్రెసు ప్రెశిడెంటు కానూరి చిన వెంకట దాసయ్యగారి ఆధిపత్యమున శెట్టిపల్లి వెంకటరత్నం మున్నగువారు గుడివాడలో బ్రహ్మాండమగు సభ యేర్పాటుచేసిరి. 144వ సెక్షన్ ప్రయోగించి యీ సభను నిషేధించిరి. అయినను ప్రజాసమూహములు సముద్ర తరంగమువలె వచ్చిపడుచు సభను సాగించుచుండిరి. ఈలోగా ఎవరో రాళ్ళువేసిరను కారణమున పోలీసులు ప్రజలపై తుపాకులు కాల్చి చెల్లాచెదరుచేసిరి. కొంతమందికి గాయములు తగిలెను. దొండపాడు వాస్తవ్యులు దాసరి వెంకటాచలపతిరావుగారికి తొడలో గుండుదెబ్బతగిలి చాలాకాలము బాధపడిరి. దావూద్ ఖాను ఒక కుర్చీని కానూరి చిన వెంకట దాసయ్యగారి నెత్తిమీదపెట్టి నీవా! కాంగ్రెసు ప్రెశిడెంటు. దీనిని మొయ్యి అని పరుషవాక్యములు పలికి వారిని అవమానించిరి. ఈ సందర్భమున పెక్కుమందిని అరెస్టుచేసి, శిక్షలు విధించిరి. కొన్నిచోట్ల క్రొత్తగ్రామానికి హెచ్చు శిస్తులు వసూలుచేసిరి. కురుమద్దాలి గ్రామ

కాపురస్థులు గుళ్ళపల్లి రామబ్రహ్మంగారు ఉద్యమంలో పనిచేయు చున్నందున, యితరులకు రెండురెట్లుకట్టి, వీరికి ఆరురెట్లు కట్టిరి.

## జైలు బాధలు

రాజమండ్రి జైలులో వలంటీర్లను నానాబాధలు పెట్టిరి. 1930 జూన్ 15వ తేదీన రాజమండ్రి జైలునుండి 40 మందిని వేలూరు జైలుకు ట్రాన్సుఫర్ చేసిరి. ఈ సమయంలో జరిగిన గలాటాలో గోనుగుంట్ల సుబ్రహ్మణ్యంగుప్త, వెలిదండ్ల హనుమంతరావు, కాశీనాధుని వీరమల్లయ్య, పురాణం సూరిశాస్త్రి మొదలైనవారికి లాఠీదెబ్బలు తగిలినవి. ఈ లాఠీ దెబ్బల కారణంగానే వెలిదండ్ల హనుమంతరావుగారికి జబ్బుయేర్పడి, విడుదలైన కొద్దికాలానికే మృత్యువాతపడిరి. 'సి' క్లాసు ఖైదీల అవస్థలు చెప్పతరముకాదు. 1. మజ్జిగలేదు 2. కూరగాయలులేవు 3. చల్ల, చమురు లేవు. 4. దేవతలను తలపించు కంపు పులుసు-అందుచేతనే దీనికి దేవతాపులుసు అని ఎగతాళి పేరువచ్చెను. 5. ఉప్పుడుబియ్యపు అన్నం దానినిండా మరలలోనుండి జారిపడిన మేకులు, పురుగులు, చితచితలాడు తవుడు, వూక, నానాచెత్తగడ్డి, ఇనుప పాత్రలలో వంట. ఈ అన్నపు ముద్దలు, పులుసు ఒక ఇనుప మంచముమీదపెట్టి, పైన ఒకమురికిగుడ్డకప్పి, నలుగురు మడ్డిఖైదీలు నాలుగు భుజాలమీద ఎత్తుకొని బ్లాకులోనికి వస్తూండగా చూస్తూంటే ఒక కలరాశవము వస్తూన్నంత జుగుప్సాకరముగా వుండేది. ప్రేగులు కలచివేసే దుర్వాసన అంతదూరానికేకొట్టి ముందు గానే డోకు వచ్చేది. కిలుముపట్టి ఎంతోకాలమునుండి పాతఖైదీలు ఎంతో మంది తిని వదిలిపెట్టిపోయిన అల్యూమినియం కంచాలు. ఒక పట్టెడు ఉడికీవుడకని వుప్పుడుబియ్యపు ముద్ద వాయ నాలుగుమూలల పులుసుతో కలిసీకలియకుండా కలిపి కళ్ళు మూసుకొని నోటిదగ్గర పెడితే వెంటనే డోకువస్తూవుంటే, మరల బలవంతంగా లోనికి తోస్తూవుండడం యిది సి క్లాసు భోజనం. ఇక వారానికి ఒక మట్టలాగు, ఒక గోచీ, ఒక మొలతిరుగని తువాలు, నెత్తికి ఒక అందవికారమైన కుళ్ళాయి. వారం వరకు గుడ్డలు మార్చుకొనడానికిగాని, తుడుచుకోవడానికిగాని వీల్లేదు. స్నానానికికూడ నోచుకోలేదు. పడకకు ఎవరో కొన్నాళ్ళు కప్పుకొని, తొక్కివదిలివేసిన ఒక చింకి కంబళి. దానినుండి ఊరికే బొచ్చురాలుతూ

అన్నములోను, నీళ్ళలోను, ఎక్కడబడితే అక్కడ రోమమయం. ఈ అన్నంతిని రాత్రిళ్ళు యీ పడకమీద, ఒక వంద జనంతో నిండిన హాలులో పండుకొనడం, మలమూత్రాలకు అందరికీకలిపి ఒకేడబ్బా రామ! రామ! ఆ కంపు చెప్పతరముకాదు. ఈ తిండివలన అనేగమందికి అనేక జబ్బులు చేసినవి. తిరుచునాపల్లి జైలులో మేడూరు కాపురస్థులు గుళ్ళపల్లి నాగయ్యగారు రక్తవిరోచనములవలన తమ అసువులనుబాసిరి. యిలాగే ఈడ్పుగల్లు వాస్తవ్యులు సుంకర సుబ్బారావుగారు చనిపోయిరి. 1931 మార్చి 5వ తేదీన కాంగ్రెసుకు, గవర్నమెంటుకు సంధి కుదిరెను. దీనికే 'గాంధి-ఇర్విన్' ఒడంబడిక అంటారు. సత్యాగ్రహులందరు విడుదల కాబడిరి. మార్చి 16వ తేదీ జిల్లాలోని యావన్మంది వాలంటీర్లు బందరులో ఉత్సవము జరిపిరి. తాడేపల్లివారి సత్రములో నగరవాసులు వారందరికి బ్రహ్మాండమగు విందుగావించిరి. సాయంకాలం గాంధీచౌక్‌లో మహా సభలో గాంధి-ఇర్విన్ సంధి షరతులు వివరించబడెను.

గాంధి-ఇర్విన్ ఒడంబడిక ప్రకారం విజయవాడలోని ఆంధ్రరత్న భవనమును పోలీసువారు కాంగ్రెసుకు అప్పగింతచేసిరి. 17-8-31 న టంగుటూరు ప్రకాశంగారిచే ఆంధ్రరత్న భవనంపై జాతీయ జెండా పునః స్థాపితము గావించబడెను. విడుదలై వచ్చిన సత్యాగ్రహులు అతి కోలాహలంగా విజయోత్సవం జరుపుకొనిరి. ఆ సం॥రం 5 వేల మంది పశ్చిమ కృష్ణాలో కాంగ్రెసు సభ్యులుగా చేరిరి. వెలిదండ్ల హనుమంతరావుగారికి జైలు జీవితంవల్ల క్షయ, ఉబ్బసము యేర్పడెను. దానిని లక్ష్యపెట్టకుండా ప్రచారము చేయుచుండిరి. వేసంగిలో ఆ జబ్బు ఎక్కువై వైద్యసేవకై మైసూరుకు పోయి వారు అచటనే మరణించిరి. దేశ స్వాతంత్ర్యము కొరకు హనుమంతరావుగారు ప్రాణములర్పించిన ధీరుడు. వారి పేరను విజయవాడలో ఒక పార్కు, ఒక గ్రంథాలయము నెలకొల్పబడినవి.

## రా జ కీ య మ హా స భ లు

1931 మే నెలలో పశ్చిమ కృష్ణాజిల్లా రాజకీయ మహాసభ ముదునూరులో జరిగినది. ఉప్పు సత్యాగ్రహ ఖైదీలందరు గాంధి-ఇర్విన్ ఒడంబడికతో విడుదలకాబడిన అనంతరం విజయవాడ ఆంధ్రరత్నభవనము స్వాధీనంచేసుకొని విజయోత్సవం జరుపుకున్నారు. అనంతరం జిల్లా

రాజకీయ మహాసభ జరుపుటకు నిర్ణయించినారు. జిల్లాలో ఎక్కువమంది వుద్యమంలో పాల్గొన్న గ్రామంలో జరపాలని ఆలోచించి ముదునూరులో జరుపుటకు నిర్ణయించినారు. ఈ గ్రామంలో దాదాపు 80 మందివరకు జైళ్లకు వెళ్ళినారు. గ్రామంలోని అన్నికులాలు వుద్యమంలో పాల్గొన్నవి. మంచి జాతీయభావంగల గ్రామం. పైగా "హీరో ఆఫ్ ది వెస్టు కృష్ణా" అనే బిరుదుపొందిన యువకుడు (శ్రీ) అన్నే అంజయ్యగారి స్వగ్రామమది. ఆయన నాయకత్వాన పెద్దఎత్తున సభా ఏర్పాట్లు చేయబడినవి. సభాధ్యక్షులుగా (శ్రీ) రాజా కోటగిరి వెంకట కృష్ణారావు, గంపలగూడెం కుమార రాజాగారు ఎన్నుకోబడ్డారు. జిల్లా నలుమూలలనుండి ప్రతినిధులు వెయ్యిమంది సభలో పాల్గొన్నారు. స్త్రీలకు ప్రత్యేక సమావేశము ఏర్పాటుచేయబడినది. దానికి ప్రత్యేకంగా పందిళ్ళువేసి స్త్రీ ప్రతినిధులందరకు వలయుసౌకర్యములు చేయబడినవి. ఈ ఏర్పాట్లన్నీ శ్రీ అంజయ్యగారి తల్లి వెంకటరమణమ్మగారు బాధ్యతతో నిర్వహించారు.

సమావేశాలు రెండురోజులు జరిగినవి. విషయనిర్ణయ సభానంతరం, డెలిగేట్లు సమావేశమై చర్చించినారు. మరునాడు సాయంత్రం పెద్ద బహిరంగసభ జరిగినది. అయ్యదేవర కాళేశ్వరరావు, కాకుమాను లక్ష్మయ్య, కాట్రగడ్డ సోదరులు, వల్లభనేని వెంకట్రావు, కాకాని వెంకటరత్నం, మూకల వీరరాఘవయ్య, పెదర్ల వెంకటసుబ్బయ్య, ఘంటసాల సీతారామశర్మ వగైరా ప్రముఖులంతా వుపన్యసించారు. సభాధ్యక్షుని ఉపన్యాసం ప్రజలను తేజపరిచినది. సభా యేర్పాట్లు తిలకించిన నాయకులందరు అంజయ్యగారి కార్యశీలతకు అభినందనలు తెలిపారు. ఆహ్వాన సంఘాధ్యక్షులు (శ్రీ) అన్నే సుబ్రహ్మణ్యంగారు స్వాగతోపన్యాసం చదివారు.

స్త్రీల సభలో కాళేశ్వరరావుగారు, కోటగిరి వెంకటకృష్ణారావుగారు, వెలిదండ్ల హనుమంతరావుగారు వుపన్యసించారు.

## రైతు సమస్యలు

జైళ్ళనుండి విడుదల అయివచ్చిన తరువాత ఉభయ కృష్ణా జిల్లాలలోను నిర్మాణ కార్యక్రమము చేపట్టబడినది. అందు అస్పృశ్యతా నివారణ, రైతు సంఘమున నిర్మాణము, జాతీయ విద్యాలయాల స్థాపన,

స్త్రీ జనోద్ధరణ మొదలగు కార్యక్రమములు చేరియున్నవి. జిల్లాలో అదనపు శిస్తులు విధించి, ప్రభుత్వము రైతులను పీడించసాగినది. ప్రభుత్వానికి వ్యతిరేకముగా, రైతు సంఘాలద్వారా శ్రీయుతులు గొట్టిపాటి బ్రహ్మయ్య, దుగ్గిరాల బలరామకృష్ణయ్య, కానూరి చిన వెంకటదాసయ్య, కొల్లిపర సూరయ్య, వల్లభనేని రామబ్రహ్మం, కాజ బసవయ్య మొదలగు పలువురు కార్యకర్తలు తూర్పు కృష్ణాజిల్లాలోను, కాట్రగడ్డ మధుసూదనరావు, నూకల వీరరాఘవయ్య, కాకుమాను లక్ష్మయ్య, పిడికిటి రామకోటయ్య, అన్నే అంజయ్య, కాకాని వెంకటరత్నం, వల్లభనేని వెంకట్రావు, వగైరా మరికొంతమంది నాయకులు పశ్చిమ కృష్ణాజిల్లాలోను రీసెటిల్‌మెంటుకు వ్యతిరేకముగా పనిచేస్తూవున్న కారణముగా అరెస్టుచేసి, జైళ్ళకు పంపిరి. ఆచార్య గోగినేని రంగనాయకులుగారిని రీసెటిల్‌మెంటు విషయములో తీవ్రముగా పనిచేయుచున్నందున 1931 నవంబరులో విజయవాడలో అరెస్టుచేసి ఒకటిన్నర సంవత్సరములు కఠిన శిక్ష విధించిరి. వీరితోపాటు దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారినికూడా అరెస్టుచేసి శిక్ష విధించారు. శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారిని గుడివాడ, కైకలూరు తాలూకాలలో అడుగు పెట్టవద్దని ఆంక్ష విధించిరి. ఈ ఆంక్షను ధిక్కరించుటకు సిద్ధపడుచుండగా త్వరలోనే శాసనోల్లంఘనోద్యమం ప్రారంభించవలసిన పరిస్థితులున్నవిగనుక మీరు ఈ ఆంక్షను ధిక్కరించి జైలుకు వెళ్ళవద్దని, మీ అవసరం చాలావున్నదని రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి శ్రీ కాశేశ్వరరావుగారు శ్రీ బ్రహ్మయ్యగారికి హుకుం జారీచేశారు. దానిని వారు పాటించారు. అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షులు వల్లభాయ్ పటేల్, నెహ్రూగార్లు, రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి కాశేశ్వరరావుగారిని బొంబాయి పిలిపించి, యిక్కడి రైతుల ఆందోళనను చర్చించారు. పన్నుల నిరాకరణమే శరణ్యమని వారు సలహానిచ్చిరి. ఈ కార్యకర్తల కార్యకుశలతవల్ల జిల్లాలో పలు గ్రామములలో రైతు సంఘములు యేర్పడినవి. 6 వేలమంది రైతులు ప్రాథమిక సభ్యులుగా యీ సంఘాలలో చేరిరి. ఈడ్పుగల్లులో ఒక రైతు శిక్షణ శిబిరం యేర్పాటయ్యెను. శ్రీమతి భారతీదేవి రంగాగారు దానిని ప్రారంభించిరి. శ్రీమతి మూల్పూరి చుక్కమ్మగారు అధ్యక్షత వహించిరి. శ్రీ బెజవాడ గోపాలరెడ్డి జెండాను ఎగురవేసిరి. ఈ రీసెటిల్‌మెంటు ఆందోళనను గురించి విజయవాడలో మద్రాసు గవర్నరుగారిని న్యాపతి సుబ్బారావు

వగైరాలు కలుసుకున్నను ప్రయోజనము లేకపోయెను. ఇది ఇంగ్లండు లోని మహాత్మాగాంధిగారి దృష్టిలోనికి తీసుకొని పోబడినది. వారు ఇండియా సెక్రటరికి తెలిపినను ప్రయోజనము జరుగలేదు. గాంధీగారు ఇంగ్లాండు నుండి బొంబాయి వచ్చినప్పుడు ఈరీసెటిల్‌మెంటు ఉద్యమాన్ని గురించి వారితో సంప్రదించుటకుగాను కార్యదర్శి కాశేశ్వరరావుగారిని, సర్దారు దండు నారాయణరాజు గారిని రాష్ట్ర కాంగ్రెసు తరఫున బొంబాయి పంపించిరి.

## ప్రభుత్వ జులుము

చాలామంది కార్యకర్తలపై 144వ సెక్షను ప్రయోగించి గ్రామాల వెలుపలకు కదలరాదని నిషేధించిరి. పత్రికా స్వాతంత్ర్యమును అరికట్టిరి. కాంగ్రెసు సంఘములు సక్రమముగా పనిచేయుటకు వీలులేకుండా నిర్బంధింపసాగిరి. విల్లింగ్డన్ ప్రభువు అనుసరిస్తూవున్న ఈ చర్యలకు కాంగ్రెసు నాయకులు సమావేశమై చర్చించి మరల శాసనోల్లంఘనోద్యమము సాగించుటకు తీర్మానించిరి.

## శాసనోల్లంఘనోద్యమము

1932లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘాన్ని అక్రమ సంఘంగా నిషేధించి, ఆంధ్రరత్న భవనమును వశపర్చుకొనిరి. ఈదుప్పుగల్లు సేవాశ్రమమునుకూడ వశపర్చుకొనిరి. మార్చి 24వ తేదీన 6 గురు దేశసేవికులు ఎలుకపాడులో ప్రచారము చేయుచుండగా వారిని నిర్బంధించి జైలుకు పంపిరి. విజయవాడలో జాతీయదినోత్సవం, జలియన్‌వాలాబాగ్‌స్మారక దినోత్సవములు జరుగు సందర్భములో 20 మంది వాలంటీర్లు లాఠీచార్జి గావించబడి తీవ్ర గాయాలకు గురికాబడిరి. మచిలీపట్టణంలో 5-1-32 న డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్యా, ముట్నూరి కృష్ణారావు, వేమూరి దుర్గా నాగేశ్వరరావుగారి నాయకత్వాన 144వ సెక్షను ఉల్లంఘించుటకై బందరు చౌక్‌లో మీటింగు యేర్పాటు చేయబడినది. ఆ చౌక్ చాలక జనులు మేడలు, మిద్దెలుఎక్కి చూడసాగిరి. నాయకులు ఉపన్యాసములు సాగించగానే పోలీసులు జనంపై లాఠీచార్జీలుచేసి, పై ముగ్గురు నాయకులను అరెస్టుచేసి లారీలో ఎక్కించుకొని తీసుకొనిపోయిరి. అచ్చట

ప్రజలలో కలిగిన వుద్రేకమునకు భయపడి, గుడివాడ కోర్టులో విచారించి ఒక్కొక్కరికి 2 సంవత్సరములు కఠిన శిక్ష, రు 1100 లు జరిమానా విధించి సి క్లాసు యిచ్చిరి. తరువాత కొంతకాలానికి ఎ క్లాసుగా మార్చిరి

అప్పటినుండి జిల్లా అంతటా గ్రామ గ్రామమున అరెస్టులు, లాఠీ చార్జీలు రోజువారీ చర్యలుగా రెండేండ్లు సాగినవి. ఈ సందర్భములో పశ్చిమ కృష్ణాజిల్లాలో ముదునూరు గ్రామమునుంచి 'రెడీ' అను పత్రికను "సైక్లోస్టయిల్"పై ప్రచురించి ప్రతిదినం జిల్లా అంతటా పంపుచూవుండిరి. పంపిణీ కార్యక్రమములో కొల్లి రామకుమారవర్మ, ఈమని రాజరత్నశర్మ, చలసాని గంగయ్య, మలిరెడ్డి (శ్రీ) శైలరెడ్డి వగైరా ఎందరో యువకులు తెల్లవారుసరికల్లా టపా బంట్రోతులులాగా పరుగెత్తుతూ ఈ పత్రికలను ఊరూరా పంపించెడివారు. ఉద్యమం సాంతం అయ్యేవరకు ఈ ప్రెస్సును పోలీసులు స్వాధీనం చేసుకొనజాలకపోయిరి. ఆ గ్రామంలోని యువకు లందరు యీ కార్యక్రమానికి అండగా నిలిచిరి.

31-7-1932 తేదీన 60 మంది శాంతి సైనికులు అబిబుల్లాగారి నాయకత్వాన ఆంధ్రరత్న భవనమును వశపర్చుకొన యత్నించగా 17 మందిని తీవ్రముగా చావమోది జైలుకు పంపిరి. మిగిలినవారిని కొట్టి తరుమబడిరి. 25-8-32న 6 గురు శాంతి సైనికులు (శ్రీ) కాకాని వెంకటరత్నంగారి నాయకత్వాన మరల ఆ భవనమును వశపర్చుకొనబోగా కొట్టి అరెస్టుచేసిరి. మరల మూడవమారు 9 మంది భవనముపై దాడి వెడలిరి. కాని శాంతిసైనికులను కొట్టక అరెస్టుచేసి కొంతసేపువుంచి వదలివేసిరి. ఆ సమయమున ఇండియా లీగు డెలిగేషన్‌వారు హిందూదేశ మంతాపర్యటనచేయుచు ఆరోజు బెజవాడ మకాంచేసియుండిరి. 14-11-32న మరల 8 మంది శాంతిసైనికులు దాడిచేయగా లాఠీచార్జీచేసి వదలిరి.

ఘంటసాలలో జెండా స్తంభాన్ని పోలీసులు పీకివేయడానికి ప్రయత్నాలు చేస్తుండగా శ్రీ సాయం వరదదాసు అనే సత్యాగ్రహి దానిని నిరోధించినారు. వారిని స్పృహతప్పేవరకు పోలీసులు కొట్టినారు ఈ సందర్భంలో (శ్రీ) పిడుపాటి కృష్ణమూర్తిగారికికూడ దెబ్బలు తగిలినవి. ఈ ఘోరకృత్యములు చూచిన ప్రజలు రెచ్చిపోయి, పోలీసులపై తిరుగుబాటుచేసిరి. వారిపై లాఠీచార్జి చేసినారు. ఆక్టింగ్ మున్సబు

శ్రీ లక్ష్మయ్యగారు సమయోచితంగా వ్యవహరించి, ప్రమాద పరిస్థితులకు లోనుకాకుండా ఉభయులను సర్దకలిగిరి. దానితో గ్రామానికి ఒక పెద్ద ముప్పుతప్పినది.

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దావూద్‌ఖాన్‌తోపాటు గుడివాడ డిప్యూటీ కలెక్టరు రంగప్ప బంగారుకూడ పెద్ద దుర్మార్గపు అధికారులుగా ప్రజల నోళ్ళలోపడిరి. ఇతని జూరిస్‌డిక్షనులో లాఠీదెబ్బలగు గురికాబడని గ్రామంగాని, కాంగ్రెసు వలంటీరుగాని లేడనిచెప్పిన చాలును. కాబట్టి 1932-34ల ఉద్యమ చరిత్ర ఎంత వ్రాసిననూ కొంత మిగిలిపోక తప్పదు. అందుకు క్షమించ ప్రార్థన. నందివాడ, వెంట్రప్రగడ, ముదునూరు, భట్ల పెనుమర్రు, కపిలేశ్వరపురం, ఘంటసాల, అంగలూరు ముఖ్యముగా వీరి దౌర్జన్యములకు ఎక్కువగా గురికాబడినవి. భట్లపెనుమర్రు గ్రామములో గాంధీగారి విగ్రహమును ఊడబెరికి, కామినేని వెంకటప్పయ్య మొదలైన వారిని స్పృహతప్పిపోవువరకు బజారులో పడవేసి కొట్టిరి. ఈ ఘట్టము మద్రాసు శాసనసభలోకూడ చర్చకు వచ్చినది. వెంట్రప్రగడమీద 4 వేలు శిక్షార్థపు పన్ను వసూలుచేయబడెను. ఈ గ్రామవాసులు మద్దుకూరి చంద్రశేఖరరావు, కొసరాజు శేషయ్య మొదలగు యువకులు చూపిన ధైర్యసాహసములు అత్యద్భుతములు.

వెంట్రప్రగడ బంగళాలో ప్యూనిటివు పోలీసు క్యాంపుపెట్టి, ఆ చుట్టు పట్ల గ్రామములన్నీ రంగప్పబంగారు పోలీసులను వెంటబెట్టుకొని రాత్రి పగలు అనక తిరిగి, ప్రజలలో భీతావహము కలిగింపజొచ్చిరి. ప్రక్కనున్న ముదునూరులో నడపబడుచున్న సైక్లోస్టయిల్ మిషను పట్టుకొనవలయునని ప్రతిరాత్రి పొలములన్నీ గాలింపసాగిరి. కనపడిన ప్రతి మనిషిని ఆమిషను జాడ చెప్పమని హింసించసాగిరి. ఇండ్లలోదూరి బియ్యం, కోడిపెట్టలు, తినుబండారములు దోచుకొనిపోయిరి. ఎంత భయపెట్టినను ముదునూరు గ్రామములో ఏఒక్కరునూ వారికి ప్రెస్సు సంగతి తెలిసియుండికూడా వారికి ఆచూకీ యివ్వరైరి.

ఈ ఉద్యమంలో అశేషమైన ధైర్యసహాసములతో స్త్రీలు ముందుకు రావడం ఒక విశేషం. వీరిలో శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ గారి నాయకత్వమున, తులశమ్మ కొశల్యమ్మ, ఉగుమర్తి జానకమ్మ, తంగిరాల సీతారావమ్మ, గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మ మొదలైన వీరవనితలు

తూర్పు కృష్ణాజిల్లాలో పేర్కొనదగినవారు. వీరినందరను జట్టుగా సమకూర్చుకొని సీతామహాలక్ష్మమ్మగారు అతి ధైర్యసాహసములతో గుడివాడలో విదేశవస్త్ర బహిష్కరణ, కల్లుదుకాణాలవద్ద పికెటింగులు చేసినారు. వీరినందరను లారీలలో ఎక్కించి దూరప్రాంతాలలో వదలి వేసేవారు. అక్కడనుంచి కాలినడకను వచ్చి మరల పికెటింగులు సాగించేవారు. వీరి పట్టుదలకు కుపితుడై గుడివాడ సబ్‌కలెక్టరు రంగప్ప బంగారు చివరకు అరెస్టుచేసి ఒకొక్కరికి ఒక సంవత్సరం కఠిన శిక్ష విధించి జైలుకు పంపించినారు. అలాగే గరికపర్రు, కుమ్మమూరు, ముదునూరు, పమిడిముక్కల, కపిలేశ్వరపురం, పురిటిగడ్డ, యాకమూరు, తేలప్రోలు, ఉయ్యూరు, నెప్పల్లె గ్రామాలలోని రైతు కుటుంబముల నుండి ఇద్దరు, విజయవాడ నుండి మొత్తం 28 మంది స్త్రీలు పశ్చిమకృష్ణాజిల్లాలో పనిచేసిరి. వీరికి ఆతిథ్యమిచ్చినందుకు కాట్రగడ్డ మధుసూదనరావుగారి తల్లిగారైన రామసీతమ్మగారికి ఒక సంవత్సరం కఠినశిక్ష విధించి 'సి' క్లాసు నిచ్చిరి. రు 400 లు జరిమానాకూడ విధించిరి. ఇకముందు ఆతిథ్యమివ్వనని చెప్పినచో విడిచిపెట్టెదమని పోలీసులు చెప్పిరి. కాని ఆ వీరమాత ఆ మాటలు అనుటకు నిరాకరించి, జాడ్యగ్రస్తమగు శరీరముతో ఒక సంవత్సరం ఖైదు అనుభవించి వచ్చినది. శ్రీమతి రామినేని రాజమ్మ మైనేని శ్రీరావమ్మ, గాదె సుబ్బమ్మ, చెరుకూరి వియ్యమ్మ, సూరపనేని అన్నపూర్ణమ్మ, ఎనిగండ్ల లక్ష్మీకాంతమ్మ, కొల్లిపర లక్ష్మీకాంతమ్మగార్లు యిందు ముఖ్యులు. ఈ స్త్రీ వాలంటీర్ల ప్రచారము అరికట్టుటకు ప్రభుత్వం ఆడపోలీసులను నియమించినది. ఎరుకల, యానాది ఆడవాళ్ళను రోజు కూలీకి తెచ్చి, స్త్రీ వాలంటీర్లను కొట్టించిరి. ఈ స్త్రీ వాలంటీర్లపై కారపునీళ్ళను, రంగునీళ్ళను, గుంటలలోని మురికినీళ్ళనుబకెట్లతో కొయ్య పిచ్చికార్లతో వారి ముఖములపై కొట్టింపసాగిరి. కొందరిని లారీలలో ఎక్కించి, రాత్రిపూట దూరపు ప్రదేశాలలో వదలివచ్చుచుండిరి. వారు తిరిగి కాలినడకను నానాఅవస్థలుపడి యథాస్థానమునకు చేరుకొనుచు పికెటింగు వగైరా కార్యక్రమాలు సాగించుచునేయుండిరి. కొమరవోలు ఆశ్రమములో జెండాను సంరక్షించుటకై అచట స్త్రీలు చూపిన పట్టుదల అత్యద్భుతం. ఎంతచేసిననూ తమ పట్టుదలను వీడకపోవుటచేత ఒక్కొక్కరినే జైలుకు పంపసాగిరి. ఈ రీతిగా 35 మంది స్త్రీలు తూర్పు కృష్ణాలో జైలుకు వెళ్ళిరి. స్త్రీ వాలంటీర్లకు భోజనం పెట్టినందుకు సూరపనేని

గోపాలకృష్ణయ్యగారికి వెయ్యి రూపాయలు జరిమానా విధించిరి.

పశ్చిమ కృష్ణాజిల్లా ముదునూరు గ్రామంలో స్త్రీ సత్యాగ్రహుల నిమిత్తం అన్నె అంజయ్యగారు శిబిరమును పెట్టిరి. శిబిరము బాధ్యత తన తల్లిగారైన వెంకట రమణమ్మగారికి అప్పగించిరి. ఆమె అమిత సేవాభావంగల మనిషి. ఎంతమంది అతిధులు వచ్చినా విసుగుచెందకుండా మర్యాదలుచేసేది. అక్కడకు వచ్చిన స్త్రీ వలంటీర్లను అమిత ఆదరణ, ప్రేమతో కలిసిమెలిసివుండి వారికి దేశభక్తిని పురికొల్పి ప్రోత్సాహమిచ్చుచుండెడిది. చెరుకూరు వియ్యమ్మ, రామినేని రాజమ్మ, కొల్లిపర లక్ష్మీకాంతమ్మగార్లు యీ శిబిరమునందుండిరి. తుమ్మల సత్యవతమ్మ, ఎక్కల పున్నమ్మ, కోగంటి లక్ష్మమ్మ, పాలడుగు వరలక్ష్మమ్మ, కొల్లిపర లక్ష్మీకాంతమ్మ, సూరపనేని అన్నపూర్ణమ్మ, యార్లగడ్డ రత్తమ్మ, మైనేని రాజరత్నమ్మ, నాదెళ్ళ నాంచారమ్మ, వీరమాచనేని చిట్టెమ్మ, అన్నె దుర్గాంబగారలు జాతీయ పతాకములను చేత ధరించి, జాతీయ గీతములను పాడుచు, 13-4-32న విజయవాడ వీధులలో ఊరేగుచుండగా, పోలీసువారు వీరిని నిర్బంధించి రాత్రివరకు వుంచి వదలిపెట్టిరి. ఆదేరోజున విజయవాడ శివాలయపు బృందం అనే పేరున పిలువబడు ఒక యువకులజట్టు అతి పట్టుదలగా పికెటింగ్ సాగించిరి. పల్లెగ్రామములనుండి అధిక సంఖ్యన యువకులు విజయవాడకువచ్చి యీ పికెటింగులో పాల్గొనిరి. ఇందులో చాలామంది తీవ్రమగు లాఠీదెబ్బలు తినికూడ, మరలమరల పికెటింగుచేసి, మరల మరల దెబ్బలుతినిరి. ముదునూరు వాస్తవ్యులు తుమ్మల సుబ్బయ్య (తండ్రి శేషయ్య) ఆనాటి దెబ్బలకు స్పృహ కోల్పోయిరి. 3 రోజుల వరకు స్పృహ రాలేదు. నోటిలోపోసిన నీళ్ళు గుటకపడలేదు. మూడు మాసాల అనంతరం మంచమునుండి లేవగలిగిరి. వీరితోపాటు దెబ్బలుతిన్న కొమ్మూరి నర్సయ్య, తుమ్మల వెంకటసుబ్బయ్య (తండ్రి నాగయ్య)గారలు కూడా తీవ్రముగా దెబ్బలుతిని కొన్ని మాసాలకుగాని కోలుకోజాలక పోయిరి. ఆ ఒక్కరోజుననే 250 సార్లు లాఠీచార్జి చేసినట్లు పోలీసువారి కధనము. ఈ లాఠీచార్జి విషయమై మద్రాసు శాసనసభలో శ్రీ కొళంద రెడ్డిగారు తీవ్రమైన ఆక్షేపణ తెలియజేశారు. లాఠీ క్రమగూర్చి వీరు చేసిన వర్ణన సభికులను నవ్వులలో ముంచినది. ప్రభుత్వం సిగ్గుచెంచి తలవంచినది. చివరకు యివిఅన్నియు అతిశయోక్తులని త్రోసిపుచ్చినది.

కాని ఇండియా డెలిగేషన్‌వారు ఈ లాఠీచార్జి సమయములో విజయవాడ రావడము జరిగినది. వారు ఈ పరిస్థితులను విచారించి, లాఠీచార్జిలలో అక్రమము జరుగుచున్నదనియు, అతి తీవ్రముగావున్నదనియు అంగీకరించిరి.

ఈ ఉద్యమ నిర్వహణకు కాంగ్రెసు కమిటీలు లేనందున ఒకరి తర్వాత నొకరిని నియంతలుగా నియమించి, ఉద్యమ నిర్వహణ బాధ్యతను వారికి అప్పగించిరి. ఇందు మొదటి నియంత కాకుమాను లక్ష్మయ్యగారు. ఆయన జైలుకుపోయినతరువాత వేదాంతం శంభుశాస్త్రిగారు నియంతగా పనిచేసిరి. శంభుశాస్త్రిగారిని తీవ్రంగా లాఠీచార్జీచేసి, అరెస్టుచేసిరి. వారి పిమ్మట శ్రీ కాకాని వెంకటరత్నంగారు నియంతగా పనిచేసిరి. వారు జైలుకుపోయిన తరువాత శ్రీ తుమ్మల కోటయ్య (ముదునూరు) గారు నియంతగా పనిచేసిరి. ఇట్లు ఒకరితర్వాత ఒకరు 13 గ్గురు నియంతలు పనిచేసిరి. శ్రీ అన్నే అంజయ్య, శ్రీ కృత్తివెంటి కుటుంబరావు, శ్రీ కేశిరెడ్డి సూర్యనారాయణ, శ్రీ పిడికిటి రామకోటయ్య వగైరాలు యీ పికిటింగు నడుపుటలో తోడుపడిరి.

విజయవాడలో జరిగిన లాఠీచార్జిలు అనుభవించినవారికి చికిత్స చేయుటకు ఎవరూ ముందుకురానందున, వారు రామమోహన గ్రంథాలయ వరండాలో పడియుండవలసివచ్చెను. డా॥ శివలెంక మల్లిఖార్జునరావు, గాదిరాజు వెంకటేశ్వరరావు, శంకర వెంకట్రామయ్యగార్లు—కాట్రగడ్డ మధుసూదనరావుగారి యింట్లో "పీపుల్స్ హాస్పటల్" నొకదానిని స్థాపించి దానిలో లాఠీచార్జిలకు గురియైనవారికి చికిత్సచేయుట మొదలుపెట్టిరి. ఈ సందర్భములో గాదిరాజు వెంకటేశ్వరరావుగారిపై కేసుపెట్టి ఆరు మాసాలు శిక్ష విధించిరి.

## అస్పృశ్యతా నివారణోద్యమము

18-9-32న మహాత్ముడు యరవాడ జైలులో హరిజనులను హిందూ సంఘంలో వుంచుకొనుటకు కఠోర ప్రాయోపవేశముచేసిరి. ఆ సందర్భమున స్వయం సేవకులు దళములుగా ఏర్పడి గ్రామములవెంట అస్పృశ్యతా నివారణ ప్రచారము గావించిరి. గాంధిమహాత్ముని జన్మ దినోత్సవమును (2-10-32) జరుపుకొనుచుండగా ఆరుగురు కార్యకర్తలు విజయవాడలో లాఠీదెబ్బలుతినిరి. ముదునూరు గ్రామమునుండి శ్రీ అన్నే

అంజయ్యగారి నాయకత్వాన వలంటీరుదళం సమీకరించబడి గన్నవరం తాలూకాలో అనేక గ్రామాలలో అస్పృశ్యతా నివారణ ప్రచారము గావించిరి. హరిజనులకు దేవాలయ ప్రవేశాలు, పబ్లికు నూతులలో నీళ్ళు తోడుకోవడం, సహపంక్తి భోజనాలు మొదలగుకార్యక్రమాలు చేయబడినవి. అనేక గ్రామాలలో సవర్ణహిందువులవల్ల కఠినమైన వ్యతిరేకతను ఈ దళం ఎదుర్కొనవలసివచ్చినది. కొన్ని గ్రామాలలో భోజనాలుకూడా పెట్టకుండా తిరస్కరించుట జరిగినది. ఈ దళములో అన్నే సుబ్రహ్మణ్యం, కురప్తి వెంకటరత్నం, మొవ్వ సత్యనారాయణ, తుమ్మల సుబ్బయ్య, తుమ్మల వెంకటసుబ్బయ్య, కొమ్మమూరి నరసయ్య, అన్నే మల్లిఖార్జునరావు, కలపాల సూర్యప్రకాశరావు, కాకాని వెంకటరత్నం, వెల్లంకి పూర్ణచంద్రియ్య మొదలగు 15 మంది యువకులు పాల్గొన్నారు. ఈ దళము పది రోజులు తాలూకా అంతటా ప్రచారముచేయుట జరిగినది. ఈ సంచార సందర్భములో శ్రీ బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యంగారు, శ్రీ మాగంటి బాపినీడు, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు, శ్రీ నూకల వీరరాఘవయ్య, శ్రీ కాకుమాను లక్ష్మయ్యగార్లు వచ్చి అక్కడక్కడ బహిరంగ సభలలో పాల్గొన్నారు. శ్రీ అన్నే సుబ్రహ్మణ్యంగారి గంభీరోపన్యాసములు విని ప్రజలు ముగ్ధులయ్యేవారు.

1933 మే నెలలో హరిజనోద్యమమునకు పవిత్రత చేకూర్చుటకు మహాత్ముడు 21 రోజులు ఉపవాసముచేసిరి. గాంధీజీని విడుదలచేసిరి. నాయకులందరు పూనాలో సమావేశమై, సమిష్ఠి శాసనోల్లంఘనము విరమించి, వ్యక్తిగత శాసనోల్లంఘనము చేయవలసినదిగా తీర్మానించిరి. కృష్ణాజిల్లాలో ఈ వ్యక్తిగత శాసనోల్లంఘనములో భోగరాజు పట్టాభి సీతారామయ్య, దుగ్గిరాల బలరామకృష్ణయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, కాశీనాధుని పూర్ణమల్లిఖార్జునుడు మరికొందరు జైళ్ళకు వెళ్ళిరి.

7-4-1934 న వ్యక్తిగత శాసనోల్లంఘనముకూడ విరమించి, తాను మరల చెప్పువరకు ఎవరూ చేయవద్దనిచెప్పి అధికారము తనకు యివ్వవలసినదిగా గాంధీగారు కోరిరి. కాంగ్రెసు అప్రకారమే మే నెలలో తీర్మానము చేసినది.

1933 ఆగస్టులో కృష్ణా పుష్కర సందర్భమున విజయవాడలో

జరిగిన ఖాదీ, చేతిపరిశ్రమల వస్తుప్రదర్శన మహోత్సవముగా జరుపబడెను. దుర్గాకళామందిరముయొక్క ఆవరణలో శ్రీ కాట్రగడ్డ మధుసూదనరావు, మరుపిళ్ళ చిట్టిగార్ల నాయకత్వాన యీ ప్రదర్శన ఏర్పాటు చేయబడినది. అదే సంవత్సరము విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర కాంగ్రెసు మహాసభలో గంపలగూడెం కుమారరాజా శ్రీ కోటగిరి వెంకట కృష్ణారావుగారిని ఏకగ్రీవంగా రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నుకొనబడిరి. అనంతరం ఆయన కొద్దికాలానికే రాజీనామాయిచ్చి, రాజకీయములకు దూరముగా నుండిపోయిరి.

## ఎన్నికలు

1934 మే నెలలో పాట్నాలో జరిగిన అఖిల భారత కాంగ్రెసు కమిటీ శాసనోల్లంఘనాన్ని విరమించి, రాబోవు ఎన్నికల్లో పాల్గొనుటకు నిశ్చయించినది. జూన్ నెలలో కాంగ్రెసు సంఘముల మీదనున్న నిషేధములను ఉపసంహరించుకొనిరి. జూన్ 15వ తేదీ ఆంధ్రరత్నభవనం కార్యదర్శి శ్రీ కాశేశ్వరరావుగారికి వప్పగించబడినది. ఆ మాసాంతమున శ్రీ దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారి అధ్యక్షతన ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘం ఆంధ్రరత్న భవనములో సమావేశమై మరల ఆ భవనముపై జాతీయ పతాకమును ప్రతిష్ఠించిరి. అన్ని జిల్లాలలోను కాంగ్రెసు సంఘములు పనిచేయడం సాగించినవి. 1934 ఆగస్టు నెల ఆఖరులో అఖిల భారత కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డుయొక్క ప్రధాన కార్యదర్శి శ్రీ భూలాభాయి దేశాయ్‌గారు ఆంధ్రరాష్ట్రమున అసెంబ్లీ అభ్యర్థులను నిర్ణయించుటకు విజయవాడకు విచ్చేసిరి. కృష్ణా, గోదావరి జిల్లాలకు కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారిని నిర్ణయించిరి. నవంబరు నెలలో జరిగిన ఎన్నికలలో దేశంలో ఏ అభ్యర్థికి రానన్ని ఓట్లతో శ్రీ నాగేశ్వరరావుగారు గెలుపొందిరి.

1935 నవంబరులో అఖిలభారత కాంగ్రెసు సంఘాధ్యక్షులు శ్రీ బాబూ రాజేంద్రప్రసాద్‌గారు కృష్ణాజిల్లాను సందర్శించినప్పుడు ప్రజలు చూపిన ఉత్సాహమునకు అంతులేదు. విజయవాడలో హిందీ మహా విద్యాలయమును నడుపుటకుగాను మల్లెల రత్తమ్మగారు 8 ఎకరముల భూమినిన్నీ, ఎర్నేని లక్ష్మీనారాయణగారు 1000 లు రొక్కమున్నూ విరాళముగా యిచ్చుటకు రాజేంద్రప్రసాదుగారి సమక్షంలో వాగ్దానముచేశారు.

రాజేంద్ర ప్రసాదుగారు జిల్లా అంతటా పర్యటించిరి. విజయవాడ, కంచికచర్ల, పునాదిపాడు, వుయ్యూరు, భట్లపెనుమర్రు, మచిలీపట్నం, గుడివాడ, హనుమాన్ జంక్షన్, గన్నవరం, గుణదల గ్రామాలలో బహిరంగ సభలు జరుపబడినవి. ప్రతిచోట కాంగ్రెసు సిద్ధాంతముల గురించి వారు ఉపన్యసించిరి. వారితోపాటు కాకుమాను లక్ష్మయ్య, కాశేశ్వరరావు, పట్టాభి, ప్రకాశంగార్లు వుండిరి. బాబురాజేంద్రప్రసాదుగారు ఆంధ్రదేశంలో కాంగ్రెసు అధ్యక్షులుగా సంచారం చేశారు. వీరితోపాటు కాశేశ్వరరావు గారు, పట్టాభిగారు, మోటూరి సత్యనారాయణగారు వుండిరి. కొమర వోలు గాంధి ఆశ్రమమును దర్శించిరి. అక్కడజరిగిన నిర్మాణ కార్యకర్తల సమావేశములో ఉపన్యసించిరి. అక్కడనుండి నందివాడకువెళ్ళి అక్కడ బహిరంగ సభలో వారి సందేశమిచ్చిరి.

అనంతరం పునాదిపాడు వెళ్ళి పోలవరపు మధుసూదనరావుగారి భవనములో జరిగిన పశ్చిమ కృష్ణా జిల్లా నిర్మాణ కార్యకర్తల సభలోకూడ సందేశమిచ్చిరి. ఇదే సంవత్సరం కాంగ్రెస్ స్వర్ణోత్సవం జరుపుకున్నది.

## కాంగ్రెసు స్వర్ణోత్సవము

కాంగ్రెసుకు యిప్పటికి 50 సంవత్సరాలు నిండినవి. కాంగ్రెసు స్వర్ణోత్సవ శుభ సమయమున కాంగ్రెసు చరిత్రను అమూలాగ్రముగా వ్రాసి డాక్టరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు దేశమున కర్పించిరి. వారు యీ మండలమున నాయకులేగాక, చాలా కాలము అఖిల భారత కాంగ్రెసు వర్కింగు కమిటీలో ఒకరై దేశమును నడిపించిరి. ఇంతేగాక అఖిలభారత సంస్థాన ప్రజామండలికి అధ్యక్షులుగావుండి సంస్థాన ప్రజా ఉద్యమాన్ని గొప్పగా నడిపిరి. స్వతంత్రము వచ్చిన అనంతరము, వీరు అఖిలభారత జాతీయ కాంగ్రెసుకు అధ్యక్షులుగాను, రాజ్యాంగ రచనా మండలికి సభ్యులుగాను, మధ్యప్రదేశ్ రాష్ట్రమునకు గవర్నరు గాను, అనేక వున్నత పదవులను నిర్వహించిరి. మరియు గాంధిసిద్ధాంతము నకు భాష్యకర్తగా పేరొందిన మహా మేధావి.

కృష్ణా మండలములో ప్రసిద్ధిగాంచిన కవుతరము గ్రామములో కానూరివారి కుటుంబము బాగుగా త్యాగముచేసినది. కానూరి దామోద రయ్యగారి కుమాళ్ళు రామానందం, వెంకటరత్నంగారలు ఉద్యమమునందు

పాల్గొనిరి. వీరిలో రామానందంగారు మద్రాసు కుట్రకేసులో మూడు సంవత్సరములు కఠిన శిక్షకు గురియైరి.

అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షులు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆంధ్రప్రదేశ్ పర్యటన సందర్భములో 20-10-1936న కృష్ణాజిల్లాలో పర్యటించిరి. విజయవాడ జింఖానా మైదానంలో గొప్ప బహిరంగసభ జరిగినది. అనంతరం కంకిపాడు, ఉయ్యూరు, మచిలీపట్నంలో బహిరంగ సభలలో ఉపన్యసించి, గుడివాడకు వచ్చిరి. అక్కడ ట్రావెలర్సు బంగళా మైదానంలో గొప్ప బహిరంగసభ జరిగినది. చుట్టుపట్ల గ్రామాల నుండి వేలాది ప్రజలు నెహ్రూ దర్శన నిమిత్తం వచ్చిరి. తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు కార్యదర్శి వల్లభనేని రామబ్రహ్మంగారు సన్మానపత్రం యిచ్చి, సభాపర్పాట్లు చక్కగా నిర్వహించిరి. స్వచ్ఛంద సేవికల తరపున సీతామహాలక్ష్మమ్మగారు నెహ్రూకు రు 207 లు పర్సును బహూకరించిరి. స్వాతంత్ర్య ఉద్యమాలలో ఇక్కడ స్త్రీలు చూపిన అసమాన ధైర్య సాహసాలకు నెహ్రూ ముగ్ధులై స్త్రీలను ప్రశంసించిరి. ఈ సంచార సందర్భములో నెహ్రూగారు సోషలిస్టు సిద్ధాంతములను బాగా ప్రచార మొనర్చిరి. కాంగ్రెసు లక్ష్యం సోషలిజమే అని నొక్కిచెప్పిరి. సోషలిజం వినా దేశసమస్యలు పరిష్కారం కావని, దేశంలోని దారిద్ర్యము నిర్మూలించ డమే సోషలిస్టుల ఆశయమని ఆయన పదేపదే ప్రబోధించిరి.

నెహ్రూగారి ఈ సంచార అనంతరం కొద్దికాలానికి గుడివాడలో శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారి కృషివలన సోషలిస్టు భావాలుగల కాంగ్రెసువాదులందరు గుడివాడలో సమావేశమై కృష్ణాజిల్లా కాంగ్రెసు సోషలిస్టుపార్టీని ఏర్పరచిరి. సదరు జిల్లా పార్టీకి శ్రీ గద్దే లింగయ్యగారు అధ్యక్షులుగను, శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారు కార్యదర్శిగను ఎన్ను కొనబడిరి. ఈ సంఘముద్వారా సోషలిస్టు సాహిత్యము విరివిగా ప్రచు రించి, ప్రచారము చేయబడినది.

సత్యాగ్రహము, శాసనోల్లంఘనము విరమించబడిన తరువాత, యువకులలో సామ్యవాదమను నూతన సంచలనము కలిగినది. దీనికి ప్రోత్సాహకులు పండిత జవహర్ లాల్ నెహ్రూగారు. కృష్ణాజిల్లా సామ్య వాద సంఘమను పేరుతో 1936 లో ఒక సంఘంయేర్పడి సామ్యవాద

ప్రచారములు చేయుచున్నది. దీనికి అనుబంధముగా యువజనసంఘములు కూడా ఏర్పడి పనిచేయుచున్నవి.

యలమర్రు - విప్లవ యుగము కేసు

1939 ప్రపంచయుద్ధం ప్రారంభంకాగానే ప్రభుత్వం అతివాద శక్తులపై దాడి ప్రారంభించినది. చాలామంది కార్యకర్తలను అరెస్టు చేసి జైళ్ళకు డిటెన్యూలుగా పంపినది. (శ్రీ) గద్దె లింగయ్యగారు కృష్ణా జిల్లా సోషలిస్టుపార్టీకి అధ్యక్షులుగా వున్నారు. అప్పటికే రహస్యముగా సోషలిస్టు సాహిత్యమును, విప్లవ సాహిత్యమును అచ్చువేయించి ప్రచారం చేయుచుండెడివారు. వీరికి హిందీభాషలో బాగా ప్రవేశముండేది. వీరి అంతరంగిక స్నేహితులు (శ్రీ) పిడికిటి మాధవరావుగారు యలమర్రు పంచాయతీ అధ్యక్షులుగా వుండెడివారు. అన్నిటికీ తెగించి పనిచేసే యువకులు చాలామంది ఆ గ్రామంలో వీరితో వుండేవారు. వీరిద్దరు హిందీ, ఇంగ్లీషు భాషలనుండి బ్రిటీషు ప్రభుత్వముచే అభ్యంతరకర సాహిత్యంగా పరిగణించబడి "నిషేధించిన" అనేక గ్రంథాలను తెలుగులోకి అనువాదముచేసి, అచ్చువేయించెడివారు. అందులో భారత రక్షణ చట్టం కోరలుచాచుకుని వికటాట్టహాసం చేస్తున్న రోజులలో 'విప్లవ యుగము' అను బృహద్ గ్రంథమును భారతదేశ విప్లవచరిత్ర 800 పేజీలలో విప్లవకారుల ఫోటోలతోసహా ఆదినుంచి అంతం వరకు రహస్యముగా అచ్చువేయించడం విశేషం. ఈ గ్రంథ రచన నిమిత్తమే వీరు అండరు గ్రౌండుకువెళ్ళినారు. ఈ గ్రంథమును విజయవాడలో రహస్యముగా అచ్చువేయించినారు. అన్ని జిల్లాలకు పంపించడం జరిగినది. రహస్యముగా అనంతపురంజిల్లా వురవకొండకు ఒక పార్సెలు పంపబడినది. అదివరకే గాలిస్తున్న రహస్య పోలీసులు ఆ పార్సిలు పట్టుకున్నారు. అది వగలగొట్టి చూడగా 'విప్లవ యుగము' పుస్తకముతోపాటు 'రవిప్రెస్' అనే బ్లాకుమేకర్స్ మొహరు కనిపించినది. దాని ఆధారంగా మద్రాసులోని రవిప్రెస్ వారిని నిర్బంధించినారు. వారివల్ల అసలు సంగతి బయటపడినది. వెంటనే యలమర్రుకు అర్ధరాత్రివేళ పోలీసులువచ్చి యలమర్రు గ్రామ పంచాయతీ అధ్యక్షులైన (శ్రీ) పిడికిటి మాధవరావుగారి యిల్లు (శ్రీ) గద్దె లింగయ్యగారి యిల్లు ముట్టడివేసిరి. రాత్రిపూట తిరిగితిరిగివచ్చి వీరిద్దరు మాధవరావుగారి యింట్లో నిద్రించుచుండగా ఇరువురను అరెస్టుగావించిరి.

లింగయ్యగారి యింటివద్ద వారి భార్య లలితాంబగారిని, లింగయ్యగారి బంధువు గద్దే మల్లిఖార్జునరావుగారినికూడా అరెస్టుచేసి గుడివాడ సబ్ జైలుకు పంపివేసిరి,

శ్రీ పిడికిటి మాధవరావుగారి యిల్లు సోదాసందర్భమున విప్లవ యుగమునకుచెందిన బ్లాకులు, విడిపొరములు, యింకా యితర నిషేధించిన సాహిత్యము దొరికినవి. వారిపైన ఆ కేసుపెట్టి ఒక సంవత్సరం శిక్షవేసి బళ్ళారి జైలుకు పంపినారు. లింగయ్యగారిని డిటెన్యూగా పంపివేసిరి. తక్కిన ఇరువురను జామీనుమీద విడుదలచేసిరి.

విప్లవయుగం కేసు దర్యాప్తు పూర్తిచేసిన అనంతరం శ్రీ మాధవ రావుగారిని బళ్ళారి జైలునుండి వెనుకకు తీసుకొనివచ్చియు, శ్రీ లింగయ్య గారిని రాయవేలూరునుండి తీసుకొనివచ్చి గుడివాడ సబ్ జైలులో వుంచి పైనలుగురికి రహస్య విప్లవ ఉద్యమానికి సంబంధము కలదనియు విప్లవ యుగము గ్రంథమును వీరు రచించి, అచ్చువేయించి, ఆంధ్రదేశమంతటా పంపిణీ చేసిరనియు వీరిపై కుట్రకేసు బనాయించినారు. ఈ కేసులో 60 మంది ప్రాసిక్యూషన్ సాక్షులను విచారించినారు. కేసు 2 సంవత్సరములు నడిచినది. ఈ కేసు అయ్యేలోగా ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లు మారిపో యినారు. చివరకు మాధవరావుగారికి మొదట విధించిన ఒక సం॥ శిక్ష సబ్ జైలులో అయిపోయి మరొక సంవత్సరం గడిచినది. చివరకు మాధవరావు గారికి ఒక సంవత్సరం, లింగయ్యగారికి 2 సంవత్సరాలు శిక్ష విధించినారు. లలితాంబగారిని, మల్లిఖార్జునరావుగారిని విడుదలచేసిరి.

1930-32 ఉద్యమాలకు అంగలూరు, ఘంటసాల, భట్లపెనుమర్రు, బమిగొల్వపల్లి, నందివాడ, వెంట్రప్రగడ, ముదునూరు, పునాదిపాడు, మొగల్రాజపురం, కొణకంచి గ్రామాలు ప్రధాన కేంద్రాలుగా పనిచేసినవి. జిల్లాలోని అనేక గ్రామాలనుంచి ఎక్కువమంది రైతుబిడ్డలు యీ వుద్యమాలలో ప్రవేశించి, సాహసోపేతమైన చరిత్రను నిర్మించిరి.

## వి రా మ స మ య ము

1932-42 మధ్యకాలములోనే భారతదేశములో అపూర్వమైన రాజకీయ చైతన్యం కలిగినది. ముఖ్యముగా వ్యక్తిగత దౌర్జన్యవాదుల

(విప్లవ వీరులు) భావాలలో మార్పువచ్చినది. వ్యక్తిగతమైన హత్యలద్వారా స్వాతంత్ర్యము సంపాదించుకొనలేమని గ్రహించుకున్నారు. వారుకూడ అతివాద సంఘాల నిర్మాణానికి పూనుకున్నారు.

లెనిన్ నాయకత్వాన రష్యాలో జరిగిన బోల్షివిక్ విప్లవం వీరిని ఆకర్షించినది. సుప్రసిద్ధ భారత విప్లవనాయకుడు మానవేంద్రనాథ్ రాయ్ అమెరికా ప్రవాసంనుండి రష్యా చేరుకున్నారు. అక్కడినుండి తనతోటి విప్లవ వీరులకు రష్యన్ సామ్యవాద సాహిత్యమును అందజేయసాగారు. ఆ విధంగా భారత విప్లవ యువకులు చాలామంది సామ్యవాదమువైపు ఆకర్షింపబడినారు. తత్ఫలితంగా 'హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లిక్ ఆర్మీ' వంటి విప్లవ సంస్థలు ఏర్పాటు అయినవి. సర్దార్ భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, యశపాల్, విజయకుమార్ సిన్హా మొదలగు యువకులు ఈ సంస్థ నిర్మాణమునకు ముఖ్యులు. వీరందరు లాహోరు కుట్రకేసుకు చెందినవారు సాండర్సన్‌ను హత్యచేసినందుకు వీరిపైన 1929లో కేసునడిపి కొందరికి మరణశిక్షలు, మరికొందరికి యావజ్జీవిత శిక్షలు విధించినారు. వీరినందరును ఒకే జైలులో వుంచినచో ప్రమాదమనిఎంచి, దక్షిణ భారతదేశంలోని వివిధ చెరసాలలకు విడివిడిగా పంపివేసిరి. అందు విజయకుమార్ సిన్హా, శివవర్మ, జయదేవ్‌కపూర్ లు రాజమండ్రి జైలుకు పంపబడిరి.

1930 సత్యాగ్రహ ఉద్యమములో కృష్ణాజిల్లానుండి రాజమండ్రి జైలుకు పంపబడిన యువకులకు వీరితో పరిచయమేర్పడెను. అలాగే బళ్ళారి, రాయవెల్లూరు, తిరుచునాపల్లి జైళ్ళకు పంపబడిన లాహోరుకుట్ర కేసు ఖైదీలతోకూడ జిల్లా యువకులకు పరిచయాలు కలిగెను. కృష్ణా జిల్లాకు చెందిన అనేకమంది యువకులు వీరి సాంగత్యమువలన సామ్యవాద భావాలకు ప్రభావితులయ్యారు. వీరందరూ విడుదలకాగానే, 1934లో ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టుపార్టీని ఏర్పాటుచేశారు. 1936 భారత జాతీయ కాంగ్రెసు మహాసభలకు జవహర్ లాల్ నెహ్రూ అధ్యక్షత వహించారు. అంతకుముందు ఆయన యూరపుయాత్రలో అనేక దేశాలు సందర్శించారు. పశ్చిమ జర్మనీలో జరిగిన అంతర్జాతీయ పీడిత ప్రజల మహాసభలో భారత ప్రతినిధిగా పాల్గొన్నారు. ఇదే సందర్భంలో రష్యాను కూడ సందర్శించడం జరిగినది. ఇండియాకు రాగానే 'భారతదేశము ఎటువైపు' అను గ్రంథాన్ని వ్రాసినారు. యూరపులో సంతరించు

కొంటున్న సామ్యవాద నూతన భావాలు ఆయనను ఆకర్షించినవి. తన అధ్యక్షోపన్యాసములో "కాంగ్రెసు లక్ష్యము - సోషలిజం" అని స్పష్టంగా ప్రకటించినారు. పెద్దనాయకులలో గుసగుసలు బయలుదేరినవి. అయినను ఈ భావాలకు అనుకూలురైన సోషలిస్టు యువకుల అండ ఆయనకు బాగుగావున్నది. అందుచేత తన వర్కింగుకమిటీలో నలుగురు సోషలిస్టు నాయకులను వేసుకున్నారు. వీరు 1. ఆచార్య నరేంద్రదేవ్ 2. అచ్యుతపట్వర్ధన్ 3. అశోక్ మెహతా 4. జయప్రకాష్ నారాయణగార్లు

వీరందరు అదివరకే నెహ్రూసలహాపై అఖిల భారత కాంగ్రెసు సోషలిస్టుపార్టీని స్థాపించి కాంగ్రెసులోనేవుండి పనిచేయుటకు నిర్ణయించి యున్నారు. కాంగ్రెసు సంస్థను సోషలిస్టు భావాలతో అతివాద దృక్పథం వైపు మరల్చడమే వీరి ధ్యేయము. ఇందలి ప్రతి సభ్యుడు కాంగ్రెసులో విధిగా సభ్యులై యుండాలి. అన్ని రాష్ట్రాలలోను దీని శాఖలు యేర్పడినవి. ఆంధ్రలోకూడ ఒక శాఖ యేర్పడి, విజయవాడ కేంద్రముగా పనిచేయసాగనది. కృష్ణాజిల్లాలోని యువ కాంగ్రెసు కార్యకర్తలందరు యీ నూతన పార్టీలో చేరి పనిచేయసాగిరి. జిల్లా అంతటా సామ్యవాద ప్రచారము జోరుగా సాగిపోతూవున్నది. సోషలిస్టు మహాసభలు, యువజన కాంగ్రెసు మహాసభలు, విద్యార్థి మహాసభలు లెక్కలేనన్ని జరిపి, బహు తీవ్రమైన సామ్యవాద ప్రచారము జరిగినది. జయప్రకాష్ నారాయణ, బాటిల్‌వాలా మొదలగు సోషలిస్టు నాయకులు జిల్లా అంతటా సమాచారము చేసిరి. సోషలిస్టుపార్టీ ప్రచారము నిమిత్తం కమలాదేవి చటోపాధ్యాయ విజయవాడ వచ్చినది. ఆమెకు కాశేశ్వర రావుగారు స్వాగతమిచ్చి ఆమెతోపాటు జిల్లా అంతటా సంచారముచేశారు. ఆమె బహిరంగసభలలో అతి తీవ్రమైన భాషతో ప్రభుత్వాన్ని విమర్శించినది. వెంట్రప్రగడలో ఆమె యిచ్చిన ఉపన్యాసానికి ఆమెను అరెస్టుచేసి 1 సం॥రం శిక్షవేశారు. ఆ ఉపన్యాసాన్ని తర్జుమా చేసినందుకు కాశేశ్వర రావుగారిని సెక్యూరిటీ కోరినారు. ఈ సభకు డా॥ బ్రహ్మజోశ్యుల సుబ్రహ్మణ్యంగారు హాజరై గంభీరోపన్యాస మిచ్చినారు. 1937 లో మొవ్వలో జరిగిన యువజన కాంగ్రెసు మహాసభలో శ్రీ కడియాల గోపాల రావుగారిని అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. ఈసభకు అఖిలభారత సోషలిస్టు

నాయకుడు బాటిల్‌వాలాగారు హాజరైనారు. తరువాత ఆయనను కూడ అరెస్టుచేసి శిక్షవేసినారు.

సరిగా యిదేకాలములో పశ్చిమ కృష్ణాజిల్లాకు చెందిన 35 వేల ప్రాథమిక సభ్యత్వము రద్దుచేయుట జరిగినది. ఈ చర్యకు యువకులు అసంతృప్తిచెంది అతివాదం వైపు మొగ్గసాగారు. తూర్పు పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘాల్లో అతివాద, మితవాద విభేదములు తీవ్రముకాజొచ్చినవి. ఈ వాదోపవాదాలమధ్య జిల్లా రాజకీయములు తీవ్రస్థాయికి పోయినవి. ఇది అదనుగా తీసుకొని, కమ్యూనిస్టులు తమ పార్టీ నిషేధంలో వున్నందున, ఈ సోషలిస్టు పార్టీలోచేరి, నెమ్మది నెమ్మదిగా ఇందలి యువకులను తమ రహస్య పార్టీలో చేర్చుకొనసాగిరి. పైకిమాత్రం కాంగ్రెసు సోషలిస్టుపార్టీ, లోపల కమ్యూనిస్టుపార్టీగా తయారైపోయినది. తమ పార్టీ ఆదేశాలప్రకారం కాంగ్రెసును దుయ్యబట్టడం ప్రారంభించినారు. కాంగ్రెసులోనేవుంటూ కాంగ్రెసును విమర్శించడం ఒక విచిత్ర పరిస్థితికి దారితీసినది.

ఇంతలో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైనది. భారతీయులతో చెప్పకుండానే భారతదేశాన్నికూడ యుద్ధంలోకి ఈడ్చినారు. ఇందుకు అసమ్మతిగా కాంగ్రెసు ప్రభుత్వాలు రాజీనామాలు యిచ్చినవి. సంపూర్ణ స్వాతంత్ర్యం వాగ్దానంచేస్తేనే తప్ప యుద్ధకార్యాలకు సహాయం చేయ కూడదని కాంగ్రెసు నిర్ణయించినది. ఇందుకు బ్రిటీషు ప్రభుత్వం అంగీక రించలేదు. యుద్ధానికి వ్యతిరేకతను తెలియచెప్పటకు వ్యక్తిగత శాసనో ల్లంఘనం ప్రారంభించినది. ఆంధ్ర సోషలిస్టుపార్టీ (కమ్యూనిస్టు) యీ వ్యక్తిగత శాసనోల్లంఘనాన్ని వ్యతిరేకించినది. రాష్ట్ర పార్టీ మహాసభ ఏర్పాటు చేయవలసినదిగా జయప్రకాష్ ఆదేశించారు. ఆయన అఖిల భారత కాంగ్రెసు సోషలిస్టుపార్టీ కార్యదర్శి. విజయవాడలో రాష్ట్ర కాంగ్రెసు సోషలిస్టు మహాసభ ఏర్పాటు అయినది. శ్రీ జయప్రకాష్ నారాయణ్‌గారు ఆ సమావేశానికి హాజరు అయినారు. ఆయన వ్యక్తి గత సత్యాగ్రహాన్ని సమర్థించవలసినదిగా పార్టీని కోరినారు. ఒకరోజంతా దీర్ఘచర్చలు జరిగిన అనంతరం, ఆయనతో విభేదించి, కాంగ్రెసు సోషలిస్టు పార్టీతో సంబంధం వదులుకుంటున్నామని కమ్యూనిస్టులు తెగతెంపులు చేసుకున్నారు. మిగిలివున్న జయప్రకాష్ అనుయాయులందరు వ్యక్తి

గత సత్యాగ్రహాన్ని బలపర్చుతూ తీర్మానించారు. కృష్ణాజిల్లాలో హెచ్చు మంది సోషలిష్టు కార్యకర్తలు, హెచ్చుమంది పార్టీనాయకులు, కాంగ్రెసు సోషలిస్టుపార్టీనుండి వేరై పోయినారు. వారిలో చాలామంది ప్రస్తుతం కమ్యూనిస్టుపార్టీ అగ్రనాయకులుగా వున్నారు.

మిగిలిన సోషలిస్టులు శ్రీ బసవరాజు రంగశాయిగారి ఆధ్యక్షతన నూతన సంఘాన్ని ఏర్పరచి, వ్యక్తిగత సత్యాగ్రహాన్ని, తర్వాత 1942 క్విట్ ఇండియా వుద్యమాన్ని బలపర్చి తీవ్రముగా పనిచేశారు. మద్దూరి అన్నపూర్ణయ్య, అల్లూరి సత్యనారాయణరాజు, యరమిల్లి నరసింహారావు మొదలగు యువకులు వీరితో వున్నారు.

## రైతు సంఘాలు

కృష్ణాజిల్లాలో రైతు సమస్యలమీద జాతీయోద్యమాలకు పూర్వం నుండి పనిచేస్తూవున్న రైతు సంఘాలున్నవి. అవి ఆయా కాలపరిస్థితుల ననుసరించి అప్పటి సమస్యలమీద పోరాటాలు సాగించుచూ వచ్చినవి. ముఖ్యంగా యీ జిల్లా యావత్తు యే కొద్దిభాగమో మినహా జమీందారుల యేలుబడిలో యుండెడిది. భూమిమీద అన్నిహక్కులు జమీందారుకే యుండెడివి. వారి సనదుల ప్రకారము వారు విధించిన షరతులకులోబడి సాగుచేసుకొనడంతప్ప మరొక హక్కు రైతులకులేదు. కుడివరం, మేలు వరం హక్కులు జమీందారుకు వుండెడివి. జమీందారు అనుమతి లేనిదే తాను సాగుచేసుకొనే భూమిలోని చెట్లను కొట్టుకొనే హక్కుగాని, యిండ్లు కట్టుకొనే హక్కుగాని రైతులకు లేదు. జమీందారుకు యిష్టం లేకపోతే సాగుచేసుకొనే రైతులను తప్పించి, ఆ భూమిని మరొకరికి సనదులుయిచ్చి తొలగించే హక్కునుకూడ జమీందారులు కలిగివుండిరి.

సాగుభూములలోని పంటలో దాయభాగం జమీందారుకు వుండేది. అమానీలద్వారా యీ దాయభాగం పండిన పంటనుండి వసూలుచేసేవారు. యీ వసూళ్ళలో రైతులను యమయాతనలకు గురిచేసి జమీందార్ల ఏజెంట్లు పీడించుకుతినేవారు. వారిభాగము వారికి చెల్లేవరకు ధాన్యం రాసులు వారి స్వాధీనంలోనే వుండేవి. రానురాను ఈ బాధలు ఎక్కువై రైతులు తిరుగుబాటుచేసిన ఘట్టాలు యీ జిల్లాలో అనేకం వున్నవి.

## శ్రీ దండమూడి రామబ్రహ్మం సమ్మె

మనకు తెలిసినంతలో దండిమూడి రామబ్రహ్మంగారి సమ్మె కృష్ణా జిల్లాలో ప్రఖ్యాతి చెందినది. జమీందార్ల జులుముకు నిరసనగా రైతుల ఆందోళనను వీరు లేవదీశారు. ఈయన జమీందారీ గ్రామమైన ఉయ్యూరు శివారు గండిగుంటకు చెందిన పెద్దరైతు. ఈయన నాయకత్వంలో నూజివీడు జమీప్రాంతమంతటా రైతుదండు నడిపినారు. ఒక గ్రామం నుంచి రైతులనందరను దండుగా తీసుకొని మరొక గ్రామం వెళ్ళడం, అక్కడనుండి వీరు ఆ గ్రామ రైతులను బయలుదేరతీయడం, దారిలో కోలాహలంగా చిందులు త్రొక్కుచు, కనబడిన చెట్లను విరగదీయడం, గొడ్లమందలను బీళ్ళపై ఎగదోలడం, ఊరి పొలిమేరలలో నాగలి మేడిని విరగవేసి పాతడం మొదలగు నిరసన చర్యలు జరుపుతూ వీరు తమ కార్యక్రమము సాగించెడివారు. దీని అర్థం జంమీందార్ల జులుం నశించేవరకు పశ్చికబేళ్ళకు పుల్లరి యివ్వరాదని, దాయభాగం నశించేవరకు ఎవ్వరు వ్యయసాయం చేయకూడదనీ, చెట్లపై హక్కు రైతులకు కలిగేవరకు ఎవ్వరు చెట్లను పెరగనివ్వరాదనీ ఈ ఉద్యమం యొక్క ప్రధానలక్ష్యం. ఈ రైతు దండులు జిల్లాలో గొప్ప సంచలనాన్ని కలుగజేసినవి. జమీందారులు భయపడి వీరితో రాజీచేసుకోవడం జరిగినది. రైతులు విజయం పొందారు. కొన్ని హక్కులు సాధించగలిగారు.

## శ్రీ కడియాల చంద్రయ్య తిరుగుబాటు

దండమూడి రామబ్రహ్మంగారి తర్వాత ముస్తాబాద వాస్తవ్యులు కడియాల చంద్రయ్యగారు గొప్ప ఉద్యమాన్ని జమీందార్లపై నడిపారు. పంట పండించుకొంటూనే అన్నిహక్కులు సంపాదించటం వీరి ఉద్యమ లక్ష్యం. జమీందార్లకు చెల్లించవలసిన పన్నులు, దాయభాగము, చెట్లపై హక్కులు గురించి ప్రత్యక్ష పోరాటంద్వారా ఎదుర్కొని జమీందార్లను కోర్టుకు పంపే పరిస్థితి కలుగజేశారు. కొన్ని సందర్భాలలో రైతులతో కూడ దావాలు వేయించినారు. ఎన్నో కేసులలో రైతులు విజయము పొందారు. చివరకు అన్నిహక్కులు రైతులకు వదలి, భూమి పన్నులు నామకః యిచ్చే ఏర్పాట్లు రైతులతో జమీందార్లు ఒప్పందం చేసుకున్నారు

వీరి అనంతరం వచ్చిన రైతునాయకులు కోర్టులద్వారాను, ప్రజాందోళనద్వారాను వుద్యమాలు నడిపారు. 1916 సెప్టెంబరులో ముదునూరు వాస్తవ్యులు తుమ్మల నాగభూషణం, వారి సోదరుడు కోటయ్యగారు కట్టుబడి ఈనాముకు అక్రమంగా అదనపు శిస్తు వసూలు చేసినందుకు ఉయ్యూరు జమీందారుగారిపై దావావేసి గెల్చుకున్నారు. అదనంగా వసూలుచేసిన మొత్తంతోపాటు, కోర్టు ఖర్చులుకూడా డిక్రీ యిచ్చారు. డిక్రీ మొత్తం వసూలుకు వుయ్యూరు ఠాణాలోని సామానుకు జప్తు వారంటు తీసుకువెళ్ళినారు. ఎస్టేటు మానేజరు ఈ మొత్తము వారికి చెల్లించినారు. ఉయ్యూరు ఎస్టేటువారు శాశ్వత జిరాయితీవన్ను రు 2-75 పైసలు వుండగా దానిని 5 రూపాయలకు పెంచిరి. దీనికి రైతులు అభ్యంతరం తెలిపిరి. భూముల ఫలసాయం పెరిగినందుకుగాను జమీందారు శిస్తు ఎక్కువ చెల్లించాలని వుయ్యూరు జమీందారు శిస్తును దౌర్జన్యముగా వసూలుచేయసాగెను. జమీందార్లు ప్రభుత్వానికి చెల్లించే పేషకర్ పెరగనప్పుడు రైతుపై పెంచడానికి జమీందారుకు హక్కులేదని ముదునూరు వాస్తవ్యులు (శ్రీ) అన్నె వెంకటకృష్ణయ్య, అన్నె వీరభద్రయ్య, గుత్తా లక్ష్మయ్యగారి భార్య అంబమ్మగార్లు వాదులుగా వుయ్యూరు జమీందారును ప్రతివాదిగాపెట్టి దావావేశారు. దావా 3 సంవత్సరాలు జరిగినది. శిస్తు పెంచే అధికారము జమీందారుకు లేదని కోర్టు తీర్పుయిచ్చినది.

ఆ భూములకు చెల్లించవలసిన శిస్తు రు 2-75 పైసలు చొప్పున రైతులు చెల్లించబోగా జమీందారు ఉద్యోగులు నిరాకరించిరి. రైతులు శిస్తును రిజిష్టరు చేయసాగిరి. దానినికూడా తిరస్కరించిరి. ఇలా 15 సంవత్సరములు జరిగినది. రిజిష్టరుచేసిన రశీదులు జాగ్రత్తగా వుంచుకొనిరి. 15 సంవత్సరాలు అనంతరం ఈ భూములకు శిస్తు చెల్లించడంలేదని, భూములు శిస్తుకు డిక్రీ యివ్వవలసినదని జమీందారు కోర్టులో దావావేసిరి. తమవద్దగల యావత్తు తిరుగు రశీదులు రిజిష్టర్లుకోర్టులో రైతులు దాఖలు చేయగా, జమీందారు పిటిషన్ కొట్టివేస్తూ రైతులకు ఖర్చులు యిప్పిస్తూ కోర్టు తీర్పుచెప్పినది.

1917లో (శ్రీ) వేమూరు వెంకటసుబ్బారావుగారి అధ్యక్షతన 105 గ్రామాలనుంచి 1000 మంది రైతులు గుడివాడలో సమావేశమయ్యారు.

హైలెవెల్ భూములను మాగాణి హద్దులోనుంచి తగ్గించివేయుటకు నిశ్చయించిన ప్రభుత్వ చర్యను ఖండిస్తూ తీర్మానించినారు. ఒక రాయబార వర్గమును అధికారులవద్దకు పంపించినారు. జగ్గయ్యపేటలో మరొక సభ వేమూరు వెంకట సుబ్బారావుగారి అధ్యక్షతన జరిగినది. మునగాల ముక్త్యాల ఎస్టేటుల్లో రైతులకు జరిగే అన్యాయాలు ఖండించుచూ తీర్మానము చేసిరి.

1917 మే నెలలో పామర్రులో జరిగిన రైతుల సభకు కృష్ణాజిల్లా కలెక్టరుగారుకూడా హాజరయిరి. రైతులు చెప్పుకున్న విన్నపాలు సావధానంగావిని తప్పక చేస్తానని హామీయిచ్చినారు. అదే సంవత్సరం మర్రివాడ క్యాంపులోవున్న స్పెషల్ ఆఫీసరు వెంకన్న పంతులుగారికి అదనపు పన్నులు గురించి తుమ్మల కోటయ్యగారి నాయకత్వమున చుట్టుప్రక్కల రైతులు విన్నవించుకున్నారు. వీరుచేసిన ఫిర్యాదులు విచారించుటకు రెవిన్యూబోర్డు మెంబరు విజయవాడ వచ్చి విచారణ జరిపినారు. అధికారుల జులుం గురించి ధైర్యముగా రైతులు సాక్ష్యం చెప్పిరి. కొందరు అధికారులపై చర్య తీసుకోబడినది.

శ్రీ వేమూరు వెంకట సుబ్బారావుగారి అధ్యక్షతన 1918లో మార్చి 4 వ తేలప్రోలులో నూజివీడు, వుయ్యూరు ఎస్టేటు రైతుల సభ జరిగినది. ఆ తర్వాత శ్రీ చిన్నమనేని వెంకటచలంగారి అధ్యక్షతన ఇందుపల్లిలో వుయ్యూరు ఎస్టేటు రైతుల సభ జరిగినది. అక్రమముగా వసూలు పరిచిన శిస్తు ముదరా ఇమ్మని డిమాండు చేశారు. ఒక రాయబార వర్గమును జమీందారుగారివద్దకు పంపగా కొద్ది సర్దుబాట్లుతో రాజీ చేసుకున్నారు.

1918 సెప్టెంబరు 8 వ తేదీన గుడివాడలో శ్రీ పుంకర బసవయ్యగారి అధ్యక్షతన జిల్లా రైతు మహాసభ జరిగినది. అదనపు శిస్తునుగురించి తీర్మానంచేశారు. అదే సమయంలో కాటూరులోను, ముదునూరులోను శ్రీ తుమ్మల కోటయ్యగారి ఆధ్వర్యమున రైతుల సభలు జరిగినవి.

1918 అక్టోబరు 20న వుయ్యూరులో కాళ్ళకూరి నరసింహారావుగారి అధ్యక్షతన రైతుల సభ జరిగినది.

1919 జనవరి 25 న కావూరు గ్రామ వాస్తవ్యులు పాతూరు అప్పయ్యగారి అధ్యక్షతన కృష్ణాజిల్లా రైతుసభ జరిగినది. ఈ సభ రామమోహన గ్రంథాలయంలో జరుపబడినది. ఆదేసమయములో విజయవాడ వచ్చిన గాంధీగారికి సన్మానపత్రం జిల్లా రైతుల తరపున సమర్పించబడినది. రౌలటు చట్టాన్ని వుపసంహరించుకోవలసినదిగా తీర్మానం చేశారు.

ఈ విధంగా కృష్ణాజిల్లాలో రైతు నాయకులు జమీందారులపై హోరా హోరీగా అనేక పోరాటములు జరిపినారు. ప్రజా బలమును సమీకరించి అనేక హక్కులు సంపాదించగలిగారు. ఆ రోజులలో ఎక్కడ చూచినా వెట్టిచాకిరి మహా ఘోరంగా వుండేది. ప్రతిరైతు, ప్రతికూలి, ప్రతి వృత్తి పనివారు అందరూ అవుసరమైనప్పుడల్లా వుచితంగా జమీం దారుకు సేవచేయవలసి వుండేది. ఈ రైతుల ఆందోళన ఈ వెట్టిచాకిరిని అరికట్టగలిగినది. ఇప్పటికీ ఈ దురాచారము కొన్నిచోట్ల అమలుజరుగు చునేవున్నది. కృష్ణాజిల్లాలో పైన తెల్పిన నాయకుల అండదండలతో పటిష్టమైన రైతు వుద్యమాన్ని నిర్మించుకుని రైతులు ధైర్యసాహసము లతో పోరాడి, అన్ని హక్కులు సంపాదించుకోగలిగారు. జమీందార్లకు సివిలు, క్రిమినల్ హక్కులుకూడా వుండేవి. వారు చిత్రవిచిత్రమైన తీర్పులు చెబుతూ ఉండేవారు. ఇప్పటికీ వెనుకబడిన ప్రాంతాలలో ఎన్నో అమానుష చర్యలు వీరివల్ల జరుపబడుచునే వున్నవి.

వీరి అనంతరం వచ్చిన నాయకులు జమీందార్ల అక్రమాల గురించే కాకుండా, డెల్టా అభివృద్ధికికూడా ఎక్కువ కృషిచేసినారు. ఈ తరంవారు కూడా ఎక్కువగా రాజకీయాల జోలికి పోకుండానే నిర్మాణయుతము చట్టబద్ధము అయిన పద్ధతులు అవలంబించి రైతులకు సేవచేశారు. వీరు డెల్టా అభివృద్ధికి ఎక్కువగా కృషి చేశారు

జస్టిసు పార్టీకి, కాంగ్రెసు పార్టీకి జిల్లాబోర్డుకు జరిగిన ఎన్నికలలో జమీందార్లందరు జస్టిసుపార్టీ తరపున నిలబడినారు. అన్నిచోట్ల కాంగ్రెసు తన అభ్యర్థులను నిలబెట్టినది. యలమర్రు ఎస్టేటు తాలూకు వీరవల్లి గ్రామములో రైతులు తమ ఓట్లు యివ్వలేదనే కోపముతో, తన పర్మిషన్ లేకుండా రైతులు భూములలో వేసుకున్న యిండ్లను పీకివేయించుటకు

నోటీసు యిచ్చిరి. రైతులందరు బండ్లుకట్టుకొని, నూజివీడు వెళ్ళి యీ అక్రమ ఆర్డరును రద్దుచేయించుకొనుటకు కోటకు ఎదురుగా బైటాయింపు సమ్మెచేసిరి. జట్టు తరువాత జట్టు మారుతూ సత్యాగ్రహము సాగించిరి, దీని ప్రభావము చుట్టుప్రక్కల గ్రామాలలో వ్యాపింప దొడగెను. చివరకు తన దివానును సత్యాగ్రహులవద్దకు రాజాగారు పంపిరి. వారు రాజాగారి దర్శనమే కావాలని పట్టుబట్టిరి. విధిలేక పదిరోజులనంతరము రాజాగారు వారికి దర్శనమిచ్చిరి. యీ ఆర్డరు రద్దుచేయవలసినదిగా కోరిరి. నాకు ఎన్నికలలో ఎందుకు వ్యతిరేకం చేశారు అని కేకలుపెట్టి వారినందరిని దబాయించిరి. సత్యాగ్రహులు చలించలేదు. నేను ఆ గ్రామములో క్యాంపువేసుకొని, మీవిషయం ఆలోచిస్తాను వెళ్ళండి అనగా, సత్యాగ్రహం విరమించి యిండ్లకు వెళ్ళిరి. తరువాత ఆ గ్రామంలో రాజాగారు క్యాంపు వేసి రైతులతో మాట్లాడి, తమ ఆర్డరును ఉపసంహరించిరి. రైతుల సత్యాగ్రహము విజయవంతమైనది.

## డెల్టా అభివృద్ధి

కానూరి వెంకటాచలపతయ్య (కవుతరం), కామినేని వెంకటరత్నం (రామవరం), వద్దె శోభనాద్రి (యలమర్రు), సూరపనేని వెంకయ్య (వెంట్రప్రగడ), పర్వతనేని బసవశంకరం (పోలుకొండ) మొదలగు జిల్లా రైతు ప్రముఖులు రాజకీయ సమస్యల జోలికి ఎక్కువ పోకుండా, రైతుల యిబ్బందులను గురించి మాత్రమే ప్రత్యేక శ్రద్ధ వహించి, ముఖ్యముగా డెల్టా అభివృద్ధిని గురించి ఎంతగానో కృషిచేసినారు. నీటి లెవెలు విషయములో అవుసరమైనచోట్ల డ్రాపులు కట్టించుట, క్రొత్తగా నీటి పారుదల స్కీములు నేర్పరచి అదనముగా భూమి సాగులోనికి తెప్పించుట, మురుగుకాల్వల అవుసరాన్ని అధికారుల దృష్టికితెచ్చి మురుగు సౌకర్యాలను ఏర్పాటు చేయించుటలో వీరు గణనీయమైన కృషిచేశారు. వీరి నిర్విరామ కృషివల్ల కృష్ణా డెల్టా ఎంతో అభివృద్ధి చెందినది.

## జాతీయోద్యమము - రైతు సంఘాలు

వీరి తర్వాతవచ్చిన రైతునాయకులు జాతీయభావాల ప్రేరితులగుట వల్ల, రైతు సంఘాలుకూడ రాజకీయ వాసనకు లోనైనవి.

గొట్టిపాటి బ్రహ్మయ్య, పిడికిటి రామకోటయ్య, పేట బాపయ్య, కామినేని వెంకటప్పయ్య, కాట్రగడ్డ మధుసూదనరావు, కాకాని వెంకట రత్నం వగైరా కాంగ్రెసు నాయకులు రైతు సంఘాలపై కృషి చేయడము, కాంగ్రెసువారు విధిగా భావించి జిల్లా రైతు సంఘమును రిజిష్టరు చేయించి పనిచేయసాగిరి. రీసెటిల్‌మెంటు ద్వారా శిస్తులు, తీరువాలు పెంచాలని ప్రభుత్వం తలపెట్టినప్పుడు వీరు తీవ్రమైన ప్రతిఘటనలు చేశారు. జమీందారీ రైతుల హక్కుల విషయమై అనేక పోరాటములు సాగించారు. క్రమేణా జాతీయోద్యమాలతోపాటు రైతు వుద్యమముకూడ ప్రధాన సమస్యగా రూపొంది, జాతీయోద్యమములో కలసిపోయినది.

1936లో అఖిలభారత కిసాన్‌సభ ఏర్పాటు అయినది. ఆచార్య యన్. జి. రంగా, ఆచార్య నరేంద్రదేవ్, స్వామి సహజానంద సరస్వతి, ఇందులాల్ యాజ్ఞిక్ మొదలగు రైతు నాయకులవల్ల పై కిసాన్ సభ స్థాపించబడినది. దీనిలో సోషలిస్టుల ప్రభావము ఎక్కువగానుండెను. రాష్ట్ర శాఖలుకూడ ఏర్పడినవి. వాటికి జిల్లా శాఖలుకూడ ఏర్పడినవి. కృష్ణాజిల్లాలో అతివాద గ్రూపుకు చెందిన యువకులు యీ జిల్లా రైతు సంఘములోచేరి పనిచేయసాగిరి. కామినేని వెంకటప్పయ్య అధ్యక్షులుగా, పామిరెడ్డి సుబ్బారావురెడ్డి కార్యదర్శిగా యీ జిల్లా సంఘం చాల కాలం పనిచేసినది. జిల్లా కాంగ్రెసు సంఘాలుకూడ యీ సంఘానికి బాగుగా చేయూతనిచ్చినవి.

## మునగాల రైతు పోరాటము

పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘము మునగాల జమీందారు రైతులపై సాగించు దురాగతాలను ఎదుర్కొని, అప్పటి జిల్లా కాంగ్రెసు సంఘాధ్యక్షులు శ్రీ పేట బాపయ్య, కార్యదర్శి శ్రీ కాకాని వెంకటరత్నం గార్ల నాయకత్వాన, ఆచార్య రంగాగారి సలహా సంప్రదింపులతో కొందరు యువకులతో పరగణా గ్రామాలలో తిరిగి రైతుల తరఫున పనిచేసిరి. జమీందారీ గూండాలు ఎన్నో ఇబ్బందులు పెట్టసాగిరి. అక్కడి రైతులను పురికొల్పి సత్యాగ్రహ ఉద్యమము నడుపబడినది. ఇందులో అతివాద వర్గానికి చెందిన సోషలిస్టు యువకులుకూడ పాల్గొనిరి. ఈ సత్యాగ్రహ

ములో జైలుకు వెళ్ళినవారు శ్రీ నల్లపాటి వెంకటరామనరసయ్య, శ్రీ ఇమ్మడి పాపయ్య, శ్రీ నండూరి ప్రసాదరావు శ్రీ గట్టు గోపాలకృష్ణయ్య, శ్రీ పొన్నలూరి రాధాకృష్ణమూర్తి, శ్రీ ఉప్పల రామయ్య మొదలగువారు కలరు.

మరికొందరు యువకులు రహస్యముగా గ్రామాలలో తిరిగి జమీందారీ దురంతములను సేకరించి రిపోర్టు తయారుచేశారు. ఈ రిపోర్టు తయారు చేసినవారిలో శ్రీ కాకాని వెంకటరత్నం, శ్రీ వంగవేటి అచ్చయ్య, శ్రీ పిన్నమనేని సీతారామయ్య, శ్రీ గొంది కోటేశ్వరరావు, శ్రీ బండి తిరుపతయ్య, శ్రీ ఏజెండ్ల వెంకటసుబ్బయ్య, శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠి, నందిగామ తాలూకా రైతు సంఘ ప్రెశిడెంటు శ్రీ కాపా లక్ష్మీనారాయణ, శ్రీ పొందూరి అనంతరామయ్యగారలు పాల్గొనిరి.

ఈ పోరాటం సందర్భములో సర్వశ్రీ ఇందులాల్ యాజ్ఞిక్, యన్. జి. రంగాగార్లు వచ్చి పరిస్థితులను స్వయంగాచూచి, తగిన సలహాల నిచ్చివెళ్ళిరి. అనంతరం కొణకంచిలో జరిగిన పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు సర్వసభ్య సమావేశంలో ఆ రిపోర్టును ఏకగ్రీవముగా అంగీకరించిరి. రాష్ట్ర కాంగ్రెసు సంఘానికి, ప్రభుత్వానికి ఆ రిపోర్టు పంపబడినది. మద్రాసు ప్రభుత్వంలో రివెన్యూ మంత్రిగావున్న ఆంధ్రకేసరి శ్రీ ప్రకాశంపంతులుగారు స్వయముగా మునగాల వచ్చి, పరిస్థితులను అవగాహన చేసుకొని వెళ్ళినారు.

మునగాల జమీందారుగారు పరిస్థితులను అవగాహనచేసుకొని, పరిస్థితులు చేయిజారిపోతున్నవని గ్రహించి, రాజీవ్యవహారాలకు దిగివారు. అంతట ఉభయపక్షాలు రాష్ట్ర కాంగ్రెసు ప్రధాన కార్యదర్శియైన శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారిని మధ్యవర్తిగావుండి తీర్పు చెప్పమన్నారు. వీరి తీర్పును ఆఖరుతీర్పుగా ఉభయులు అంగీకరించారు. ఈ నిర్ణయమును తీసుకొనుటకు శ్రీ వి. యస్. మూర్తిగారు చొరవ తీసుకున్నారు.

శ్రీ బ్రహ్మయ్యగారు తీర్పు చెప్పిరి. ఈ తీర్పు "బ్రహ్మయ్య అవార్డు"గా వాడుకలోనికి వచ్చినది. ఈ అవార్డును అమలుపర్చుటలో రైతులకు అన్యాయం జరుగకుండా చూచు నిమిత్తం, తన ప్రతినిధిగా బ్రహ్మయ్యగారు శ్రీ ఎర్నేని సుబ్రహ్మణ్యంగారిని నియమించారు. ఈయన రెండు మాసాలు ఆ గ్రామాలన్నీ పర్యటించి తీర్పును అమలు పరిపించారు.

1947లో కాంగ్రెసు ప్రభుత్వాలు అమలులో వున్నప్పుడు మరల మునగాల పరగణాలో రైతుల తిరుగుబాటు విజృంభించినది. బ్రహ్మాయ్య అవార్డు అమలు జరుగనీయకుండా జమీందారు అనేక అవరోధాలు కల్పించినారు. రైతులు తిరుగుబాటు చేయగా పోలీసు కాల్పులుకూడ జరిగినవి. ఈ పరిస్థితులు ప్రభుత్వానికి నివేదించబడినవి. అప్పటి రివెన్యూ మంత్రిగానున్న కీ॥ శే॥ కళా వెంకటరావుగారు స్వయముగా మునగాలకు వచ్చి పరిస్థితులను పరిశీలించారు. బ్రహ్మాయ్య అవార్డు అమలు జరుగుటలేదని, వేలకొలది రైతులువచ్చి మునగాల రహదారి బంగళాలో వారికి నివేదించుకున్నారు. అంతట బ్రహ్మాయ్య అవార్డు సక్రమముగా అమలు జరిగినదీ లేనిదీ పరిశీలించుటకుగాను 21-10-47 న జి. ఓ. నెం. 2457 ప్రకారం ఒక కమిటీని నియమించినారు. ఆ కమిటీకి శ్రీ గొట్టిపాటి బ్రహ్మాయ్య ఛైర్మన్, శ్రీ పేట బాపయ్య, శ్రీ మాకల వీరరాఘవయ్య, శ్రీ వై. వి. కృష్ణారావు, శ్రీ కుందేటి సత్యనారాయణ గారలను సభ్యులుగా నియమించబడిరి. వారు విచారించి 10-1-48 తేదీన రిపోర్టును రివెన్యూ మంత్రిగారికి దాఖలు చేసిరి.

తిరువూరు తాలూకా కొండపర్వ జమీందారు రైతులపై అక్రమంగా కేసులుపెట్టి, వారి భూములు స్వాధీనము చేసుకొంటూ వుండగా జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు పేట బాపయ్య, కార్యదర్శి కాకాని వెంకటరత్నం, జిల్లా రైతుసంఘం అధ్యక్షులు పిడికిటి రామకోటయ్య, కాట్రగడ్డ నారాయణరావు, యమ్. యల్. ఎ., తాలూకా కాంగ్రెసు అధ్యక్షులు కలగర సత్యనారాయణగారలు అక్కడకువెళ్ళి రైతుల తరఫున సత్యాగ్రహము చేసిరి. పేట బాపయ్యగారి పేరుతో కరపత్రములు వేసినందున కోర్టు ధిక్కార కేసుపెట్టి, ఆయనకు జమీందారులు శిక్ష వేయించిరి. బాపయ్యగారు ఒక నెల శిక్ష అనుభవించిరి. జమీందారుచే రైతులపై పెట్టబడిన అక్రమకేసు కోర్టులో కొట్టివేయబడినది. ఆ సందర్భములో రైతులు విజయోత్సవం జరుపుకున్నారు. కొండపర్వాలో రాజాగారి దివాణముకు ఎదురుగా గొప్ప బహిరంగసభ జరిగినది. ఆ సభలో పేట బాపయ్యగారికి సర్దార్ బిరుదు నిచ్చారు.

## కమ్యూనిష్టుల ప్రవేశము - రైతు సంఘ విభజన

ప్రతి సంఘములోను ప్రవేశించి, ఆ సంఘాన్ని తమ స్వాధీనము చేసుకోవడము తమ పాలసీ. ఆ విధముగానే కృష్ణాజిల్లా రైతు సంఘాన్ని తమ హస్తగతము చేసుకోవాలని కమ్యూనిస్టులు ప్రయత్నించారు. దీనిని కాంగ్రెసుకు చెందిన రంగాగారి వర్గము వ్యతిరేకించడము జరిగినది. దానితో కమ్యూనిష్టులు విడిపోయి వేరే రైతు సంఘాన్ని స్థాపించుకున్నారు.

అప్పటినుంచీ రంగాగారి పలుకుబడిలో కృష్ణాజిల్లా రైతుసంఘం పనిచేయసాగినది. గొర్రెపాటి వెంకట సుబ్బయ్య అధ్యక్షులుగా, పామిరెడ్డి సుబ్బారావురెడ్డి కార్యదర్శిగా కొంతకాలం పనిచేసిరి. రైతాంగ విద్యాలయములద్వారా ఎందరో యువకులకు రైతు సమస్యలపై తరిఫీదు నిచ్చి, గణనీయముగా వారిలో చైతన్యం కలుగజేసినది. ఆచార్య రంగాగారి నాయకత్వమున తిరువూరు తాలూకా తునికిపాడులోను, నందిగామ తాలూకా వీరులపాడులోను, విజయవాడ తాలూకా ఈడుప్పగల్లులోను, దివితాలూకా కాజ, చల్లపల్లి, నూజివీడు తాలూకా ఆకిరిపల్లిలోను మరికొన్నిచోట్లను రైతాంగ విద్యాలయములు జరిగినవి. అనేక చోట్ల జిల్లా రైతు మహాసభలుకూడ జరుపబడినవి. అన్ని తాలూకాలలోను, తాలూకా రైతు సంఘాలు ఏర్పడి పనిచేయుచుండినవి. దాదాపు 300 గ్రామ రైతు సంఘాలు ఏర్పడినవి. జిల్లాలో అనేకమంది రైతు సంఘ కార్యకర్తలను రంగాగారు తయారుచేసినారు.

## ప్రకాశం కమిటీ విచారణ

1938లో జమీందారులు - రైతు సమస్యలు విచారణ నిమిత్తము ప్రకాశం కమిటీ వేయబడినప్పుడు ఆ కమిటీ ఎదుట సాక్ష్యమిచ్చినవారిని చంపుతామని జమీందారులు బెదిరించినారు. అయినను లెక్కచేయక, నూజివీడు తాలూకా రైతు సంఘ అధ్యక్షులు పర్వతనేని వెంకట సుబ్బయ్యగారు పూర్తి వివరాలతోసహా యిచ్చి, జమీందారుల అక్రమచర్యలు కమిటీకి నివేదించిరి. వారితోపాటు దాసరి వెంకట సుబ్బయ్య, మాదల వెంకటప్పయ్య, కలకర సత్యనారాయణ, వేంపాటి సుబ్బయ్య వగైరాలు కూడ సాక్ష్యమిచ్చిరి. వీరిపై జమీందారులు కక్షబూని, అనేక విధాల

హింసించిరి. తిరువూరు తాలూకా రైతు సంఘం అధ్యక్షులు కొల్లి బుచ్చయ్యగారు కమిటీ ఎదుట సాక్ష్యమిస్తూ, రికార్డుతోసహా జమీందారుల అక్రమాలను బుజువుచేశారు. ఆ యేరియాలో ఏ గ్రామములో ఏ రైతును ఎలా బాధించుచున్నదీ, ఎంతమంది రైతులు జమీందారీ జులుముకు బలియైపోయినది సవివరంగా ఆధారాలు చూపించి సాక్ష్యమిచ్చిరి. వారితోపాటు శ్రీ మురుకుట్ల వెంకటప్పయ్యకూడ కొందరు రైతులతో సాక్ష్యమిచ్చిరి. తరువాత ఒకనాడు సాయంత్రము కొల్లి బుచ్చయ్యగారు తన అరుగుమీద కూర్చొనివుండగా, జమీందారు రౌడీలనుపంపి, ఆయన కాలు విరుగగొట్టించిరి.

గన్నవరం తాలూక రైతుసంఘ అధ్యక్షులు, జిల్లా రైతు సంఘ కార్యదర్శి అయిన శ్రీ లింగంనేని పెదకుటుంబరావుగారుకూడ జమీందారుల దౌర్జన్యాలు, రైతుల హక్కులగూర్చి సాక్ష్యమిచ్చారు. శ్రీ పాలడుగు నాగభూషణం (ముస్తాబాద) గారుకూడ సాక్ష్యమిచ్చారు.

మునగాల ఎస్టేటులో జరుగు దురాగతాలనుంచి రేపాల బుచ్చి రామశేషయ్య శ్రేష్ఠిగారు, ఇమ్మడి పాపయ్య, నల్లపాటి వెంకటరామ నరసయ్య, బండి తిరుపతయ్యగార్లు అక్కడి రైతులను వెంటబెట్టుకొనివచ్చి వివరాలతో సాక్ష్యమిప్పించారు. ఇలాగే జిల్లాలో పలుచోట్ల రైతుసంఘం తరపున సాక్ష్యాలు యివ్వబడినాయి. జిల్లా రైతు సంఘాధ్యక్షులైన శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్యగారు జిల్లాఅంతకు సంబంధించిన సుదీర్ఘమైన పత్రమును సమర్పించిరి.

## రైతు యాత్ర

ఇదే సమయంలో ఆచార్య రంగాగారి సలహాపై శ్రీకాకుళం మందసానుంచి మద్రాసు వరకు కాలినడకను నడుపబడిన రైతుయాత్రలో యీ జిల్లా రైతు సంఘ కార్యకర్తలుకూడ పాల్గొన్నారు. ఇందు రైతు గీతాలు శ్రావ్యముగాపాడే శ్రీ అట్లూరి అప్పారావుకూడ పాల్గొన్నారు. రాష్ట్ర రైతు సంఘాధ్యక్షులైన శ్రీ కొమ్మారెడ్డి సత్యనారాయణమూర్తి, కార్యదర్శి శ్రీ పుల్లెల శ్యామసుందరరావుగార్ల నాయకత్వములో ఈయాత్ర నడుపబడినది. ఈ దళమునకు మచిలీపట్టణములో రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్ష కార్యదర్శులైన డా॥ పట్టాభి సీతారామయ్య, శ్రీ గొట్టిపాటి

బ్రహ్మయ్యగారలు స్వాగతమిచ్చిరి. ఆనాటి బహిరంగ సభకు పట్టాభి గారు అధ్యక్షత వహించి, రైతు సమస్యలలో కాంగ్రెసు సంఘముకూడ ప్రధాన పాత్రవహించి పనిచేయుచున్నదని నిరూపించారు. శ్రీ బ్రహ్మయ్యగారు రైతు సమస్యలలో తనకున్న గాఢమైన ప్రేమాభిమానాలను బహిరంగసభలోవ్యక్తపరచారు. అనంతరం ఈదళం విజయవాడకుబయలు దేరి వెళ్ళినది. కృష్ణాజిల్లా రైతు సంఘంతరఫున వారికి విజయవాడలో ఘనమైన సన్మానముజరిగినది. ఆనాడు గొప్ప బహిరంగసభ జరుపబడినది. జిల్లా అంతటినుంచి గ్రామ రైతు సంఘాలవారువచ్చి, వారికి విరాళములనిచ్చిరి. ఈ యాత్రాదళము మద్రాసువరకు కాలినడకనువెళ్ళి చారిత్రాత్మకమైన ఒక మెమోరాండమును కాంగ్రెసు ప్రభుత్వానికి సమర్పించినది. ఈ రైతు సంఘాల ఆందోళనయేగాక, కమిటీకి అందిన ప్రత్యక్ష సాక్ష్యాధారాలతో 'ప్రకాశం కమిటీ' జమీందారీల రద్దుకు శిఫారసుచేస్తూ చారిత్రాత్మకమైన రిపోర్టును తయారుచేసినది. ఈ రైతు సంఘాల విజ్ఞప్తులను పురస్కరించుకొనే కాంగ్రెసు ప్రభుత్వము ఋణ విమోచన చట్టాన్నికూడ తీసుకొని వచ్చినది. రైతు ఉద్యమానికి యిది స్వర్ణయుగమని చెప్పవచ్చును. ఈ రిపోర్టు ఆధారంగానే తరువాతవచ్చిన కాంగ్రెసు ప్రభుత్వము జమీందారీలను రద్దు చేసినది. 1948లో జమీందారీరద్దు శాసనమును రివెన్యూమంత్రి శ్రీ కళా వెంకట్రావుగారు మద్రాసు అసెంబ్లీలో ప్రవేశపెట్టినప్పుడు ఆ శాసనము ఏకగ్రీవముగా ఆమోదించబడి చట్టమైనది. దీనితో వేలాది సంవత్సరాలనుంచి పీడించబడే జమీందారీ రైతుల బాధలు అంతరించినవి. ఇది కాంగ్రెసు వేసిన ఒక విప్లవాత్మకమైన ముందడుగు.

## ఫార్వర్డు బ్లాకు

1939లో సుప్రసిద్ధ దేశభక్తుడైన సుభాస్ చంద్రబోసు త్రిపుర కాంగ్రెసుకు అధ్యక్షులుగా ఎన్నుకొనబడినారు. మహాసభలో ఆమోదించబడిన 'పంత్' తీర్మాన ఫలితముగా అఖిలభారత కాంగ్రెసు అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చిరి. 1939 మే నెలలో 'ఫార్వర్డు బ్లాకు'ను స్థాపించిరి. కాంగ్రెసులోనేవుండి, చారిత్రాత్మక విప్లవ పాత్రను నిర్వర్తించుటకు, కొన్ని చారిత్రాత్మక సంఘటనవలన 'ఫార్వర్డు బ్లాకు' యేర్పడినదని

ఆయన ప్రకటించిరి. తన అధ్యక్ష పదవికంటేకూడ కాంగ్రెసు సంస్థ అతివాద సంస్థగా రూపొందించడమే తన ముఖ్య ఆశయము. కాంగ్రెసును విడిచిపెట్టకుండానే, ఈ ఫార్వర్డు బ్లాకు ద్వారా కాంగ్రెసును అతివాదమువైపుకు తీసుకొని వెళ్ళదలచాడు. కొద్దిరోజులలో యుద్ధము రాబోవుచున్నదని, భారత స్వాతంత్ర్యానికి అది మంచి అవకాశమును కలుగజేయగలదని ఆయనకు తెలుసు. కాంగ్రెసు నాయకత్వము బ్రిటిషు ప్రభుత్వముతో ఫెడరల్ రాజ్యాంగ విధానమునకు రాజీ పడకూడదని ఆయన పట్టుదల. అందుకే కాంగ్రెసును యుద్ధవ్యతిరేక ధోరణికి మరల్చాలనే పట్టుదలతో దేశమంతా సంచారముచేసి ప్రచారము చేశాడు. 'ఫార్వర్డు బ్లాకు' పత్రికద్వారా యీ ఆశయమును ప్రబోధించారు. ఆంధ్రలో కూడ ఫార్వర్డు బ్లాకు స్థాపన జరిగినది. దానికి మద్దూరి అన్నపూర్ణయ్య యర్రమిల్లి నరసింహారావుగారలు నాయకులు. కృష్ణాజిల్లాలోకూడ దీని శాఖ యేర్పడినది. శ్రీ పేట బాపయ్య దానికి అధ్యక్షులు. శ్రీ కాకాని వెంకటరత్నం, అన్నే అంజయ్య, పిడికిటి రామకోటయ్య, కాట్రగడ్డ మాధవరావు, ఈమని రాజరత్నశర్మ, మురుకుట్ల వెంకటప్పయ్యగారలు అభిమానులుగా వుండెడివారు.

బోసు అంతర్థానము తర్వాత 1942 మే 18వ తేదీన శ్రీ పేట బాపయ్యగారిని అరెస్టు చేశారు. తెల్లవారుసరికల్లా విజయవాడ వీధులలో అన్ని గోడలపైన స్వాతంత్ర్యయోధుడు సుభాస్‌చంద్రబోసు వర్ధిల్లుగాక అను అక్షరాలుగల వాల్‌పోస్టర్లు ప్రత్యక్షమైనవి. విజయవాడలో సాహసికులైన యువకులు యెందరో శ్రీ పేట బాపయ్యగారి అనుచరులుగా వుండేవారు. వారు నగరమంతా ఒకేరాత్రి యీ వాలుపోస్టర్లు అంటించివేశారు. ఇది శ్రీ బాపయ్యగారి పనేనని ఆ రోజుననే వారిని అరెస్టుచేసి, కన్ననూరు జైలులో డిటెన్యూగ నిర్బంధించిరి. తిరిగి వారిని 1946 లో రాజకీయ ఖైదీలతోపాటు విడుదల చేయకుండా కొంత కాలానికి ఎన్నికల సమయములో విడిచిపెట్టిరి. ఆనాడే అన్నే అంజయ్య, కాకాని వెంకటరత్నం, పేట బాపయ్య, ఈమని రాజరత్నశర్మ, మురుకుట్ల వెంకటప్పయ్యగార్ల ఇండ్లను సోదా చేసిరి.

## జాతీయ కార్మిక సంఘాలు

కాంగ్రెసు ఆదేశానుసారంగా కార్మికుల యోగక్షేమాలను సంరక్షించుటకుగాను అఖిలభారత కాంగ్రెసు ఆదేశానుసారం కృష్ణాజిల్లాలో ఐ. ఎన్. టి. యు. సి. ఏర్పాటు చేయబడినది. 1919లో గాంధీగారు కొత్తపేటలో కార్మిక సమావేశములో ఉపన్యసించిరి. విజయవాడలో శ్రీ మరుపిళ్ళ చిట్టిగారి నాయకత్వాన వివిధరకాల కార్మికులను సమీకరించి వారిదైనందిన కష్టాలను ఎప్పటికప్పుడు విచారించి నివారించుటకు తీవ్రమైన కృషి జరిగినది. మద్రాసు అసెంబ్లీకి శ్రీ చిట్టిగారు కార్మిక నియోజక వర్గమునుండి పోటీచేసిరి.

తరువాత క్రమేణా జిల్లాలో పరిశ్రమలు అభివృద్ధి కావడం, కార్మికుల సంఖ్య ఎక్కువగా పెరగడం జరిగినది. ఈ సంఘాలలో పనిచేసే కాంగ్రెసు కార్యకర్తలకు, కమ్యూనిస్టు కార్యకర్తలకు కార్మిక సంఘాల నిర్మాణంలో పోటీలుకూడ పడవలసివచ్చినది. ప్రస్తుతం కృష్ణాజిల్లాలో బ్రహ్మాండమైన ఐ. ఎన్. టి. యు. సి. ఉద్యమము నిర్మాణమైయున్నది. ఇందు ఉయ్యూరు పంచదార ఫ్యాక్టరీ కార్మికులు, బందరులో ఆంధ్ర సైంటిఫిక్ కంపెనీ కార్మికులు ఆదర్శవంతముగా పనిచేయుచున్నారు. ఇచ్చట కార్మిక సంఘాధ్యక్షులు శ్రీ చొప్పవరపు సుబ్బారావు జిల్లా ఐ. ఎన్. టి. యు. సి. లోకూడ అధ్యక్షులుగా వుండి రాష్ట్ర స్థాయి ఐ. ఎన్. టి. యు. సి. కి ప్రధాన కార్యదర్శిగా కూడ వున్నారు.

ఆర్. టి. సి. కార్మికులలోకూడ ఐ. ఎన్. టి. యు. సి. బలమైన సంస్థగా రూపొందినది. అనేక క్లిష్టసమయాలలో తను హక్కులకు భంగం కలుగనీయకుండా మేనేజిమెంటుతో రాయబారాలు ద్వారా ఒప్పించి సాధించగలిగారు. సమ్మెలు - ధర్నాలు ప్రతిపక్షాలు సాగించే నిరోధక చర్యలు మంచిదికాదని, సంప్రదింపుల ద్వారానే అన్నిపనులు పూర్తిచేసుకోవచ్చుని ఆచరణలో నిరూపించారు. ఇటీవల జరిగిన ఆర్. టి. సి. కార్మిక సంఘం ఎన్నికలలో కృష్ణా డివిజను సంఘం అత్యధిక మెజారిటీతో ఐ. ఎన్. టి. యు. సి. గెల్చుకున్నది. ఎన్నిక చాలాతీవ్ర స్థాయిలో జరిగినది. ఎట్టి గలాటా జరుగకుండా అధికారులు గట్టిఏర్పాట్లు చేశారు.

# ఖాదీ ఉద్యమము

అఖిల భారత చరఖా సంఘానికి అనుబంధముగా ఆంధ్రశాఖ 1930 నాటికే మచిలీపట్టణములో యేర్పడినది. దీనికి అనుబంధముగా జిల్లాలో శాఖలు యేర్పడినవి. ఘంటసాల, పురిటిగడ్డ, ముదునూరు, జమీగొల్వేపల్లి, కానుమోలు, కేసరపల్లి, తిరువూరు, కొణకంచి, వీరులపాడు, జగ్గయ్యపేట వగైరా గ్రామాలలో ఖద్దరు ఉత్పత్తి బాగుగా జరిగెను. విజయవాడ తిలక్ నగర్‌లో కాట్రగడ్డ రఘురామయ్య, పేట బాపయ్య వగైరాలు నడిపిన ఖాదీ ఉత్పత్తి సంఘాన్ని రాష్ట్ర శాఖకు అనుబంధముగా చేర్చ బడినది. 1922లో శ్రీ పేట బాపయ్యగారు ఆంధ్ర కాంగ్రెసు సంఘం ద్వారా ఖాదీ శిక్షణ నిమిత్తం సబర్మతీ ఆశ్రమమునకు పంపబడిరి. వారు అక్కడ కొంత కాలమువుండి శిక్షణ పూర్తిచేసి, విజయవాడలో యీ ఖాదీ ఉత్పత్తి కేంద్రాన్ని, విక్రయశాలను స్థాపించారు. దీనికి అనుబంధముగా జిల్లాలోని ముఖ్యకేంద్రము లన్నింటిలోను శాఖలు యేర్పడినవి. ఆంధ్ర ఖద్దరుకు ఉత్తర భారతములో మంచి గిరాకీ యుండినది. అందు కృష్ణా జిల్లాలో తయారైన ఖద్దరు ఎక్కువగా ఎగుమతి చేయబడుతూ వుండేది.

1920లో తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు తరపున శ్రీ కొటా రామ శాస్త్రిగారి ఆధ్వర్యాన బందరు జాతీయ కళాశాలలో మగ్గములు పెట్టించి, నేత నేర్పించడము ప్రారంభించిరి. అలాగే పురిటిగడ్డలో పరుచూరి లింగయ్యగారి ఆధ్వర్యమున మరొక ఖాదీ ఉత్పత్తి సెంటరు ప్రారంభించ బడినది. అప్పటి జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు గొట్టిపాటి బ్రహ్మయ్య, కార్యదర్శి పట్టాభి సీతారామయ్యగార్లు ప్రత్యేక శ్రద్ధతీసుకొని వీరిని ప్రోత్సహించి జిల్లా కాంగ్రెసునుంచి గ్రాంటుకూడ యిప్పించిరి.

1923లో "శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు ఖద్దరు ఉత్పత్తి సంస్థ" అను పేరుతో ఘంటసాలలో ఒక ఖాదీ ఉత్పత్తి విక్రయ సంస్థను శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి అధ్యక్షతను స్థాపించబడెను. కార్యవర్గ సభ్యులుగా శ్రీ గొర్రెపాటి నరసింహం (తండ్రి కోటయ్య), శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య (తండ్రి వెంకన్న), శ్రీ వేమూరి నాగయ్య (తండ్రి బ్రహ్మయ్య) శ్రీ వేమూరి సీతారామయ్య (తండ్రి గోపాలుడు), శ్రీ వేమూరి వెంకట రత్నం (తండ్రి సుబ్బయ్య) గార్లు ఎన్నుకొనబడిరి. వీరు

ఎవరివల్ల ఆర్థిక సహాయం పొందకుండా, వీరే స్వంతముగా అవసరమైన పెట్టుబడి పెట్టి, లాభమును ఆశించకుండా తయారయిన ధరకు విక్రయించే వారు. ఖర్చుల నిమిత్తం రూపాయకు ఒక అణావంతున వసూలుచేసే వారు. 1929 వరకు యీ సంస్థ బాగుగా పనిచేసినది. ఆనాటికి లెక్కలు చూడగా రు 200 లు లాభము మిగిలినది. ఈ మొత్తము ఘంటసాల రామమోహన గ్రంథాలయమునకు యివ్వడం జరిగినది.

అనంతరం యీ సంస్థకు శ్రీ కొడాలి నరసింహంగారు (కొడాలి) కొంతకాలము నడిపినారు. ఆ తరువాత వేమూరి పేరయ్యగారు మరి కొంతకాలము నడిపినారు. ఇప్పుడు శ్రీ వేమూరి పేరయ్య, శ్రీ గొర్రెపాటి సీతారామయ్యగార్లు వేరువేరుగా ఖద్దరు వ్యాపారము చేస్తూనే వున్నారు. శ్రీ పావులూరు సుబ్బయ్యగారుకూడ యీ ఖద్దరు ప్రచారము బాగుగా చేశారు. కనిగిరినుంచి దూది తెప్పించి, స్థానిక మహమ్మదీయులతో యేకించి, స్త్రీలతో ఏకులు చేయించి, గ్రామాలవెంట తిరిగి, రాట్నములను స్థాపించి, వారికి యీ ఏకులుయిచ్చి, వడికిన నూలు సేకరించేవారు. ఘంటసాలలో బట్టలను నేయించేవారు. ఘంటసాలలో నేయించిన ఖద్దరు మన్నికలో మంచి పేరుపొందినది. డా॥ పట్టాభి సీతారామయ్యగారి ద్వారా శ్రీ వల్లభాయ్ పటేల్‌గారికి ప్రతి సంవత్సరం బట్టలు పంపుతూ వుండేవారు.

పురిటిగడ్డలో పరుచూరి లింగయ్యగారు ఖాదీ ఉత్పత్తి విక్రయ సంఘాన్ని 1920లో స్థాపించారు. పురిటిగడ్డ ఖాదీ చాల ప్రసిద్ధి చెందినది. సన్న ఖద్దరు వస్త్రాలు ఇక్కడ బాగుగా తయారు అయ్యేవి. మంచి మన్నికగాకూడ వుండేవి. ఉత్తర భారతంలో పురిటిగడ్డ ఖద్దరుకు మంచి పేరువుండేది. చాలామంది కాంగ్రెసు నాయకులు యీ ఖాదీనేకోరుతూ వుండేవారు. గాంధీగారుకూడ యీ ఖాదీ సెంటరును దర్శించి, వీరిని ప్రశంసించిరి. శ్రీ పరుచూరి లింగయ్యగారి కుమారులు యిప్పటికీ ఆ నాణ్యతకు లోటులేకుండా యీ గ్రామంలో యీ ఖద్దరు ఉత్పత్తి సంస్థను నడుపుచునేయున్నారు.

ఇదిగాక 1958లో "ది జ్ఞానోదయా ఖాదీ సహకార సంఘము"ను స్థాపించి ఖద్దరు ఉత్పత్తిచేస్తూ, విక్రయించుచు పనిచేయుచునే యున్నది.

మంచి లాభములుకూడ గడించినది. దీనికి ఒక స్వంత భవనముకూడకలదు. ఇది చేనేత కార్మికులచే నడుపబడుచున్న సంస్థ. దీనికి అనుబంధముగా దంపుడు బియ్యం పరిశ్రమకూడ నడుపబడుచున్నది.

## తూర్పు కృష్ణా జిల్లా ఖద్దరు విక్రయ సంస్థ

శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య అధ్యక్షులుగాను, శ్రీ పట్టాభి సీతా రామయ్యగారు కార్యదర్శిగారు, శ్రీ ముట్నూరి కృష్ణారావు, శ్రీ చెరుకు వాడ నరసింహం, శ్రీ గడియారం సాబ్బయ్యగార్లు ఒక ఖద్దరు విక్రయ సంస్థను మచిలీపట్టణములో స్థాపించినారు. వీరు 5 గురు జమ్నాలాలు బజాజుగారికి ప్రోనోటు వ్రాసిరు 7000 లు అప్పుతెచ్చి పట్టాభిగారి యింట్లో ఆఫీసుపెట్టి ఖాదీ క్రయ విక్రయాలు సాగించినారు. ఈ సంస్థ 1923 నుంచి 1929 వరకు నడిచినది. పురిటిగడ్డ, ఘంటసాల, అంగలూరు, పెంజెండ్ర, పసుముర్రు, గుడివాడ, కవుతరం, బందరు వగైరా గ్రామాలలో తయారు అయ్యే ఖద్దరు కొని అమ్మేవారు. 1926లో గాంధీగారు ఖద్దరు ప్రచారనిమిత్తము యీ జిల్లాకు వచ్చినప్పుడు బందరులో స్థాపించిన ఆంధ్ర ఖద్దరు శాఖకు యీ సంస్థను అనుబంధముగా చేర్చడము జరిగినది. అనాటికి లెక్కలు చూడగా మిగిలిన రెండువందలు ఖాదీ సంస్థకు అప్పగించడము జరిగినది. బజాజుగారి బాకీ తీర్మానము చేయబడినది.

విజయవాడలో శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు అధ్యక్షులుగాను, శ్రీ అద్దేపల్లి వెంకట గురునాధ రామశేషయ్యగారు కార్యదర్శిగాను, శ్రీ ఘంటసాల సీతారామశర్మ, శ్రీ ధన్వాడ రామచంద్రరావు, శ్రీ దాసు నారాయణగార్లతో 1923లో ఒక ఖద్దరు సంస్థ స్థాపించబడినది. వీరందరు జమ్నాలాల్ బజాజుగారివద్ద రు 7000 నోటు వ్రాసితెచ్చి సంస్థను నడుపుచుండిరి. జగ్గయ్యపేట, కానుమోలు, ముదునూరు, కేసరపల్లి, నెప్పల్లె గ్రామాలలో తయారు అయ్యే ఖద్దరును కొని, విక్రయించుచుండేవారు. 1929లో యేర్పడిన ఆంధ్రచరఖాసంఘం శాఖకు దానిని వప్పగించినారు. ఈ సంస్థకు రు 1500 లు నష్టము వచ్చినది. దానిని చందాల రూపములో వసూలుపర్చి శ్రీ కాళేశ్వరరావుగారు బజాజుగారి బాకీ తీర్చివేసిరి.

నెప్పల్లె గ్రామములో శ్రీ దేవినేని మాధవరావుగారు ఒక ఖద్దరు ఉత్పత్తి కేంద్రమును స్థాపించి, తన యావజ్జీవితము దానికై వినియోగం

చుచున్నారు. ముదునూరులో శ్రీ నాదెళ్ళ వెంకటప్పయ్య, జబర్లపూడిలో కొడాలి సుబ్బయ్య (ఏకుల సుబ్బయ్య), కురుమద్దాలిలో శ్రీ పిన్నమనేని వీరయ్యగార్లు యీ ఖద్దరు ఉత్పత్తి విషయములో ఎక్కువగా కృషి చేసినారు. వీరందరు మెట్ట ప్రాంతాలనుంచి దూదిని తెప్పించి, స్థానిక మహమ్మదీయులచే ఏకించి, స్థానిక స్త్రీలకు కొద్ది వేతనము యిచ్చి ఏకులు చేయించి, వీటిని గ్రామాలలో రాట్నములున్నవారికల్లా యిచ్చి, వారితో వడికించెడివారు. వడకినందుకు వారికి కొంత మజూరి యిచ్చేవారు. తరువాత ఆ నూలు అంతా వారే సేకరించి, మగ్గములపై గుడ్డలను నేయించి, ఎగుమతి చేస్తూవుండేవారు.

కానుమోలులో కంబళ్ళు నేసే కులస్థులు చాలామంది కలరు. శ్రీ నూకల రామస్వామిగారు, వారి కొడుకు కంబళ్ళ ఉత్పత్తి సహకార సంఘమును స్థాపించి, మేలురకము ఉన్నిని సంపాదించి, దానితో కంబళ్ళను నేయించేవారు. కానుమోలు కంబళ్ళు మంచి ప్రసిద్ధికలవి. హనుమాను జంక్షనులో షాపుపెట్టి చిల్లరగా అమ్ముతూ ఇతర ప్రాంతాలకు ఎగుమతి కూడ చేసేవారు. శ్రీ రామస్వామిగారు గ్రామస్థుల సహకారముతో ఖాదీ సంస్థను స్థాపించి, లాభనష్టాలతో నిమిత్తం లేకుండా, మంచి ఖద్దరును తయారు చేయించి అమ్ముతూవుండేవారు. వారు బ్రతికినంత కాలము ఆ సంస్థను నడుపుతూనే వున్నారు.

జగ్గయ్యపేటలో శ్రీ వాసిరెడ్డి దుర్గాసదాశివేశ్వరప్రసాద్, శ్రీ సాధు రామకృష్ణయ్య వగైరాలు ఒక ఖద్దరు సంస్థను స్థాపించారు. జగ్గయ్యపేట పట్టు పరిశ్రమకు ప్రసిద్ధి. ఇక్కడ చేనేతవారు ఎక్కువగా ఈ పరిశ్రమ మీద ఆధారపడియున్నారు. వారికి తగిన సౌకర్యములు కల్పిస్తూ, పట్టు పరిశ్రమను, ఖాదీపరిశ్రమను వృద్ధిచేసి, ఎక్కువవ్యాప్తిలోనికి తెచ్చినారు.

ఖాదీ శిక్షణ పొందిన లింగగిరి రాములు, కొమరగిరి వెంకటప్పా రావుగార్లు గ్రామాలవెంట తిరిగి మిషనుపై ఏకులుచేసే పద్ధతిని నేర్పెడివారు.

కాటూరునుండి శ్రీ నాదెళ్ళ కుటుంబయ్య, శ్రీ నార్ల సీతారామయ్య గార్లు ఖద్దరును మూటలతో గ్రామాలవెంట తిరిగి అమ్ముతూ వుండేవారు. వీరేగాక, యింకా ఎంతోమంది ఖద్దరు ప్రచారకులు జైళ్ళ కార్యక్రమానికి వెళ్ళకూడదని పై నాయకులతో ఆదేశింపబడి, వారి యావజ్జీవితములు

ఖద్దరు ప్రచారమునకు వినియోగించారు. వారి పేర్లు ప్రకటించుటకు సరియైన సమాచారము అందనందున వ్రాయజాలక పోయినందుకు విచార పడుచున్నాము.

## మహిళాభ్యుదయం

కాంగ్రెసు నిర్మాణ కార్యక్రమ ఆదర్శ ప్రకారం, మహిళా సమాజాలుకూడ ఏర్పాటు కాబడి కృష్ణాజిల్లాలో మహిళాభ్యుదయానికి విశేషంగా తోడ్పడినవి. శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారి ఆధ్వర్యములో ఒక మహిళా సంఘం యేర్పడి, స్త్రీల శిక్షణ శిబిరములు యేర్పాటు చేయబడి, గాంధీజీ ఆశయములను వారికి ప్రబోధించడం జరిగినది. వీరికి సహాయకులుగా గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మ, కొత్రపాటి అంకమ్మ, ఈడ్పుగంటి బాపమ్మ, వాసిరెడ్డి హనుమాయమ్మ, సూర్యదేవర అన్నపూర్ణమ్మ, కొల్లిపర లక్ష్మీకాంతమ్మ, కాట్రగడ్డ రామసీతమ్మ మొదలగు అనేకమంది మహిళలు నిర్మాణ కార్యక్రమ ప్రచారమునుచేసిరి. శ్రీమతి కొమర్రాజు అచ్చమాంబగారి అధ్యక్షతన జిల్లా మహిళా మహాసభ పామర్రులో జరిగినది. సీతామహాలక్ష్మమ్మ ఆహ్వాన సంఘం అధ్యక్షులుగ మంచి ఏర్పాట్లుచేసిరి. ఈ సభలో శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ గారిని జిల్లా మహిళాధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా శ్రీమతి మానికొండ సూర్యావతిగారిని ఎన్నుకున్నారు.

వీరేగాక వీరి తర్వాత వచ్చిన నాదెళ్ళ నాంచారమ్మ, వీరమాచనేని సీతమ్మ, యార్లగడ్డ రత్తమ్మ, వెనిగళ్ళ లక్ష్మమ్మ, పాలడుగు వరలక్ష్మమ్మ, నాదెళ్ళ మహాలక్ష్మమ్మ, పెరంబుదూరు సుభద్రమ్మ, ఈడ్పుగంటి రత్న మాంబ, మద్దాలి వెంకట సుబ్బమ్మ, మద్దినేని అన్నపూర్ణమ్మ మొదలగు నారీమణులు స్త్రీ జనాభ్యుదయానికై గ్రామాలలో విరివిగా ప్రచారము చేయుచుండిరి.

కాలక్రమేణా రాజకీయ పార్టీల ప్రభావంవలన మహిళా ఉద్యమం కూడ విభేదాలకు లోనైనది. వివిధ పార్టీలు తమకు అనుకూలమైన మహిళా సంఘములు పెట్టుకొని పనిచేయుచుండిరి.

గుడివాడలో శ్రీమతి యీడ్పుగంటి బాపమ్మగారు మహిళామండలి స్థాపించి భారత సేవక్ సమాజ్ సహకారంతోను, ప్రజల సహకారంతో

నుంచి బిల్డింగును కట్టించిరి. అందు స్త్రీలకు కుటీర పరిశ్రమల శిక్షణ, గ్రంథాలయము, చిన్నపిల్లలకు బాలవిద్యాలయము స్థాపించి పనిచేయు చున్నారు.

పైన తెల్పబడిన వివిధ సంఘాల శాఖలు కృష్ణాజిల్లాలో యేర్పాటు కాబడినవి. ఈ సంఘాలన్నీ వివిధ వర్గాలలో చైతన్యం కలుగజేసి అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెసుకు అండగా సమకూర్చి, కాంగ్రెసును బలవత్తర మైన జాతీయ సంస్థగా రూపొందించడమే తమ ఆశయంగా పెట్టుకున్నవి. అందుచేత యీ సంస్థలన్నీ కాంగ్రెసు లోపలనేవుంటూ కాంగ్రెసు ఆశయములకు విఘాతములు కలుగనిరీతిగా పనిచేయసాగినవి.

21-5-1937 తేదీన తూర్పు కృష్ణాజిల్లా రాజకీయ మహాసభ పామర్రులో జరుపబడినది. జెండా ప్రతిష్ఠాపన అయ్యదేవర కాళేశ్వరరావు గారు చేసిరి. శ్రీ కాట్రగడ్డ నారాయణరావు, యమ్. యల్. ఎ. గారు సభను ప్రారంభించిరి. ప్రభుత్వ కార్మిక నాయకులు శ్రీ వి. వి. గిరి, యమ్. యల్. ఎ. గారు అధ్యక్షత వహించిరి. తూర్పు కృష్ణా జిల్లాలోని యువ కార్యకర్తలు విశేషంగా సభలో పాల్గొనిరి. శ్రీ వల్లభనేని రామ బ్రహ్మంగారు ఆహ్వాన సంఘాధ్యక్షులుగా గొప్ప ఏర్పాట్లు చేసిరి. విశాలమైన పందిళ్ళు వంటశాలలు వేయించి, భోజన సదుపాయాలు పెద్ద ఎత్తున చేయించినారు.

సభలో అతివాద - మితవాద వర్గాలమధ్య తీవ్ర వాదోపవాదములు జరిగినవి. సభాధ్యక్షులు శ్రీ వి. వి. గిరి, శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగార్ల చాకచక్యమువల్ల అందరను సమన్వయపరచి ఏకగ్రీవముగా తీర్మానములు చేయించడము జరిగినది.

అదే వేదికపైన కృష్ణాజిల్లా మహిళాసభ జరిగినది. డా॥ కొమర్రాజు అచ్చమాంబగారు అధ్యక్షత వహించిరి. శ్రీమతి యస్. సుభద్రమ్మగారు సభను ప్రారంభించిరి. చాలా దూరప్రాంతములనుంచి స్త్రీలు విశేషంగా వచ్చి సభలో పాల్గొనిరి. సభానంతరం శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ గారిని అధ్యక్షులుగాను, శ్రీమతి మానికొండ సూర్యావతిగారిని కార్యదర్శి గాను ఎన్నుకుని జిల్లా మహిళా మండలిని స్థాపించినారు. వీరు అనేక గ్రామములు కాలినడకను తిరిగి సభ్యులను చేర్పించి సంఘమును పటిష్టము గావించారు.

1938 ఏప్రిల్ 20వ తేదీన మరల జిల్లా మహిళాసభలు కొమరవోలు ఆశ్రమములో జరిగినవి. జిల్లా నలుమూలలనుండి స్త్రీలు విశేషముగావచ్చి పాల్గొన్నారు. శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారిని తిరిగి అధ్యక్షులుగా జిల్లా సంఘానికి ఎన్నుకున్నారు. శ్రీమతి చంద్ర సావిత్రీ దేవిగారిని కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఈ సంఘం గ్రామాలలో స్త్రీ హక్కులను గురించి బాగా ప్రచారం చేసింది.

1938లో కాంగ్రెసు ప్రభుత్వాలు ఏర్పడిన అనంతరం 39లో జిల్లా బోర్డు ఎన్నికలు జరిగినవి. తూర్పు, పశ్చిమ కృష్ణాజిల్లాలు తమ అభ్యర్థులను నిలబెట్టి బోర్డులో మంచి మెజారిటీ సంపాదించినవి. జిల్లాబోర్డు అధ్యక్షులుగా శ్రీ కోలపల్లి లక్ష్మయ్యనాయుడుగారిని రాష్ట్ర కాంగ్రెసు సంఘము ఎన్నిక చేసినది. అయినా క్రమశిక్షణతో పార్టీ అంగీకరించినది. శ్రీ చల్లపల్లి రాజాగారి పార్టీ మైనారిటీలో వుండి కాంగ్రెసులో చీలికలు కలుగజేయడం మొదలుపెట్టినది. ఒక సంవత్సరం అనంతరం కాంగ్రెసు ఆశయాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నందున అధ్యక్షునిపై పార్టీ అవిశ్వాసం తెలిపినది. అంతట చల్లపల్లివారితో కలిసి కాంగ్రెసుకు విరుద్ధముగా తన నడకను అధ్యక్షులు సాగించదలిచినారు. కాంగ్రెసుపార్టీ సభ్యులు క్రమశిక్షణతో ఐక్యముగావుండి దీనిని ప్రతిఘటించారు. మైనారిటీలోవుండి పని చేయజాలనందున పరిపాలన స్థంభించిపోయినది. చివరకు ప్రజా శ్రేయస్సుదృష్ట్యా ప్రభుత్వం బోర్డును రద్దుపరచినది.

## కృష్ణా జిల్లాలో గాంధీగారి సంచార వివరము

1917లో గాంధీగారు మద్రాసు వచ్చిరి. కాంగ్రెసు లీగు తయారు చేసిన రాజ్యాంగ సంస్కరణ ప్రణాళికపై సంతకము చేయించి మాంటేగుకు పంపవలెనని నిర్ణయించిరి. ఈ సంతకములు 1917 నవంబరు 10 తేదీ కల్లా పంపవలసినదిగా కోరిరి. కృష్ణాజిల్లా తరఫున ఈ బాధ్యత పట్టాభి సీతారామయ్యగారికి అప్పగించబడినది. అనంతరం మద్రాసు నుంచి ఢిల్లీ వెళ్ళుతూ, గాంధీగారు విజయవాడ స్టేషనులో ఆగిరి. వారితోపాటు డా॥ పట్టాభిగారుకూడ ఉండిరి. స్టేషనులో దాసు మధుసూదనరావు, అయ్యదేవర కాళేశ్వరరావు మొదలగు పురప్రముఖులు వారికి స్వాగతమిచ్చిరి. స్టేషనులోనే అమర్చిన వేదికపైనుంచి తన సందేశము యిచ్చి ఢిల్లీకి వెళ్ళిపోయిరి. కృష్ణాజిల్లాలో గాంధీగారి ప్రథమ దర్శనమిదే.

1919 మార్చి 18వ తేదీన మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలకు ఎదురుగా సముద్రతీరాన పెద్ద బహిరంగసభ జరిగినది. గాంధీగారు రౌలట్ చట్టాన్ని విమర్శిస్తూ పెద్ద ఉపన్యాసము చేశారు. కృష్ణాజిల్లా తరపున కాశీనాధుని నాగేశ్వరరావు, పురాణం నాగభూషణం, అయ్యదేవర కాళేశ్వర రావుగార్లు ఈ సభలో పాల్గొన్నారు. మార్చి 31న గాంధీగారు విజయ వాడ వచ్చిరి. రామమోహన గ్రంథాలయములో సభ జరిగినది. కృష్ణా మండల రైతుల తరపున స్వాగత పత్రం సమర్పించబడినది. జమీందార్ల అక్రమ చర్యలు గురించి ఒక మెమోరాండముకూడ సమర్పించబడినది. ఆనాడు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారి యింట బసచేసిరి. ఆ రాత్రి బయలుదేరి వెళ్ళిపోయిరి.

1920 ఆగస్టు 23న మహాత్మాగాంధి ఆయనతోపాటు మౌలానా షౌకతాలీ విజయవాడ విచ్చేసిరి. ఉదయము కొత్తపేటలో కార్మిక సభ జరిగినది. సాయంత్రం 5 గంటలకు చర్చివద్ద బహిరంగసభ జరిగినది. ఆ రాత్రి బొంబాయికి వెళ్ళిపోయిరి. కాళేశ్వరరావుగారి ఇంట్లో బసచేసిరి.

కృష్ణాజిల్లానుండి మద్రాసు శాసనసభకు జాతీయవాదుల తరపున అభ్యర్థులుగా నిర్ణయింపబడి ప్రచారము చేసుకొనుచున్న శ్రీ కాళేశ్వర రావు, శ్రీ కానూరు వెంకటాచలపతయ్యగార్లు తమ అభ్యర్థిత్వములను వదులుకొన్నట్లు మహాత్ముని సన్నిధిని ప్రకటించారు. ఇందుకు వారిని గాంధీగారు అభినందించినారు.

1936 సంవత్సరం మార్చిలో గాంధీమహాత్మాకు 'జై' అనుచూ నందిగామలో రాత్రి 9 గంటలకు నినాదములిచ్చుచూ జాతీయ గీతములు పాడుచూ నాటకము చూచుటకు వెళ్ళుచుండగా యీ ఉగువవారలను నందిగాము పోలీసులు సర్కిల్ ఇన్‌స్పెక్టరుగారు అందరినీ అరెస్టుచేసి సబ్ జైలులో పెట్టినారు. ఆ విషయము జాతీయవాదియగు సుంకర నరసిం హయ్యగారు తెలుసుకొని అందరికి జామీను యిస్తాను వదిలివేయవలసినదిగా కోరగా శ్రేష్ఠి, శర్మలు తప్ప మిగతావారందరు జామీనుపై విడుదలైనారు. తెల్లవారినతరువాత విడుదలగాబడిన వారందరినీ కోర్టుకు హాజరుపరచి మహాత్మాగాంధీకి 'జై' అన్నందుకు న్యూసెన్సు కేసుపెట్టి ఒక మనిషికి ఒక రూపాయి జరిమానా విధించిరి. దరిమిలా రేపాల బుచ్చిరామ

శేషయ్యశ్రేష్టి, అనుముల రామగోవిందశర్మలను కోర్టుకు హాజరుపరచినారు. మహాత్మాగాంధీకి 'జై' అనుట న్యూసెన్సు కాదని, మేము న్యూసెన్సు చేయలేదని డిఫెన్సుపెట్టినారు. ఈ కేసుతో విజయవాడ వాస్తవ్యులు శ్రీ కోడూరు లక్ష్మీపతిగారు, నందిగామ తాలూకా వేములపల్లి వాస్తవ్యులు శ్రీ భండారు వీర రాజేశ్వరరావుగారు న్యాయవాదులుగా ఉచితముగా పనిచేసిరి. అందుపై షుమారు 3 మాసములు వాయిదాలకు తిరిగినారు. జాతీయ వాదులైన ఇరువురు ప్లీడర్లు ఉచితముగా కేసు నడిపినారు. ఉత్తర సాక్షులు రామిరెడ్డిపల్లి మునసబుగారు, బండిపాలెం బండి ఎల్లమందయ్యగార్లు న్యూసెన్సు చేయలేదని సాక్ష్యం చెప్పినందున కేసు కొట్టివేసినారు. ఈ కేసు జరుగుచున్న రోజులలో మద్రాసు రాష్ట్ర శాసన సభ్యురాలైన శ్రీమతి ఆచంట రుక్మిణీపతి శాసనసభలో మహాత్మాగాంధీకి 'జై' అన్నందుకు న్యూసెన్సు గలదా? అని ప్రభుత్వ విధానముగురించి విపులముగా విమర్శించినారు.

న్యూఢిల్లీలోని ఒక ఇంగ్లీషు పత్రిక సంపాదకీయములో మహాత్మాగాంధీకి 'జై' అన్నందుకు న్యూసెన్సు కేసుపెట్టిన నందిగామ సర్కిల్ ఇన్స్పెక్టరుగారిని ఒక మ్యూజియంలోవుంచితే బాగుండేది అనివ్రాసినారట.

## అరెస్టు అయినవార్ల పేర్లు

1. శ్రీ అనుముల రామగోవిందశర్మ - కొణకంచి
2. శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్టి - బండిపాలెం
3. శ్రీ జవ్వాజి సత్యనారాయణ - బండిపాలెం
4. శ్రీ పొందూరి సోమయ్య - బండిపాలెం
5. శ్రీ బచ్చు రాములు - బండిపాలెం
6. శ్రీ కోయ రంగనాయకులు - కొణకంచి
7. శ్రీ ముగతా హనుమయ్య - కొణకంచి
8. శ్రీ తుమ్మేపల్లి బ్రహ్మయ్య - కొణకంచి
9. శ్రీ చలువాది సుబ్బయ్య - కొణకంచి
10. శ్రీ నెట్టెం సీతారామయ్య - కొణకంచి
11. శ్రీ శివకోటి వెంకట గురునాథం - కొణకంచి

1921 మార్చి 31న విజయవాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెసు సభకు (ఎ. ఐ. సి. సి.) గాంధీగారు వారితోపాటు అనేకమంది దేశనాయకులు విచ్చేసిరి. ఆ సభలు 3 రోజులు జరిగినవి. (ఈ సభలు వివరం వేరే యివ్వబడినవి).

1921 ఏప్రిల్ 4న గాంధిగారు కారులో మచిలీపట్నం విచ్చేసిరి. ఆ రోజున వారికి మౌన వ్రతము. పట్టణమంతా శోభాయమానముగా అలంకరించిరి. మౌన వ్రతములో వున్నప్పటికీ గాంధీగారిని బజార్లుఅన్నీ త్రిప్పి ఊరేగింపుతో ఆంధ్ర జాతీయ కళాశాలకు తీసుకొనివెళ్ళిరి. అక్కడ వారికి బస ఏర్పాటుచేయబడినది. పురపాలక సంఘం స్వాగత పత్రము సమర్పించినది. మౌనముతో గాంధీగారు స్వీకరించిరి.

బెజవాడనుంచి బందరు పోవుదారిలో వుయ్యూరు ప్రజల కోరికపై కొంచెంసేపు ఆగిరి. గ్రామ ప్రజలందరు కొంచెంసేపు దర్శించి, తిలక్ స్వరాజ్య నిధికి 100 రూపాయలు విరాళ మొసంగిరి. పామర్రులోకూడ 10 నిముషములు ఆగిరి. పంచాయతీ తరపున తుర్లపాటి శేషాచలంగారు స్వాగతపత్రం చదివి సమర్పించిరి. తిలక్ స్వరాజ్యనిధికి 100 రూపాయలు విరాళ మొసంగిరి. వీరితోపాటు డా॥ పట్టాభి సీతారామయ్య, ముట్నూరు కృష్ణారావుగార్లుకూడ ప్రయాణంచేసిరి. మరియు కస్తూరిబాయి గాంధి, మహాదేవ దేశాయ్‌గార్లుకూడ వుండిరి. ఆ రోజంతా మౌనంతో విశ్రాంతి తీసుకున్నారు.

మరునాడు బందరు వర్తక సంఘంవారు వినతిపత్రము సమర్పించిరి. బందరు న్యాయవాదుల సభలో సంభాషించిరి. వారిని వృత్తి వదులుకోవలసినదిగా గాంధగారు కోరిరి. వారు అంగీకరించలేదు. ఒక న్యాయవాది విచిత్ర సంభాషణకు గాంధిగారు నొచ్చుకున్నారు.

ఏప్రిల్ 6న గాంధి దంపతులు డా॥ పట్టాభిగారితో కలిసి కవుతరం విచ్చేసిరి. గ్రామమంతా శోభాయమానముగా అలంకరించబడినది. 116 రూపాయలు ప్రజలు విరాళ మొసంగిరి. శ్రీ కానూరు చినవెంకట దాసయ్యగారు తాను స్వయంగా 1116 రూపాయలు యిచ్చుటకు వాగ్దానము చేసిరి. తర్వాత వారు అంగలూరు గ్రామము చేరిరి. అక్కడ పనిచేస్తున్న 800 ల రాట్నములను, 25 మగ్గములనుచూచి ఆ ఉదయము

గుడివాడచేరిరి. గుడివాడలో పూలదండ వేసిన ప్రతివారు 70 రూపాయలు తిలక్ నిధికిఇచ్చే ఏర్పాటు కార్యకర్తలు చేశారు. గూడూరు రామచంద్రుడుగారు స్థాపించిన హరిజన సేవాశ్రమును గాంధిగారు ప్రారంభించిరి. ఈ సంచార సందర్భంలో వసూలయిన నిధులు :— విజయవాడ రు 2812-6-9 పైసలు, బందరులో రు 7372-6-0 పైసలు.

## ఖ ద్ద రు ప్ర చా ర ం

1929 ఏప్రిల్ 8న గాంధిగారు తన పరివారముతో బోనకల్లులోదిగి జయంతిపురమునకు విచ్చేసిరి. వారికి బసఏర్పాట్లు శ్రీ రాజా వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాదుగారు తన యింటివద్ద ఏర్పాటు చేసిరి. రైలు దిగి వెళ్ళేదారిలో ప్రతిచోట ఆపి ప్రజలు స్వాగతమిచ్చారు. లింగాల గ్రామస్థులు రు 20 లు, మొక్కపేట గ్రామస్థులు రు 40 లు ఖద్దరు నిధికి విరాళమిచ్చిరి. ఆరోజు జయంతిపురం రాజాగారికి అతిధిగా వున్నారు.

మరునాడు జగ్గయ్యపేటలో బహిరంగసభ జరిగినది. స్వదేశీ వుద్యమముగురించి, ఖద్దరుఉత్పత్తిగురించి గాంధిగారు గంభీరమైన ఉపన్యాసమిచ్చిరి. ఆ సభలో జయంతిపురం రాజాగారు రు 500 లు, మునగాల రాజాగారు రు 1500 లు, జగ్గయ్యపేట పౌరులు రు 516 లు ఖద్దరు నిధికి విరాళములు సమర్పించినారు.

సభానంతరం నందిగామ వెళుతూ త్రోవలో గౌరవరం గ్రామస్థులు ఆపి, రు 100 లు విరాళమిచ్చినారు. తరువాత కొణకంచి అడ్డరోడ్డువద్ద అనుమల రామగోవిందశర్మగారి నాయకత్వంలో ప్రజలు ఆపి పూలదండలు సమర్పించిరి. గ్రామ కాంగ్రెసు తరఫున రామగోవిందశర్మగారు వినతిపత్రం సమర్పించినారు. గ్రామస్థుల తరఫున రు 116 లు ఖద్దరు నిధికి సమర్పించారు. అనంతరం నందిగామచేరి రహదారి బంగళాకు ఎదురుగా వున్న తోపులో బహిరంగసభ జరిపినారు. గాంధిగారు ఉపన్యసించిన అనంతరం, వాసిరెడ్డి రామనాధంగారు రు 500 లు, అయ్యదేవర బాల త్రిపురసుందరమ్మగారు తన చేతి గాజులను, బసవలింగయ్యగారి భార్య, మంకర నరసింహంగారి భార్య చెరియొక గాజులజత ఖద్దరు నిధికి సమర్పించినారు. చతుర్వేదుల అన్నపూర్ణమ్మ, యడవల్లి సీతారామమ్మగార్లు

చెరియొక పావువవర్సు బంగారము సమర్పించినారు. ఆ రాత్రి నందిగామ రహదారి బంగళాలో మకాంచేసినారు.

మరునాడు ఉదయం విజయవాడ 9 గంటలకు చేరినారు. దారిలో గుంటుపల్లి ప్రజలు ఆపి దర్శనం చేసుకుని రు 116లు విరాళం సమర్పించిరి. ఇబ్రహీం పట్నంవద్ద శ్రీమతి మల్లెల రత్తమ్మగారి నాయకత్వమున ఆపి సన్మాన పత్రము సమర్పించి, రు 500 లు ఖద్దరు నిధికి సమర్పించినారు. అనంతరం విజయవాడచేరి కాశీనాధుని నాగేశ్వరరావుగారి ఇంట బసచేసిరి.

ఆ సాయంత్రం నూజివీడు చేరిరి. గొప్ప బహిరంగసభ జరిగినది. ఛానువోలు సంఘమువారు సన్మానపత్రము సమర్పించిరి. దానిని వేలం వేయగా రు 60 లు వచ్చినవి. సభలో రు 1000 లు విరాళము వచ్చినవి. ఆ రాత్రి ఉయ్యూరు రాజాగారి నందనవనములో రాజాగారికి అతిధిగా వుండిరి. గాంధి పరివారమునకు తగిన చక్కటి ఏర్పాట్లు చేశారు. జనానా స్త్రీలు గాంధీగారిని దర్శించి రు 500 లు విరాళము సమర్పించిరి.

1929 ఏప్రిల్ 10 ఉదయం నూజివీడునుంచి బయలుదేరి గొల్లపల్లి చేరిరి. గొల్లపల్లి రాజాగారు ఆహ్వానించి ఖద్దరు నిధికి రు 1116 లు విరాళమిచ్చిరి. తరువాత ఆరుగొలనులో రు 300 లు విరాళమొసంగిరి. అనంతరం పిరపల్లిలో రు 40 లు, పొట్టిపాడులో రు 116 లు విరాళములు లభించినవి. ఆరుగొలనులో వండూరు లక్ష్మీనారాయణ అనే పదుపండ్ల కుర్రవాడు తనంతటతాను మూడు ఉంగరాలుతీసి గాంధీగారికిచ్చెను. యిదిచూచి గాంధీగారు అమితానందముపొంది ఆ కుర్రవానిని ఎత్తుకొని ముద్దాడి, ఆశీర్వదించిచెను. అనంతరం విజయవాడచేరి, కాశీనాధుని నాగేశ్వరరావుగారి దుర్గా విలాసములో వారికతిధిగా వుండిరి. పశ్చిమ కృష్ణాలో జరిగిన ఈ సంచార కార్యక్రమములో నాగేశ్వరరావుగారు, కాశేశ్వరరావుగారు గాంధీగారి వెంటవుండిరి. గారపాటి సుబ్రహ్మణ్యంగారు సేవాదళముతో గాంధీజీ సంచార ఏర్పాట్లు జాగ్రత్తగా నిర్వహించినారు.

ఆరోజు సాయంత్రం ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యాయులు కట్టమంచి రామలింగారెడ్డిగారు గాంధీగారిని దర్శించి రు 100 లు ఖద్దరు నిధికి విరాళంగా యిచ్చిరి. స్త్రీల బహిరంగసభ ప్రత్యేకంగా జరిగినది. 2000 మంది స్త్రీలు హాజరయినారు. గాంధీగారు ఉపన్యసించిన అనంతరం స్త్రీలు

తమ నగలు విరాళముగా యిచ్చిరి. ఆసాయంత్రం గం॥ 6-30 లకు గొప్ప బహిరంగ సభ జరిగినది. ఆ సభలో విజయవాడ మ్యునిసిపాలిటీ తరఫున అయ్యదేవర కాళేశ్వరరావుగారు, బెజవాడ తాలూకా బోర్డు తరఫున శ్రీ నూతక్కి రామశేషయ్యగారు, పారిశ్రామిక సంస్థ తరఫున అద్దేపల్లి వెంకట గురునాధ రామశేషయ్యగారు, బెజవాడ పౌరుల పక్షమున శ్రీ కాకునూను లక్ష్మయ్యచౌదరిగారు, కృష్ణదేవరాయకమిటీతరఫున దుర్గాప్రసాద్ శర్మగారు సన్మాన పత్రములు సమర్పించినారు. ఈ సన్మాన పత్రములు వేలంవేయగా రు 170 లు వచ్చినవి. సభకు 10 వేలకు పైగా ప్రజలు హాజరయినారు.

ఏప్రిల్ 11 ఉదయం కాశీనాధుని నాగేశ్వరరావు, అయ్యదేవర కాళేశ్వరరావుగార్లతో కలిసి గుణదల ఖద్దరు ఆశ్రమమునకు వెళ్ళిరి. ఆ ఆశ్రమములో ఉప్పులూరి వెంకట కృష్ణయ్యగారు ఆహ్వానించి రు 116 లు రొక్కము, రు 500 లు విలువగల నగలు సమర్పించారు. వెంకటకృష్ణయ్య గారి పినతండ్రి భార్య తనకున్న నగలన్నీ గాంధీగారికి సమర్పించినది. తర్వాత మొగల్రాజపురం వెళ్ళారు. అక్కడ జిల్లా కాంగ్రెసు కార్యదర్శి శ్రీ కాట్రగడ్డ మధుసూదనరావుగారు బహిరంగసభ యేర్పాటుచేశారు. గాంధీగారి సందేశం అయిన అనంతరం రు 1350 లు విరాళం సమర్పించారు. ఇందు హెచ్చుభాగం కాట్రగడ్డ సోదరులే యిచ్చారు. అక్కడే గాంధీ గారికి సమర్పించిన వెండి పళ్ళెము వేలమువేయగా రు 70 లు వచ్చినవి. అక్కడనుంచి వారి బృందము పటమట వెళ్ళినారు. నల్లూరు పాపయ్య గారు ఆహ్వానించి రు 1116 లు విరాళం ఇచ్చినారు. వీరికి వేసిన దండలు వేలమువేయగా, ఒక దండను కాట్రగడ్డ మధుసూదనరావుగారు రు 50 లకు, మరొక దండను కాశీనాధుని నాగేశ్వరరావుగారు రు 45 లకు కొన్నారు. కాట్రగడ్డ రఘురామయ్యగారు కొంతసొమ్ము వసూలుచేసి సమర్పించినారు.

ఆ సాయంత్రం 3 గంటలకు పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెస్ ప్రముఖ కార్యకర్తల సమావేశము జరిగినది. గాంధీగారు తన సందేశమిచ్చారు. కూనల పూర్ణచంద్రరావుగారు గాంధి దంపతులను తన యింటికి ఆహ్వానించి రు 2116 లు ఖద్దరు నిధికి సమర్పించారు. వారికి అప్పుడే వివాహమైనది. తన భార్యతోకూడా రు 100 లు విరాళమిప్పించారు. గాంధి దంపతులు ఆ నవదంపతులను ఆశీర్వదించారు.

ఏప్రిల్ 11వ తేదీ సాయంత్రము గాంధీగారు వుయ్యూరుకు ప్రయాణమైరి. త్రోవలో పోరంకిలో ఆపి ప్రజలు రు 40 లు సమర్పించిరి. ఈడ్పుగల్లులో రు 887 లు విరాళమిచ్చిరి. పునాదిపాడులో రు 630 లు విరాళమిచ్చిరి. నెప్పల్లిలో రు 440 లు విరాళమిచ్చిరి. ఆకునూరులో ఖద్దరు నిధికి రు 485 లు, తిలక్ నిధికి రు 100 లు విరాళమిచ్చిరి. అన్ని చోట్ల గాంధీజీ సందేశమిచ్చిరి. ఆ రాత్రి 8 గంటలకు పరివారంతోసహా వుయ్యూరు రహదారి బంగళాలో మకాంచేసిరి. మరునాడు ఉదయము గం॥ 6-30 లకు కుమ్మమూరు వెళ్ళిరి. ఆ గ్రామస్తులు రు 400 లు ఖద్దరు నిధికి సమర్పించిరి. తిరిగి ఉయ్యూరువచ్చి మిషనరీ పాఠశాలలో బహిరంగ సభలో ఉపన్యసించిరి. వుయ్యూరు పంచాయితీ తరఫున, పుర ప్రముఖుల తరఫున సన్మాన పత్రములు సమర్పించబడినవి. రు 667 లు ఖద్దరు నిధికి విరాళం సమర్పించినారు. వుయ్యూరులో గాంధీగారికి వారి పరివారమునకు అవురమైన ఏర్పాట్లు అన్నీ శ్రీ వల్లభనేని వెంకట్రావు, శ్రీ గాయత్రి అనంత రామయ్యగార్లు చేశారు. వారిని గాంధీగారు బాగా మెచ్చుకున్నారు.

దీనితో పశ్చిమ కృష్ణాలో గాంధీగారి సంచార కార్యక్రమము అయి పోయినది. పశ్చిమ కృష్ణా సంచారమంతటా శ్రీ కాశీనాధుని నాగేశ్వర రావు పంతులుగారు, శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు పంతులుగారు వెంట వున్నారు. శ్రీ నాగేశ్వరరావుగారు ఖద్దరు నిధికి రు 5000 లు స్వయంగా విరాళమిచ్చుటయేగాక, తన కారును పశ్చిమ కృష్ణాజిల్లా సంచారం అయ్యే వరకు గాంధీగారి స్వాధీనములో వుంచారు. గాదిరాజు వెంకటేశ్వరరావు, మద్దూరి సుబ్బారావుగార్లు స్వచ్ఛందసేవక దుస్తులతో మహాత్మునివెంటవుండి కార్యక్రమము నిర్విరామముగా కొనసాగించినారు.

శ్రీ భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు, శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు, శ్రీ కొడాలి ఆంజనేయులుగారు, తూర్పు కృష్ణా అధ్యక్ష కార్యదర్శులు శ్రీ కొల్లిపర సూరయ్య, శ్రీ కానూరు చినవెంకటదాసయ్యగార్లు వారి సహచరులు వుయ్యూరువచ్చి గాంధీగారిని అప్పగించుకుని తూర్పు కృష్ణా పర్యటనకు బయలుదేరిరి. తూర్పు కృష్ణాలో గాంధీగారి సంచార కార్యక్రమము యావత్తూ శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారు తాను అప్పుడే తెచ్చిన కొత్తకారులో గాంధీగారిని ఎక్కించుకుని తానే స్వయంగా కారు

నడుపుతూ, గాంధిగారికి సంతోషం కలిగించేలాగ వాయువేగముతో నడిపి సుఖముగా గాంధీగారిని త్రిప్పినారు.

## తూర్పు కృష్ణాలో

వుయ్యూరులో బయలుదేరి గాంధీగారి బృందము కపిళేశ్వరపురం 12 గం॥ చేరినది. అక్కడ శ్రీ కొల్లిపర సూరయ్యగారు చక్కని ఏర్పాట్లతో వారి బృందమును ఆహ్వానించి అతిధ్యమిచ్చారు. కొంచెంసేపు విశ్రమించి, కురుమద్దాలి వెళ్ళినారు. ఆ గ్రామస్తులు రు 800 లు ఖద్దరు నిధికి విరాళము యిచ్చినారు. కనుమూరులో రు 100 లు సమర్పించినారు. పామర్రులో బహిరంగసభ యేర్పాటు చేశారు. 100 మంది ప్రజలు హాజరయినారు. రు 800 లు విరాళమిచ్చినారు. అక్కడనుంచి వీరంకిలాకు వెళ్లగా గొప్ప ఏర్పాట్లతో బహిరంగసభ ఏర్పాటుచేశారు. వేలకొలది జనం హాజరయినారు. గాంధీగారి సందేశం విన్నతరువాత రు 800 లు ఖద్దరు నిధికి సమర్పించారు. ఆ సాయంత్రము కపిళేశ్వరపురంలో గొప్ప బహిరంగ సభ జరిగినది. సభావుద్దేశ్యములు గురించి కాశేశ్వరరావుగారు, పట్టాభిగారు ఉపన్యసించిరి. తర్వాత గాంధీగారు తమ సందేశము యిచ్చారు. రు 1500 లు రొఖం, రు 200 లు విలువగల నగలు విరాళంగా సమర్పించబడినవి.

1929 ఏప్రిల్ 12 తేదీ సాయంత్రం తన బృందముతోసహా శ్రీ దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుగారి స్వగ్రామము ఎలకుర్రు చేరిరి. వారికి అతిధులుగా వుండిరి. దారిలో పసుమర్రు చెరువు గట్టుపై జరిగిన సభలో గ్రామస్థులు రు 500 విరాళము ఇచ్చిరి. ఆ రాత్రి ఎలకుర్రులో పాఠశాల ఆవరణలో గొప్ప బహిరంగసభ జరిగినది. గ్రామస్థులు రు 1250 విరాళమిచ్చిరి. హరిజనవాడకుకూడా వెళ్ళి వారికి సందేశమిచ్చిరి. ఆ రాత్రి అక్కడ విశ్రమించిరి. ఈ హరిజనవాడను శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారు వారి స్వంత ధనముతో నిర్మించినారు. అక్కడ హరిజనులందరకు బజారులు తీర్చి యిండ్లు కట్టించి పెట్టినారు. ఇదిచూచి మహాత్ముడు సంతోషపడి, "నేనే ఇటువంటి ఇండ్లను హరిజనులకు కట్టించి యివ్వాలని అనుకుంటున్నాను. నాకంటే ముందు నీవే యీ పని చేశావే" అని శ్రీ నాగేశ్వరరావుగారిని అభినందించిరి.

ఏప్రిల్ 13 తేదీ ఉదయం కొరిమెర్లలో చెరువుగట్టున పందిరివేసిరి. గాంధీగారు ఉపన్యసించిన అనంతరం, రు 150 లు విరాళమిచ్చిరి. ఆ సాయంత్రం గుడివాడ చెరువుగట్టుమీద పెద్ద బహిరంగసభ జరిగినది. గుడివాడ పౌరులు రు 1200 లు విరాళ మొసంగిరి. గుడివాడ తాలూకా బోర్డువారు సన్మాన పత్రము సమర్పించిరి. గుడివాడనుండి బొమ్ములూరు మీదుగా వెళ్ళుతుండగా గ్రామస్థులు రు 120 లు విరాళంయిచ్చిరి. సేరి కలవపూడిలో చాలాకాలమునుండి ఖద్దరు ఉత్పత్తి జరుగుచుండెను. ప్రతి యింట రాట్నము వడుకు అలవాటుగలదు. గాంధీగారి కారుదారి నిమిత్తం చేలగట్లన్నీ త్రివ్వి సరిచేసి గాంధీగారిని గ్రామములోనికి తీసుకు వెళ్ళిరి. చెరువుగట్టుపై పందిరివేసి బాగా అలంకరించిరి. పెద్ద బహిరంగ సభ జరిగినది. గాంధీజీ ఎదుట రాట్నములు వడుకు ప్రదర్శనం ఏర్పాటు చేసిరి. తన మొదటి కార్యక్రమములో ఆ గ్రామము లేనప్పటికి వారి ఆసక్తినిచూచి అక్కడకు వెళ్ళ నిశ్చయించిరి. అక్కడి గ్రామస్థుల ఉత్సాహము, వారి దేశభక్తినిచూచి గాంధీగారు చాలా సంతోషించిరి. వారికి మంచి సందేశమిచ్చిరి. అనంతరం రాత్రి 8 గంటలకు నూజెళ్ల వెళ్ళిరి. పర్వతనేని భూషయ్యగారు ఆహ్వానించి రు 500 లు విరాళ మిచ్చిరి. వారి బంధువులు మరొక రు 300 లు విరాళమిచ్చిరి. తదుపరిరాత్రి అంగలూరు చేరిరి. అక్కడ పెద్ద బహిరంగసభ జరిగెను. 4 వేల మంది హాజరయిరి. మహాత్ముని దర్శించుటకు 500 స్త్రీలు వచ్చిరి. ఎర్నేని సుబ్రహ్మణ్యంగారి కృషివల్ల రు 300 లు విరాళం ఇవ్వబడినది. అక్కడ నుంచి గుడ్లవల్లేరు చేరినారు. రు 110 లు విరాళము లభించినది. ఆ తర్వాత కౌతరం చేరిరి. చెరువుగట్టుపై పెద్ద మంటపము నిర్మించబడినది. 2000 మంది సభకు హాజరయిరి. ఆ గ్రామము స్వదేశీ వుద్యమానికి పట్టుకొమ్మ. రు 1116 లు గాంధీగారికి సమర్పించినారు. అనంతరము గాంధీజీ సందేశంయిచ్చి పడ్లమన్నాడు వెళ్ళినారు. ఆగ్రామస్థులు రు 250 లు ఖద్దరు నిధికి సమర్పించారు. అక్కడ సందేశమిచ్చిన అనంతరం పెడనకు బయలుదేరి వెళ్ళినారు. గాంధీ సందేశానంతరం పెడన గ్రామస్థులు రు 116 లు ఖద్దరు నిధికి సమర్పించిరి. ఆ రాత్రి గాంధీజీ, వారిబృందం రాత్రి 11 గంటలకు బందరు చేసురుకుని డాక్టరు పట్టాభి సీతారామయ్య గారింట బసచేసిరి.

బందరులో ఆంధ్ర జాతీయ కళాశాల ఆవరణలో పెద్ద బహిరంగసభ జరిగినది. ఆరోజు సంచారంలోవచ్చిన కొన్ని వస్తువులు వేలం వేయగా, పతిదీ దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులుగారు పాడుతుండగా మహాత్ముడు ఆనందించి వారిని "విశ్వదాత"గా పేర్కొన్నారు. ఆనాటినుంచే వారికి విశ్వదాత బిరుదు సార్థకమైనది.

ఇదే సభలో మరొక విశేషముకూడ జరిగినది. బందరు మ్యునిసిపల్ చైర్మన్ బారిష్టరు శీలం జగన్నాధరావు నాయుడుగారు, బందరు తాలూకా బోర్డు అధ్యక్షులు కొల్లిపర వెంకట రమణయ్యనాయుడుగారు మహాత్మునికి సన్మాన పత్రిములు సమర్పించినారు. వీరిద్దరు జస్టిస్‌పార్టీ ప్రముఖులు. వారిచ్చిన సన్మానపత్రములో "ఖద్దరు కట్టుకునేప్రతివారు స్వయంగా ప్రత్తిని పండించి, ఏకులు చేసుకొని, రాట్నంమీద వడికి, స్వయంగా నేసుకొని, కట్టుకోవాలని సూచించారు". మహాత్ముడు దీనికి సమాధానం చెప్పుతూ ప్రతి మనిషి స్వంతముగా దున్నుకొని, వరినారు ఊడ్చుకొని, తానే కోసుకొని, నూర్చుకొని, దంపుకొని, వంట చేసుకొని తినాలంటే ఎంత అసహజమో, అంత అసహజంగా వున్నదని, వ్యంగముగా చెప్పేసరికి, ప్రజలంతా పెద్ద పెట్టున నవ్వుతూ, కరతాళధ్వనులు చేశారు. ఆ ప్రముఖులు యిద్దరూకూడా నవ్వక తప్పలేదు.

14-4-1929 వ తేదీన ఉదయం బందరునుంచి బయలుదేరి చినముత్తేవి, పెదపూడి, కూచిపూడి, నరసన్నపాలెం, మొవ్వ, కొడాలి, తాడేపల్లి, ఘంటసాలపాలెం చూచుకొని, 9 గంటలకు ఘంటసాలచేరినారు. అక్కడ వేసిన పెద్ద పందిరిలో 3 వేలమంది సమావేశమైనారు. వినతి పత్రిముతోపాటు రు 558 లు ఖద్దరు నిధికి సమర్పించినారు. స్త్రీలు బంగారు నగలు గాజులు వగైరా ఆభరణములుతీసి మహాత్మునకుఇచ్చినారు. మహాత్ముడు కారులోనేవుండి వుపన్యసించారు. అక్కడ గాంధీజీ మంచి సందేశమిచ్చినారు. ఆ గ్రామము ఖద్దరు ఉత్పత్తికి, చేనేత పరిశ్రమకు పెద్దకేంద్రమని తెలుసుకొని గాంధీగారు సంతోషించినారు. బ్రహ్మయ్య గారు ఎండకు తాటాకు గొడుగుపట్టగా, నాకు చేతులున్నవి, నేను పట్టుకోగలనని మహాత్ముడు ఆ గొడుగు తీసుకున్నారు. పిమ్మట దేవర కోటమీదుగా చల్లపల్లి చేరుకున్నారు. అక్కడే సాయంకాలమువరకు రహదారి బంగళాలో వున్నారు. సాయంత్రిము 5 గంటలకు బహిరంగ

సభ జరిగినది. ఖద్దరు ధారణ, అస్పృశ్యత గురించి సందేశమిచ్చిరి. అనంతరం కొడాలి చేరినారు. రోడ్డు ప్రక్కన నిర్మించిన పందిరి చక్కగా అలంకరించబడినది. గ్రామ మునసబు తుమ్మల సీతారామయ్యగారు గ్రామస్తుల తరపున రు 381 లు ఖద్దరు నిధికి సమర్పించారు. ఆ సభలో 5 నిమిషాలు సందేశమిచ్చి, తాడేపల్లి గ్రామమునకు వెళ్ళినారు. అక్కడ నుంచి పురిటిగడ్డ వెళ్ళి అక్కడ స్త్రీలందరు ఒక చెట్టుక్రింద నూలువడకటం చూచినారు. అక్కడ 60 రాట్నములు పనిచేయుచున్నవి. నిత్యము ఇలా జరుగుతుందని తెలుసుకుని సంతోషించారు. గ్రామస్తులు రు 150 లు కానుకగా సమర్పించినారు. ఆ తర్వాత నాగాయతిప్పదగ్గర కృష్ణా నదిదాటి అవనిగడ్డకు వెళ్ళినారు. నాగాయలంకలో రు 500 లు ఖద్దరు నిధికి సమర్పించినారు. చాలా పొద్దుపోయిన తరువాత అవనిగడ్డ చేరిరి. గాంధీజీని బసలోకి చేర్చినారు. దగ్గరలోని కోడూరు గ్రామ ప్రజలు గాంధీ దర్శనార్థము వేచివున్నారని తెలిసినది. ఆ గ్రామము తన ప్రోగ్రాములో లేకపోయినా వెళ్ళుటకు నిశ్చయించిరి. లేచి కారులో కూర్చున్నారు. కోడూరువెళ్ళి ఆ మీటింగు చూచుకుని, అవనిగడ్డ వచ్చుసరికి రాత్రి 12 గంటలయినది. ఆయన రాకకోసం 4 వేలమంది అవనిడ్డలో ఎదురుచూస్తున్నారు. గాంధిగారు అలసిపోయి మాట్లాడ జాలకపోయిరి. కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్యగార్లు ప్రజలకు క్షమాపణ చెప్పకుని తాము వుపన్యసించిరి.

15వ తేదీ ఉదయం 6 గంటలకు అవనిగడ్డనుంచి బయలుదేరి కొత్తపేటవద్ద కృష్ణానదిని దాటారు. గాంధీ మోటారు ఎక్కబోతుండగా కోసూరుపాలెం వాస్తవ్యులు రేపల్లె వెంకట కృష్ణయ్యగారు వచ్చి ఖద్దరు నిధికి రు 116 లు విరాళము సమర్పించారు. అది గాంధీగారికి మౌన దినము.

14-4-1929 తేదీ ఉదయం బందరునుండి మహాత్ముడు తన బృందముతో బయలుదేరినారు. ఈరోజు మహాత్ముని కారులో శ్రీ బ్రహ్మయ్యగారుకూడ వున్నారు. వారు జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు. దారిలో చినము త్తేవి, పెదపూడి, కూచిపూడి, నరసన్నపాలెం, మొవ్వ, కొడాలి, తాడేపల్లి, ఘంటసాలపాలెం చూచుకొని 9 గంటలకు ఘంటసాల చేరినారు. అక్కడ వేసిన పెద్ద పందిరిలో 3 వేలమంది సమావేశమైనారు. షుమారు

100 మంది స్త్రీలు రాట్నములు వడుకుతూ వేదికకు ఒక ప్రక్కన ఆసీనులయ్యారు. శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య (కిసాన్) నాయకత్వమున స్వచ్ఛంద సేవకులు గాంధీ టోపీలు, కాంగ్రెసు జెండాలు పుచ్చుని, ప్రజా సమూహాన్ని నిశ్శబ్దముగా వుండునట్లు మంచి ఏర్పాట్లు చేసినారు. మహాత్ముని కారు రాగానే, వారికి వారందరూ సైనిక వందనం చేశారు. తనతోవున్న శ్రీ బ్రహ్మయ్యను చూచి, *Is this our National army ?* అని నవ్వుతూ మహాత్ముడు అన్నారు. స్వచ్ఛంద సేవకులు వారిని వేదికవద్దకు చేర్చినారు. స్త్రీలు వడుకుతూవున్న రాట్నములు చూచి మహాత్ముడు సంతసించినారు. ఎదురుగా కోరాఖద్దరు ధరించి ఒక బీదబ్రాహ్మణుడు తాటాకు గొడుగువేసుకొని కూర్చుని వున్నాడు. ఆ గొడుగు తీసుకొని శ్రీ బ్రహ్మయ్యగారు మహాత్మునికి ఎండ తగలకూండా పట్టబోయినారు. "నాకూ చేతులున్నవి నేను పట్టుకొనగలను" అని మహాత్ముడు ఆ గొడుగు తీసుకున్నాడు. అక్కడ అర గంట అయినప్పటికీ, గంటసేపు మహాత్ముడు ఉపన్యసించినారు. దీనికి కారణం అక్కడి దృశ్యము వారిని ఆకర్షించడమే. బందరువచ్చి రోజంతా విశ్రాంతి తీసుకున్నారు.

బందరు మినర్వాసినిమాహాలులో మహిళాసంఘమువారిచే ఏర్పాటు చేసిన స్త్రీల సభలో ఉపన్యసించారు. 5 వేలమంది స్త్రీలు సభకు వచ్చారు. ఉపన్యాసానంతరం రు 500 లు విలువగల నగలు నిధికి సమర్పించినారు. వేమూరి రాంజీరావుగారిచే స్థాపించబడిన అరుంధతీ ఆశ్రమము గాంధిగారు సందర్శించారు. కన్యకాపరమేశ్వరి దేవాలయములో గ్రంథాలయముకూడ దర్శించిరి. వైశ్య సంఘంవారు సన్మానపత్రం సమర్పించి రు 116 లు నిధినికూడా సమర్పించినారు. ఆ సాయంత్రం ఆంధ్ర జాతీయ కళాశాలలో గొప్ప బహిరంగసభ జరిగినది. బందరులో వసూలైన మొత్తము 5194 రూపాయలు పట్టాభి సీతారామయ్యగారు ఖాదీ నిధికి సమర్పించినారు. అదిగాక రు 116 లు పి. సత్యనారాయణగారు, రు 45 లు కళాశాల సిబ్బంది, గుడ్లవల్లేరునుంచి యమ్. కృష్ణారావుగారు పంపిన రు 116 లు చేరినట్లు సభలో ప్రకటించిరి. బందరు తాలూకా బోర్డు తరఫున కొల్లిపర రమణయ్యనాయుడుగారు, బందరు మ్యునిసిపాలిటీతరఫున శీలం జగన్నాథ రావునాయుడుగారు గాంధిగారికి సన్మాన పత్రములు సమర్పించినారు.

1929 ఏప్రిల్ 16న ఉదయం 6 గంటలకు గూడూరులో సందేశ మిచ్చి గ్రామస్థులు సమర్పించిన రు 200 లు స్వీకరించి, జమిగొల్వేపల్లి గ్రామమువెళ్ళినారు. గ్రామమంతా తోరణాలతో అలంకరించబడినది. వందలకొలది స్వచ్ఛంద సేవకులు జాతీయ పతాకములతో, మేళతాళము లతో గాంధిగారిని వేదికవద్దకు తీసుకొనివెళ్ళిరి. గాంధీజీ కారువెనక సీటుమీదనే కూర్చుని వుపన్యసించిరి. గ్రామస్థుల పక్షాన శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారు రు 1209 ఖద్దరునిధికి విరాళముగా సమర్పించిరి. గ్రామస్థుల వుత్సాహము, దేశభక్తిచూచి గాంధిగారు సంతోషించినారు. అక్కడి నుంచి బయలుదేరి పెద్యేరుకు వెళ్ళినారు. అక్కడ పోలవరపు నాగేశ్వరరావుగారు రు. 500 ఖద్దరు నిధికి సమర్పించిరి. దాకరము గ్రామస్థులు రు 116 సమర్పించిరి. పిమ్మట కైకలూరుకు వెళ్ళినారు. రైలు స్టేషనులో సభ జరిగినది. రు. 500 నిధికి సమర్పించినారు. మీటింగులో కొంచము గలాభా జరిగినది. జనము గాంధీజీ కారుచుట్టూ మూగారు. కారు నడుపుట చాల కష్టసాధ్యమైనది. రామబ్రహ్మము గారి చాకచక్యము వలన ఎవరికి అపాయము కలుగకుండా వేగముతో బయటకు తీసుకురావడం జరిగింది. గాంధీగారు ఆశ్చర్యపడి రామబ్రహ్మం గారిని ప్రశంసించిరి. పట్టాభిగారు అందుకుని "అదంతా మా రామ బ్రహ్మము నేర్పు. అందుకనే మీకు సారధిగా నియమించాను" అన్నారు.

కైకలూరు నుండి తిరిగి వచ్చేటప్పుడు భైరవపట్నం ప్రజలు ఆపి గాంధిగారిని దర్శించి రు. 150 నిధికి సమర్పించినారు. వడాలిలో మంచి సభ జరిగింది. 2 వేలమంది హాజరయినారు. అక్కడినుంచి వెంట్రప్రగడకు ప్రయాణమైనారు. త్రోవలో పెదపారుపూడివద్ద ఆపి రు 150 నిధి సమర్పించారు. వెంట్రప్రగడ సభకు చుట్టుపట్ల గ్రామాలనుంచి జనం వచ్చినారు. 6 వేలు సమావేశమయ్యారు. అక్కడి యువకులు సభకు మంచి ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సేవకులు జాతీయ పతాకములతో వీధులలో నిలబడి వేదికవద్దకు దారి చూపారు. దానితో గ్రామమంతా గాంధీజీ వూరేగినట్లయినది. సభలో గాంధీజీ సందేశమిచ్చారు. పట్టాభి సీతారామయ్యగారు తెలుగులో అనువాదం చేసినారు. ఈ సభలో ముదునూరు రు. 116, మానికొండ రు. 135, కలవపాముల రు. 165, నందమూరు రు. 116, కాటూరు రు. 316, వెంట్రప్రగడ గ్రామస్థులు

రు. 850 ఖద్దరు నిధికి సమర్పించినారు. వానపాముల గ్రామస్థులు రు. 150 సమర్పించిరి. సందేశానంతరం గాంధీజీ హెచ్చరికతో, మరొక రు. 100, ఒక కెంపుల ఉంగరము లభించినవి. కృష్ణాజిల్లా సంచారములో ఇది ఆఖరు ప్రోగ్రాము. ఈ సంచారములు గాంధీజీతోపాటు కస్తూరిబాయి గాంధి, మహాదేవదేశాయ్, ప్రభావతీదేవి వున్నారు. వారంతా ఒక కారులో వున్నారు. చెరుకువాడ వెంకటనరసింహం, కొడాలి ఆంజనేయులు, గొట్టిపాటి బ్రహ్మయ్య, ముట్నూరి కృష్ణారావుగార్లు ఒక కారులో ముందు వెళ్ళుచుండేవారు. పట్టాభి శీతారామయ్యగారు గాంధిగారి కారులోనే వుండి కార్యక్రమం నడిపించేవారు, గాంధిగారి వుపన్యాసాలు తెలుగులోకి అనువదించి చెప్పేవారు.

ఆ రాత్రి విజయవాడ వెళ్ళి గాంధిగారు తన బృందముతో వార్ధాకు వెళ్ళిపోయిరి.

## హ రి జ న టూ రు

1933 డిశంబరు 16 వుదయం గాంధిగారు ఢిల్లీనుంచి గ్రాండు ట్రంకు ఎక్సుప్రెస్‌లో విజయవాడలో పరివారముతోసహా దిగిరి. హరిజన సంచారం నిమిత్తం వచ్చిరి. ప్రజలు, స్వచ్ఛందసేవకులు, నాయకులు స్టేషన్‌లో ఘనమైన స్వాగతమిచ్చిరి. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు గారి దుర్గావిలాస్‌లో బసచేసినారు. వర్షం పడుతున్నందున ప్రోగ్రాము ఆపుదామని నాయకులు వారిని కోరినారు. గాంధిగారు అంగీకరించక నాగేశ్వరరావు, మాగంటి బాపినీడు, మోటూరు సత్యనారాయణగార్లతో కలసి సంచారమునకు బయలుదేరెను. ముందుగా ఈడ్పుగల్లు గ్రామమునకు వెళ్ళారు. ఆ గ్రామములో బహిరంగసభ జరిగినది. రు 150 లు హరిజన నిధికి సమర్పించారు. చాలమంది స్త్రీలు నగలు, వుంగరాలు సమర్పించి నారు. అక్కడనుంచి తిరిగి పటమటలంక, మొగలార్రాజపురం వెళ్ళారు. అమితోత్సాహముతో ప్రజలు ముందుకువచ్చి పూలమాలలు, విరాళములు సమర్పించినారు. అనుకున్న సమయమునకు 2 గం॥ ఆలస్యముగా దుర్గా విలాస్‌కు చేరుకున్నారు. ఆ రోజు రొఖ్ఖం రు 1500 లు, నగలు వసూలయినవి.

ఆ మధ్యాహ్నము 1000 మంది మహిళలు గాంధిజీ సందేశము వినటానికి దుర్గావిలాస్‌కు వచ్చారు. వారు హిందీలో సన్మానపత్రము సమర్పించి, రు 120లు హరిజన నిధికి సమర్పించినారు. గాంధిగారి హిందీ వుపన్యాసమును దుర్గాబాయి తెలుగులోకి అనువాదం చేసినది. ఆ తర్వాత దుర్గాకళామందిరములో ఏర్పాటయిన హరిజన కార్యకర్తల సమావేశానికి గాంధీగారు హాజరయినారు. ఆ తర్వాత గవర్నరుపేట మైదానంలో జరిగిన బహిరంగసభలో పాల్గొని సందేశమిచ్చారు.

డిశంబరు 17 ఉదయం గాంధిగారు తన బృందముతోసహా బెజవాడ నుండి బయలుదేరినారు. అసలు ప్రోగ్రాము ముదునూరులోవుంది. ఆయన అలసటగావుండి కారులో నిద్రపోయినారు. పునాదిపాడు, మానికొండ, నందమూరు, కలవపాముల ప్రజలు ఆపి దర్శనం చేసుకొనుటకు రోడ్డుపైకి వచ్చిరి. వారంతా గాంధీగారి విశ్రాంతికి భంగంకలిగించటానికి ఇష్టపడక హరిజన నిధికి విరాళములు సమర్పించిరి. పునాదిపాడు ప్రజలు రు 116 లు సమర్పించిరి. ఉదయం 8 గంటలకు ముదునూరు చేరిరి. అక్కడ పెద్ద బహిరంగసభ జరిగెను. సభానంతరం శ్రీ రామలింగేశ్వర దేవాలయం లోను, రామాలయంలోను హరిజన దేవాలయ ప్రవేశము గాంధీగారితో జరిపించిరి. హరిజన నిధికి శ్రీ అన్నె అంజయ్యగారు ప్రజల తరఫున రు 400 లు సమర్పించిరి. కారు వెనుక సీటుపై కూర్చుని గాంధీగారు సందేశమిచ్చిరి. వారువాత గుడివాడకు వారి బృందముతో బయలుదేరినారు. వారి బృందములో ప్రొఫెసర్ మల్కాని, రామ్‌నారాయణ, కుమారి ఉమాబజాజ్, మీరాబెన్, శుక్లాగార్లుకూడా వున్నారు.

గుడివాడలో స్థానిక ప్రముఖులు శ్రీ అద్దుమిల్లి గోపాలకృష్ణయ్య, అద్దుమిల్లి హరినీడు, హనుమార అప్పయ్య, కోగంటి వెంకటరామయ్య, కేతవరపు లక్ష్మీనరసింహారావు, ఎర్నేని సుబ్రహ్మణ్యంగార్లు స్వాగత మిచ్చారు. వీధులన్నీ చక్కగా అలంకరించబడినవి. వేదిక అందముగా తయారుచేశారు. చాల ప్రజాసంస్థలు సన్మాన పత్రములు సమర్పించినవి. పిమ్మట ఆహ్వాన సంఘము నందివాడ, దొండపాడు, దొన్నపాడు, దండిగానపూడి, చిరివాడ గ్రామస్థులు రు 1000 లు హరిజననిధికి కానుకలు సమర్పించినారు. స్వాతంత్రయోధుడు పూనూరు వెంకటరెడ్డిగారి కుమార్తె చిన్నపిల్ల వేదికపైకివెళ్ళి తనగాజులను గాంధీగారికి సమర్పించినది.

అందరూ ఆశ్చర్యపోయారు. గాంధీగారు ఆమెను ముద్దాడి ఆశీర్వదించారు. గాంధీజీ సందేశం యిచ్చిన అనంతరం బొమ్ములూరు గ్రామానికివెళ్ళి దేవాలయంలో హరిజనులను ప్రవేశపెట్టారు. పిమ్మట రంగాపురం ఎస్టేటు జమీందారు, అడ్సుమిల్లి గోపాలకృష్ణయ్యగారు తన స్వగ్రామము సిద్ధాంతమునకు ఆహ్వానించి, సకలలాంఛనాలతో గాంధీగారిని సన్మానించి, గాంధీగారిచేత అక్కడ రెండు దేవాలయాలలో హరిజనప్రవేశం చేయించినారు. అనంతరం గొప్ప సందేశం గాంధీగారు యిచ్చారు. ఆ పూట గోపాలకృష్ణయ్యగారికి అతిథులుగా గాంధి పరివారం అక్కడ వుండిపోయినారు. ఆ మధ్యాహ్నం స్త్రీలు ప్రత్యేకంగా సిద్ధాంతములో గాంధీగారిని దర్శించి కానుకలు సమర్పించినారు. చవటపల్లివారు రు 116 లు, జొన్నపాడు రు 80, జమిగొల్వేపల్లివారు రు 48, పెదముద్దాలి రు 15 సమర్పించారు. పర్వతనేని బసవశంకరంగారి తల్లి రు 500 లు విలువగల నగలు యిచ్చారు. కొంత తడవు విశ్రాంతి తీసుకుని అక్కడనుంచి బయలుదేరి అంగలూరుకు వెళ్ళినారు. అక్కడ పర్వతనేని భూషయ్యగారు రు 116 లు హరిజన నిధికి సమర్పించారు. అంగలూరు పౌరులు రు 60, స్త్రీలు నగలు సమర్పించారు. దారిలో కౌతరంలోకూడా ఆగినారు. సాయంత్రం 5 గం॥ బందరు చేరినారు. జాతీయ కళాశాలలో బహిరంగసభ జరిగినది. అనేక సంస్థలు సన్మానపత్రములు సమర్పించినవి. ఆ సభలో విరివిగా హరిజన నిధికి కానుకలు సమర్పించబడినవి. తరువాత చల్లపల్లివెళ్ళి రాత్రికి బందరు చేరినారు. జాతీయ కళాశాలలో బసచేసినారు. బందరు సభలో రు 1020 హరిజన నిధికి సమర్పించారు. బందరులోని సనాతన సంఘంవారు గాంధీజీ హరిజన ప్రచారమును నిషేధించిరి. చల్లపల్లి రాజాగారి ఉన్నత పాఠశాల ఆవరణలో సభజరిగినది. చక్కగా అలంకరించబడిన వేదికపైకి ప్రజలు గాంధీగారిని ఆహ్వానించిరి. ఆర్చీలతోను, తోరణములతోను నగరము అలంకరించబడినది. రాజాగారు గ్రామములో వుండికూడ సభకురారైరి. అంతవరకు వారికై ఎదురుచూసే ప్రజలు ఆశ్చర్యపోయిరి. చివరి నిమిషములో అనివార్యకారణాలు వారి రాకకు అభ్యంతరం కలిగించినట్లు చెప్పబడినది. వారి పనుపున దివాను జంపాల వెంకటేశంగారు, గ్రామ ప్రముఖులు పాల్గొని గాంధీగారికి మంచి మర్యాదలతో సత్కరించి పంపిరి. అనంతరం ఘంటసాల దేవాలయములో హరిజన ప్రవేశం అదివరకేచేయించిరి. దానిని అనుకరించమని గాంధిగారు ప్రబోధించిరి. చల్లపల్లి సభలో 1500

విరాళం యిచ్చిరి. ఆ రాత్రి బందరుచేరి, మరుసటిరోజు బందరులో విశ్రాంతి తీసుకొనిరి. తరువాత పశ్చిమ గోదావరిజిల్లా సంచారమునకు వెళ్ళిపోయిరి.

1946 జనవరి 21 ఉదయము, 6-20 నిమిషములకు కలకత్తానుంచి గాంధీజీ ప్రత్యేక రైలు విజయవాడకు చేరినది. విజయవాడ స్టేషన్ వెలుపల సిమెంటు ఫ్యాక్టరీ మైదానంవద్ద రైలు పట్టాలు అనుకుని వేదిక నిర్మించబడినది. దాదాపు లక్షమంది జనం తెల్లవారుగట్ల 3 గంటలకే వచ్చి చలితో బాధపడుతూకూడ ఆ స్థలమంతా నిండిపోయిరి. ఆ రోజు గాంధీగారికి మౌనదినము. అందుచేత మాట్లాడలేదు. అనేకమంది సమర్పించిన కానుకలు ఆయన మౌనముతో స్వీకరించారు. కొండా వెంకటప్పయ్య, మరుపిళ్ళ చిట్టి, పేట బాపయ్య, కాకాని వెంకటరత్నం, వేముల కూర్మయ్య, అయ్యదేవర కాళేశ్వరరావుగార్లు గాంధిగారిని కల్సుకున్నారు. తర్వాత గాంధిగారి రైలు మద్రాసుకు వెళ్ళిపోయినది.

ఆ రాత్రి ఆ స్పెషల్ రైలును ఎవరికీ తెలియనీయకుండా అంపాపురం స్టేషనులో ఆపివేసినారు. తెలిస్తే ప్రజలు ఎగబడి గాంధీగారికి నిద్రాభంగం జరుగుతుందని అక్కడ ఆపినారు. తెల్లవార్లు ఆ బండిచుట్టూ అన్నాప్రగడ కామేశ్వరరావు మరికొందరు యువకులు పహారాయిచ్చినారు.

1946 ఫిబ్రవరి 6 తేదిన మద్రాసునుంచి తిరిగి వార్థాకువెళ్ళునపుడు విజయవాడలో ఆగిరి. స్టేషను వెలుపల ప్రత్యేకంగా కట్టిన వేదికపైకి గాంధిగారు వచ్చిరి. ప్రభాకర్‌జీ భజనగీతాలు పాడుచుండగా, గాంధీగారు మౌనముగా నిలబడిరి. అనంతరము గాంధీ శిష్యుడు (శ్రీ) ఎర్నేని సుబ్రహ్మణ్యంగారు ఒక లేఖను గాంధీజీకి అందజేసిరి. "రాజగోపాలాచారిని ముఖ్యమంత్రిగా చేయుటకు మీరు మద్రాసు వచ్చినట్లుగా ఆంధ్రలో చెప్పుకుంటున్నారని" ఆ ఉత్తరంలో ఉదహరించబడియున్నది. దానిమీద గాంధీగారు ఇలా వుపన్యసించారు. "నేను దక్షిణభారత హిందీ ప్రచారసభకు అధ్యక్షుడను. కేవలము దాని రజతోత్సవములలో పాల్గొనవలెనని మద్రాసు వచ్చాను. రాజగోపాలాచారిని ప్రధానిగా చేయటానికి నా పలుకుబడిని వినియోగించవలెననే అభిప్రాయము నాకు కలలోకూడ లేదు. రాజగోపాలాచారి నాకు పాత మిత్రుడు. ఆయన సమర్థుడైన మంచి

రాజనీతిజ్ఞుడు. పరిపాలనా దురంధరుడు. నాకు ప్రధానిగాచేసే అధికారమే వుంటే నేను ఆయనను సరాసరి మద్రాసు ప్రధానిగా చేసివుండేవాడిని. అది నాపనికాదు. ఆ విషయమునుగూర్చి ఆలోచించటానికి కాంగ్రెసు కమిటీ వున్నది. నేను కాంగ్రెసులో పావలా సభ్యుడమకూడా కాదు. తమిళ స్నేహితులు చాలమంది రాజగోపాలాచారికి అనుకూలంగా ఒక మాట చెప్పమని నాకు ఉత్తరాలు వ్రాశారు. నేను వారికి జవాబుకూడా వ్రాయలేదు. నేను రాజగోపాలాచారిని మద్రాసు ప్రధానిగా చేయదలచుకున్నట్లయితే నేను ఇంత దూరము మద్రాసువరకు రానక్కర లేదు. ఉన్నచోటనుండే ఆ పని చేయగలను.

నా మద్రాసు రాకనుగూర్చి కాంగ్రెసు వాదులలో ఇటువంటి అపోహ కలిగినందుకు నాకు చాలవిచారముగా వున్నది, నేను ప్రత్యేకం రాజగోపాలాచారిని ప్రధానిగా చేయడానికి మద్రాసు వచ్చినట్లు కొన్ని తెలుగు పత్రికలు వ్రాసినవి. ఆ విషయము కలలోకూడా తలపెట్టలేదు. నేను జైలునుండి విడుదల అయినప్పటినుండి హిందుస్థానీ ప్రచార నిమిత్తము మద్రాసు రావలెనని ఆలోచించుతూనేవున్నాను. రాజగోపాలాచారిని ప్రధానిగాచేసే విషయముగాని, నామటుకునేను ప్రధానిఅయ్యే విషయముగాని నా చేతులలోలేదు." అనంతరం వారి స్పెషల్ రైలు వార్ధాకు బయలుదేరిపోయింది.

ఇది ఆంధ్రదేశమునకు గాంధీగారి ఆఖరు సందర్శనము. మొత్తము మీద 1917 నుంచి 1946 వరకు మధ్యలో గాంధీగారు కృష్ణాజిల్లాలో 7 సార్లు సంచారచేశారు. వారి రాకవల్ల జిల్లాలో గొప్ప దేశభక్తి, సంఘసేవకు బీజాలు నాటబడినవి.

1948 జనవరి 30వ తేదీన ఒక మతావేశపరుని పిస్టలు గుండుకు గురియై ఆయన పరలోకగతులయ్యారు. దేశమంతా శోకసముద్రములో మునిగిపోయింది. కృష్ణాజిల్లా అంతటా వారం రోజులు సంతాపదినములు జరుపవలసినదిగా జిల్లా కాంగ్రెసు సంఘాలు ప్రకటించినవి. ఊరూరా సంతాప సభలు జరుపబడినవి. జాతిపిత ఆత్మశాంతికై ప్రతిచోట అన్న దానములు జరిగినవి. భారతదేశంతోపాటు ప్రపంచమంతా శోకదినాలు పాటించి ఈ అహింసామూర్తికి శ్రద్ధాంజలులు ఘటించారు.

## వ్యక్తిగత సత్యాగ్రహం

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమై షుమారు ఒక సంవత్సరం. జరిగింది. దేశమంతటా స్వాతంత్ర్యేచ్ఛ ప్రబలం కాజొచ్చినది. ప్రజలలో కలిగే యీ వుత్సాహానికి తగిన కార్యక్రమము యిచ్చి స్వాతంత్ర్య సంపాదనకు తీవ్ర ఆలోచనచేస్తూ కాంగ్రెసు వర్కింగ్ కమిటీ తరచు సమావేశములు జరుపుచూ వుండెను.

ఈ ప్రపంచ యుద్ధం ఇంగ్లండుకు భయంకరంగా పరిగణించినది. జర్మని శరవేగంతో యూరపు దేశాల నన్నింటిని కబళించుచున్నది. 1940 వేసవిలోగానే నార్వే మొదలైన దేశాలు దానివశమైనవి. చాంబర్లేను ప్రభుత్వం పడిపోయినది. అఖిలపక్ష ప్రభుత్వం ఏర్పడి విన్‌స్టన్ చర్చిల్ ఇంగ్లాండులో ప్రధాని అయ్యాడు. ఈ గంభీరమైన పరిస్థితినికూడ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ చర్చించుచునే యున్నది. భారత దేశానికి స్వాతంత్ర్యం యిస్తే యుద్ధానికి సహాయం చెయ్యాలని కొందరు, అది అహింసా విధానానికి వ్యతిరేకం గనుక స్వాతంత్ర్యం యిచ్చినా యుద్ధానికి సహాయ పడరాదని కొందరు వాదోపవాదాలు చేశారు. చివరకు స్వరాజ్య సంపాదనకు, దేశాంతర్గత సమస్యల పరిష్కారమునకు మాత్రమే అహింసగాని. స్వతంత్ర భారతదేశం బయటి రాజ్యాలతో వ్యవహరించవలసి వచ్చినప్పుడు అహింస అడ్డురాకూడదని మెజారిటీ అభిప్రాయం వ్యక్తమైనది. ఈ మేరకు వర్కింగ్ కమిటీ ఒక తీర్మానంచేసి, వెంటనే భారత దేశాన్ని స్వతంత్రదేశంగా ప్రకటించాలని, స్వతంత్రభారతమే యుద్ధంలో పాల్గొనగలదని ప్రకటించారు. దానిని అఖిల భారత కాంగ్రెసు కమిటీ గూడ ఆమోదించడం జరిగినది. ఈ నిర్ణయానికి గాంధీగారు బాధ చెందారు.

అయితే బ్రిటిషు ప్రభుత్వం ఇందుకు సమ్మతించలేదు. యుద్ధ సమయంలో చట్టబద్ధమైన మార్పులు చేయ వీలుపడదని, అవుసరమైతే వైస్రాయి కౌన్సిల్‌లో మరికొందరి భారతీయులకు అవకాశం కల్పిస్తామని, యుద్ధానికి అవుసరమైన సలహాల నివ్వడానికి మరొక సలహాసంఘాన్ని నియమిస్తామని, అందులోకూడ ముఖ్యులైన కొందరు భారతీయులకు స్థానం కల్పిస్తామని ఇండియా మంత్రి ఆమేరీ ప్రకటించారు.

ఇది కాంగ్రెసుకు అంగీకారము కాలేదు. అఖిల భారత కాంగ్రెసు బొంబాయిలో సమావేశమై ఈ పై ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించినది. ఇప్పుడు తన విధానమేమిటో ప్రపంచానికి తెలయచెప్పాలని నిర్ణయించుకున్నది. యుద్ధానికి వ్యతిరేకతను తెలియజేయడం తప్ప గత్యంతరం లేదని తీర్మానించుకున్నది. ఇందుకు వ్యక్తిగత సత్యాగ్రహమే శరణ్యమని నిర్ణయించుకున్నది. ఈ బాధ్యత గాంధీగారికి అప్పగించినది. నిర్మాణ కార్యక్రమములో ఏదో ఒక బాధ్యత వహించేవారికి, ప్రజాప్రతినిధులైన వారికి మాత్రమే సత్యాగ్రహము చేయుటకు ఆయన అనుమతి ఈయదలచినాడు. అంటే అనుమతి పొందగోరేవారు నూలు విధిగా వడుకుతూ, అస్పృశ్యతను పాటించువారై యుండాలి. శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులు, స్థానిక సంస్థలలో ఎన్నుకోనబడిన సభ్యులు, కాంగ్రెసు కమిటీ సభ్యులు మొదలగు వారినే సత్యాగ్రహం చేయడానికి అర్హులుగా నిర్ణయించిరి. అట్టివారందరు రాష్ట్ర కాంగ్రెసు కమిటీకి దరఖాస్తులు చేసుకోవాలి. వారు లిస్టులు తయారుచేసి గాంధీగారికి పంపించాలి. గాంధీగారి అనుమతి పొందిన తరువాత వారు సత్యాగ్రహం చెయ్యాలి.

ప్రతి సత్యాగ్రహి ఏవిధమైన ఆడంబరం లేకుండా తాను సత్యాగ్రహము చేయదలచినట్లు ముందు స్థానిక అధికారులకు తెలియజేసి, త్రివర్ణ పతాకముతో బయలుదేరి, "మనం యుద్ధానికి ఏవిధంగాను సహాయపడరాదు"—అను నినాదముతో వారు శాసనమును ధిక్కరించేవారు. ఈ సత్యాగ్రహముయొక్క వుద్దేశ్యము, మనకు ఉచితమని తోచినదానిని చెప్పుటకు హక్కుకలదని ప్రకటించానికి చాటడమే. ఈ విధమైన నినాదములతో దేశమంతా యీ వ్యక్తిగత సత్యాగ్రహం జరుపబడినది. కృష్ణా జిల్లాలోకూడ వ్యక్తిగత సత్యాగ్రహంలో పాల్గొని, చాలామంది సత్యాగ్రహులు జైళ్ళకు వెళ్ళినారు. అది 1940-41 వరకు జరుపబడినది. దేశం మొత్తముమీద మొదటి సత్యాగ్రహిగ 'వినోబాభావే'ను ఎన్నుకున్నారు. గాంధీ ఆదర్శాలను మనసార ఆచరించేవారిని మాత్రమే రాష్ట్రాలలో ప్రథమ సత్యాగ్రహులుగా అనుమతించారు.

ఈ సత్యాగ్రహం 4 దశలుగా విభజింపబడినది. మనసా, వాచా అహింసా వ్రతము అనుష్టించేవారికి ప్రథమ దశలో అనుమతినిచ్చేవారు. ప్రజలచే ఎన్నుకోబడిన శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులకు రెండవ

దశలో అనుమతి లభించేది. స్థానిక సంస్థల ఎన్నిక ప్రతినిధులు, కాంగ్రెసు కార్యనిర్వాహక సభ్యులకు మూడవదశలో అనుమతి లభించినది. కాంగ్రెసు ప్రాథమిక సభ్యులకు నాలుగవ దశలో అనుమతి లభించినది.

ఈ సత్యాగ్రహంలో కృష్ణాజిల్లానుంచి డా॥ పట్టాభిసీతారామయ్య, ఎర్నేని సుబ్రహ్మణ్యం, అయ్యదేవర కాళేశ్వరరావు, వేముల కూర్మయ్య, మాగంటి అంకినీడు, కాశీనాధుని పూర్ణమల్లిఖార్జునుడు ప్రభృతులు జైళ్ళకు వెళ్ళిరి. ఇంకా ఎంతోమంది జైళ్ళకు వెళ్ళిరి. వారి జాబితా వేరే అనుబంధములో ప్రకటించబడినది.

అనేకమంది మహిళలుకూడా ఈ సత్యాగ్రహములో పాల్గొనిరి. శ్రీమతి ఎర్నేని అమృతమ్మ, ఎర్నేని లీలావతమ్మ, ఎర్నేని కస్తూరిదేవి, ఎర్నేని రాధామనోహరంగార్లు గ్రామాలవెంట తిరిగి కాంగ్రెసు పతాకముతో ఊరేగుతూ, యుద్ధ వ్యతిరేక ప్రచారం జిల్లా అంతటా సాగించిరి. చివరకు బందరులో వీరిని అరెస్టుచేసి, శిక్షలు విధించి, జైళ్ళకు పంపిరి. వీరందరు 1942 ఉద్యమములోకూడా జైళ్ళకు వెళ్ళిరి. వీరితోపాటు పూనూరు సుందరమ్మ, గాదిరెడ్డి పుట్లమ్మ, మలిరెడ్డి అన్నపూర్ణమ్మ, గోనుగుంట్ల లక్ష్మీనరసమ్మగార్లుకూడా ఉద్యమములో పాల్గొనిరి.

నందిగాము తాలూకాలో సూర్యదేవర అన్నపూర్ణమ్మ వగైరాలు సత్యాగ్రహంచేసిరి. అయితే వారిని అరెస్టుచేసి వదలివేసిరి.

తిరువూరు తాలూకా రెడ్డిగూడెం కాపురస్తులు చిలుకూరి సత్తిరెడ్డి తహశ్శీలుదారుకు నోటీసుయిచ్చి యుద్ధ వ్యతిరేక నినాదములతో సత్యాగ్రహముచేయగా ఆయనను అరెస్టుచేసి, ఆయనకు 3 నెలలు జైలుశిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించిరి. జరిమానా చెల్లించకపోయినచో 5 వారాలు శిక్ష అనుభవించవలసినదిగా తీర్పుయిచ్చిరి. శిక్షాకాలం అనుభవించి, జరిమానా చెల్లించకుండా 5 వారాలు జైలుశిక్ష అనుభవించిరి. అయినప్పటికీ వారి ఆస్తిని జప్తుచేసి వేలంద్వారా వెయ్యి రూపాయలు వసూలుచేసిరి. అనంతరం వచ్చిన కాంగ్రెసు ప్రభుత్వమువారు వారి జరిమానా డబ్బును వాపసు చేసినారు.

ముష్టిగుంట్ల వాస్తవ్యులు గద్దె రంగయ్యనాయుడుగారు 1930-32-42 ఉద్యమాలలో జైలుకు వెళ్ళినారు. వీరు మద్రాసులో స్థిరనివాసము

పర్వరచుకుని ఆంధ్ర కేసరి ప్రకాశంగారితో కలిసి పనిచేశారు. ఆంధ్ర కాంగ్రెసు సంఘ కార్యదర్శిగాకూడ పనిచేసిరి. మద్రాసు కార్పొరేషనులో పోటీలేకుండా అనేక పర్యాయములు సభ్యులుగా ఎన్నుకొనబడినారు. మద్రాసు ఆంధ్రులలో మంచి పలుకుబడిగల త్యాగశీలుడు. ముప్పిగుంట్లలో 1946లో జరిగిన జిల్లా రాజకీయ మహాసభకు అధ్యక్షులుగా వున్నారు. ఈ సభను ప్రకాశం పంతులుగారు ప్రారంభించినారు. ప్రజాహిత సంస్థలలో అనేక కీలక స్థానములను అలంకరించిన ప్రజాసేవకుడు.

1942లో గంగు సత్యం, నన్నాక రామకృష్ణయ్య, డా॥ మాదేపల్లి సుబ్బారావు, నూరెల్లీ సాహెబ్ వగైరా యువకులు అనేక కార్యక్రమాలలో పాల్గొని పనిచేశారు.

## 1942 క్విట్ ఇండియా ఉద్యమము

1941 చివరకు వ్యక్తిగత సత్యాగ్రహులందరు బయటకు వచ్చిరి. 1941 డిశంబరులో జర్మనీ తరపున జపాను యుద్ధములో ప్రవేశించినది. జర్మనీకూడ రష్యాపై విరుచుకుపడినది. ఇంగ్లండు తరపున అమెరికాకూడ యుద్ధములో దిగినది. జర్మనీ, జపాను సైన్యాలు కొద్ది రోజులలో ఇండియాలో కల్సుకొనగలవని వదంతులు వ్యాపింపసాగినవి. జపాను బర్మాను ఆక్రమించుకొని కాకినాడ, విశాఖపట్నముల తీర ప్రాంతాలపై బాంబులు కురిపించినది. ఇండియాలోని ప్రజలు ఆందోళన చెందసాగిరి. ఇంగ్లండు ఓడిపోవుట తథ్యమని సర్వత్ర నమ్మకం హెచ్చుచుండెను. ఇంగ్లండుపై కోపం, జపానుపై అభిమానంగా ప్రజలలో ప్రస్ఫుటింపసాగెను. ఈ పరిస్థితుల నన్నింటినీ తట్టుకొని, భారతదేశమునకు స్వతంత్రం సంపాదిం చాలని, కాంగ్రెసు నాయకులు తీవ్రముగా ఆలోచించసాగిరి.

అక్కడ ఇంగ్లాండుకు ప్రాణ సంకటమైన పరిస్థితులు ఏర్పడినవి. ఆ పరిస్థితినుంచి బయటపడుటకు అది చావుబ్రతుకులతో పోరాడుచుండెను. ఇండియాను సంతృప్తి పరచుటకు క్రిప్సు రాయబారము పంపిరి. భారత నాయకులతో సుదీర్ఘమైన చర్చలు జరిగిన అనంతరం క్రిప్సు ప్రణాళి అనేది వాగాడంబరము తప్ప మరేమి లేదని వీరు త్రోసిపుచ్చిరి. క్రిప్సు తిరి స్వదేశానికి వెళ్ళిపోయెను.

స్వాతంత్ర్యము నిమిత్తం అంతిమ పోరాటము జరిపి తీరవలసిన పరిస్థితులు దేశంలో నానాటికి హెచ్చు అగుచుండెను. సుభాస్ చంద్రబోసు దేశం వెలుపలనుండి పోరాటం సాగించుచుండెను. దేశం అంతటా ఉద్రేక వాతావరణం పెరుగుచుండెను. ఈ పరిస్థితిలో 1942 ఆగస్టు 8 వ తేదీన బొంబాయిలో అఖిలభారత కాంగ్రెసు సంఘం సమావేశమైనది. ఉద్రేక పూరిత చర్చల అనంతరం బ్రిటిషువారు ఇండియానుంచి వైదొలగిపోవలసినదిగా ఒక చారిత్రాత్మకమైన తీర్మానము చేయబడెను. దీనికే "క్విట్ ఇండియా తీర్మానం" అని పేరు వచ్చినది. తీర్మానానంతరము నాయకుల నందరిని ప్రభుత్వం అరెస్టులుచేసి, రహస్య ప్రదేశాలకు పంపివేశారు.

కృష్ణాజిల్లా కాంగ్రెసు నాయకులలో ముఖ్యులు చాలమంది 1942 ఆగస్టులోనే అరెస్టుకాబడి జైళ్ళలో పెట్టబడిరి. జిల్లా అంతటా దేశభక్తి పెల్లుబుకుచున్నది. సరియైన నాయకత్వములేక ఎవరికితోచిన విధముగా వారు తమ దేశభక్తిని ప్రదర్శించసాగారు. జైలుకుపోగా మిగిలవున్న నాయకులలో శ్రీ అన్నె అంజయ్య, కామినేని వెంకటప్పయ్యగారలు అండర్ గ్రౌండులో వుండి రాత్రనక పగలనక జిల్లా అంతటా తిరిగి యువకులకు ప్రోత్సాహమిస్తూ వుద్యమాన్ని నడపసాగారు. ఈ రహస్యోద్యమమునకు ముదునూరు కేంద్రమైనది. అఖిలభారత రహస్యోద్యమ నాయకులు ఈ కేంద్రమునకు వచ్చివెళ్ళేవారు. "జయభారత్" అనే రహస్య పత్రిక "రోటరీ మిషన్" పై తీయబడి యీ కేంద్రమునుంచి జిల్లా అంతటా పంపబడేది. కేంద్ర రహస్య ఉద్యమ సాహిత్యమంతా డా తెన్నేటి చలపతిరావుగారి ద్వారా యీ కేంద్రానికి అందించబడేది శ్రీ ఇవటూరి కోటేశ్వరరావుగారు కలిసి పనిచేస్తూవుండేవారు. వీ నాయకత్వాన ఒకనాటి రాత్రి బుడమేరు బ్రిడ్జికి డైనమైట్లు పెట్టగా అ పేలి బ్రిడ్జికి కొద్దిపాటి నష్టము కలిగినది. ఈ కోటేశ్వరరావుగార ఆంధ్ర సిమ్మెంటు ఫ్యాక్టరీలో చీఫ్ కెమిస్టుగా పనిచేస్తూ వుండేవారు తరువాత వీరు అనేక రంగాలలో కాంగ్రెసు కార్యకర్తగా పనిచేసినారు ఆకునూరు ఒక మజిలీగా శ్రీ మాలెంపాటి వెంకట నరసయ్యగారిద్వార యీ సాహిత్యం వచ్చేది. ఈ రహస్య సాహిత్యంద్వారా వివిధ ప్రాంతా లోని ఉద్యమ కార్యకలాపములను తెలియచేస్తూ వుండేవారు. జిల్లాలో

యువకుల నందరను, జాతీయ విద్యార్థి, యువజన సంఘాలు స్థాపించి, స్వతంత్ర పోరాటమును తీవ్రముగా నడుపసాగిరి.

శ్రీ అంజయ్యా, వెంకటప్పయ్యగార్ల సలహాపై పటిష్టమైన యువజన ఉద్యమం నిర్మాణమైనది. దీనికి కారకులు భూపతి కోటేశ్వరరావు, కొల్లి రామకుమారవర్మ, సూరపనేని శేషగిరిరావు, వంకదారు బలరాం, గుమ్మడి అమ్మేశ్వరరావు, మైనేని రామకోటయ్యా మొదలైన యువకులు. వీరంతా సామ్యవాద భావాలుగల అభ్యుదయవాదులు.

వీరు జిల్లాలో అనేక సమావేశాలు జరిపి, యువకులను సమీకరించి, వుద్యమము చల్లారిపోకుండ జిల్లాలో అనేక కార్యక్రమాలు సాధించారు.

గంగవల్లి చెరువు లోతట్టుఊదులు పొడిసిన సందర్భములో లింగాల గ్రామమునసబు శ్రీ కంజుల లింగారెడ్డిగారు వలంటీర్లకు సహాయపడినారు. 1942 ఉద్యమములో ప్రభుత్వమునకు అసమ్మతి తెల్పుచూ రావిరాల గ్రామకరణంగారైన శ్రీ రావిరాల గోపాలకృష్ణమూర్తిగారు తమ ఉద్యోగమునకు రాజీనామా యిచ్చిరి.

1942 ఆగస్టు 25న కొమిరవోలుగాంధి ఆశ్రమములో శ్రీ గోనుగుంట్ల సుబ్రహ్మణ్యంగుప్తగారి అధ్యక్షతన 200 మంది కార్యకర్తల రహస్య సమావేశం జరిపినారు. అనంతరం బెజవాడ బందరు రైల్వేలైను సేరీ కలవపూడి సమీపములోప పట్టాలు పీకివేయబడినవి. శ్రీ చలసాని నాగ భూషణం (తండ్రి రామయ్య)గారి ఆధ్వర్యంలో కలవపూడి గ్రామస్థులు అంగలూరు గ్రామస్థులు, ఆ చుట్టుపట్ల గ్రామస్థులుకూడ పాల్గొనిరి. ఆ గ్రామాలన్నీ పోలీసు జులుమునకు లోనయి అనేక కష్టాలు అనుభ వించారు, తర్వాత వురుటూరులో మలిపెద్ది దశరథరామయ్యగారి ఇంట మరొక రహస్య సమావేశం జరిగింది. కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు చేయబడినవి. మరునాడు ఆ చుట్టుపట్లగల టెలిగ్రాం, టెలిఫోన్ తీగెలను నరికివేయడం జరిగింది. ఈ ఉద్యమంతో పైన తెల్పిన యువకులతోపాటు రావి వెంకటసుబ్బారావు, యం. ఎ., యల్. యల్. బి., వల్లభనేని కాశీ విశ్వనాథం, పునుకొల్లు సీతారామాంజనేయులు, చిగురుపాటి వెంకటేశ్వర రావు, మాకినేని గోపాలకృష్ణయ్యా, లింగంనేని వెంకటామయ్యా, వల్లూరుపల్లి వెంకట సుబ్బారావు, యార్లగడ్డ వెంకట కృష్ణారావు,

బొందలపాటి శివరామకృష్ణయ్య, కొనరాజు బసవయ్య వగైరా ఎందరో యువకులు. కార్యరంగములో దూకారు. వీరికి గుడివాడ, పెదముత్తేవి కేంద్రాలుగా వుండేవి.

1942 ఆగష్టు 20 న పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ మద్దాలి జగన్నాధంగారిని పునాదిపాడులో వారి యింటివద్ద అరెష్టు చేసిరి. కంకిపాడు పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వస్తుండగా కంకిపాడులో ఒక పెద్దగుంపు వారిని అడ్డగించి బ్రిటిష్ ప్రభుత్వం నశించాలని నినాదములు యివ్వసాగిరి. పోలీసులు తీవ్రమైన లాఠీచార్జిచేసి గుంపును చెదరగొట్టిరి. ఆ రాత్రి జగన్నాధంగారిని డిటెన్యూగా పంపివేసిరి.

మరికొందరు యువకులు పునాదిపాడు కేంద్రముగా బ్రహ్మాండమైన బలమైన ఉద్యమాన్ని సాగించారు. మద్దాలి జగన్నాధం, కాసరనేని జనార్ధనరావు, అక్కినేని భాస్కరరావు, పి. అప్పలాచార్యులు, బొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, మైనేని రామకోటయ్య, మాకినేని గోపాలకృష్ణయ్య, పాతూరి వెంకటేశ్వరరావు, మద్దాలి వెంకటేశ్వరరావు, గుత్తా రాజారావుగార్లు వగైరా మరికొందరు యువకులు కంకిపాడు చుట్టుప్రక్కల తీవ్రమైన రహస్య కార్యక్రమాలు నిర్వహించారు. కాసరనేనివారిపాలెం, చోడవరం, వల్లూరిపాలెం, వణుకూరు, కొయ్యగూరపాడు గ్రామాలలో రహస్య సమావేశాలు జరిపి, అనేక ముఖ్యనిర్ణయాలు చేశారు. మద్దాలి జగన్నాధం గారి సలహాపై పి. అప్పలాచార్యులు, పోలవరపు జగన్నాథం, మద్దాలి వెంకటేశ్వరరావు, కోమటి వెంకటేశ్వరరావుగార్లు ఉప్పులూరు, పెనమలూరు, చోడవరం, కంకిపాడు, పునాదిపాడు గ్రామాల ప్రజలు రాత్రిపూట ఉప్పులూరు స్టేషన్ తగులపెట్టినారు. వినాయకచవితినాడు పునాదిపాడు హైస్కూలుపాకలు తగులబెట్టిరి. చుట్టుప్రక్కల ప్రాంతములో తీగెలు తెంపివేసిరి. ఉప్పులూరుస్టేషను తగులబెట్టిన కేసు బెజవాడ సబ్‌కలెక్టరు దగ్గర జరిగినది. సరియైన సాక్ష్యాలు దొరకలేదు. అందువల్ల తన తీర్పులో స్టేషను తగులబెట్టినమాట నిజము. అయితే యీ ముద్దాయిలే తగులబెట్టినట్లు నాకు నమ్మకము కలుగలేదు—అని సబ్‌కలెక్టరు తీర్పులో వ్రాశారు. తరువాత ఉప్పులూరు పునాదిపాడు గ్రామములమీద సామూహిక పన్నులు విధించి వసూలుచేశారు.

## కాసరనేనివారిపాలెం

ఒకరోజు రాత్రి కాసరనేనివారిపాలెంలో రహస్య సమావేశం జరిగింది. ఆరోజు పగలు ఒక్కొక్కరే అక్కడకు చేరుకున్నారు. అక్కడ ఏర్పాట్లన్నీ శ్రీ కాసరనేని జనార్ధనరెడ్డిగారు చేశారు. జిల్లా నలుమూలల నుంచి కార్యకర్తలు హాజరయినారు. నూకల వీరరాఘవయ్య, కోవెలమూడి రాఘవయ్య, పోతిన గణపతిరావు పాత్రుడు. కామినేని వెంకటప్పయ్య, పునుకొల్లు సీతారామాంజనేయులు, ఈమని రాజరత్నశర్మ, యలమంచిలి భాస్కరరావు మొదలగు ముఖ్యకార్యకర్తలందరు సమావేశమైరి. వర్షం జోరుగా పడుచున్నది. ఆ వర్షంలోనే అందరూ తడిసి అక్కడకు చేరుకోవడం జరిగింది. వల్లూరుపాలెం మజిలీనుంచి అంజయ్యగారిని తీసుకుని కుర్రి వెంకటరత్నం, కలపాల సూర్యప్రకాశరావుగార్లు కూడ అదే వర్షంలో అక్కడకు చేరుకున్నారు. భోజనాల అనంతరం సమావేశము ప్రారంభమయింది.

ఇంతలో కంకిపాడునుంచి రిజర్వుదళం బయలుదేరిందనీ, కాసరనేని వారిపాలెం వస్తున్నారని వార్త వచ్చింది. త్వరత్వరగా సమావేశం పూర్తిచేసుకుని ఎక్కడివారక్కడే బయలుదేరి తెల్లవారక ముందే వెళ్ళిపోయిరి.

ఉదయం 8 గంటలకు చావుబ్రతుకులతో మిలిటరీవారు ఆగ్రామం వచ్చారు. గ్రామస్థులంతా ఐక్యముగా వుండి రాత్రి జరిగిన ఆనవాలు కూడా లేకుండాచేసి కించిత్తు కూడా వారికి సమాచారం ఇవ్వరైరి. ఎవరిని అడిగినా ఎవరు మాగ్రామం రాలేదని గట్టిగా చెప్పదొడగిరి.

గ్రామస్థులందరను ఒకచోటికి పిలిచి బెదరించిరి. ఎంత ఒత్తిడి చేసినా చెప్పకపోయేసరికి కొందరిని వెంట తీసుకొనివచ్చి కంకిపాడు స్టేషనులో సాయంత్రంవరకూ వుంచి వదిలివేసిరి. ఇది ఒక చిరస్మరణీయమైన సమావేశం. ఒక పగలూ రాత్రి పెండ్లి ఏర్పాట్లులాగా చేయబడినవి. అసలే చిన్న గ్రామం. అందరూ కాసరనేని జనార్ధనరావుగారి అభిమానులు. వారు ఏది చెబితే అదివారికి వేదం. అందువల్ల అక్కడ

ఒక పగలు, రాత్రి వుండగలిగారు కార్యకర్తలు. అంతటి ఏర్పాట్లను కూడా పోలీసులు వచ్చుసరికి ఆనవాలు లేకుండా చేశారంటే కమిటీవారి ఐకమత్యం వెల్లడగుచున్నది.

## ముదునూరు

ముదునూరు ప్రధాన కేంద్రముగావుండి, జిల్లా అంతటా ఆదేశాలు పంపబడుతూ, మూడు సంవత్సరాలు ఎడతెరిపిలేని ఉద్యమాన్ని నడపటం జరిగినది. 1942 డిశంబరులో శ్రీ అన్నే అంజయ్యగారిని 100 పోలీసులు వలపన్ని తెల్లవారు ఝామున ఒక రహస్య ప్రాంతము నుండి వస్తూండగా అరెస్టుచేసిరి శ్రీ అంజయ్యగారిని డిటెన్యూగా తీసుకొని వెళ్ళినారు. భట్లపెనుమర్రులో శ్రీ కామినేని వెంకటప్పయ్యగారినికూడ యిలాగే వలపన్ని అరెస్టుచేశారు. అయినా ఉద్యమం ఆగలేదు. సామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, యలమంచిలి భాస్కరరావు, దాసు రామస్వామి వగైరా మరికొందరు యువకులు ముదునూరు కేంద్రములో వుంటూ, పామర్రు, వుయ్యూరు, వీరంకిలాకు సెంటర్లలో టెలిఫోను తీగలు, కరెంటు తీగలు తెగకొట్టడం చేస్తూవుండేవారు. వీరు జిల్లా అంతటా తిరిగి మూడు సంవత్సరాలు విరామం లేకుండా యీ కార్యక్రమం సాగించారు. చివరకు వీరినీ నిర్బంధించి జైలుకు పంపారు.

ముదునూరు నాస్తిక కేంద్రమునుంచి ఒక దళము శ్రీ గోరాగారి నాయకత్వమున బయలుదేరి అనేక గ్రామాలలో ఉద్యమ ప్రచారము సాగించినందువల్ల, చర్చిలు బొమ్మ తగులబెట్టినందువల్ల, వారి నందరను అరెస్టుచేసి జైలుకు పంపిరి. మహమ్మదు యాసిన్, అప్పికట్ల జోసెఫ్ మాకినేని గోపాలకృష్ణయ్య, కాళే నాగేశ్వరరావు, దాసురామస్వామి, వగైరాలు నిడమానూరు రామవరప్పాడుమధ్య కరెంటులైను విచ్ఛిన్నం చేయుటకు ప్రయత్నము చేశారు. వీరికి సరియైన అనుభవము లేకపోయి నది. ఒక గొలుసును కరెంటు లైనుపైన వేసిన, అక్కడ కరెంటు ఆగిపోతుందని వూహించి గొలుసును అతిప్రియానతో విసరడము జరిగినది. వెంటనే పెద్ద ధ్వని కలిగింది. యువకులు కగారుపడి, ఎక్కడివారు అక్కడ వుడాయించిరి.

జైలునుండి విడుదలయి వచ్చిన అనంతరము శ్రీమతి గోపరాజు సరస్వతమ్మ, తుమ్మల చలమయ్యగార్లు ముదునూరునుండి కొంతమంది కార్యకర్తలతో మద్రాసువెళ్ళి రెండవసారి సత్యాగ్రహముచేసి అరెస్టుకాబడి శిక్షలు అనుభవించినారు.

మరొక దళము రహస్య కార్యక్రమము నిమిత్తము జయభారత్ పేపరు నడుపుటకు, రహస్య సాహిత్యం పంచుటకుగాను శ్రీ కలపాల సూర్యప్రకాశరావు నాయకత్వమున పనిచేయసాగినది. పోలీసులు విశ్వ ప్రయత్నము చేసికూడ, యీ రహస్య ప్రెస్సును పట్టుకొనజాలకపోయిరి. దీనికి తిరుగుడు ప్రెస్సు అని పేరు వచ్చినది.

1944 జనవరి 26న స్వాతంత్ర్య దినోత్సవమునాడు జండా ఎగురవేయుటకు, ముదునూరు నాస్తిక కేంద్రములో సమావేశమైన యువకులు నిర్ణయించారు. అప్పటికే అండరు గ్రౌండులోవున్న కురా్రి వెంకటరత్నం ఈ పనికి సిద్ధమైనాడు. అంజయ్యగారితోపాటు ఈయనకుకూడా వారంటు ఉన్నది. అంజయ్యగారు అరెస్టయిన రోజున ఇద్దరూ రహస్య స్థావరము నుంచి వస్తున్నారు. ఈయన పోలీసుల కనుగప్పి తప్పించుకున్నారు. అప్పటినుంచి రహస్య జీవితం గడుపుతూ రహస్యపత్రిక అచ్చువేయుట, పంపిణీచేయుటలో నిమగ్నమైవున్నారు. జనవరి 26 న బహిర్గతమై దేవాలయం ముందు జండాను ప్రతిష్టించినాడు. అవుసరమై ఆయనను తప్పించుటకు యువకులు సిద్ధముగా పొంచివున్నారు. ఇంతలో ఇద్దరు పోలీసులను వెంటబెట్టుకుని మున్సిఫ్‌గారు ఆ స్థలమునకు చేరుకున్నారు. చుట్టుప్రక్కల జనం గుమిగూడి పోలీసులకు దారిలేకుండా చేశారు. శ్రీ కురాి వెంకటరత్నం ధైర్యంగా జండాకట్టి వెళ్ళిపోయినాడు. యుద్ధమం ఆగిపోయేంతవరకు ఆయనను పోలీసులు అరెస్టు చేయజాలకపోయిరి. చివరకు వారంటు దానంతట అదే రద్దయిపోయినది.

అనంతరము ముదునూరుకేంద్రములో జరిగే రహస్య కార్యకలాపములను అరికట్టుటకుగాను గ్రామంలో రిజర్వు దళమును మకాం చేయించిరి. గ్రామచుట్టుప్రక్కల పొలాలన్నీ ప్రెస్సు నిమిత్తం గాలించసాగిరి. గ్రామసత్రంలో మకాంపెట్టి బజారునవెళ్ళే ప్రతిమనిషిని నిలవేసి సోదాచూడసాగిరి. అమాయకులను చావమోదటం మొదలు

పెట్టిరి. ప్రతిరోజూ బజార్లన్నీ గస్తీ తిరుగుతూ అనుమానంగల ఇండ్లలో ప్రవేశించి ఇంటిలోని సామానులు ధ్వంసముచేయుట, బియ్యము, కోళ్ళు మొదలయిన ఆహారవస్తువులు దోచుకొని వెళ్ళుట సాగించుచుండిరి. ప్రజలను భయభ్రాంతులనుచేసి రహస్యపత్రిక వునికిని బయటకులాగాలని ఎన్నో క్రూరచర్యలకు తలపడిరి. ఎంత చేసినను ఎన్ని బాధలు పెట్టినను ప్రజలు సహించారేగాని ఏమీ వారికి సమాచారము అందించబడలేదు.

వీరి భీభత్సకాండను చూచి ప్రెస్సును కుందేరు బ్రహ్మచర్య ఆశ్రమమునకు తరలించటం జరిగింది. ఈ ఆశ్రమము పాలడుగు శేషాచలంగారు స్థాపించిరి. ఎటుచూచినా మూడుమైళ్ళ దూరంలోగల ఏకాంత ప్రదేశములో వారు ఈ ఆశ్రమము స్థాపించి ప్రశాంత జీవనం జరుపుకుంటూ స్వసంఘ పౌరోహిత్యం ప్రచారకులుగా వుండెడివారు. ఈ ఆశ్రమములో హిందీ విద్యాభ్యాసంచేసే వర్మ అను తోటకూర అప్పారావుకు ఈ ప్రెస్సు బాధ్యత చూడమని వారే అప్పగించిరి. అప్పటి నుంచి రాత్రి పూట ముదునూరునుంచి రోజుకు ఇద్దరుచొప్పున వెళ్ళి ప్రెస్సులో "జయభారత్" పేపరు ప్రింటింగు చేసుకుని తెల్లవారకముందే ముదునూరుకు చేర్చేవారు. అక్కడినుంచి నిర్ణీత కార్యక్రమం ప్రకారం అన్యప్రాంతాలకు పంపించ బడుతుండేది. దీనిని ఎలాగో రిజర్వు పోలీసులు పసిగట్టినారు. ఒకరోజు రాత్రి ఆశ్రమంనుంచి వచ్చేదారిలో ముదునూరుకు 3 మైళ్ళదూరంలోగల నాగన్నగూడెం వద్ద రహస్యంగా కాపువేశారు. ఆ రోజున కుర్ర వెంకటరత్నం, తుమ్మల వెంకట సుబ్బయ్యగారలు ఆశ్రమములో తమ పనిని యథాప్రకారము పూర్తిచేసుకుని అదే దారిన వచ్చుచుండిరి. మారు వేషములో పోలీసులు వారిని ప్రశ్నలు వేయ సాగిరి. కొంతతడవు సంభాషణ జరిగిన తర్వాత వీరు మారుపేర్లు చెప్పి బయలుదేరిరి. కొంతదూరం వీరిని పోలీసులు వెంబడించిరి. బాగా చీకటిరాత్రి. ఇక లాభంలేదని దారితప్పించి ప్రక్కకు తిరిగి ఇద్దరు చెరియొక వైపుకు పరుగెత్తసాగిరి. వీరికి బాగా తెలిసిన ప్రదేశముగుట వల్ల వీరు జోరుగా పరుగెత్తుకునిపోయిరి. దారి తెలియని పోలీసులు మాగాణిగట్లలో వీరితో పరుగెత్తజాలక గట్లుతగిలి క్రిందపడిపోయిరి. ఇంతలో వీరిద్దరు అదృశ్యమై వారికి చిక్కలేదు.

ఈ సంఘటన జరిగిన అనంతరం ఆ ప్రెస్సును ఆశ్రమము నుంచి తరలించి ఆకునూరుకు మార్చడం జరిగింది. ఈ సంఘటన అనంతరం గ్రామంమీద మరింత వత్తిడి ఎక్కువయినది. అంతట గ్రామ పెద్దలు బందరులో సూపరెన్టెంటుకు ఈ అత్యాచారములను వివరంగా చెప్పుకొనిరి. తర్వాత 2, 3 రోజులలో రిజర్వుదళమును గ్రామంనుంచి ఎత్తివేసిరి.

## జగ్గయ్యపేట బాంబు కేసు

యుద్ధనిధికి విరాళాలు యివ్వవద్దని రేపాల బుచ్చిరామ శేషయ్య శ్రేష్ఠి, పెద్దాపురపు వెంకటనారాయణగార్లు గ్రామాలన్నీ తిరిగి ప్రచారం చేసిరి. తహశ్శీలుదారు బలవంతముగా వసూలుచేయ మొదలుపెట్టెను. గ్రామాధికారులు తమ దస్త్రములను వప్పగించి వేసిరి. వెంటనే తహశ్శీలుదారు వీరిని అరెస్టు చేయించెను.

యుద్ధనిధి నిమిత్తము టిక్కెట్లు బలవంతంగా అంటగట్టి ఒక నాటకము జిల్లాకలెక్టరు మహంతిగారి సమక్షమున వేయించుటకు యేర్పాట్లు చేయబడెను. దీనిని భగ్నము చేయవలెనని డా॥ కలవకొలను శోభనాద్రిగారి నాయకత్వమున, ధూళిపాళ్ళ వెంకటేశ్వర్లుగారి యింట్లో చేతిబాంబులు తయారుచేసిరి. వాటిని డ్రామాహాలులో ప్రేల్చుటకు నిర్ణయించిరి. ఈ బాంబులు ప్రేల్చుటకు శ్రీయుతులు వరగంటి అప్పారావు, బాలిన రాములు, బాలిన సత్యనారాయణ, కన్నెబోయిన వన్నూరుగారలు నియమించబడిరి. అయితే అక్కడకు పోగానే వీరిలో వన్నూరు, బాలిన రాములుగార్లు, ఉద్రేకము పట్టలేక రెండు చేతిబాంబులను కలెక్టరున్నచోట విసిరివేసిరి. అవి ప్రేలి ఒకరిద్దరికి బాగా గాయములు అయినవి. కలెక్టరుకు ఏమీ ప్రమాదం జరగలేదు. కలెక్టరును చంపాలనే వుద్దేశ్యముతో ఈ బాంబులు వేశారని కాంగ్రెసు కార్యకర్తల పైన కేసు బనాయించినారు. దాని ఫలితంగా తూమాటి యోగానందాచార్యులుగారికి 7 సం॥రాలు మళ్ళ నాగయ్యగారికి 7 సం॥రాలు, దివ్వెల విశ్వనాథంగారికి 4½ సం॥రాలు డా॥ కలవకొలను శోభనాద్రిగారికి 3 సం॥లు, పెద్దాపురపు నాగభూషణం గారికి, నకిరికంటి కృష్ణమూర్తిగారికి, అమరవాది రామమూర్తిగార్లకు తలా ఒక సంవత్సరము శిక్షలు విధించబడినవి. డాక్టరు శోభనాద్రిగారు సబ్జైలునుండి పారిపోయి చాలకాలం అండర్ గ్రౌండులో వుండి పని

చేశారు. చివరకు పట్టుకొని అదనముగా 6 మాసాలు శిక్ష విధించి బళ్ళారి జైలుకు పంపిరి. మరి కొందరిపైన రుజువు కానందున వారిని వదలి వేసిరి. ఈ శిక్షలుపడిన వారందరూ అతిబీదవారు. అందుకని బొంబాయి నుంచి వారి కుటుంబాలకు కొంత ఆర్థికసహాయం జైలులోవున్న రోజులలో ముడుతూ వుండేది.

మరికొందరు యువకులు చుట్టుపట్ల గ్రామాలలో తిరిగి రహస్య సమావేశాలు జరిపి, తీగలు త్రెంచుట, పోష్టాఫీసులు దగ్ధంచేయుట మొదలగు అనేక రహస్య కార్యక్రమాలు జరిపినారు. అనుమానంపై కొన్ని యిండ్లు సోదాచేయగా పై కేసుకు సంబంధించిన బాంబులతయారు చేసే సామాగ్రి మీనిగ వెంకయ్యగారింట్లో దొరికింది. మరి కొంతమందిపై కూడా కేసులు పెట్టబడినవి. ఆనాడు జగ్గయ్యపేట యువకులు విరోచితమైన పోరాటం సాగించినారు. ఎన్ని బాధలు పెట్టినా చలించకుండా స్వాతంత్య్ర పోరాటములో ముందు నిలిచినారు.

గారపాటి సుబ్రహ్మణ్యాం అను కార్యకర్త 1930లో మైలవరంలో బహిరంగసభ పెట్టుటకు విజయవాడనుండి వెళ్ళినాడు. అక్కడి జమీందారు వీరి మీటింగు జరగకుండా చేసినారు. ఎవరినీ మీటింగుకు గానీయలేదు. టముకు వేయుటకు వీలులేదని అడ్డగించినారు.

అంతట విజయవాడ వెళ్ళి మరొకరోజున శ్రీమఠం బాలసుబ్రహ్మణ్యంగుప్తగారిని తీసుకునివచ్చి, తానే స్వయంగా డప్పు వాయించి జనాన్ని మీటింగుకు సేకరించినారు. విశేషమైన జనసమూహం ప్రోగయిన మీటింగులో మఠం బాలసుబ్రహ్మణ్యాం గుప్తగారు జమీందారు క్రూర చర్యలను, ప్రజా వ్యతిరేక ధోరణిని తీవ్రంగా విమర్శించినారు. జమీందారు కుపితుడై వారిరువురను జైళ్ళకు పంపించుటకు పోలీసులతో కుమ్మక్కయినారు.—

జైలునుంచి రాగానే జయంతిపురం దగ్గర అడవిలో స్థావరం ఏర్పరచుకొని, సైక్లోస్టయిల్ మిషన్‌తో కరపత్రములు అచ్చువేసి వుద్యమ ప్రచారం తీవ్రంగా చేసినారు—

## నందివాడ కేంద్రం

1942 సెప్టెంబరు నెలలో నందివాడ, జనార్దనపురం గ్రామాల నుంచి శ్రీ ఈడుపుగంటి లింగయ్యగారి నాయకత్వాన 50 మంది యువకులు బయలుదేరి, ఒకనాటి రాత్రి దోసపాడు - గుడివాడ మధ్య రైల్వేలైను ఒక ఫర్లాంగుదూరం పీకివేసిరి. జనార్ధనపురం రైసుమిల్లు నుంచి కొన్ని రెంచీలు తీసుకుని, ఆ మిల్లు డ్రైవరును కూడా తీసుకువెళ్ళిరి. ఆ కార్యం పూర్తికాగానే, ఎవరిదారిన వారు వెళ్ళిపోయిరి. ఆ తరువాత ఒకనాటి రాత్రి 10 లారీలలో మిలిటరీవచ్చి నందివాడ గ్రామాన్ని చుట్టుముట్టి, ఇండ్లలోనివారి నందరిని దేవాలయమువద్దకు తీసుకునివచ్చి తీవ్రమైన లాఠీచార్జీచేసిరి. శ్రీయుతులు పూనూరి వెంకారెడ్డి, యార్లగడ్డ వెంకట నారాయణ, ఆచంట రామబ్రహ్మం, ఈడుపుగంటి లింగయ్యగార్లను స్పృహతప్పునట్లుగా కొట్టిరి. ఎంత కొట్టినను, ఎవరూ రహస్యము బయట పెట్టలేదు. తరువాత కొంతమందిని అరెస్టుచేసి, లారీలలో తీసుకొని పోయిరి. గుడివాడ కోర్టులో కేసులుపెట్టి శిక్షలు విధించిరి.

**గుడివాడ:** గుడివాడటౌను కాంగ్రెసు అధ్యక్షుడు కూరాళ్ళ భుజంగ రావుగారి నాయకత్వాన 20 మంది యువకులు సంవత్సరమువరకు ఉద్యమాన్ని ఆరనియ్యకుండా గుడివాడలోను, చుట్టుపట్ల గ్రామాలలోను తీవ్రముగా కొనసాగించిరి. వీరి ఆధ్వర్యముననే దొండపాడు, మోటూరు గ్రామస్థుల సహాయముతో మోటూరు - గుడివాడల మధ్య రైలుపట్టాలు పీకివేయడము జరిగినది. వీరిలో చాలమంది తీవ్రమైన హింసాకాండకు లోనయిరి. అనేకమంది దీర్ఘకాలిక శిక్షలకు గురియైరి.

**చౌటపల్లి:** శ్రీ అట్లూరి సత్యనారాయణ, పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావుగారి నాయకత్వంలో 50 మంది పైగా చౌటపల్లి గ్రామస్థులు చుట్టుప్రక్కల గ్రామాలలోని రైలుపట్టాలు పీకుట టెలిఫోను తీగలు త్రెంచుట వగైరా కార్యక్రమాలు సెప్టెంబరు అక్టోబరు నెలలలో నిర్వహించిరి. వీరిపై పోలీసు జులుము తీవ్రంగా జరిగినది. సాముదాయక జరిమానాలు విధించిరి.

**కవుతరము:** కృష్ణాజిల్లాలో కవుతరం గ్రామము దేశభక్తికి పేరొందినది. 1905 నుంచి ప్రతి జాతీయ వుద్యమములోను అగ్రగామిగా వుండి ఎందరినో దేశభక్తులను పెంచిన గ్రామమిది. బొబ్బా వెంకట శేషయ్య (దేశాభిమాని) కానూరు చినవెంకట దాసయ్య, కానూరు రామానందం (విప్లవవీరుడు), బొబ్బా ఆదినారాయణమూర్తి మొదలగు ఎందరో దేశభక్తులు జన్మించిన గ్రామం. సుప్రసిద్ధ దేశభక్తుడు, వుపన్యాస చక్రవర్తి శ్రీ చెరుకువాడ వెంకట నరసింహంగారికి ఆశ్రయమిచ్చి, జాతీయ విద్యాలయంస్థాపించి ఎందరినో దేశభక్తులను తయారుచేయించిన ప్రదేశము. స్వదేశీ అభిమానంతోపాటు గాంధి ఆదర్శాలకు, తీవ్ర విప్లవ రాజకీయాలకు, అభివృద్ధికాముకమైన సోషలిస్టు ఆదర్శాలకు, కమ్యూనిస్టు దృక్పథానికి, త్యాగమయ జీవితాలకు అంకితమైన ఎందరో దేశభక్తులు ఇక్కడగలరు. ప్రతి స్వాతంత్రపోరాటములోను వీరందరు పాల్గొని జైళ్ళకు వెళ్ళియుండిరి. ఎందరో లాఠీచార్జీలకు గురియైరి. 1942 క్విట్ ఇండియా వుద్యమంలో యువకులయిన బొబ్బా ఆదినారాయణమూర్తి సాహసము వర్ణించనలవి గానిది. ఎటుచూచినా చుట్టుప్రక్కల 20 మైళ్ళ దూరంలో తీగలు తెంచటం, పట్టాలు పీకడము, ఇతర ప్రతిష్టంభనా చర్యలలో వీరు పాల్గొనని సంఘటనంటూ లేదు. వీరిచేతిలో మంచి యువకుల బృందము వుండేది. అందు పామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, యలమంచిలి భాస్కర రావు, కొడాలి వెంకటచలంలాంటి సాహసులు వుండేవారు. ముదునూరు కేంద్రముతో అతి సన్నిహిత సంబంధము కలిగివుండేవారు. ప్రతి రహస్య సమావేశములోను అదినారాయణమూర్తిగారు పాల్గొనేవారు.

**ఆకునూరు:** స్వర్గీయ శ్రీకాకాని వెంకటరత్నంగారిస్వ గ్రామమిది. చుట్టుప్రక్కల వెంకటరత్నంగారి నాయకత్వములో బండిపాలాజురావు, కూచిభొట్ల చలపతిరావు (చినవోగిరాల) కంతేటి చలపతిరాజు (వుయ్యూరు) మాలెంపాటి వెంకట నరసయ్య(ఆకునూరు) మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి (కోలవెన్ను ఈయన తర్వాత కమ్యూనిస్టుపార్టీలో చేరినాడు) మొదలగు అనేకమంది యువకులు రహస్య కార్యకలాపములలో పాల్గొనెడివారు. ముదునూరు కేంద్రముతో సంబంధము కలిగివుండి, అక్కడ తయారయ్యే రహస్య పేపరును ఇతర ప్రాంతాలకు అందించుటలోను, ఇతర ప్రాంతాలనుంచి

అనగా కేంద్ర రహస్య వాఙ్మయమును ముసునూరుకు అందించుటలోను పరిశంసనీయంగా పనిచేసేవారు.

విజయవాడ నివాసి, ప్రముఖ కార్యకర్త అయిన ఈమని రాజ రత్నశర్మగారు ఈ కేంద్రముతో సంబంధము కలిగి కుర్రా వెంకటరత్నంతో సహా అందరు గ్రౌండులో పనిచేయుచూ, మాలెంపాటి వెంకట నర్సయ్యా గారి పెట్టకుపొంది పనిచేసేవారు. వీరిద్దరు కలిసి రాత్రించరులుగా పశ్చిమ కృష్ణాజిల్లాలో తిరగని ప్రాంతములేదు. ప్రతిచోట రహస్య సమావేశ ములు జరిపి యువకులను పుత్సాహపరిచి వుద్యమములోనికి ఆకర్షించేవారు. ముఖ్యమైన నాయకులు బయటినుండి వచ్చేవారికి వీలుగా జరిగే రహస్య సమావేశాల బాధ్యత వీరు వహించేవారు. బందరు - బెజవాడ రోడ్డు ప్రక్కన దగ్గరలోగల గ్రామాలలో ఈ సమావేశాలు తరచు జరుగు చుండేవి. ఆచార్య యన్. జి. రంగాగారు, కల్లూరు చంద్రమౌళిగారు, సంపత్కుమారాచారిగారు, బసవరాజు రంగశాయిగారు, తంగిరాల వీర రాఘవరావుగారు, కన్నెగంటి సూర్యనారాయణగారు, గౌతు లచ్చన్నగారు మొదలగు ఎందరోవచ్చి రహస్యంగా శ్రీ అన్నే అంజయ్యగారితో మాట్లాడి వెళ్ళేవారు. వీరిని ఒక్కొక్కరిని ఒక్కొక్కచోట సమావేశములు ఏర్పాటు చెయ్యబడేవి. తరచుగా ముసునూరుకు అందుబాటులోవుండే ప్రాంతాలలోనే ఈ సమావేశాలు జరిగేవి. గుడివాడ తాలూకా చిన పారుపూడి గ్రామం ఒక కేంద్రం. ఇక్కడకు ఎటునుంచి కూడా పోలీసులువచ్చే అవకాశంలేదు. ఇది ఒక దీవి. కొడాలి వెంకట్రామయ్య గారి యిల్లు అనువైన ప్రదేశంగా వుండేది. ఇక్కడ చాల సమా వేశాలు జరిగినవి. బందరురోడ్డు సమీపంలో గోపువానిపాలెంలో శ్రీ పుట్ట గుంట ఆంజనేయులుగారి నారింజతోట మరొక అనువైన ప్రదేశంగా వుండేది. ఇక్కడ సమావేశాలు తరచుగా జరుగుచూ వుండేవి. వూరికి వెలుపల మంచి దట్టమైన రహస్యస్థావరం. వచ్చిన వారందరికి పుట్టగుంట ఆంజనేయులుగారు మంచి సౌకర్యములు కలుగచేసేవారు. ఒక్కొక్కసారి నాయకులు 2-3 రోజులు ఇక్కడనే వుండిపోయేవారు. తర్వాత కనుమూరులో, కుందేరులో కూడ నాయకుల సమావేశాలు జరుగుతూండేవి.

1942 నవంబరు నెలలో కనుమూరులో రహస్య సమావేశం జరిగింది. శ్రీ కామినేని గోపాలకృష్ణయ్య, కామినేని సుబ్బారావు,

పోలవరపు నాగేశ్వరరావు, కొల్లిపర సూరయ్య, అన్నె అంజయ్య, ఈమని రాజరత్నశర్మ, రామకుమారశర్మ, మరికొందరు కార్యకర్తలు హాజరయినారు.

ఈ రహస్య సమావేశములో ఆర్థిక ఇబ్బందులను గురించి, డబ్బు వసూలు పర్చవలసిన అవసరాన్ని గురించి శ్రీ కామినేని వెంకటప్పయ్య గారు వివరించిరి. జిల్లాలో జరిగే రహస్య ఉద్యమవివరాలు అంజయ్య గారు, వెంకటప్పయ్యగార్లు వివరించిన అనంతరం, కామినేని గోపాల కృష్ణయ్య,పోలవరపు నాగేశ్వరరావుగార్లను డబ్బు వసూలుపర్చే బాధ్యత వహించమని కోరిరి. వారు అంగీకరించిరి.

గుడివాడ సమీపములో పెదపారుపూడి గ్రామమునందు మండవ హనుమంతరావుగారింటిలో షెల్టరు ఏర్పాటుచేసుకొనబడి కొన్ని రహస్య సమావేశములు జరుగుతూవుండేవి. గుడివాడ వాస్తవ్యులు కొడాలి వెంకటచలం, యలమంచిలి భాస్కరరావు, పామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, నిర్ణీత కార్యక్రమం ప్రకారం ప్రోగ్రామ్ నిర్ణయించుకుని తీగలు తెంపుట, విధ్వంసకాండ సాగించుట మొదలగు కార్యక్రమం నడిపి బాధ్యతవహించి వుండేవారు. నాయకులను రహస్య ప్రదేశములలోచేర్చి సమావేశాలు ఏర్పాటుచేసే బాధ్యత ఈమని రాజరత్నశర్మ, కుర్రా వెంకటరత్నంగార్లు వహించివుండేవారు. అలాగే కంకిపాడు పైభాగంలో జరిగే రహస్య కార్యకలాపాలకు శ్రీ కాకరనేని జనార్దనరావుగారు బాధ్యత వహించి వుండేవారు. ఇలాగే జిల్లాలో అన్ని ప్రాంతాలలోను పనిని విభజించుకుని పకబందీగా నడిపేటట్లుచేసి జిల్లా అంతటా వుద్యమాన్ని నడపటం జరిగింది.

నిడమానూరు సమీపములో శ్రీ చెన్నుపాటి రామకోటయ్యగారి నాయకత్వమున కొందరు యువకులు 1942 సెప్టెంబరులో రైలుపట్టాలు పీకి, తీగలు తెంపివేసిరి. వారిని నిర్బంధించి నానాహింసలు పెట్టారు. చుట్టుపట్ల నాలుగు గ్రామాలమీద అపరాధపువన్ను విధించారు.

శ్రీ వెల్లంకి పూర్ణచంద్రయ్యగారి నాయకత్వమున ఒక దళం కొండపల్లి గంగినేని మధ్య రైలుబ్రిడ్జీను డైనమేట్లతో పేల్చివేయుటకు బయలుదేరి వెళ్ళినది. నాలుగు రోజులు అడవులలోదాగి ప్రయత్నం చేశారు ఒకరోజు బ్రిడ్జికి డైనమైటు పెట్టారు. డైనమైటు శక్తివంత

మైనదికానందున కొద్దినష్టము మాత్రమే జరిగినది. తర్వాత గట్టిమిలిటరీ బందోబస్తు అన్ని బ్రిడ్జీలకు చెయ్యబడింది. శ్రీ పూర్ణచంద్రయ్యగారిని, వారి బృందమును వెంటాడి పోలీసులు పూర్ణచంద్రయ్యగారిని అరెస్టు చేశారు. వెల్లంకి సుబ్బారావు (తండ్రి సుబ్బయ్య) వీరితోపాటు పట్టుబడినారు. వీరు జై భారత్ అను రహస్య పేపరును నడుపుటలో కృషి చేశారు. శ్రీ కోవెలమూడి రాఘవయ్యగారి నాయకత్వాన, గొడవర్రు సెంటరులో మద్దాలి తాతాచారి, సూర్యదేవర సుబ్బారావు, చిగురుపాటి శేషయ్య, యలమంచిలి వెంకటేశ్వరరావు, మద్దాలి వెంకటేశ్వరరావు వగైరాలు తీగలు తెగ్గింపుట, పోస్టు బాక్సు తగులబెట్టుట మొదలగు రహస్య కార్యక్రమాలు నిర్వహించిరి.

తూర్పు కృష్ణాజిల్లా సహాయ కార్యదర్శి శ్రీ సూరపనేని వెంకటేశ్వరరావుగారి నాయకత్వమున 1942 సెప్టెంబరులో బందరు - బెజవాడ ట్రంకురోడ్డుకు నిడుమోలు దగ్గర గండికొట్టి రాకపోకలను స్థంభింపచేశారు. వీరితోపాటు నిమ్మకూరు, యలకుర్రు, నెమ్మలూరు, నిడుమోలు, మంత్రిపాలెం, కొరిమెర్ల గ్రామాల కార్యకర్తలు కొంతమంది పాల్గొన్నారు. కొరిమెర్ల గ్రామముపై (వెంకటేశ్వరరావుగారి స్వగ్రామం) రు 1600లు సాముదాయకపన్ను విధించి వసూలుపర్చబడినది. తర్వాత ప్రకాశంగారు ముఖ్యమంత్రిగ రాగానే ఈ మొత్తం వాపసు ఇవ్వబడినది. శ్రీ వెంకటేశ్వరరావుగారు వ్యక్తి సత్యాగ్రహములోకూడా జైలుకు వెళ్ళిరి.

కొయ్యగూరపాడు :

గన్నవరం తాలూకా కొయ్యగూరపాడు గ్రామంలో షుమారు 50 మంది యువకులు రహస్య సమావేశము జరిపినారు. అనంతరము ఒక నాటి రాత్రి దోనపాడు ఇందుపల్లి స్టేషన్‌ల మధ్య టెలిఫోను తీగలను తెగ్గించివేసి, రైలుపట్టాలు పీకివేసినారు. మూడురోజులు రైళ్ళు ఆగిపోయినవి. బాగుచేసిన వెంటనే మరల పీకిపారవేయుడము జరిగినది. దీనితో పోలీసులగాలింపు ఎక్కువ అయినది. అపక్క గ్రామస్థుడు ఒకతను పోలీసువద్ద డబ్బుతిని, వీరినందరను పట్టించియిచ్చెను. వారినందరను అరెస్టుచేసి, నానాహింసలు పెట్టిరి. ఎక్కువమందిమీద కేసులు పెట్టి జైళ్ళకు పంపిరి. ఆగ్రామముమీద సాముదాయక పన్నుకూడ విధించిరి.

కపిలేశ్వరపురం :

1930లో సత్యాగ్రహ దళముకు నాయకులుగా శ్రీకొల్లిపర సూరయ్య గారిని నిర్ణయించి కొంతమంది సత్యాగ్రహులతో గ్రామాల వెంట పంపుట జరిగింది. వీరు కపిలేశ్వరపురం గ్రామానికి చుట్టుప్రక్కల అనేక గ్రామాలు తిరిగి మద్యపాన నిషేధము గురించి, విదేశవస్త్ర బహిష్కరణ, తాటిగెలు నరుకుట మొదలగు కార్యక్రమముల గురించి ప్రచారం చేసిరి. కపిలేశ్వరంపురంలో చిగురుపాటి శివన్నారాయణ, కడియాల కోటయ్య వగైరా కొందరు యువకులు ఎక్కి గెలు నరికివేసినారు. వీరికి మద్దతుగా మరికొందరు వుండగా అందరిని పోలీసులు అరెస్టుచేసి తీసుకువెళ్ళినారు.

విదేశవస్త్ర దహన కార్యక్రమములో శ్రీ తాతినేని సుబ్బయ్య (తండ్రి రామయ్య) షేక్ మదారుసాహెబ్, తాతినేని కుటుంబయ్య, చిగురుపాటి కుటుంబయ్య, మాగంటి రామచంద్రరావు వగైరా యువకులు స్కూలునుంచి ఇంటికి వెళ్ళుతూవున్న మరికొందరు బాలురు ఈ వస్త్ర దహన కార్యక్రమంలో పాల్గొన్నారు, శ్రీమతి దువ్వూరి సుబ్బమ్మ గారు సభలో వుపన్యసించారు. సభకు శ్రీ కొల్లిపర సూరయ్యగారు అధ్యక్షత వహించినారు. వస్త్రదహన కార్యక్రమము ప్రారంభం కాగానే విద్యార్థులు తమ ఇండ్లకువెళ్ళి, ఇంటిలోని విదేశీవస్త్రములను (కొత్తవి) పెద్దవారికి తెలియకుండా తెచ్చి మంటలలో వేసిరి. ఇదిచూచి వారి పెద్దలు వారిని నిర్బంధించి దేహశుద్ధి చేసిరి.

1932 లో రిజర్వుపోలీసుదళం గ్రామములోకివచ్చి జండా స్థంభము విరగగొట్టి త్రివర్ణపతాకమును తగులబెట్టి స్తంభమును ముక్కలు ముక్కలుగా నరికి పేళ్ళుగా వేయించిరి. అక్కడ కనిపించిన ప్రతివ్యక్తిని లాఠీలతో బాది భీభత్సము గావించిరి.

వ్యక్తి సత్యాగ్రహముల సందర్భమున శ్రీ కొల్లిపర సూరయ్యగారు అధికారులకు నోటీసుయిచ్చి గ్రామమందిరమువద్ద సత్యాగ్రహము చేసినారు. వారిని అరెస్టుచేసి 6 మాసాలు శిక్షవిధించి, బి క్లాసు ఇచ్చినారు. అనంతరం తాతినేని సుబ్బయ్య (దొర) గారు వ్యక్తి సత్యాగ్రహము చేయుటకు అధికారులకు నోటీసు యిచ్చినారు. యుద్ధవ్యతిరేక నినాద

ములు చేయుచూ వీధులవెంట తిరుగుచుండగా వీరిని అరెస్టుచేసి 6 మాసాలు శిక్షవిధించి సి క్లాసు యిచ్చిరి.

**కొణకంచి:** కొణకంచినుంచి రేపాల బుచ్చిరామశేషయ్యశ్రేష్ఠిగారి నాయకత్వాన కొంత మంది యువకులు బయలుదేరి, నందిగామ, పెనుగంచిప్రోలు ప్రాంతాలలో టెలిఫోను, టెలిగ్రాము తీగలను త్రెంపుట, పోస్టాఫీసులు తగులబెట్టుట, చర్చిలు బొమ్మలు చేసి నడిబజారులలో మీటింగులుపెట్టి అక్కడ తగులబెట్టుట మొదలగు కార్యక్రమాలు జరిపిరి.

**తిరువూరు తాలూకా:** ది 18-8-42 న తిరువూరు తాలూకా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ మురుకుంట్ల వెంకటప్పయ్యగారిని తిరువూరులో అరెస్టు చేసి విజయవాడ తీసుకొని వచ్చినారు. అంతకుముందే అరెస్టుచేసిన శ్రీ కాకాని వెంకటరత్నం, శ్రీ మద్దాలి జగన్నాథంగారలను వుంచిన సబ్ జైలుకు వీరిని కూడా తీసుకొని వెళ్ళిరి. వీరు ముగ్గురను విజయవాడ సబ్ జైలులో ఒక నెలరోజులు వుంచి శ్రీ మురుకుంట్ల వెంకటప్పయ్యగారి మీద కేసుపెట్టి 9 నెలలు శిక్ష విధించి జైలుకు పంపిరి. తక్కిన యిద్దరు నాయకులను డిటెన్యూలుగ పంపించినారు.

శ్రీ వెంకటప్పయ్యగారి అరెస్టు అనంతరం శ్రీ గంగు సత్యనారాయణ నాయకత్వాన కొంతమంది విద్యార్థులు తిరువూరు హైస్కూలు పాకలు తగులబెట్టినారు. ఆ సందర్భంలో గంగు సత్యనారాయణను అరెస్టుచేసి, వారిపైన కేసు పెట్టి, 20 కొరడాదెబ్బలు విధించినారు. తిరువూరు పోలీసుస్టేషనులో, కొరడాదెబ్బలు శిక్ష అమలు చేయగా ఆ దెబ్బలకు ఆయన స్పృహతప్పి పడిపోయినాడు.

విస్సన్నపేటలో వున్న రహదారి బంగళాను, శ్రీ నాయుడు సుబ్బయ్య, శ్రీ జన్నాధాచారి, శ్రీ కాశీ సోమశేఖరాచారి, శ్రీ సాలారు సాహెబు మరికొందరు కలిసి తగులబెట్టిరి. వారిని అరెస్టుచేసి వారిపై కేసులుపెట్టి శిక్షలు వేసినారు.

**గుంటుపల్లి:** గుంటుపల్లి సెంటరులో మరొక రహస్య దళము ఏర్పడి, పెదర్ల వేణుగోపాలరావుగారి నాయకత్వాన చుట్టుప్రక్కల గ్రామాలలో కరపత్రాలు పంచుట, తీగలు త్రెంచుట, పోస్టుబాక్సులు

ధ్వంసముచేయుట, రైలుపట్టాలు పీకుట మొదలగు అనేక కార్యక్రమాలు సాగించిరి. వీరి నందరను అరెస్టుచేసి జైలు శిక్షలు విధించిరి.

**పోలుకొండ:** పోలుకొండనుంచి అట్లూరి వెంకట సుబ్బయ్య, పిన్నమనేని సత్యనారాయణ, యలమంచిలి భాస్కరరావుగార్ల నాయకత్వాన అనేకమంది యువకులు పుట్లచెరువు రైల్వేస్టేషన్ సమీపములో పట్టాలు పీకివేసిరి. వీరితోపాటు మొఖాసా కల్వపూడి గ్రామస్థులు, గండేపూడి గ్రామస్తులు, తమిరిశ గ్రామస్తులుకూడ పాల్గొనిరి. రైల్వే అధికారులు బాగుచేస్తూ వుంటే, మరల మరల పీకివేస్తూ వుద్యమాన్ని ఉధృతము చేసినారు. వారిని అరెస్టుచేసి, నానాహింసల పాలుచేసినారు. ముఖ్యమైన కార్యకర్తలనందరి జైళ్ళకు పంపిరి. ఆ గ్రామాలమీద సాముదాహిక పన్నులు విధించిరి. దివితాలూకా చినముత్తేవి గ్రామంలో, ఘంటసాల సీతారామాంజనేయులుగారినాయకత్వాన ఆ తాలూకాలోని కొందరు యువకులు రహస్య సమావేశం జరిపి, చల్లపల్లి అవనిగడ్డ ప్రాంతాలలో తీగలు తెగ్రించుట, పోస్టాఫీసులు తగులబెట్టుట మొదలగు కార్యక్రమాలు నిర్వహించిరి. పేర్లు తర్వాత యివ్వబడినవి.

జిల్లా అంతటా నంబూరి దూర్వాసమహర్షి తానే స్వయంగా వ్రాసిన హరికథలను గిరికథలను శ్రోతలకు శ్రవణానందంగా వినిపించుచు మధ్య మధ్య కాంగ్రెసు గురించి చెప్పుతూ, ప్రజలలో వీరావేశం కలిగించేవారు. శ్రీ మోపర్రుదాసు కూడ హరికథలద్వారా పద్యాలద్వారా ప్రజలను త్తేజపర్చి ఉద్యమంలో తీవ్రంగా పనిచేశారు. వీరితోపాటు మైనేని రామకోటయ్య, అక్కినేని భాస్కరరావు, కొల్లి రామకుమారవర్మ, భూపతి కోటేశ్వరరావుగార్లు యిచ్చే గంగా ప్రవాహంలాంటి ఉపన్యాసములను విని ప్రజలు వీరావేశం పొందేవారు. జాతీయ యువజన సంఘాలు జోరుగా యుద్ధవ్యతిరేక ప్రచారం చేశాయి. పెదముత్తేవి, గుడ్లవల్లేరు, విజయవాడ, వురుటూరు, దండిగానపూడి మొదలగుచోట్ల యీ యువజన మహాసభలు జరిపి, క్యాంపులు నడుపబడినవి.

ఈ జాతీయ యువజన సంఘాల విజృంభణను చూచి, కృష్ణాజిల్లా కమ్యూనిష్టులకు గంగ వెర్రులెత్తినవి. అనేకచోట్ల వీరి సభలను భగ్నము చేయ తలపెట్టినారు. యువజన కాంగ్రెసు కార్యకర్తలను కొట్టి భయ

పెట్ట సాగించినారు. ఇట్టిదే పాములపాడు రైతు మహాసభలో కమ్యూనిస్టులు కాంగ్రెసు వలంటీర్లను చితకబాదిన ఘట్టం. అక్కడ జరిగిన రైతు మహాసభకు స్వామి సహజానందను తీసుకువచ్చారు. వారికి యదార్థ విషయాలు తెలియచెప్పటానికి కొందరు కాంగ్రెసు యువకులు వెళ్ళగా వారిని కర్రలతో బాదినారు. పునుకొల్లు సీతారామాంజనేయులు, వల్లభనేని కాశీవిశ్వనాథంగార్లకు బాగుగా దెబ్బలు తగిలినవి. ఇదిచూచి సహజానంద అసహ్యించుకొని, నిజము గ్రహించి వెళ్ళిపోయినాడు. సీతారామాంజనేయులులాంటి సాధువును కొట్టిన దుండగానికి నిరసనగా కొందరు కమ్యూనిస్టు కారకర్తలు పార్టీని విడిచిపెట్టినారు.

అఖిలభారత రహస్యోద్యమ కార్యకర్తలకు ముదునూరు కేంద్రంతో సంబంధం కలదని పైన తెల్పబడినది. భారత కాంగ్రెసు సోషలిస్టుపార్టీ అర్గనైజరు అచ్యుత పట్వర్ధన్‌గారు మద్రాసు కేంద్రంగా చేసుకొని, దక్షిణ భారతంలో ఉద్యమాన్ని రహస్యంగా నడుపుచుండిరి. వారి ప్రతినిధిగా వచ్చిన మహారాష్ట్ర యువకుడు రంగనాథ కులకర్ణి అనే సోషలిస్టు కార్యకర్త శ్రీ అన్నే అంజయ్యగారి అడ్రసు తీసుకొని, ఒకనాటిరాత్రి ముదునూరు వచ్చిరి. వారు వచ్చుసరికే అంజయ్యగారు అరెస్టు కాబడిరి. శ్రీ కలపాల సూర్యప్రకాశరావు అండరు గ్రౌండులోవుండి కేంద్రమును యథాస్థితిగా నడుపుచుండిరి. రహస్య ప్రదేశంలో సూర్యప్రకాశరావుగారు కులకర్ణిగార్లు కలుసుకొనిరి, కృష్ణాజిల్లా రహస్య కార్యక్రమము యావత్తూ కలపాల సూర్యప్రకాశరావు కులకర్ణిగారికి వివరించిరి. అనంతరం కపిలేశ్వరపురం తాతినేని సుబ్బయ్య (దొర)గారి యింట్లో రహస్య సమావేశము జరిపినారు. ఆ సమావేశంలో భూపతి కోటేశ్వరరావు, రామకుమారవర్మ, మైనేని రామకోటయ్యగార్లను కులకర్ణిగారికి పరిచయం చేయటం జరిగింది. వారు కొంతకాలం రహస్యంగావుండి జిల్లా అంతటా రామకుమారవర్మ, సూర్యప్రకాశరావుగార్లతో కలిసి తిరిగి ఉద్యమ నిర్వహణకు సంతృప్తిచెందిరి. ఆయన కొన్ని అడ్రసులు సెంటరుకుపంపి రహస్యోద్యమ సర్క్యులర్లు తెప్పించుకొనే యేర్పాట్లు చేయబడినవి. మధ్యలో ఒకసారి మద్రాసువెళ్ళి పట్వర్ధన్‌గారితో కలిసి తిరిగి వచ్చిరి. వారికొరకు గాలించుతూవున్న రహస్య పోలీసులు వారిని వెంటాడి, వారు కనుమూరు, పెదముత్తేవి, చినముత్తేవిగ్రామాలు చూచుకొని, ఒకరాత్రి బందరువెళ్ళుచుండగాఅరెస్టుచేసిరి.

వారివద్ద దొరికిన ఆచూకీ ప్రకారం వెంటనే ముదునూరువచ్చి శ్రీ నాగులపల్లి సీతారామయ్యగారిని అరెస్టుచేసి వారివద్దగల రహస్య సర్క్యులర్లు స్వాధీనం చేసుకున్నారు. అదే సందర్భంలో ముదునూరులో నర్రా సత్యనారాయణగారి యిల్లు ముట్టడించి సోదా చేయగా ఏమియుదొరకలేదు. స్త్రీలు ముందుగా జాగ్రత్తపడి, యింటిలోని రహస్య వాఙ్మయాన్ని అంతటినీ బయటికి పంపివేశారు. సత్యనారాయణగారిని కస్టడీలోనికి తీసుకొని వదలివేసినారు.

ఈసందర్భములో కులకర్ణిగారిని జైలులో నానాహింసలు పెట్టి, రహస్యము చెప్పించుకొనుటకు యత్నించినారు. 6 మాసాలు విచారణ లేకుండా చీకటికొట్టులో వుంచారు. వారికి ఏమియు ప్రయోజనం కలుగలేదు. చివరకు విజయవాడ మేజిస్ట్రేటు కోర్టులో ఆయనపై కేసు పెట్టినారు. బందరు సబ్‌జైలునుండి ప్రతి వాయిదాకు విజయవాడకు తీసుకొని వచ్చేవారు. ఇది కనిపెట్టిన రామకుమారవర్మ చక్కని ప్లానువేసి వాయిదాకు వచ్చినపుడు విజయవాడలో హోటలుకు కాఫీనిమిత్తం తీసుకొని వెళ్ళినాడు. ఆ హోటలులో అదివరకే వేచియున్న మరికొందరు యువకులు, ఆయనతో బాతాఖానీ మొదలుపెట్టినారు. వేరే బల్లలవద్ద పోలీసులను కూర్చొనపెట్టి తృప్తిగా టిఫిన్ యిప్పించినారు. అదను దొరకగానే వర్మ కనుసైగ చేసినాడు. పోలీసుల కండ్లుకప్పి కులకర్ణిగారు పారిపోయినారు. వర్మతోసహా అందరు జనంలో ఎటువారు అటు తప్పుకున్నారు.

ఇక్కడ వర్మతోపాటు ఎక్కడి వారక్కడ పరారీఅయినారు. పోలీసులుస్టేషనుకువెళ్ళి, ఆరాత్రి విజయవాడలో కాశేశ్వరరావుగారి ఇల్లు, పునాదిపాడులో పోలవరపు మధుసూదనరావుగారి యిల్లు, కాసరనేని జనార్దనరావుగారి యిల్లు, ముదునూరులో సూర్యప్రకాశరావుగారి యిల్లు, కనుమూరులో వర్మగారి యిల్లు సోదాచేశారు. వారి గాలింపు తీవ్రంగా సాగుచున్నది.

శ్రీ కులకర్ణిగారిని, రామకుమారవర్మ తప్పించిన అనంతరం ఆయన ప్రక్కసందులోకివెళ్ళి రిక్షాలోఎక్కి అటుపొమ్మని సైగచేశాడు. ఆయనకు తెలుగు బాగారాదు. ఆరిక్షాతను ఏలూరు రోడ్డుకువెళ్ళి, తిన్నగా గుణదల

గట్టువరకు తీసుకువెళ్ళారు. అక్కడదిగి అతనికి ఒక రూపాయిచ్చి చీకటిపడువరకు గుణదలకొండపై ఎక్కి కూర్చున్నాడు. చీకటి పడగానే బందరురోడ్డు వైపుకు బయలుదేరి వెళ్ళి, ఆరాత్రి పెనమలూరు ఆశ్రమము నకు చేరారు.అక్కడ స్వాములవారి దర్శనముచేయుటకు వచ్చినానని గేటు కాపలావానికి ఎంత బ్రతిమాలి చెప్పినా వినక అతను లోనికి పోనీయకుండా అడ్డగించెను. సంభాషణవిని స్వాములవారు రానిమ్మని చెప్పగా వెళ్ళి ఆయనకు సాష్టాంగప్రణామంచేసి తనసంగతి ఆయనకు విన్నవించుకున్నాడు. ఇక్కడ వుండటం భద్రతకాదని కులకర్ణిగారి ముఖానికి విభూతివ్రాసి, ఈరాత్రంతా నడుస్తూనే వుండవలసినదని, ఎక్కడ విశ్రమించరాదని, నీకు జయము కలుగగలదని చెప్పి, తన సేవకుని పిలిచి ఈ బందరు కాలువ గట్టువెంట తెల్లవారువరకు ఈయనతో వుండి తిరిగి రమ్మని సహాయం పంపినాడు అలాగే తెల్లవార్లు నడిచి, వుదయం 10 గం॥లకు వీరంకి లాకు చేరుకున్నాడు. అప్పటికి ఆకలి మిక్కుటంగ బాధించసాగినది. అదివరకు అండర్ గ్రౌండులో తిరిగిన గుర్తుల ఆధారంగా కపిలేశ్వరపురం దొర సుబ్బయ్యగారింటికి చేరినాడు. ఆయన ఆసమయానికి ఇంటివద్ద లేరు. వారి అక్కగారికి ఈయన అదివరకే తెల్సుగనుక గుర్తించి ఆమె ఆదరించినది. వివరం ఏమిటని అడిగినది. నేను పోలీసులను తప్పించుకు పారిపోయి వచ్చానని వచ్చీరాని తెలుగులో ఆమెకు చెప్పాడు. అలా పారిపోయి రావడం గాంధి సిద్ధాంతాలకు వ్యతిరేకం గదా! నీవు పెద్ద తప్పుచేశావు. ఇలా చేయవచ్చునా అని మందలించినది. నేను దేశం కొరకు పనిచేయాలని తప్పించుకున్నాను. నేరు పిరికివాడను కానని జవాబు చెప్పగా ఆమె తృప్తిపడలేదు. ఆమె 1930-32 వుద్యమాలలో సత్యాగ్రహిగా జైలుకు వెళ్ళిన గాంధీ భక్తురాలు. మీరు నాకు ఆశ్రయ మివ్వ నిరాకరించినచో నేను వెళ్ళిపోతానని బయలుదేరిన ఈయనను ఆపి స్నానం చేయించి అప్పటికప్పుడు వంటచేసి భోజనం పెట్టినది. తృప్తిగా భోజనముచేసి కొంచెంసేపు విశ్రమించి అక్కడినుండి బయలుదేరి సాయంత్రం భట్లపెనుమర్రువెళ్ళి కామినేని వెంకటప్పయ్య గారింటికి వెళ్ళినాడు. వెంకటప్పయ్యగారు కూడా అండర్ గ్రౌండులో వున్నారు. కనుక వారు దొరకలేదు. ఇంటిలోని స్త్రీలు మర్యాదగా ఆహ్వానించి ఫలహారం పెట్టిరి. అనంతరం రాత్రి పొద్దుపోయి కనుమూరు చేరుకున్నాడు ఆగ్రామంలో కాపలాదార్లు ఈయనను పట్టుకున్నారు. ఎవరు నీవు ?

ఎందుకు వచ్చావు? అని ప్రశ్నలువేయసాగారు. వచ్చీరాని తెలుగులో నాది నైజాము, నేను మాదిగ కులస్థుడను, పొట్టపోసుకొనుటకు వచ్చాను అని చెప్పున్నాడు. వాళ్ళు ఎవరో దొంగ అని పట్టుకుని బాగా కొట్టి నారు. చేతులమీద ఒంటిమీద కర్రలతో చావబాదినారు. చివరకు ఇక్కడ నుంచి పొమ్మని పడదోసినారు. బ్రతుకుజీవుడా అని వారిబాధనుంచి తప్పించుకుని బందరురోడ్డు పైకివచ్చి పడమరగా బయలుదేరినాడు. పెద్ద వర్షం కురవ నారంభించింది. తడిగుడ్డలు పిండుకుని ఒకచెట్టు క్రింద కూర్చున్నాడు. ఆరాత్రిపూట జరజరా ప్రాకిపోయే పాములనుచూచి భయ పడిపోయి దారినపడి వుయ్యూర్యు దగ్గరకు చేరినాడు. ఈకష్టాలు పడేకన్నా ఏ పోలీసు స్టేషన్ కన్నా వెళ్ళి హాజరైతే మంచిదనే నిర్ణయానికి వచ్చాడు.

అప్పటికే మనిషి బాగా డస్సి పోయినాడు, వుదయం 9 గం॥ల వేళ వుయ్యూర్యు దగ్గర ఒక కాఫీహోటలులో కొందరు పత్రిక చదువుతూ వుండటం చూచాడు. "అందులో రంగనాథ కులకర్ణి పోలీసులనుంచి తప్పించుకున్నాడు. అతన్ని పట్టియిస్తే వెయ్యిరూపాయలు బహుమతి యిస్తామని" వున్న ప్రకటన వారు చదువుతూండగా విన్నాడు. అంతట తనను పట్టుకుంటే వెయ్యిరూపాయి లిస్తారా? అయితే ఎందుకు లొంగిపోవాలి అని నిర్ణయించుకుని అక్కడ నుంచి మెల్లిగా బయలు దేరినాడు. ఆరోజంతా తిరిగి, తిరిగి అతనికి ముదునూరు అంతుపట్టక రెండు మూడు గ్రామాలు తిరిగిన అనంతరం నాలుగవరోజు సాయంత్రం చీకటిపడుసరికల్లా ముదునూరు నాస్తిక కేంద్రమునకు చేరుకున్నాడు. అప్పటికి ముదునూరు గ్రామములో రిజర్వు పోలీసుదళం వుంది. వారు గ్రామమంతా అల్లకల్లోలం చేస్తున్నారు. కులకర్ణి వచ్చినాడని అండర్ గ్రౌండులోవున్న కురాకి వెంకటరత్నం, సూర్యప్రకాశరావులకు కబురు వెళ్ళింది. వారు ప్రక్కగ్రామంలో వున్నారు. ఆరాత్రి వారువచ్చి శ్రీ కొల్లి వెంకటదాసుగారితో మాట్లాడి వూరికి దూరంగావున్న వారి తమలపాకులతోటలో వుంచే ఏర్పాటు చేసినారు. కులకర్ణిగారి ఒళ్ళంతా దెబ్బలతో కణితలుకట్టి వున్నవి. కాళ్ళువాచి పోయినవి, ముళ్లు విరిగినవి. కాళ్ళన్నీ పుండ్లుకూడా పడినవి. శ్రీ వెంకటదాసుగారు ఆయుర్వేద వైద్యులు. మంచి శుశ్రూషచేసినారు. వారంరోజులు బాగా విశ్రాంతి పొందిన అనంతరం చాపరాల వెంకట నారాయణ, మొవ్వ సత్యనారాయణ

గారల ను సహాయంగా పంపి, మహమ్మదీయుల దుస్తుల ధరింపచేసి ఆవుట పల్లి స్టేషనుకు పంపించి అక్కడనుంచి వారిని విశాఖపట్నం మీదుగా నాగపూరుకు పంపించటం జరిగినది.

శ్రీ కుటుంబరావుగారి కొరకు దేశాలన్నీ గాలించి గాలించి ఆరుమాసాలు అనంతరం మరల బొంబాయిలో అరెస్టుచేసి విజయవాడ తీసుకువచ్చి సబ్ జైలులో బంధించిరి. సబ్ జైలులో అదివరకే నిర్బంధించబడియున్న బండి తిరుపతయ్యగారు, జగ్గయ్యపేట బాంబు కేసులోవున్న డా॥ శోభనాద్రి గారు, నర్సయ్యగారలుకూడ వుండిరి. ఎంతోకాలం విచారణ లేకుండా నిర్బంధించిరి. జైలులో గజ్జితో శరీరమంతా చెడిపోయినను ఎన్ని బాధల కైనా సహించి తన పట్టుదల సడలకుండా కాపాడుకున్నారు. ఈయన కేసు చాలాకాలం నడిచింది. ముదునూరు సెంటరునుంచి డబ్బుయిచ్చి ఒక ప్లీడరును పెట్టి వాదించబడినది. జాస్తి సీతామహాలక్ష్మమ్మగారు కూడా ఈయన తరపున ఉచితంగా వాదించి చివరకు కేసు కొట్టివేయడం జరిగింది. ఇంతలో వుద్యమం కూడా చల్లబడినది. తర్వాత స్వస్థలానికి వెళ్ళిపోయి నారు. అనంతరం హైదరాబాదు రజాకార్ల భీభత్ససమయంలో 2 సం॥లు కారాగార జీవితం గడిపినారు. పిదప హైదాబాదు ఆయుర్వేద ఫార్మసీలో మేనేజింగు డైరెక్టరుగా పనిచేశారు. ప్రస్తుతం వుస్మానియా యూనివర్సిటీలో మహారాష్ట్రభాషకు ప్రధానాచార్యులుగా పనిచేయు చున్నారు. యన్. జి. గోరే, రామమనోహార లోహియా, అచ్యుత పట్వర్ధన్, జయప్రకాశ నారాయణ వగైరా సోషలిస్టు నాయకులకు అత్యంత సన్నిహిత మిత్రులు.

కృష్ణాజిల్లాకు సంబంధించి సంతవరకు 'క్విట్ ఇండియా' ఉద్యమము అభ్యుదయ భావాలుగల పైన తెల్విన యువకుల స్వయం నిర్ణయ కార్య క్రమాల ద్వారానే నడిచినది. జాతీయ యువజన, విద్యార్థి సంఘాల ద్వారా యీ కార్యక్రమాలు యెక్కువగా చేపట్టబడినవి. 1943 లో వీటిని ప్రభుత్వము నిషేధించినది. తరువాత యువజన కాంగ్రెసు సంఘాలుగాను, విద్యార్థి కాంగ్రెసు సంఘాలుగాను పేరు మార్చుకొని, యీయువకులంతా అచంచల ధైర్య సాహసములతో కమ్యూనిస్టుల దేశద్రోహ ప్రచార పద్ధతులను బహిరంగంగా ఎదుర్కొనసాగిరి. ఈ కాలములో రామకుమారవర్మ, తన మిత్రవర్గము కలిసి, కమ్యూనిస్టుపార్టీ

తమ పార్టీసభ్యులకు జారీచేసిన 82 రహస్య సర్క్యులర్లు సంపాదించిరి. బహిరంగ సభలలో అందలి ఉద్దేశ్యములను బహిర్గతము చేసిరి. ఈ విద్యార్థి, యువజన కాంగ్రెసు సంఘాలు అన్నితాలూకాలలోను తమ అనుబంధ సంఘాలను ఏర్పరచుకొన్నవి. అప్పటికే ఉద్యమం చల్లబడినది. గాంధీగారు విడుదల కాబడినారు. విశ్రాంతి నిమిత్తం కొంతకాలం 'జుహూ'లో వుండినారు. తర్వాత కాంగ్రెసు కార్యవర్గ సభ్యులు విడుదలైనారు. దేశరాజకీయాలు నూతన పరిణామం చెందుతూవున్న రోజులవి. స్వరాజ్యం అతి సమీపంలో చేకూరే సూచనలు అగుపడుచూ వున్నవి. ప్రపంచయుద్ధంకూడ ఆగిపోయినది.

కమ్యూనిస్టులు ప్రకటించే ప్రతి కరపత్రానికి ప్రతి గ్రంధానికి వెంటనే యువజన కాంగ్రెసుకూడ కరపత్రాలు, పుస్తకాలు ప్రకటించి సమాధానాలు చెప్పడము జరిగినది. శ్రీరామకుమారవర్మ, యస్. పి. యస్. ప్రసాదరావు, భూపతి కోటేశ్వరరావుగార్లు ఈసాహిత్యం రచించేవారు. కాంగ్రెసు కార్యవర్గం 1942 నుండి కమ్యూనిస్టుల పాత్రను గురించి విచారణ ప్రారంభించినారు. కృష్ణాజిల్లానుండి వర్మ నాయకత్వాన మైనేని రామకోటయ్య, భూపతి కోటేశ్వరరావు వగైరాలు 'జుహూ' కు వెళ్ళి గాంధీగారికి విలువైన భోగట్టాను యిచ్చిరి. తదుపరి బొంబాయిలో పటేల్ కు కృపాలనీకికూడ వీరు మరొక రిపోర్టును సమర్పించిరి. ఈ రిపోర్టులనుచూచి నాయకులు ఆశ్చర్యపోయిరి. ఈసాక్ష్యాల నాధారంగానే కార్యవర్గము కమ్యూనిస్టులను కాంగ్రెసు నుండి 1945లో తొలగించింది.

ఈ సందర్భమున మణిపూసలవంటి యువ కార్యకర్తలెందరో మా స్మృతిపథంలో మెలగుచున్నారు, 32 సంవత్సరాల నాటి యీ చరిత్ర జ్ఞాపకం చేసుకొనుటలో ఎందరో వీరులను మరిచిపోయి వుండడం సహజం. ఎంత ప్రయత్నించినను సమాచారము అందనందున యీ కొద్ది మంది పేర్లను మాత్రమే ప్రకటించ గలిగినందుకు మన్నించ ప్రార్థన.

## జిల్లా కాంగ్రెసు అసెంబ్లీ

1946 వ సంవత్సరం వరకు, కాంగ్రెసుపైని షేధం రద్దు కాబడలేదు. ఈలోగా జాతీయ యువజన, విద్యార్థి సంఘాలద్వారా బహిరంగ ప్రచారమునకు వున్న అవకాశాన్ని వాటి రద్దుద్వారా పోగొట్టబడినది. తర్వాత

యువజన కాంగ్రెస్ సంఘాలతో పాటు మరొక ప్రచారసంస్థ స్థాపించవలసిన అవసరం వుందని జిల్లా కార్యకర్తలు ఆలోచించినారు. ఉద్యమ తీవ్రత కూడా చాలవరకు తగ్గినది.

కృష్ణాజిల్లాలోని కార్యకర్తలందరు 1945 జనవరిలో విజయవాడలో సమావేశమై కృష్ణాజిల్లా కాంగ్రెసు అసెంబ్లీ అను మరొక నూతన సంస్థను స్థాపించినారు. ఈసంస్థకు అధ్యక్షులుగ శ్రీ కాశీనాధుని పూర్ణమల్లి కార్జునుడుగారు, ప్రధాన కార్యదర్శిగా శ్రీ కలపాల సూర్యప్రకాశరావు గారు ఎన్నుకోబడిరి. ట్రెజరరుగా శ్రీ పిడికిటి రామకోటయ్యగారిని, కార్యవర్గ సభ్యులుగా శ్రీ వలేశ్వరపు కృష్ణమూర్తి, లింగంనేని పెదకుటుంబ రావు, బలుసు విశ్వేశ్వరరావు, దామరాజు పట్టాభిరామారావు, రేపాల బుచ్చిరామశేషయ్య శ్రేష్ఠి, మురుకుట్ల వెంకటప్పయ్య ఎన్నుకొనబడిరి. అన్ని తాలూకాలలోను దీనిశాఖలుకూడా ఏర్పరచబడెను. కాంగ్రెసు నిషేధంలోవున్న లోటును ఈ సంస్థ చాలవరకు తీర్చినది.

కాంగ్రెసుపై కమ్యూనిస్టులుచేసే అసత్య ప్రచారాన్ని ఈసంస్థ ద్వారా ఎదుర్కోటం జరిగింది. బహిరంగ సభలద్వారాను, కరపత్రముల ద్వారాను, పుస్తకములద్వారాను కమూనిస్టుల ప్రజాయుద్ధ నినాదము నకు జవాబులు ఇస్తూ గొప్ప సంఘటనా శక్తితో ఎదుర్కొనడం జరిగింది. బహిరంగ ప్రచారానికి ఈ అసెంబ్లీలెంతో తోడ్పడినవి.

ముఖ్యంగా ఈ ప్రచార కార్యక్రమము నిర్వహించిన యువకులు కార్యదర్శి సూర్యప్రకాశరావు, వుపన్యాసకులుగా రామకుమారవర్మ, అక్కినేని భాస్కరరావు, కాసరనేని జనార్దనరావు, మైనేని రామకోటయ్య, భూపతి కోటేశ్వరరావుగార్లు తమ ఆసర్గళోపన్యాసాల ద్వారా ప్రజలలో వుత్సాహాన్ని రేకెత్తించారు. ఆంధ్రి మాస్కో అనబడే కాటూరు గ్రామంలో జిల్లా నలుమూలలనుంచి కార్యకర్తలను రావించి గొప్ప బహిరంగసభ ఏర్పాటు చేయబడినది. వెల్లంకి పూర్ణచంద్రయ్య, లింగంనేని పెదకుటుంబరావుగార్లు ఈ సభా ఎర్పాట్లకు బాధ్యత వహించారు. ఆ నాటి సభకు మహాకవి శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. ఈద్పుగంటి శివమూర్తిగారుకూడా వుపన్యసించారు. ఇలాగే ఎంత గడ్డు ప్రదేశాలలోకూడా సభలుపెట్టి కమ్యూనిస్టుల ప్రజాయుద్ధ

నిజాదములోని ముసుగును బహిర్గతం చేయడం జరిగింది. ఇది సహించలేక వారు సభలను భగ్నంచేయ తలపెట్టిరి.

జైళ నుంచి విడుదలయి వచ్చిన రాష్ట్ర కాంగ్రెసు పెద్దలందరు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారధ్యక్షతన 1945 మార్చిలో ఏలూరులో సమావేశమయ్యారు. కృష్ణాజిల్లాలో అసెంబ్లీ చేసేపనితీరు వారికి నచ్చినది. రాష్ట్రస్థాయిలోకూడ ఒక సంస్థను స్థాపించి ప్రచారం చేయడం అవసరమని గుర్తించి "రాష్ట్ర కాంగ్రెసు అసెంబ్లీ" అనే సంస్థను స్థాపించారు. దీనికి అధ్యక్షులుగా శ్రీ కల్లూరి చంద్రమౌళిగారిని, కార్యదర్శిగా శ్రీ నీలం సంజీవరెడ్డిగారిని ఎన్నుకున్నారు. చంద్రమౌళిగారి స్వస్థానమైన తెనాలిలో దీని కార్యస్థానం ఏర్పాటు చేయబడినది. ఈసంస్థద్వారా రాష్ట్రమంతటా మంచి ప్రచారం జరిగింది

ఆ నాటి సమావేశమునకు కమ్యూనిస్టులు హాజరయి సభను భగ్నం చేయచూశారు. ప్రిక్కయింట్లో వారి కార్యకర్తలందరూ వుండి కాంగ్రెసు టిక్కెట్టుపై ఎమ్.ఎల్.ఏ. గా ఎన్నుకోబడి తర్వాత కమ్యూనిస్టుగ మారిన ఒకరిని మీటింగులోకి పంపిరి. సభలోలేచి ఆయన ఏదోచెప్పబోగా కొందరు యువకులు అభ్యంతరంచెప్పిరి. దానితో అల్లరి ప్రారంభమయినది. వారికి కావలసినదికూడా అదే. అయితే సభాధ్యక్షులు గ్రహించి ఆయనను సభనుంచి వెళ్ళిపోవలసినదిగా ఆదేశించిరి. ఆయన వెళ్ళుటకు నిరాకరించి వుపన్యసించ మొదలిడెను. నాయకులు బ్రతిమాలి వారిని బయటకు పంప చూచిరి. ఇంతలో చాటునవున్న కమ్యూనిస్టు గేటునుదూకి కర్రలతో లోనికి ప్రవేసింపచూచారు. లోని యువకులు వీరినిచూచి రెచ్చిపోయి వారిపై తిరగబడినారు. మాగంటి బాపినీడు, వక్కపట్ల గంగరాజువగైరా స్థానిక పెద్దలు కలుగజేసుకుని సర్ది బయటకు పంపివేశారు. తర్వాత సభ ప్రశాంతముగా జరిగినది.

1945 మే నెలలో రాష్ట్ర కాంగ్రెసు అసెంబ్లీ అధ్యక్ష కార్యదర్శులు కృష్ణాజిల్లాలో వారం రోజులు పర్యటన చేసిరి. వారితో పాటు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, జిల్లా అధ్యక్షులు శ్రీ కాశీనాధుని పూర్ణ మల్లికార్జునుడు, కార్యదర్శి శ్రీ కలపాల సూర్యప్రకాశరావుగార్లు ఉండిరి. కపిలేశ్వరపురం, గుడివాడ, తేలప్రోలు, ఆత్కూరు, అప్పికట్ల, పామర్రు, మచిలీపట్నం, పెడన, చల్లపల్లి, పెదప్రోలు, అవనిగడ్డ, విజయవాడ,

నూజివీడు, జగ్గయ్యపేట, నందిగామ మొదలగు అనేక గ్రామాలు దర్శించి బహిరంగ సభలలో ఉపన్యసించిరి. ప్రతిచోట గ్రామస్తులు ఆహ్వానించి నిధిని బహూకరించిరి. మొత్తం 6 వేలు వసూలయినది. ఇందులో 4 వేలు జిల్లా సంఘానికియిచ్చి, 2 వేలు రాష్ట్ర సంఘానికి జమకట్టించిరి. వీరి సభలకుకూడ చాలచోట్ల కమ్యూనిస్టుల ప్రతిఘటన తప్పలేదు. పెదప్రోలు గ్రామములో జరిగిన సభను భగ్నం చేయుటకు దాడిచేశారు. రాత్రి 9 గంIIలకు సభ ప్రారంభించ బడినది. నాయకులు వేదికపై నుండిరి. పలేశ్వరపు కృష్ణమూర్తిగారు స్వాగతపత్రం చదవబోతుండగా, కొందరు గూండాలు చీకటిలోనుంచి కర్రలతోవచ్చి ఒకరు పెట్రొమాక్సులైటును బ్రద్దలుకొట్టిరి. తక్కినవారు కృష్ణమూర్తిగారిని బాది పారిపోయిరి. కృష్ణమూర్తిగారి తల పగిలి రక్తముకార మొదలిడెను. కుడిచేయి విరిగి పోయినది. ఆయన ఆర్తనాదంతో క్రిందపడిపోయినారు. సభ భీభత్స మయినది. నాయకులు దిగ్భ్రాంతి చెందిరి. కృష్ణమూర్తిగారిని యింటికి చేర్చిరి. ఆరాత్రి భోజనాలు నాయకులకు వారి యింటివద్దనే పర్పాటు చేయబడినవి. ఈసంఘటన అనంతరం గ్రామపెద్దలువచ్చి పరామర్శించిరి. అందరు బలవంతంచేసి నాయకులను భోజనము చేయించిరి. ఆ రాత్రి అక్కడనేవుండి మరునాడు అవనిగడ్డ మీటింగుకు వెళ్ళిరి.

మరికొన్నిచోట్లకూడా ఇలాంటివే మరికొన్ని అభ్యంతరాలు కలుగ చేసిరి. జగ్గయ్యపేటలో ఆనాటి బహిరంగసభకు టాం టాం వేయుటకు ఒక వెట్టి సిద్ధముకాగా అతనిని బెదరించిరి. భయపడిపోయి అతను మాను కొనెను. అంతట కాంగ్రెసు కార్యకర్త శ్రీపెద్దాపురపు వెంకట నారాయణ స్వయముగా పూనుకొని టాం-టాం వేసెను. ఈ సభకు జనం విశేషంగా వచ్చిరి. సభాపర్పాట్లు పరిశీలిస్తుండగా శ్రీ రేపాల బుచ్చిరామశేషయ్య శ్రేష్టిగారు సైడుకాలువలో పడిపోయిరి. వారి మోకాలికి మంచి దెబ్బతగిలెను.

పెనుగంచిప్రోలు సభను భగ్నంచేయ చూచిరి. రాత్రిపూట జరిగే ఈసభను భగ్నంచేయుటకు కంభంజిల్లా సరిహద్దులనుంచి కొందరు కమ్యూనిస్టులు వచ్చిరి. వారిని గ్రామస్తులయిన శ్రీ కాకాని వెంకట నర్సయ్య, మామిడి వెంకయ్యగార్లు ఎదుర్కొని తరిమివేసిరి.

ధాన్యం ఉత్పత్తిదారుల సభలుకూడా ఈ అసెంబ్లీల ద్వారా ఏర్పాటు చేయబడినవి. గన్నవరం తాలూకా ధాన్యం ఉత్పత్తిదారుల సభ మర్రివాడలో జరిగింది. రావిపాటి మహానందచౌదరిగారు దీనికధ్యక్షత వహించిరి. భారతీదేవిరంగాగారు ప్రారంభించిరి. శ్రీ పుటగుంట ఆంజనేయులుగారు సభా ఏర్పాట్లు చేసిరి. జిల్లా రైతుసంఘ కార్యదర్శి పామిరెడ్డి సుబ్బారావురెడ్డి, మైనేని రామకోటయ్యగార్లు బాధ్యతవహించి పనిచేసిరి. గుడివాడతాలూకా ధాన్యం వుత్పత్తిదారుల సభ పెంజంద్రిలో జరిగినది. శ్రీమతి భారతీదేవిరంగా అధ్యక్షత వహించినది. దాసు రామస్వామిగారు సభను ప్రారంభించిరి. శ్రీ బలుసు విశ్వేశ్వరరావుగారు సభా ఏర్పాట్లు చేసిరి.

కృష్ణాజిల్లా ధాన్యం వుత్పత్తిదారుల మహాసభ గుడివాడలో జరుప బడినది. శ్రీ కల్లూరు చంద్రమౌళిగారిని అధ్యక్షులుగా ఆహ్వానించడ మయినది. శ్రీ ఆచార్య రంగాగారు సభను ప్రారంభించిరి. ఈనాయకు లను 60 జతల ఎడ్లను పూన్చిన బండిపై పట్టణమంతా వూరేగించిరి. ఈ ఏర్పాట్లు పెదపారుపూడి వాస్తవ్యులు మండవ హనుమంతరావుగారు వారి మిత్రులు చేసిరి. వేలకొలది జనం ఈసభకు వచ్చిరి. శ్రీ పామిరెడ్డి సుబ్బారావు రెడ్డిగారు, శ్రీ కలపాల సూర్యప్రకాశరావుగారు ఈ సభలను నిర్వహించిరి.

1946 లో విడుదలయిన శ్రీ టంగుటూరి ప్రకాశంగారిని ఆహ్వానించి కృష్ణాపుష్కర ఎగ్జిబిషను ప్రారంభోత్సవం చేయడం జరిగినది. ఈ ఎగ్జిబిషను జిల్లా కాంగ్రెసు అసెంబ్లీద్వారా నిర్వహించ బడినది. ఈ సభకు శ్రీ మొసలికంటి తిరుమలరావు, స్వామి శీతారాం, నరసింహదేవర సత్యనారాయణ, అయ్యదేవర కాళేశ్వరరావు, మరుపిళ్ళ చిట్టిగార్లుగూడా హాజరయిరి. జిల్లా సంఘం తరపున కార్యదర్శి కలపాల సూర్యప్రకాశరావు స్వాగతపత్రం సమర్పించిరి

ఇదే సంవత్సరం ఆంధ్రకేసరి ప్రకాశంగారు రాష్ట్రమంతా సంచారం చేశారు. ప్రతిచోట వారికి నిధులు సమర్పణ జరిగింది. ఈ జిల్లా కాంగ్రెసు అసెంబ్లీకూడా వారిని ఆహ్వానించి గుడివాడలో సభ ఏర్పాటు చేసి 3000లు నిధి సమర్పించినది. ఆనాడు ప్రకాశంగారిని అందమైన

పూలరథంలో కూర్చొనబెట్టి 60 జతల ఎడ్లనుకట్టి పట్టణమంతా వూరేగించిరి. టౌనువెలుర్సు బంగళా మైదానంలో మీటింగు ఏర్పాటు చేయబడినది. సముద్రం పొంగిన అలలవలె జనంవచ్చి మైదానం నిండిపోయినది. ఆ సభలో ప్రకాశంగారు 3 గంటలు ఏకధారగా వుపన్యసించిరి. అనంతరం జిల్లా కాంగ్రెసు అసెంబ్లీ అధ్యక్షులు శ్రీ కాశీనాధుని పూర్ణమల్లికార్జునుడు గారు పర్సు బహూకరించిరి. ఆరాత్రి గుడివాడ బంగళాలో విశ్రమించి మరునాడు వుదయం విజయవాడకు వెళ్ళిపోయిరి.

గాంధిగారు జుహూనుంచి వార్థాకు చేరినారు. భారతరాజకీయాలు సింహావలోకనం జరుగుచూ వుండెను. కాంగ్రెసుకు వ్యతిరేకంగా, దానిని దుయ్యబడుతూ, కాంగ్రెసు నాయకులను పంమూంగదళంగా చిత్రించుచూ గత నాలుగు సంవత్సరాల నుంచి కమ్యూనిస్టుపార్టీ అనుసరించియున్న వివరాలు సేకరణ నిమిత్తం వర్కింగు కమిటీవారు దాదాభాయి నౌరోజీ మనుమరాలు కుర్షీద్ బెన్‌ను నియమించారు. ఈమె వార్థాలోవుండి విషయ సేకరణకు పూనుకొన్నది. కృష్ణాజిల్లా కాంగ్రెసు అసెంబ్లీ కమ్యూనిస్టుల విధ్వంసక చర్యల గురించి ఒక రిపోర్టు తయారుచేసి కార్యదర్శి కలపాల సూర్యప్రకాశరావు, కాసరనేని జనార్దనరావుగార్లతో వార్థాకుపంపించినది. వీరు వార్థాలో కుర్షీద్ బెన్‌ను కల్సుకుని రిపోర్టు అందజేశారు. అందలి వివరాలుచూచి ఆమె ఆశ్చర్యపడినది. అక్కడనేవున్న డాక్టర్ సయ్యద్ మహమూద్ (వర్కింగు కమిటీ మెంబరు) కూడ ఆశ్చర్యపడి అనేక ప్రశ్నలు వేసి వివరాలు తెలుసుకున్నారు.

1946 మధ్యకాలములో కాంగ్రెసుపై నిషేధం తొలగిపోయినది. రాజకీయ ఖైదీలందరు విడుదల కాబడిరి. అన్ని జిల్లా సంఘాలు మామూలుగా పనిచేయు అవకాశం చిక్కినది. జిల్లా కాంగ్రెసు అసెంబ్లీని రద్దుచేసి, కార్యకర్తలందరు తూర్పు, పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు కమిటీలద్వారా పనిచేయసాగారు.

## జాతీయ విద్యార్థి సంఘాలు

1942 వరకు కృష్ణాజిల్లాలోను, రాష్ట్రంలోనుకూడ విద్యార్థి సంఘాలు కమ్యూనిస్టుల పలుకుబడిలోనే వున్నవి. కమ్యూనిస్టులు అవలంభించిన ప్రజాయుద్ధ నినాదములతో యువజన సంఘాలు చాలావరకు

కమ్యూనిస్టుల గుప్పిటినుండి 1942 నాటికే బయటపడినవి. అయితే విద్యార్థులలో మాత్రం 1944 వరకు కాంగ్రెసుకు అనుకూల వాతావరణం లేదు. కమ్యూనిస్టుల జాతీయ వ్యతిరేక పంథా నానాటికి స్పృతిమించి రాగాన పడుటవల్లను, పూర్తి బ్రిటీషు అనుకూలముగా మారిపోయినందునను అందులోని విద్యార్థులు కొందరు తిరుగుబాటుచేసి జాతీయ విద్యార్థి కాంగ్రెస్‌ను స్థాపించినారు.

శ్రీ కొండపల్లి కృష్ణారెడ్డి అను విద్యార్థి బందరులో బి. ఎ. చదువుతూ, అంతవరకు కమ్యూనిస్టు అభిమానులుగావున్న తనతోటి విద్యార్థులు కొందరి సహాయముతో ప్రప్రథమంగా జాతీయ విద్యార్థి సంఘమును స్థాపించినాడు. విద్యార్థి పెడరేషను (కమ్యూనిస్టు) వారు ఎంత ప్రతిఘటించినా ధైర్యోత్సాహముతో ఎదుర్కొని జిల్లాలోని అన్ని ప్రాంతములు తిరిగి, కాలేజీలలోను, హైస్కూళ్ళలోను విద్యార్థి సమావేశాలు ఏర్పాటుచేసి, వారిలో దేశభక్తిని పురికొల్పి, బలీయమైన జాతీయ విద్యార్థి వుద్యమాన్ని ఏర్పాటు చేశారు. ఒక ప్రక్కన బ్రిటీషు ప్రభుత్వం పోలీసులు వీరిని క్రూరంగా హింసించుతూ వెంటాడుతూవుంటే, మరొక ప్రక్కన కమ్యూనిస్టు విద్యార్థి ఫెడరేషనువారు ఎంతో తీవ్రంగా వీరిని ప్రతిఘటించడం మొదలుపెట్టినారు. అయినా లెక్కచేయకుండా వీరు ముందుకు సాగిపోయినారు. అనేకచోట్ల కర్రలతోను, గసికలతోను వీరిని చావబాదినారు. ఎందరికో జాతీయ విద్యార్థులకు తీవ్రమైన గాయము లయినవి.

బందరు, తాడంకి ప్రాంతాలు జాతీయ విద్యార్థులకు మంచిబలమైన కేంద్రాలుగా వుండేవి. బందరు జిల్లా జాతీయ విద్యార్థి మహాసభలు పెద్ద ఎత్తున జరుపబడినవి. జిల్లా జాతీయ విద్యార్థి సంఘంలో ఆనాడు బాగా పనిచేసిన విద్యార్థులు తుమాటి కోటేశ్వరరావు, కొండపల్లి కృష్ణారెడ్డి, యన్. వి. యస్. ప్రసాదరావు, పి. అప్పలాచారి, తుమాటి బాల కోటేశ్వరరావు, అన్నే శ్రీరాజ్యం (అన్నే అంజయ్యగారి కుమార్తె), చింతా ఆంజనేయులు, జాస్తి వెంకటేశ్వరరావు, నారాయణమూర్తి (నూజివీడు), రామదాసు (పామర్రు), మండలి వెంకట కృష్ణారావు మొదలగు విద్యార్థులుగలరు. రెండవతూరి జిల్లా మహాసభలు చల్లపల్లిలో జరిగినవి. రాష్ట్రమంతటినుంచి అన్ని జిల్లాలవారు ఈసభకు హాజరైనారు.

చల్లపల్లిలో జరిగిన జిల్లా విద్యార్థి సభలకు వచ్చిన ఇతర జిల్లాల విద్యార్థి నాయకులతో మచిలీపట్నంలో సమావేశం ఏర్పాటుచేసి రాష్ట్ర జాతీయ విద్యార్థి సంఘమును ఏర్పాటు చేశారు. దీని కేంద్ర కార్యాలయము బందరులో ఏర్పరచినారు. ఈ రాష్ట్ర సంఘాధ్యక్షులుగా శ్రీ కొండపల్లి కృష్ణారెడ్డిగారిని ఎన్నుకున్నారు.

మొదటిసారిగా రాష్ట్ర జాతీయ విద్యార్థి మహాసభలు బందరులో జరిగినవి. అప్పుడే జైళ్ళనుండి విడుదలకాబడిన నాయకులు ఆచార్య ఎన్. జి. రంగా, అయ్యదేవర కాళేశ్వరరావు, గొట్టిపాటి బ్రహ్మయ్యగార్లు ఈ సభకు విచ్చేసినారు. కాళేశ్వరరావుగారి అధ్యక్షతన బందరు టౌను హాలులో బ్రహ్మాండమైన సభ జరిగినది. రంగాగారు సభలను ప్రారంభించినారు. రాష్ట్రం నలుమూలలనుంచి తండోప తండాలుగా విద్యార్థులు సభలకు హాజరయినారు. ఈ మహాసభల కోలాహలంచూచి కమ్యూనిస్టులు సభను అల్లరిచేయ నుద్దేసించి టౌనుహాలుకువచ్చి కేకలు వేయసాగిరి. కర్రలతోను, గసికలతోను జాతీయ విద్యార్థులను కొట్టసాగిరి. ఇది చూచి అయ్యదేవర కాళేశ్వరరావుగారు తీవ్రముగా మందలించి ఎదుర్కొనవలసినదగా ప్రోత్సహించిరి. జాతీయ విద్యార్థులు తెగించి తిరగబడిరి. కొంతసేపటికి కమ్యూనిస్టులు పిక్కబలముచూపి పారిపోయిరి. కృష్ణారావు అనే గుడివాడ విద్యార్థికి బలమైన దెబ్బలు తగిలినవి. అతనిని హాస్పిటలులో చేర్చినారు. ఈ మహాసభలకు హేమచంద్ర భాస్కరరావు, త్రిపురానన రాఘవదాసు, వై. ఆర్. కె. శర్మ, చెరుకూరి వెంకటేశ్వరరావు, జెట్టి నాగేశ్వరరావు, ఎ. ఎస్. ఆర్. కృష్ణ, కంచుల కోటిరెడ్డి, డి. అశ్వర్థప్ప, పి. మునిరెడ్డి, భాట్టం శ్రీరామమూర్తి మొదలగు జాతీయ విద్యార్థి నాయకులు హాజరయినారు.

1946 డిశంబరు 29న రెండవ జాతీయ విద్యార్థి మహాసభ నంద్యాలలో జరిగినది. శ్రీ కొండపల్లి కృష్ణారెడ్డిగారిని మరల అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎ. ఎస్. ఆర్. కృష్ణను, కార్యవర్గ సభ్యులుగా సుంకర సత్యనారాయణ, అన్నె శ్రీరాజ్యం, జెట్టి వెంకటేశ్వర్లు, త్రిపురానన రాఘవదాసు, హేమచంద్ర భాస్కరరావుగార్లను ఎన్నుకున్నారు. మూడవ రాష్ట్ర జాతీయ విద్యార్థి సభలు నిడుబ్రోలులో జరిగినవి. ఆసభలో సుంకర సత్యనారాయణ అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు.

రాష్ట్ర జాతీయ విద్యార్థి సంఘాలతోపాటు అఖిల భారత విద్యార్థి సంఘాలుకూడ పనిచేయసాగినవి. అందులో ఈ జిల్లా విద్యార్థులు ప్రధాన పాత్రను వహించినారు. 1946లో బొంబాయిలో జరిగిన విద్యార్థి సమావేశంలోను, దరిమిలా ఢిల్లీలో జరిగిన అఖిలభారత మహాసభలలోను శ్రీ కొండపల్లి కృష్ణారెడ్డిగారిని కార్యవర్గంలోకి తీసుకున్నారు.

ఆంధ్రలో జాతీయ విద్యార్థి వుద్యమ ప్రగతిని, విద్యార్థుల దేశభక్తిని చూచి అఖిలభారత కాంగ్రెసు నాయకులు సర్దార్ వల్లభాయ్ పటేల్, జవహర్ లాల్ నెహ్రూ, జయప్రకాష్ నారాయణ మొదలగు నాయకులు మెచ్చుకున్నారు. అప్పటినుంచి మన జాతీయ విద్యార్థినాయకులు అఖిల భారత స్థాయిలో గుర్తించబడి కార్యదర్శులుగను, కార్యవర్గ సభ్యులుగను స్థానం పొందగలిగారు. వీరిలో ఎస్. వి. ఎస్. ప్రసాద్, కొండపల్లి కృష్ణారెడ్డి, శ్రీరాజ్యం (అంజయ్యగారి కుమార్తె) గార్లు ప్రముఖ పాత్రలను వహించినారు.

ఆనాటి విద్యార్థి లోకంలో వీరు సాగించిన దీక్షాయుత కృషివల్ల గొప్ప సంచలనం కలిగినది. అతివాద దృక్పథంతో వీరిచ్చే ఉపన్యాసములు వినుటకు ప్రతి సభకు వేలకొలది జనం గుమిగూడేవారు. అనర్గళమైన వీరి వుపన్యాస ప్రవాహంలో ప్రజలు తేలియాడేవారు. వుద్రూతలూగించే దేశభక్తి ప్రబోధాలతో రాష్ట్ర మంతటా చైత్రయాత్ర సాగించినారు. భావిస్వతంత్ర భారత ప్రభుత్వం సోషలిజం, సమానత్వం, సెక్యులరిజం స్థాపించగలదని అందుకు ప్రజలందరు సహకరించి స్వాతంత్ర్య పోరాటమును బలపర్చవలెనని వుద్బోధించేవారు. ఆనాటి కలలు నేడు యదార్థరూపము ధరించుచున్నవి. అందుకనే "బాలదీవెనలు బ్రహ్మదీవెనలు" అని అన్నారు పెద్దలు. ఆనాటి ఈ బాలనాయకులే నేడు సోషలిజం స్థాపనలో భాగస్వాములుగా, నాయకత్వం వహించి వివిధ రంగాలలో పనిచేయుచున్నారు.

1945వ సంవత్సరంలో కొమురగిరి శేషగిరిరావు అను కుర్రవాడు 5వ ఫారము చదువుతూ పోలీసు నిషేధపుటుత్తర్వులను ధిక్కరించినందున నందిగామలో అరెస్టుచేసి కేసు పెట్టిరి. ఆ కేసు ఋజువు కానందున కొట్టి వేయబడినది.

## 1946 - ఎన్నికలు

జిల్లా కాంగ్రెసు సంఘాలు రాబోవు ఎన్నికలకు ప్రజలను సమాయత్తము చేయసాగినవి. కృష్ణాజిల్లాలో తీవ్రమైన పోటీ జరిగినది. శ్రీ కొల్లిపర సూరయ్య, శ్రీ మూకల వీరరాఘవయ్య, వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ, శ్రీ వేముల కూర్మయ్యగార్లు అధిక మెజారిటీతో ఎన్నుకొనబడిరి. వీరితో పోటీచేసిన కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థులు వోడిపోయిరి. కొడాలి ఆంజనేయులుగారు, గొట్టిపాటి బ్రహ్మయ్యగారు, దుగ్గిరాల బలరామ కృష్ణయ్య వగైరా నాయకులు తూర్పు కృష్ణాలోను, కాకాని వెంకటరత్నం, అన్నే అంజయ్య, పేట బాపయ్య, మరుపిళ్ళ చిట్టి, కాకుమాను లక్ష్మయ్యచౌదరిగార్లు పశ్చిమ కృష్ణాజిల్లాలోను తీవ్రమైన ఎన్నికల ప్రచారము చేశారు.

1946 జనరల్ ఎన్నికలలో కాంగ్రెసు - కమ్యూనిస్టు పార్టీలకు తీవ్రమైన పోటీ జరిగినది. అనేక చోట్ల ఎన్నిక సభలను భగ్నం జేయుటకు కమ్యూనిస్టులు ప్రయత్నించినారు. ప్రతిచోట కాంగ్రెసు కార్యకర్తలు అతి ధైర్యసాహసములతో వీరిని ఎదుర్కొన్నారు. ఎన్నికల ప్రచారములో శ్రీ అన్నే అంజయ్యగారి కుమార్తె శ్రీరాజ్యం, అల్లూరు సత్యనారాయణరాజు, కొల్లి రామకుమారవర్మ, యన్. వి. యస్. ప్రసాద్, మైనేని రామకోటయ్యగారలు కమ్యూనిస్టుల రాజకీయ కుట్రలను, అరాచకత్వమును, బట్టబయలు చేయుచుండిరి. వీరిపై దౌర్జన్యచర్యకు అదను ఎప్పుడు దొరుకుతుందా అని కమ్యూనిస్టులు కుట్రలు పన్నసాగిరి. చివరకు పోలింగురోజున తాలూకా కాంగ్రెసు అధ్యక్షులు కలపాల సూర్యప్రకాశరావు, అల్లూరి సత్యనారాయణరాజు, శ్రీ రాజ్యంగారలు చిన్నకారులో గన్నవరంనుండి బయలుదేరి అన్నిపోలింగులు చూచుకుంటూ ఇందుపల్లి వచ్చువరకు వీరి కారుమీద దాడిచేయటానికి కమ్యూనిస్టులు సిద్ధపడగా కాంగ్రెసు కార్యకర్తలు కర్రలతో ఎదుర్కొన్నారు. అంతవారు వెనుకకు తగ్గినారు. అక్కడనుంచి కాటూరు పోలింగుచూచి వుయ్యూరుకు బయలుదేరినారు. దారిలోవున్న కమ్యూనిస్టు ఆఫీసులోనించి 50 మంది కర్రలతో కారుపై విరుచుకుపడి బాయనెట్ పగలగొట్టినారు. ముందు అద్దాలు నుగ్గునుగ్గుచేశారు. ఈ దృశ్యము చూచిన కాంగ్రెసు కార్యకర్తలు కారును, కారులోనివారిని రక్షించటానికి చుట్టూమూగినారు.

వారివద్ద కర్రలులేవు, ఆ వలంటీర్లను చావ మోదారు. వీరిలో కొందరి తలలు పగిలినవి. మరికొందరి చేతులు విరిగినవి. ముదునూరు వాస్తవ్యులు పాలడుగు సత్యనారాయణ, కొల్లు తాతయ్య, కుర్రి వెంకట రత్నం, కుర్రి వెంకట రామయ్య, మొవ్వ సత్యనారాయణగారలు దెబ్బలకు క్రిందపడిపోయినారు. ఇంతలో పోలింగు చూచుటకు శ్రీ అన్నె అంజయ్య గారు అధ్రికేసరి శ్రీ ప్రకాశంగారు అక్కడకు వచ్చారు. వారినిచూచి కమ్యూనిస్టులు ఎక్కడివారక్కడ పారిపోయినారు. ప్రకాశంగారి వెనకనే తిరుగుతున్న పోలీసు వ్యానుకూడా వచ్చినది. దెబ్బలుతిన్న వారందరిని ఆ వ్యానులో ఎక్కించి, ప్రకాశంగారు విజయవాడ తీసుకువెళ్ళి, స్వయముగా హాస్పిటల్‌లో చేర్పించినారు. నెలరోజులవరకు హాస్పిటల్‌లో వారు కోలుకొనలేదు. అనంతరం జరిగిన పార్టీ నాయకుని ఎన్నికలో విజయం పొంది, శ్రీ ప్రకాశం పంతులుగారు మద్రాసు రాష్ట్రానికి ప్రధాన మంత్రిగా ఎన్నుకోబడిరి.

అదే సంవత్సరం సెప్టెంబరు నెలలో కేంద్రములో పండిట్ జవహార్ లాల్ నెహూ్రు ప్రధానిగా తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినది.

1947 ఆగస్టు 15వ తేదీన భారత దేశమునకు స్వతంత్రం ఇచ్చినట్లు బ్రిటిషు లేబరు ప్రభుత్వం ప్రకటించినది. జిల్లా అంతట అతి కోలాహలంగా ఈ స్వాతంత్ర్య దినోత్సవాలు జరుపుకోబడినవి.

## గన్నవరంలో మలబారు పోలీసుల దురంతాలు

1946 అక్టోబరులో విజయవాడ నుండి గన్నవరముకు మలబారు పోలీసులు బస్సులో ప్రయాణములుచేస్తూ కండక్టరుకు డబ్బు యివ్వలేదు. గన్నవరం బస్సుస్టాండులో వారిరువురమధ్య ఘర్షణ జరిగినది. డబ్బు యివ్వకపోగా, కండక్టరును మలబారు పోలీసులు కొట్టినారు. అంతట బస్సులోని వారంతా తిరగబడి వారిని మరల కొట్టిరి. వారు విమాన కేంద్రములోనున్న మలబారు పోలీసు సార్జెంటుకు రిపోర్టుచేశారు. తన దళముతోసహా వచ్చి, గ్రామముపైబడి నానాహంగామాచేశారు. కండక్టరు భయపడి తాలూకా పోలీసు స్టేషనులో దాగుకొన్నాడు. అతనిని వప్పగించవలసినదిగా తాలూకా ఆఫీసును చుట్టుముట్టారు. మెజిస్ట్రేటు భయపడి పారిపోయాడు. తాలూకా ఉద్యోగులు అతనిని వప్పగించలేదనే

కోపంతో రెచ్చిపోయి, రాత్రి పది గంటలవరకు గ్రామమంతా తిరిగి కనబడ్డ వారినల్లా చావమోదారు.

గన్నవరం తాలూకా కాంగ్రెసు సంఘ అధ్యక్షులు కలపాల సూర్య ప్రకాశరావుగారు వెంటనే అక్కడకువెళ్ళి, శ్రీయుతులు పిడికిటి రామ కోటయ్య, వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వరప్రసాద్‌గార్లతో ఒక కమిటీనివేసి, దెబ్బలు తిన్నవారిని విచారించి, స్టేటుమెంటులు రికార్డుచేసి, ఒక రిపోర్టును అప్పటి మదాసు ముఖ్య మంత్రిగావున్న శ్రీ ప్రకాశంగారికి సమర్పించి నారు. వెంటనే వారు నూజివీడు రివెన్యూడివిజనల్ ఆఫీసరుగారికి, సూపరిన్ టెండెంటుగారికి ఫోనుచేసి, తాలూకా అధ్యక్షుడు యిచ్చిన రిపోర్టు ప్రకారము విచారణచేసి మలబారు పోలీసుపై గట్టిచర్య తీసుకొనవలసినదిగా ఆదేశించినారు.

తాలూకా కాంగ్రెసు అధ్యక్షులు మద్రాసునుండి మెయిల్‌లో మరునాడు గన్నవరం చేరినారు. ఆయనకొరకు ఎదురుచూస్తూ, ఆఫీసర్లు అందరు వేచివున్నారు. వెంటనే దెబ్బలు తగిలినవారిని లారీలో ఎక్కించు కొని, విమాన కేంద్రములోని మలబారు పోలీసు క్యాంపుకు వెళ్ళి, తమను కొట్టినవారిని గుర్తుపట్టించి వచ్చినారు. అనంతరము వారిపై కేసు పెట్ట బడినది. అప్పటి నూజివీడు ఆర్. డి. ఒ. శ్రీ నాగోజీరావుగారు 20 మంది మలబారు పోలీసులకు ఒక్కొక్కరికి రు 100 లు జరిమానా ఆరు మాసాలు శిక్ష వేశారు. ఆ తరువాత వారు అప్పీలు చేసుకోగా శిక్ష తీసివేసి, జరిమానా నిలిపినారు.

## గన్నవరము తాలూకా స్వాతంత్ర్య సమర యోధులకు సన్మానము

1947 ఆగస్టు 15 తేదీన స్వాతంత్ర్య దినోత్సవము జిల్లా అంతటా జరిగినది. గన్నవరం తాలూకా కాంగ్రెసు సంఘ అధ్యక్షులు శ్రీ కలపాల సూర్యప్రకాశరావు, కార్యదర్శి శ్రీ దుగ్గిరాల నారాయణరావుగార్లు తాలూకా అన్ని గ్రామాలు తిరిగి విరాళములు వసూలుచేసి, తాలూకాలో జైళ్ళకు వెళ్ళిన వారిని సన్మానముచేయు నిమిత్తము రెండు రోజుల కార్య క్రమము ఏర్పాటు చేశారు. తాలూకా స్వాతంత్ర్య సమర యోధులతో పాటు, మరికొందరు జిల్లా పెద్దలనుకూడ సన్మానించారు. ప్రతి ఒక్కొ క్కరికి ఖద్దరు వస్త్రాలు, మూడు రంగుల జెండాగల ఒక మొహరు

తయారు చేయించి, రోల్డుగోల్డు మెడలు తలా ఒకటి యిచ్చి సత్కరించారు. దేశము మొత్తముమీద ఎక్కడా యిటువంటి సన్మానము 'స్వాతంత్ర్య సమర యోధులకు' అప్పటికి జరిగియుండలేదు.

ఆ రెండు రోజుల కార్యక్రమము బహు చక్కగా జరిగినది. స్థానిక నాయకులు శ్రీ వెలివెల సీతారామయ్యగారు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని, యువకులను సమీకరించి, అన్ని యేర్పాట్లు కట్టుదిట్టముగా చేయించినారు. జాస్తి చిన వెంకటేశ్వరరావు, పెద వెంకటేశ్వరరావుగార్లు యువకులకు నాయకత్వము వహించి, అతిథులకు చక్కని యేర్పాట్లు చేశారు. ఈ ఉత్సవ కార్యక్రమానికి శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు అధ్యక్షత వహించారు. శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు సభను ప్రారంభించినారు. శ్రీ వాసిరెడ్డి దుర్గా సదాశివేశ్వర ప్రసాద్, శ్రీ కాకుమాను లక్ష్మయ్యచౌదరి, శ్రీ పిడికిటి రామకోటయ్యగార్లు వచ్చి ఆశీర్వదించినారు.

## రజాకార్ల దురంతాలు

1948లో రజాకార్ల ఉద్యమ సందర్భములో తెలంగాణా కాందిశీకుల సహాయక కమిటీని ఏర్పాటు చేసినారు. శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావుగారు అధ్యక్షులుగా, శ్రీ టి. వి. యస్. చలపతిరావుగారు ఉపాధ్యక్షులుగా శ్రీ మొదలి వెంకటేశ్వరరావుగారు ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకొనబడిరి. ఈ కమిటీ ప్రథమ సమావేశము శ్రీ కాళేశ్వరరావుగారి యింట్లో జరిగినది. శ్రీ స్వామిరామానందతీర్థ, శ్రీ మాడపాటి హనుమంతరావు, సర్దార్ జమలాపురం కేశవరావు, శ్రీ మాడపాటి రామచంద్రరావు, శ్రీ కొండా వెంకట రంగారెడ్డి, శ్రీ వల్లూరి బసవరాజు, డాక్టరు మర్రి చెన్నారెడ్డి, శ్రీ తిరుక్కొవల్లూరు హయగ్రీవాచారి మొదలగు ప్రముఖ తెలంగాణా నాయకులు ఈసమావేశమునకు హాజరైరి. తెలంగాణా విమోచనోద్యమము సాగించుటకు అవసరమైన అంగబలమును, అర్థబలమును సమకూర్చుటకు ఆ నాయకులకు ఈ కమిటీ వాగ్దానము చేసినది.

పైన తెలిపిన తెలంగాణా నాయకులందరు విజయవాడను కేంద్ర స్థానముగా చేసుకొని నిజాం ప్రభుత్వముపై పోరాటమును సాగించిరి.

1948 లో తెలంగాణాలో రజాకార్ల దురంతాలవల్ల ప్రజలలో భీతావహం కలిగినది. ప్రజలను దోచుకుంటూ చిత్రహింసలపాలు చేస్తు నారు. వీరి బాధలు పడలేక అక్కడి ప్రజలు కృష్ణాజిల్లా గ్రామాలకు పారిపోయి వచ్చి తలదాచు కొనుచున్నారు. పగలు రజాకార్లతోను, రాత్రి కమ్యూనిస్టులతోను బాధలు పడలేక వీరు ఆస్తులుకూడ వదలివేసు కున్నారు. పరగణాలోని కమ్యూనిస్టులుకూడ రజాకార్లతో కలిసి బాధించసాగారు. అందువల్ల కృష్ణాజిల్లాలోకూడా కమ్యూనిస్టు అరాచక చర్యలు ప్రాకినవి. మునగాల పరగణానుట్టూ నైజాం రాజ్యము మధ్యన దీవిగావుంది. రజాకార్ల దౌర్జన్యాల మూలంగా కృష్ణాజిల్లా కార్య కర్తలు అక్కడికి వెళ్ళటం కష్టమైపోయినది. అయినను అతి సాహసంతో జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కాకాని వెంకటరత్నంగారు తన అనుచరు లతో అక్కడకువెళ్ళి ధైర్యంగా పనిచేయసాగిరి. అనేక సరిహద్దు గ్రామాలలో పునరావాస క్యాంపులు ఏర్పాటుచేసి వారికి అన్నివిధాల సహాయపడిరి. రజాకార్ల నెదుర్కొనుటకు వి. అప్పలాచారిగారిని పరగణాలోవుంచి ఆయుధాలుకూడా సప్లయిచేయించి వారిని ఎదుర్కొనిరి.

అప్పటి నైజాం రెశిడెంటుగావున్న కె. ఎమ్. మున్షీగారు రజా కార్ల దురంతములు స్వయంగాచూచి, పరిశీలించే నిమిత్తం పరగణాకు వచ్చిరి. వారితోపాటు రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు రంగాగారుకూడ వుండిరి. జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు వెంకటరత్నంగారు, పగలు రజాకార్లు, రాత్రి కమ్యూనిస్టులు ప్రజలనుపెట్టే బాధలు గురించి వారికి నివేదికను సమ ర్పించిరి. వారికి కొన్ని కాందిశీక శిబిరములుకూడ చూపించిరి.

మున్షీగారు తిరువూరు, నందిగామ తాలూకాలలోని సరిహద్దు గ్రామాలుకూడ సంచారం చేసిరి. అన్నిచోట్ల జిల్లా కాంగ్రెసు ఏర్పాటు చేసిన కాందిశీక శిబిరములుచూచి ఆయన పరిస్థితిని అర్థంచేసుకున్నారు. వెంకట రత్నంగారి కృషిని అభినందించారు.

1948 అక్టోబరు 24న డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు అఖల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నిక అయినారు. వారు 1949 జనవరిలో ఆంధ్రదేశమునకు వచ్చిరి. రెండు జిల్లా కాంగ్రెసు సంఘాలు వారికి అఖండమైన స్వాగతం ఇచ్చినవి. విజయవాడలోను, మచిలీపట్నంలోను

గొప్ప బహిరంగ సభలు జరిగినవి. ఆ సభలలో వారిని ఘనముగా సన్మానించిరి.

కీర్తిశేషురాలు మాతా కస్తూరిబాగాంధి స్మారక సంఘాలు ఏర్పడి అన్నిచోట్ల పనిచేయుచున్నవి. కృష్ణాజిల్లాలో శ్రీ అడుసుమిల్లి గోపాల కృష్ణయ్యగారు అధ్యక్షులుగాను, శ్రీమతి వల్లభనేని సీతామహాలక్ష్మమ్మగారు ఉపాధ్యక్షురాలుగాను, శ్రీ కేతవరపు లక్ష్మీనరసింహారావుగారు కార్యదర్శి గను ఒక సంఘము ఏర్పడినది. ఈ సంఘము ప్రశంసనీయముగా పనిచేసి గుడివాడ తాలూకా గురజ గ్రామములో లక్షరూపాయలు వెచ్చించి ఒక పెద్ద భవనమును ఖరీదుచేసి "మాతా శిశు సంరక్షణాలయము"ను స్థాపించిరి. గ్రామస్తులుకూడా ఉత్సాహంగా ముందుకువచ్చి విరాళములు హెచ్చు మొత్తంలో ఇచ్చి సహకరించిరి.

అదే సంవత్సరం గాంధి స్మారకనిధి కమిటీలు ఏర్పడినవి. పశ్చిమ కృష్ణాజిల్లా కమిటీకి రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠిగారు అధ్యక్షులుగాను, కలపాల సూర్యప్రకాశరావుగారు కార్యదర్శిగాను ఎన్నుకోబడిరి. జిల్లా అంతటా తిరిగి 36 వేలు వసూలు చేసిరి. తూర్పు కృష్ణా జిల్లాలోకూడా పెద్దమొత్తం వసూలు చేయబడినది.

## కాంగ్రెసు వాదులపై - కమ్యూనిష్టుల హింసాకాండ

1949 ప్రారంభంలో కలకత్తాలో జరిగిన కమ్యూనిస్టు మహాసభలో సాయుధ పోరాటంద్వారా కమ్యూనిస్టు రాజ్యం స్థాపించవలెనని తీర్మా నించారు. నిజాంపై మిలటరీ యాక్షన్ పూర్తి అయింది. రజాకార్లను అణచివేయుటకు తీవ్రచర్యలు జరుపబడుచున్నవి. ఆ సందర్భములో వారి వద్ద పెద్ద మొత్తములో ఆయుధాలను కమ్యూనిస్టులు సేకరించగలిగారు. ఆంధ్ర, తెలంగాణా ప్రాంతంలో కమ్యూనిస్టుల ప్రాబల్యం ఎక్కువగాగల ప్రాంతంలో ఈ పద్ధతివల్ల తేలికగా తమ రాజ్యం స్థాపించగలమని అంచనా వేశారు. రణదివే సుదీర్ఘమైన రిపోర్టును ఈ ప్రాంత పరిస్థితులను వివరించుచూ, మహాసభకు సమర్పించారు. దానిపై పార్టీ సాయుధ తిరుగుబాటుకు తీర్మానించినది. అనంతరం ఆంధ్ర-తెలంగాణా ప్రాంతపు పార్టీల సంయుక్త సమావేశమును కృష్ణాజిల్లా బుద్దవరం గ్రామములో

జరిపి ఈ తీర్మానమును ఆమోదించారు. నాటినుంచి ఉభయప్రాంత కమ్యూనిస్టులు కలిసి యీ సాయుధ పోరాటము జరిపినారు.

నందిగామ తాలూకా మునగాల పరగణాలో వీరి దాడికి గురికాని గ్రామము లేదు. ఒక్క మునగాల పరగణాలోనే 24 మంది కాంగ్రెసు అభిమానులను చిత్రహింసలపాలు చేశారు. వారందరు ఆయా గ్రామాలలో మంచి పలుకుబడి కలిగిన కార్యకర్తలు.

అలాగే గన్నవరం తాలూకాలో అల్లాపురం, దావాజీగూడెం. కాటూరు, మామిళ్ళపల్లి, కృష్ణాపురం, చినవోగిరాల గ్రామాలు వీరి దాడికి గురి అయినవి. ఈ గ్రామాలలో 6 గురు కార్యకర్తలు చంపబడినారు. దివి తాలూకాలో వెలువోలు, పెదప్రోలు గ్రామాలలో దాడిచేసి కొందరిని చిత్రహింస చేశారు. (శ్రీ) గొట్టిపాటి బ్రహ్మయ్యగారిని చంపుటకు ఘంటసాలలోని కమ్యూనిస్టులు కుట్ర చేసినారు. ఆ వివరాలు ప్రముఖ తాలూకా కమ్యూనిస్టు నాయకుని యిల్లు సోదా చేసినప్పుడు లిఖిత రూపములోగా వ్రాసిపెట్టుకొన్న ఛోగట్టా వారికి దొరికినది. ఈ సందర్భములో ఘంటసాల కమ్యూనిస్టు యువకుల నిద్దరిని డిటెన్షన్ క్యాంపుకు పంపడం జరిగినది. అందులో ఒకరు ఆరు మాసాలు అనంతరం అనారోగ్య కారణాలవల్ల విడుదల చేయబడ్డారు. రెండవవారు 3 మాసాల అనంతరం జైలునుండి వచ్చినారు.

ఇలాగే జిల్లాలో చాలామంది కాంగ్రెసు నాయకులకు బెదిరింపు ఉత్తరాలు వ్రాయడం జరిగినది.

బెజవాడ తాలూకాలో కోడూరు, నాగులూరు, గణపవరం, మరుసుమిల్లి గ్రామాలు వీరి దాడికి గురి అయినవి.

నూజివీడు తాలూకాలో అన్నవరం, గోగులంపాడు, హనుమంతుల గూడెం, రమణక్కపేట, ఎల్లాపురం గ్రామాలు దాడిచేసి రు 25000 లు దోచుకున్నారు.

1949 డిశంబరులో రాత్రివేళ తిరువూరు తాలూకాలో ఒకే సమయమున మూడు దాడులు జరిగినవి. మూడు దళాలుగా విడివడి వినగడప అడవి నుంచి బయలుదేరి ఈ దాడులు చేశారు. ఒక దళం మేడూరు, అట్లప్రగడ,

గొల్లమందల గ్రామాలపైనను, మరొక దళం మాధవరం, కూనపరాజుపర్వ, ముచ్చునపల్లి గ్రామాలమీద దాడిచేసి ముగ్గురు కార్యకర్తలను చంపి 10 వేలు దోచుకున్నారు. మూడవ దళం ముష్టికుంట్ల, రోలుపడి, తునికిపాడు, కొణిజర్ల, చిట్టాల గ్రామాలలో దాడిచేసి నలుగురను చంపి 5 వేలు దోచుకున్నారు. చిట్టాలలో శ్రీ కొల్లి బుచ్చయ్యగారి యింటిపై జరిగిన దాడిలో కమ్యూనిస్టులకు బుచ్చయ్యగారికి గంటసేపు హోరా హోరీ యుద్ధము జరిగినది. ఇరువైపుల తుపాకులు ఉపయోగించబడినవి. బుచ్చయ్యగారు ఇంటిలోవుండి తలుపుచాటుగా కాల్పులు చేశారు. చివరకు లాభంలేదని గ్రహించి, ఇంటిపై కిరసనాయిలుపోసి నిప్పుపెట్టారు. బుచ్చయ్యగారు వెనుకవైపుగా తప్పించుకుని తోటలోకివెళ్ళి ఆ రాత్రి తలదాచుకున్నారు. ఆయన తుపాకిమాత్రం విడువలేదు

రాష్ట్రీ జాతీయ విద్యార్థి అధ్యక్షులు శ్రీ కొండపల్లి కృష్ణారెడ్డిగారు ఒకనాటి రాత్రి ప్రొద్దుపోయిన తర్వాత బహిరంగ సభానంతరం జనార్ధనపురంవెళ్ళి తన బంధువు కొండపల్లి మాధవరెడ్డిగారింట విశ్రమించియుండగా అర్ధరాత్రివేళ ఒక కమ్యూనిస్టు దళం రైఫుల్స్, తుపాకులతోవచ్చి ఆ ఇల్లు ముట్టడించిరి. కృష్ణారెడ్డిని ఆ రాత్రి చంపివేయాలని వారి తలంపు. ఇంటి తలుపులు బ్రద్దలుకొట్టి ఇంటిలో ప్రవేశించే సమయానికి, ఆ యింటిలోని తుపాకితో కృష్ణారెడ్డి ఎదుర్కొని కాల్పులు జరిపినాడు. వారు కాల్చే కాల్పులకు ఒక మూలదాగి తప్పుకుని అక్కడినుంచి ఎదురుకాల్పులు చేసినందువల్ల, కమ్యూనిస్టులలో కొందరికి గాయములు తగిలినవి. కొంతసేపు పెనుగులాడి ఇక లాభంలేదని దెబ్బలుతిన్నవారిని ఎత్తుకుని పలాయనం చిత్తగించినారు. ఆనాటి పోరాటంలో మలిరెడ్డి పకీరుగామదాసురెడ్డి, కొండపల్లి శ్రీశైలరెడ్డి, కొండపల్లి కృష్ణారెడ్డి, సమిష్టిగా ధైర్యముతో ఎదుర్కొబట్టి బ్రతికి బయటపడ్డారు. ఈ ముగ్గురు ప్రముఖ కాంగ్రెసు కార్యకర్తలు. వీరిని చంపివేస్తే ఆ ప్రాంతములో తమకు ఎదురువుండదనే దురుద్దేశముతో కమ్యూనిస్టులు ఈ దాడికి పాల్పడినారు. వారికి సరియైన శృంగభంగం జరిగినది.

## కృష్ణా జిల్లా బోర్డు ఎన్నికలు

1949 అక్టోబరులో జిల్లాబోర్డులకు ఎన్నికలు జరపాలని మద్రాసు ప్రభుత్వము నిశ్చయించినది. ఉభయ జిల్లాల కాంగ్రెసు సంఘాలు తమ

తమ అభ్యర్థులను నిర్ణయించినవి. ఎన్నికలు మంచి ఉత్సాహ వాతావరణములో జరిగినవి. కాంగ్రెసుకు పెద్ద మెజారిటీ వచ్చినది. నవంబరు నెలలో జరిగిన అధ్యక్ష ఎన్నికలకు కాంగ్రెసు అభ్యర్థిగా శ్రీ కాకాని వెంకటరత్నంగారిని రాష్ట్ర కాంగ్రెసు సంఘం నిర్ణయించినది. వారు యేకగ్రీవముగా ఎన్నుకొనబడిరి. 1954 వరకు వారు జిల్లాబోర్డు అధ్యక్షులుగా వుండి, జిల్లాను చెప్పదగినంతగా అభివృద్ధి పరచి, కాంగ్రెసుకు మంచిపేరు తెచ్చినారు. జిల్లాలో హైస్కూళ్ళను 40 నుండి 120 వరకు పెంచినారు. ప్రతి గ్రామానికి రోడ్డు ఉండాలనే పట్టుదలతో అన్ని గ్రామాలకు రహదారి సౌకర్యాలు కలిగించారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించి, నూతన స్కేల్సు అమలుజరిపి, ప్రతినెల మొదటి తేదీకి జీతాలు అందే ఏర్పాట్లు చేశారు. "ఉపాధ్యాయ బంధు" అనే బిరుదును పొందారు. వీరు యే పదవిని స్వీకరించినా ఆ పదవికి వన్నెతెచ్చారు. భారత్ సేవక సమాజ్‌కు కన్వీనరుగా వుండి లంచగొండితనము నిర్మూలనకు కృషి చేశారు. ప్రజా సహకారముతో అనేక నిర్మాణములు చేయించారు (రోడ్లు, భవనాలు వగైరా). రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులుగావుండి, వివిధ వర్గాల ప్రతినిధులను ఆర్గనైజర్లుగా నియమించి, సంస్థకు బలము చేకూర్చినారు. రాష్ట్ర వ్యవసాయ మంత్రిగా అనేక స్కీములను మంజూరు చేయించి, రైతులకు మేలుచేశారు. రాష్ట్రములో పాల సరఫరా, పశు సంవర్థక శాఖను నిర్వహించి (శ్వేత విప్లవము - వైట్ రివల్యూషన్) సృష్టించారు, వారి పరిపాలనా దక్షతకు ఆంధ్ర ప్రజానీకము జోహారు లర్పించారు. వారు 24-12-72 న హృద్రోగమువలన కన్నుమూశారు. రాష్ట్రము నలుమూలలనుండి దాదాపు 5 లక్షల జనమువచ్చి, వారి అంతిమ యాత్రలో పాల్గొని 'శ్రద్ధాంజలి' ఘటించారు.

పశ్చిమ కృష్ణాజిల్లా కాంగ్రెసు యాజమాన్యములో కొన్ని రాజకీయ పాఠశాలలు నడుపబడినవి. సదరు పాఠశాలలో కాంగ్రెసు కార్యకర్తలను ప్రాథమిక సభ్యులను సమీకరించి, దేశ రాజకీయ పరిస్థితులు గురించి వారికి శిక్షణ యివ్వడము జరిగినది. తిరువూరు తాలూకా తునికిపాడులో శ్రీ కర్నాటి వీరభద్రయ్యగారి ఆధ్వర్యమున వారంరోజులు క్యాంపు నిర్వహించబడినది. ఈ క్యాంపునకు ఆచార్య రంగాగారు ప్రిన్సిపాల్‌గా వుండిరి, తాలూకా అంతటినుంచి కార్యకర్తలు వచ్చి శిక్షణ పొందిరి.

నందిగామ తాలూకా వీరులపాడు గ్రామములో శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్యగారి పర్యవేక్షణక్రింద తాలూకా కార్యకర్తల శిక్షణ శిబిరము నెలరోజులు జరిగినది. శ్రీ వాసిరెడ్డి ప్రసాద్, శ్రీ అడుసుమిల్లి సూర్యనారాయణరావుగార్లు శిబిర నిర్వాహకులుగావుండి మంచి యేర్పాట్లు చేసిరి.

నందిగామలో తాలూకా కాంగ్రెసు తరపున అధ్యక్షులు శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠిగారు ఒక కార్యకర్తల శిక్షణ శిబిరమును వారం రోజులు నిర్వహించిరి. ఈ శిబిరమునకు శ్రీ కాకాని వెంకటరత్నం, శ్రీ కొడాలి ఆంజనేయులుగార్లు వగైరాలు వచ్చి శిక్షణ గరపిరి.

పటమట లంకలో జిల్లా కాంగ్రెసు ఆధ్వర్యములో అధ్యక్షులు శ్రీ కాకాని వెంకటరత్నంగారు జిల్లా కాంగ్రెసు సభ్యులకు, కార్యకర్తలకు 15 రోజులు శిక్షణ శిబిరను నడిపిరి. శిబిరమునకు వలయు ఏర్పాట్లు శ్రీ చెన్నుపాటి రామకోటయ్యగారు చేసిరి. శ్రీ మైనేని రామకోటయ్య గారు శిబిరమునకు ప్రిన్సిపాల్‌గా వుండిరి. శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారు శిబిరమును ప్రారంభించిరి. శ్రీ టంగుటూరు ప్రకాశం, శ్రీ కాశేశ్వర రావుగార్లు శిబిరములో ఉపన్యసించిరి. శ్రీ కాశీనాధుని పూర్ణమల్లికార్జు నుడుగారు వారి సందేశమిచ్చిరి.

గొల్లపూడిలో మరొక క్యాంపును జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కాకాని వెంకటరత్నంగారు నిర్వహించిరి. ఈ శిబిరమునకు వలయు యేర్పాట్లు శ్రీ చనుమోలు వెంకట్రావు, యమ్. యల్. ఎ., శ్రీ కోమటి భాస్కరరావు (మైలవరం సమితి ప్రెశిడెంటు) చేసిరి. ఈ క్యాంపు 3 రోజులు జరిగినది. రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ పి. నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీ మండలి వెంకట కృష్ణారావు, శ్రీ భాట్టం శ్రీరామ మూర్తిగార్లు ఈ శిబిరములో 3 రోజులుండి ఉపన్యాసములిచ్చిరి. పి. సి. సి. అధ్యక్షులైన శ్రీ పి. నర్సారెడ్డిగారు ఈ శిబిరమునకు ప్రారంభోత్సవం చేసిరి.

నందిగామలో తాలూకా విద్యార్థి కాంగ్రెసు మహాసభ జరిగినది. ఈ సభలో శ్రీమతి అన్నే రాజ్యం, శ్రీ ఆచార్య రంగా, శ్రీ కాకాని వెంకట రత్నం, శ్రీ కాశేశ్వరరావుగార్లు ఉపన్యసించిరి. శ్రీ పారుపల్లి సూర్య నారాయణ, శ్రీ కొమరగిరి శేషగిరిరావుగార్లు తదితర విద్యార్థులు దీనిని

నిర్వహించిరి. తిరువూరు తాలూకా పుట్రేల గ్రామములో తాలూకా కాంగ్రెసు కార్యకర్తల శిక్షణ శిబిరము జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కాకాని వెంకటరత్నంగారి ఆధ్వర్యమున జరిగినది, రాష్ట్ర కాంగ్రెసు కార్యదర్శి శ్రీ బండి కూర్మన్నగారు 3 రోజులు శిబిరములో వుండి శిక్షణ యిచ్చిరి. శ్రీ మైనేని రామకోటయ్యగారుకూడ యీ శిబిర వాసులకు శిక్షణ ఇచ్చిరి. ఈ శిబిర నిర్వహణ యావత్తు యేర్పాట్లు శ్రీ కొల్లి బుచ్చయ్యగారు తమ యింటివద్దనే ఏర్పాటు చేశారు.

నూజివీడు తాలూకా ముసునూరు గ్రామములో జిల్లా కాంగ్రెసు ఆధ్వర్యమున కార్యకర్తల శిక్షణ శిబిరము జరిగినది. శిబిరమునకు అవసరమైన యేర్పాట్లు అన్నీ శ్రీ దాసరి వెంకట సుబ్బయ్యగారు చేసిరి. శ్రీ పేట బాపయ్య, శ్రీ కాకాని వెంకటరత్నంగార్లు శిబిరములో శిక్షణ గరపిరి.

## భారత రాజ్యాంగ చట్ట నిర్మాణము

భారత రాజ్యాంగ చట్ట నిర్మాణ నిమిత్తము 1948 ఆఖరులో చట్ట నిర్మాణసభ ఏర్పడినది. కృష్ణాజిల్లానుంచి డా॥ పట్టాభి సీతారామయ్య అసెంబ్లీద్వారా యీ సభకు ఎన్నుకొనబడినారు. నిమ్నజాతుల ప్రతినిధి కావలసివచ్చినారు. జైలుకు వెళ్ళినవారిలో శ్రీ అప్పికట్ల జోసెఫ్‌గారిని ఎన్నుకున్నారు. ఈయన క్విట్ ఇండియా ఉద్యమములో ముదునూరు సెంటరునుండి జైలుకు వెళ్ళినారు.

రాజ్యాంగ చట్ట నిర్మాణ సభకు శ్రీ బాబు రాజేంద్రప్రసాద్‌గారు అధ్యక్షులుగా ఎన్నుకొనబడినారు. భారత దేశానికి నూతన రాజ్యాంగ చట్టాన్ని యీ సభ రచించినది. ఈ చట్టం 26-1-1950 నుండి అమలులోనికి వచ్చినది. ఈ తేదీ నిర్ణయించడానికిగల కారణము 26-1-1929వ తేదీన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ అధ్యక్షతన జరిగిన లాహోర్ కాంగ్రెసులో "భారతదేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యము" కావాలని తీర్మానించడము జరిగినది. ఆనాటినుంచి 1947 వరకు ఈ సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు కాంగ్రెసు బ్రిటిషు ప్రభుత్వముతో పోరాడుతూనేవున్నది, దానిని పురస్కరించుకొని, 26-1-1950న క్రొత్త రాజ్యాంగం అమలు పెట్టడము జరిగినది. ఆనాటినుండి భారతదేశము సర్వసత్తాక ప్రతిపత్తిగల స్వతంత్ర

రాజ్యముగా అవతరించినది. దేశమంతా కడు వైభవముగా రిపబ్లిక్ దినోత్సవము జరుపుకొన్నది. కృష్ణాజిల్లా ప్రజలుకూడ యీ రిపబ్లిక్ దినోత్సవాలను అతి వైభవముగా జరుపుకొన్నారు.

## గోవా సత్యాగ్రహ అమర వీరులు

1955 ఆగస్టు 15వ తేదీన డచ్చిప్రభుత్వాధీనములోవున్న భారత భూ భాగములోని గోవా ప్రాంతమును వలస పాలననుంచి విముక్తిచేసి భారత దేశములో విలీనము చేయవలెనని 'గోవా జాతీయ విమోచన సంఘము' సత్యాగ్రహ వుద్యమమునకు పిలుపు నిచ్చినది.

ఈవిమోచనోద్యమమును జయప్రద మొనర్చుటకు జాతీయస్థాయిలో భారతదేశం నలుమూలలనుండి ఈ వుద్యమములో పాల్గొనవలసినదిగా ప్రజలకు అఖిలభారత కాంగ్రెసు సంస్థ పిలుపునిచ్చినది. పలు ప్రాంతాల నుండి విద్యార్థులు, యువకులు జట్లు జట్లుగా అమితోత్సాహముతో సత్యాగ్రహ దండయాత్రకు బయలుదేరిరి. విజయవాడలోని ఎస్. ఆర్. ఆర్. అండ్ సి. వి. ఆర్. కళాశాల విద్యార్థులు 15 మంది బృందం శ్రీ చాపరాల జగన్ మోహనరావు, శ్రీ సూరి సీతారాం (బి. ఎ. విద్యార్థులు) గార్ల నాయకత్వమున సర్దార్ మరుపిళ్ళ చిట్టి, శ్రీ కాకాని వెంకటరత్నం, శ్రీ పేట బాపయ్యగార్ల ఆశీర్వచనములతో విజయవాడ స్టేషను నుండి బయలుదేరి 16వ తేదీ తెల్లవారువేళకు గోవా సరిహద్దుకు చేరిరి. అప్పటికే అచ్చట సిద్ధముగావున్న ఇతర సత్యాగ్రహులతోచేరి 8 గంటలవేళ సరిహద్దును దాటి గోవా భూ భాగములో ప్రవేశించిరి. శ్రీ సీతారాం జాతీయ గీతాలాపన చేయుచుండగా శ్రీ జగన్ మోహనరావు గోవా భూ భాగముపై జాతీయ పతాకమును ఆవిష్కరించిరి. ఈ సంఘటన నెదుర్కొనుటకు గోవా ప్రభుత్వ సరిహద్దు భద్రతా సైనికులు నిర్దాక్షిణ్యా ముగా కాల్పులు జరుపగా శ్రీ జగన్ మోహనరావు గోవా భూ భాగము పైననే అసువులు బాసెను. శ్రీ సీతారాం తుపాకీ గుండ్లకు గురియై అతి కష్టముమీద మన భూ భాగములోనికి వచ్చి అసువులుబాసెను. గోవా భూ భాగముపైవున్న శ్రీ జగన్మోహనరావు శవమునుకూడా మనకు కనుపించకుండా గోవా సైనికులు మటుమాయము చేసిరి. శ్రీ సీతారాం భౌతిక దేహమును బెల్గాం పట్టణ వీధులలో ఊరేగించి, అచటనే శవదహనం గావించిరి.

నెల రోజుల అనంతరము గోవా ప్రభుత్వము శ్రీ జగన్మోహనరావు మృతదేహమును మన ప్రతినిధులకు అప్పగించగా మన ప్రభుత్వము అచటనే సర్వలాంఛనాలతో అంత్యక్రియలు గావించి, చితాభస్మమును విజయవాడలోని వారి తలిదండ్రులకు పంపించిరి. ఆ చితాభస్మముతో పాటు ఈ యిరువురి వీరుల చిత్ర పటములను విజయవాడ నగర వీధులన్నీ వూరేగించి, చితాభస్మమును పవిత్ర కృష్ణా జలాలలో నిమజ్జనము చేసిరి. అనంతరము జరిగిన స్మారక సభలో ఈ మృత వీరులకు శ్రద్ధాంజలి ఘటించిరి. శ్రీ చాపరాల జగన్మోహనరావు గుడివాడ తాలూకా దొండపాడు గ్రామములో 1935లో జన్మించినాడు. తండ్రి శ్రీ చాపరాల సుబ్బారావుగారు. పూర్వంనుండికూడా వీరి కుటుంబీకులు జాతీయోద్యమాలలో పాల్గొన్న దేశభక్తులు.

శ్రీ సూరి సీతారాం గన్నవరం తాలూకా ఉయ్యూరు గ్రామములో 1936లో జన్మించినాడు. వీరి తండ్రి శ్రీ సూరి శోభనాచలపతిగారు రాజమండ్రి ఆర్ట్సు కాలేజీలో చదుచున్న రోజులలోనే డిప్యూటీ తహశీలుదారు ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి అరెస్టు అయిన దేశభక్తుడు. శ్రీ సీతారాం స్మృతి చిహ్నముగా ఉయ్యూరు పౌరులు శిలా విగ్రహమును ప్రతిష్ఠించిరి.

ఈ వీరులిరువురకు ప్రధాని జాతీయ సహాయ నిధినుండి నాటి భారత ప్రధాని శ్రీ జవహర్ లాల్ నెహ్రూ చెరొక రు 500 లు సానుభూతిగా వీరి కుటుంబములకు నగదు సహాయము చేసిరి. తరువాత గోవా విమోచన సమితివారుకూడా సానుభూతిగా ఈ ఇరు కుటుంబాలకు చెరొక రు 1000 లు నగదు బహుమతి అందజేసిరి. అంతేగాక వీరిరువురి సేవలను గుర్తించి మన ప్రభుత్వమువారు ఈ యిద్దరు వీరులను స్వాతంత్ర్య సమరయోధుల జాబితాలో చేర్చి గౌరవించిరి.

## కాంగ్రెసు - సోషలిజము

పండిట్ జవహర్ లాల్ నెహ్రూ లక్నో కాంగ్రెసు పీఠమునుంచి కాంగ్రెసు లక్ష్యము సోషలిజమే అని ఉద్ఘాటించినారు. అంతకు ముందు నుంచి గాంధీగారు తన భాషలో సామ్యవాదమును గురించి ప్రబోధము చేయుచునేయున్నారు. నెహ్రూ పాశ్చాత్య నాగరికతను గురించి బాగా

చదివి అర్థంచేసుకున్న వ్యక్తి. యూరపు ఖండములో ప్రచలితమగుచున్న రకరకాల సోషలిస్టు సిద్ధాంతములను బాగా అవగాహన చేసుకున్నవాడు. రష్యాలో అమలుజరిగే సోషలిస్టు వ్యవస్థ ఆయనను ఆకర్షించినా అందులోని లోపాలనుకూడ గమనించాడు. చైనాలో నూతనంగా ప్రవేశించిన నియంతృత్వం ఆయనను కలవర పర్చినది. ప్రాచ్య సంస్కృతిలోవున్న విశిష్ట మానవతా దృక్పథముపై ఆయనకు ప్రేమ ఉండనే వుంది. వీటన్నిటినీ దృష్టిలో పెట్టుకుని, భారతదేశంలో సామ్యవాద నవసమాజము నిర్మించాలని సంకల్పించుకున్నాడు. ఇందుకు ఎన్నో పరిశోధనలు సాగించినాడు. భారత రాజ్యాంగ చట్టములో ప్రాథమిక హక్కుల తీర్మానం ప్రవేశ పెడుతూ ఆయన యిచ్చిన ఉపన్యాసము గమనించవలసియున్నది.

ప్రపంచ రాజ్యాల సమైక్యతకు, జాతిద్వేషాల నివారణకు ఆయన ప్రతిపాదించిన "పంచశీల సిద్ధాంతము" విశేష మానవ దృక్పథంగల ఆయన ప్రథమ ప్రయత్నము. దీనిద్వారా హింసావాదముతో నిమిత్తం లేకుండా, ప్రజాస్వామిక పద్ధతులద్వారానే ప్రపంచమంతట సోషలిజం స్థాపించవచ్చును అని నిరూపించినాడు. స్టాలిన్ అనంతరం రష్యాలో అధికారములోనికి వచ్చిన కమ్యూనిస్టు నాయకులు దీనిని హర్షించినారు. క్రమేణ ఈ భావం వ్యాప్తిచెందజొచ్చినది. ముఖ్యంగా ఆసియా దేశాలలో ఇండియా పలుకుబడి బాగా వ్యాపించినది. ఇదిచూచి చైనాకు కన్నెర్ర అయినది. అందుచేత నెహ్రూ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే దుర్బుద్ధి దానికి కలిగినది. 1962లో నిష్కారణంగా ఇండియాపై దాడిచేసినది.

నెహ్రూ నూతన సిద్ధాంతమును, ప్రజాస్వామిక సోషలిజమును హర్షించిన రష్యన్ నాయకులనుకూడ నిందించసాగినది. వారిని రివిజనిష్టులుగా వర్ణించినది. ఇది ఇంతటితో ఆగక ప్రపంచమంతటా కమ్యూనిస్టు సిద్ధాంతము పునః పరిశీలనలో పడినది. భారత కమ్యూనిస్టులలో కూడ దీని ప్రభావముచే అతివాద - మితవాద వర్గాలుగా విడిపోయారు. ఒకరు రష్యాను మరొకరు చైనాను సమర్థించ సాగినారు. 1962 లో పూర్తిగా బయటపడిపోయి ఒకరికొకరు ఎన్నికలలో పోటీకికూడా దిగినారు.

కృష్ణాజిల్లా మొదటినుంచి సోషలిస్టులకు, కమ్యూనిస్టులకు పుట్టినిల్లని పైన తెలియజేయబడినది. ఈ కృష్ణాజిల్లాలో జరిగినంతగా సోషలిస్టు

ప్రచారము మరెక్కడను జరిగియుండలేదు. అందుచేతనే కాంగ్రెస్‌లో వచ్చిన సోషలిస్టు భావ సంచలనం ఈ జిల్లా త్వరగా అందుకోగలిగినది.

నిజానికి 1947 ఢిల్లీ ఎ.ఐ.సి.సి.లో ఆర్థిక కార్యక్రమం రూపొందించే నిమిత్తం నెహ్రూ అధ్యక్షతన నియమించిన సబ్ కమిటియే దేశ భవిష్యత్ ఆర్థిక అభివృద్ధికి ప్రాతిపదికను రూపొందించినది. అనంతరం అమలులోనికి వచ్చిన ప్రణాళికలన్నింటికి అదే మూలాధారం. ఇంతేగాక జె. సి. కుమారప్ప అధ్యక్షతన "భూ సంస్కరణల సంఘాన్ని"కూడా వేయడం జరిగినది. ఈ రెండు కమిటీలు దేశ ఆర్థిక పునర్నిర్మాణమునకు మార్గదర్శకము లయినవి. 1950 ఢిల్లీలో జరిగిన రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశములో "జాతీయ ప్రణాళికా కమిషన్" ఏర్పాటు చేయబడినది. డాక్టరు పట్టాభి సీతారామయ్యగారు ఈ సమావేశము ఏర్పాటుచేశారు. శ్రీ పండిట్ గోవింద వల్లభ పంత్ సభకు అధ్యక్షత వహించినారు.

1955లో జరిగిన ఆవడి కాంగ్రెసులో సోషలిస్టు పద్ధతి సమాజం నిర్మించుటకు తీర్మానించినది. ప్రధాన ఉత్పత్తి సాధనాలు సంఘ యాజమాన్యంలో వుండాలని, ఉత్పత్తులు అధికంచేసేందుకూ, జాతీయ సంపదను సమానంగా పంపిణీ చేసేందుకు, సోషలిస్టు సమాజ వ్యవస్థను నిర్మించేందుకు అవసరమైన అన్ని చర్యలు వెంటనే తీసుకోవలసినదిగా భారత ప్రభుత్వమును ఈ సమావేశం కోరింది. పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆవడి సమావేశములో మాట్లాడుతూ "నిజానికి కాంగ్రెసుకు ఇది క్రొత్త ఆలోచన కాదని, గాంధీగారు కాంగ్రెసులో ప్రవేశించిన నాటినుంచి ఈ భావాలను కాంగ్రెసుద్వారా చెబుతూనే వున్నారని, ఇది అమలు జరుపు నిమిత్తమే రాజకీయాధికారమును కాంగ్రెసు కోరుతూ వచ్చినదని చెప్పినారు". సాంప్రదాయ బద్ధమైన ఆలోచనా పరంపరతోనే ఈ నాటికి ఈ గమ్యానికి చేరామని, సోషలిజం అనే పదాన్ని కేవలం వూతపదంగా మాత్రమే కాంగ్రెసు వాడటంలేదని, ఇండియా తన స్వంత ధోరణిలో సోషలిస్టు విధానాన్ని అలవర్చుకోవలసి వుంటుందనికూడా ఆయన స్పష్టపరిచారు. సోషలిజం కష్టించి పనిచేస్తే వచ్చేదేగాని, వుత్త నినాదాలవల్ల రాదనికూడ ఆయన నొక్కిచెప్పారు.

1956 లో ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ప్రభుత్వం మార్చివేసినది. జీవిత భీమా సంస్థను జాతీయం చేసినదికూడ.

నాగపూరు కాంగ్రెసు మహాసభలో సహకార వ్యవస్థను మరింతగా గ్రామీణ ప్రాంతాలకు విస్తరించుటకు నిర్ణయం తీసుకున్నది. సహకార వ్యవసాయ పద్ధతిని అమలు చేయాలనికూడ నిశ్చయించినది. పబ్లిక్ రంగంలో పరిశ్రమలు అధికంగా స్థాపించవలెనని నిర్ణయించినది. వ్యాపారం ప్రభుత్వ స్థాయిలో సాగించాలని సూచించినది. పంటలు దిగుబడి కార్యక్రమము అధికము చెయ్యాలని కోరింది. ప్రజాస్వామిక సోషలిస్టు సమాజ నిర్మాణమునకు అనువైన పై చర్యలు తక్షణం అమలులో పెట్టమని ప్రభుత్వాన్ని కోరినది. నిజానికి నాగపూరు కాంగ్రెసు సోషలిజం స్థాపనకు మరొక అడుగు ముందుకు వేసినది.

అయితే భావి ప్రపంచములో కాంగ్రెసు సోషలిజంవైపుకు వెళ్ళుచున్నంతగా కార్యరూపములో ప్రభుత్వం అంత ముందుకు సాగడంలేదు. కారణం సంస్థలోను, ప్రభుత్వంలోనుకూడ పాత సాంప్రదాయాలను కలిగిన వారికి ప్రాబల్యముండుటయే — 1963 వరకు అభ్యుదయ భావాలకు ప్రతీపశక్తులకు మధ్య ఘర్షణ జరుగుతూనేవుంది. దీనిని కామరాజు ప్లాను కొంతవరకు అరికట్టగలిగినది. అంతకుముందు జరిగిన చైనాదాడి నెహ్రూ ఆలోచనలను దెబ్బతీసింది. దీనికితోడు సంస్థలోని మిత్రులు ఆయనను వేధించసాగారు. ఈ మానసిక సంఘర్షణవల్ల అకస్మాత్తుగా నెహ్రూ జబ్బుపడి 1964లో స్వర్గస్థులైనారు.

నెహ్రూ స్థానంలో శ్రీ లాల్‌బహదూర్ శాస్త్రి ప్రధానిగా ఎన్నుకోబడినారు. ఆయన ప్రధాని అయిన కొద్దికాలానికి పాకిస్తాన్ భారత దేశముపై దాడిచేసినది. దీనివల్ల శాస్త్రి అమలుచేయదలచిన సోషలిస్టు సమాజ నిర్మాణమునకు విఘాతం కలిగింది. పాకిస్తాన్‌పై విజయం సాధించగలిగాము. 1966లో శాస్త్రి గుండెపోటువల్ల రాష్యాలో తాష్కెంటు నగరమందు మరణించినారు.

1966 లో శ్రీమతి ఇందిరాగాంధి భారత ప్రధానిగా ఎన్నుకోబడినది. నెహ్రూ కలలుగన్న ప్రజాస్వామిక సోషలిస్టు రాజ్యాన్ని

నిర్మించుటకు నిశ్చయించుకున్నది. ఈమె ఆర్థిక కార్యక్రమాలు ఇష్టంలేని అభివృద్ధి నిరోధకవర్గం (సిండికేటు) లోలోపల కుట్రలు పన్నసాగారు. 2-3 సంవత్సరాలు అధికార కుమ్ములాటలలో సతమతమయిన వైషమ్యాలు 1969లో ఒకరూపం ధరించినవి. సిద్ధాంత పరమయిన విభేదాలు పరాకాష్ట నందుకున్నాయి. బెంగుళూరులో ఎ.ఐ.సి.సి. ఆమోదించిన దశసూత్ర ఆర్థిక ప్రణాళికను అమలు జరుగనీయని పరిస్థితులు కల్పించ బడినవి. ఇంతలో రాష్ట్రపతి ఎన్నికలు వచ్చినవి. సిండికేటు వర్గం ప్రతిపక్షాలతో కలిసి అధ్యక్షస్థానం సంపాదించి, ఇందిరాగాంధిని గద్దెనుంచి దించివేయాలని ప్లాను వేసుకున్నది. సోషలిస్టు విధానాలకు తిలోదకాలివ్వాలనికూడ వారి సంకల్పం. ఇది గ్రహించిన ఇందిరాగాంధి, ఆమె వర్గము ఎదురు దాడిచేసి వి. వి. గిరిగారిని రాష్ట్రపతిగా ఎన్నుకున్నారు. దీనితో అభివృద్ధి నిరోధకుల ఆట కట్టినది.

అనంతరం కాంగ్రెసు రెండుగా చీలిపోయినది. జగజీవన్ రాం అధ్యక్షతన క్రొత్త కాంగ్రెసు, నిజలింగప్ప అధ్యక్షతన పాతకాంగ్రెసులుగా పనిచేయడం మొదలు పెట్టినవి. కృష్ణాజిల్లాలో అశేష సంఖ్యలో కార్యకర్తలు కొత్త కాంగ్రెసు పక్షానవుండి ఇందిరాగాంధి అభ్యుదయ కార్యక్రమాలను బలపర్చ సాగినారు. జిల్లాలో ఒకరిద్దరు నాయకులుమాత్రం పాత కాంగ్రెసులో వున్నారు. 1968 ఆఖరులో (కీ) కాసు బ్రహ్మానంద రెడ్డి అధ్యక్షతన విజయవాడలో జిల్లా కాంగ్రెసు కార్యకర్తల సమావేశం జరిగినది. ఈ సభను (కీ) కాకాని వెంకటరత్నంగారు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలలనుంచి వచ్చిన కార్యకర్తలు, అభిమానులు 2 వేల మంది ఆ సభలో పాల్గొన్నారు. రాత్రి విజయవాడ గాంధి హైస్కూలులో గొప్ప బహిరంగసభ జరిగింది.

1971 మధ్యంతర పార్లమెంటు ఎన్నికలలో కృష్ణాజిల్లా మూడు పార్లమెంటు సీట్లు లక్షవోట్ల మెజారిటీతో ఎన్నుకోబడినవి. ఇందిరాగాంధి తలపెట్టిన నూతన ఆర్థికసోషలిస్టు విధానం బీదవర్గాలపై బాగా పనిచేసింది. రైతు వర్గంలో కొంత వ్యతిరేకత వచ్చినను అంత లెక్కలోనికి రాలేదు. ఎన్నికల అనంతరం ఇందిరాగాంధి మరల ప్రధానిగా ఎన్నుకోబడినది. వెంటనే బ్యాంకులు జాతీయం చేయబడినవి. వీనిద్వారా బీదవర్గాలకు విశేషంగా అప్పులు ఇవ్వబడి అనేక వృత్తులవారు లాభంపొందారు. హరిజన

గృహ నిర్మాణ పథకాలు ప్రారంభించబడినవి. మరెన్నో స్కీముల ద్వారా బీదలకు సహాయం అందించబడినది.

## కాంగ్రెసు స్వర్ణోత్సవ సందర్భములో

1972 ఆగష్టు 15వ తేదీన భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి దేశ స్వాతంత్ర్యము నిమిత్తం అతి కష్టములకోర్చి, ఎన్నో బాధలననుభవించిన స్వాతంత్ర్య వీరులను గమనించి వారికి వీరోచితమైన స్థానాన్ని సంఘంలో కలుగజేయ తలపెట్టి వారి త్యాగముల నుగ్గడించుచూ అందరకు తామ్రపత్ర ములను బహూకరించి, ప్రభుత్వ స్థాయిలో సన్మానములు చేయించినది. అంతవరకు రాజకీయ బాధితులుగా పేర్కొనబడుచున్న ఈ త్యాగధనులు ఆనాటినుంచి స్వాతంత్ర్య సమర యోధులుగా పరిగణింపబడినారు. కేంద్ర ప్రభుత్వ స్థాయిలో ఢిల్లీలోను, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో రాష్ట్ర రాజ ధానులలోను, జిల్లాల స్థాయిలో కలెక్టరేట్సులోను దర్బారులు జరిపి అందు ఈ సమరయోధులను గౌరవ పురస్కరంగా తామ్రపత్రాలతో సన్మానములు ఏర్పాటు చేయించిన ఇందిరాగాంధి దేశభక్తిని ఎంతయినా మెచ్చుకొనవలసి యున్నది.

ఇంతటితో ఆగక చరమదశలో ఆకలిదప్పులకు, అనారోగ్యములకు గురియై యాతనలుపడుతున్న సమర యోధులకు రాజోచిత మర్యాదలతో నెలకు రెండువందల రూపాయలు చొప్పున పెన్షనుకూడ మంజూరుచేసి వారి కుటుంబాలకు పోషణాధారం చూపించినది. పైగా వారందరికి ఉచిత వైద్య సదుపాయాలుకూడా కల్పించి ఎంతో ఆదరణ చూపించినది.

ఈ సందర్భములో ఈ జిల్లానుంచికూడ అనేకమంది స్వాతంత్ర్య యోధులను ఢిల్లీకి పిలిపించి, వారికి రైలు ఖర్చులుకూడ ప్రభుత్వమే భరించినది. మరివృద్ధులయినవారికి సహాయం నిమిత్తం తోడుగ వెళ్ళిన వారికికూడా ఖర్చు ప్రభుత్వమే భరించినది. సమర యోధులయెడ ఇంత ప్రత్యేక శ్రద్ధ వహించి వారి త్యాగమును ప్రపంచమంతా గమనించేటట్లు చేసిన ఇందిరాగాంధికి జోహార్లర్పించ వలసియున్నది.

అంతర్జాతీయంగా మరెన్నో మార్పులుకూడ వచ్చినవి. బంగ్లా దేశంలో పాకిస్తాన్ దమన చర్యలకు భయపడి కోటిమంది కాందిశీకులుగా

ఇండియాకు పారిపోయివచ్చారు. ఇది చివరకు పాకిస్తాన్‌తో యుద్ధానికి దారితీసినది. అమెరికా చైనాల ప్రోత్సాహంతో పాకిస్తాన్ ఇండియాపై యుద్ధం ప్రకటించినది. రష్యా ఇండియాకు సానుభూతి కలిగియున్నది. చివరకు బంగ్లాదేశ్ విముక్తసైన్యంతోపాటు, భారత సైన్యం బంగ్లాదేశ్‌ను పాకిస్తాన్‌నుంచి విముక్తం చేయడం జరిగింది.

ఇండియాలోని ప్రతిపక్షాలు అడుగడుగునా ఇందిరాగాంధి ఆర్థిక కార్యక్రమాలకు అవరోధాలు కలిగించ మొదలిడినవి. పాకిస్థాన్ యుద్ధం వల్ల కలిగిన ఆర్థిక సంక్షోభాన్ని తమ స్వార్థానికి వినియోగించుకోసాగినారు. విభిన్న సిద్ధాంతాలుగల ప్రతిపక్షాలు అన్నీ కలిసి దేశంలో ప్రజాస్వామికానికే ముప్పుతెచ్చే పరిస్థితులు కల్పించినారు. సైన్యమును తిరుగుబాటుకు ప్రోత్సహించారు. పోలీసులు ప్రభుత్వమునకు విధేయతగా వుండవద్దని ఆదేశించసాగారు. మెజారిటీ ప్రజలచే ఎన్నుకోబడిన శాసన సభ్యులను బలవంతంచేసి రాజీనామాలిప్పించుటకు ప్రజలను రెచ్చగొట్టారు. మైనారిటీలోవుండి చట్ట సభలను పనిచేయనీయకుండా అవరోధాలు కల్పించ సాగినారు. ఈవిధంగా ఫాసిస్టు పంథాను అవలంభించి ప్రజాస్వామికమును అవమానంపాలుచేసి, నిర్వీర్యంచేసినారు. విధిలేక ప్రజాస్వామ్యమును రక్షించుకొనే నిమిత్తం దేశంలో అత్యయిక పరిస్థితి ప్రకటించవలసి వచ్చినది.

## క్రమశిక్షణతో కూడిన పరిపాలన

రాజకీయ వ్యవస్థ ఒక క్రమ పద్ధతిలో వున్నప్పుడే ! ఒక సువ్యవస్థ కొనసాగినంతకాలం మాత్రమే ! రాజకీయ స్వాతంత్ర్యం, రాజకీయమైన హక్కులు వుంటాయి. అరాజక పరిస్థితి కల్పించబడితే వ్యక్తులకువుండే అన్నిరకాల స్వాతంత్ర్యము, రాజకీయ హక్కులు అతి శీఘ్రముగా హరించుకుపోతాయి.

ప్రభుత్వము అనేక హక్కులు ప్రధానము చేయుచున్నది. అయితే వ్యక్తికి హక్కులతోపాటు కొన్ని బాధ్యతలుకూడ ఇలాగేసంక్రమించాయి. ఇదే విధంగా ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ స్వాతంత్ర్యము అనుభవిస్తున్న సంఘాలు, వర్గాలు, వ్యవస్థీకృత సంస్థలు తమ హక్కుల పరిమితికి లోబడి వ్యవహరించడం అవుసరమన్న విషయం గుర్తించాలి.

# ప్ర జ ల హ క్కు లు

మన దేశంలోని ప్రజాస్వామ్యం మూలముగా ప్రజలకు మరిన్ని హక్కులు లభించుచున్నవి. ప్రజాస్వామ్యము ప్రజలకు అనేక హక్కులు ప్రదానం చేస్తున్నది. "అంటే ఏదో ఒక వర్గం" అనికాదు అర్థం. ప్రజలందరు అనే అర్థంతోనే ఆ పదం ప్రయోగించబడుచున్నది. మన దృష్టిలో భారత దేశంలోని ప్రతి పౌరుడు ఒక వ్యక్తే! ఇటువంటి వ్యక్తుల సముదాయమే ప్రజలు. జాతిలో కొందరు కొన్ని వర్గాలవారు ఉన్నత స్థానాలు అధిష్టించి, తరతరాలుగా మన్నపై పెత్తనం చలాయిస్తున్నారు. చిరకాలంగా అణచివేయబడిన వర్గాలకు చెందిన ప్రజలు మళ్ళీ తలఎత్తుకోవడానికి వీలు కలిగించకపోతే, అటువంటి ప్రజలను సముద్ధరించకపోతే మన సమాజంలో శాంతి సామరస్యం లేకుండా పోతుందని మనం భావిస్తున్నాం. గడచిన కొద్ది సంవత్సరాలలో వారికి ఇంతకు పూర్వంకంటె ఎక్కువ అవకాశాలు కల్పించడం జరిగినది. అయితే వారికి కావలసినన్ని ఇచ్చామని అనడంలేదు. ఆమాటకువస్తే వారికి చెయ్యవలసిన సహాయం చాలవున్నది. మనం వారికి కావలసిన ఆహారం ఇవ్వలేకపోయాము. తలదాచుకోడానికి రక్షణ కల్పించలేకపోయాము. విద్యాసదుపాయాలు, మరే యితర సౌకర్యాలు కల్పించలేకపోయాము. మనం చేసినదల్లా ఒక్కటే-వారిలో ఒకకొత్త ఆత్మవిశ్వాసం కలిగించాము. అది చాల పెద్ద విషయమని మనం భావిస్తున్నాము. తమ కష్టాలను గురించి బయటకు చెప్పుకునేధైర్యంకలిగేలా చేశాము. అది నిజంగా అన్నిటికంటే గొప్ప విషయం.

ప్రజాస్వామ్యము మూలముగా శాసన సభలకూ, పత్రికలకు స్వాతంత్ర్యము సిద్ధించినంత మాత్రన చాలదు. ఇందు మూలంగా పూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదం కలిగే విధంగా అందరికి సమానావకాశాలు కల్పించాలి. అలా జరిగితే భవిష్యత్ సమాజ రూపకల్పనకు, నవసమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ మరింత ఎక్కువగా కృషి చేయడానికి వీలు కలుగుతుంది.

సాంఘిక, రాజకీయ, ఆర్థికాభివృద్ధి సాధనకై యావన్మంది ప్రజలు పూనుకొని చేసే కృషిలో ఎదురయ్యే ఆటంకాలను, అవరోధాలను తొలగించే బాధ్యత ప్రజాస్వామ్య ప్రభుత్వంపై వుంటుంది. జాతీయ

స్థాయిలో ఇంత బృహత్తర ఆధిక్యత సంపాదించకుండా నివారిస్తూ, ఒక రాజకీయ వ్యవస్థను రూపొందించటం, స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడం అవసరం అవుతుంది. మరొకవంక మరింత వున్నత స్థాయిలో సాంఘిక శిక్షణ అందేలా చెయ్యటానికి మరింత వుత్తమంగా ఆర్థికాభివృద్ధి సాధించ టానికి అనువైన పరిస్థితులు కల్పించవలసి వున్నది.

దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు పారిశ్రామిక కార్మికులైనా, వ్యవసాయదారులైనా వారు ఏ యితర రంగంలో పనిచేస్తూవున్నా, స్త్రీ పురుషులందరు జాతీయ అభివృద్ధి కృషిలో మరింత ఎక్కువగా పాల్గొనేలా చెయ్యాలని మనం కోరుకుంటున్నాము. ఇది నెరవేరాలంటే దేశా న్నంతటిని సమైక్యంగ వుంచగలశక్తిసామర్థ్యాలుగల కేంద్రప్రభుత్వం మనకు ఉండాలి. దేశాన్ని సమైక్యంగా వుంచగల సాధనము ఏదీ లేకుండాచేసి వికేంద్రీకరణ జరుపుకుంటూపోతే దేశం చిన్నాభిన్నం అయిపోతుంది. దేశం ముక్కముక్కలు అవుతుంది. దేశం ఇలా ముక్కముక్కలుగా విడిపోయి దెబ్బతినిపోయేలా చెయ్యాలని చూస్తున్నవారు ఇప్పుడు చాలామందే వున్నారు.

కొద్దిమంది ఆధిపత్యానికి తలఒగ్గి, కొద్దిమంది ఆదేశాలకు లోబడి యావన్మంది నడుచుకునే దుస్థితిని వారిస్తూ, అధిక సంఖ్యాక ప్రజల స్వాతంత్ర్యాన్ని మనం సంరక్షించ వలసివుంది. కొద్దిమంది వ్యక్తుల స్వాతంత్ర్యాన్నికాదు మనం కాపాడవలసింది అధిక సంఖ్యాక ప్రజలస్వేచ్ఛా స్వాతంత్ర్యాలను మనం రక్షించవలసి యున్నది.

మన దేశంలో ఇతరత్రా ఎక్కడా కనిపించని కొన్ని ప్రత్యేక పరిస్థితులలో ప్రజాస్వామ్యానికి ఒక రూపకల్పన జరుగుచున్నది. నిరుపేద లయిన లక్షలాది ప్రజల జీవన పరిస్థితిని మరికొంచం మెరుగుపరుచుకో డానికి మరికొన్ని వుత్తమమైన అవకాశాలు సంపాదించటానికి ఇప్పటికంటె ఎక్కువగా సాంఘికన్యాయం సాధించటానికి ప్రయత్నిస్తున్నాము. ప్రభుత్వ నిర్వహణ నిమిత్తం ప్రతినిధులను ఎన్నుకొంటున్నారు. తమ ఆదర్శాలు లక్ష్యాలు సాధించటానికి ప్రభుత్వ కృషిలో పాలు పంచుకుంటున్నారు. అందువల్ల ఇటు వ్యక్తుల రాజకీయ హక్కులను, అటు మొత్తం ప్రజల యొక్క సాంఘిక, ఆర్థిక హక్కులను సమానంగా చూడవలసిన అవసరం ప్రభుత్వానికి వున్నది.

వాస్తవాలను సమంగా గుర్తించే విధంగా ప్రజా స్వామ్యానికి విస్తృతమైన అర్థంతో నిర్వచనం చెప్పుకోవాలి. దీనికి సంకుచితమైన నిర్వచనం చెప్పడం జరిగితే ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా వుండే రాజకీయ అభిప్రాయాలకు ప్రాబల్యం వస్తుంది.

ప్రజా స్వామ్యం అంటే అందరికీ బాధ్యతలు అప్పగించడం. అంతే గాని ఇష్టంవచ్చినట్లు ప్రవర్తించటానికి స్వేచ్ఛ ఇవ్వడంకాదు. ప్రజలకు వాక్ స్వాతంత్ర్యం ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత. అయితే ప్రభుత్వ యంత్రాంగం స్థంభించపోకుండా చూడవలసిన బాధ్యతకూడా ప్రభుత్వానిదే.

కాబట్టి ప్రతి పౌరుడు ఈపరమ సత్యాన్ని గ్రహించి, ప్రజాస్వామిక పరిరక్షణకు, జాతి సర్వతోముఖ వికాసమునకు తన జీవితమును మలచుకొని వ్యవహరించవలసిన అవసరమున్నది.

## జిల్లా కాంగ్రెసు భవన నిర్మాణము

తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు కమిటీకి అధ్యక్షులుగా శ్రీ వల్లభనేని రామబ్రహ్మంగారు ఎన్నుకొనబడినారు. వారు శ్రీ పట్టాభి సీతారామయ్యగారితోను, శ్రీ కొడాలి అంజనేయులుగారితోను సంప్రదించి, జిల్లా కాంగ్రెసు సంఘానికి స్వంత భవనము ఏర్పాటుచేయాలని తలపెట్టినారు. ఇందుకుగాను గ్రామాలలో విరాళములు వసూలుపర్చి, పట్టాభిగారి పేర బ్యాంకులో వేసినారు. క్రొత్తగా బిల్డింగు కట్టుట వ్యయప్రయాసలతో కూడిన పనియని పట్టాభిగారి సలహాపై ఒక పక్కా బిల్డింగును ఖరీదుచేసినారు. జిల్లా కాంగ్రెసు కమిటీని సమావేశపరచి, ఆ బిల్డింగుకు 'పట్టాభి భవనము' అని నామకరణము చేయుటకు తీర్మానించినారు. అప్పటినుంచి 1958 వరకు తూర్పు కృష్ణాజిల్లా కాంగ్రెసు ఆఫీసు ఆభవనములోనే పనిచేయుచున్నది.

దరిమిలా 1958లో శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారి షష్ఠిపూర్తి ఉత్సవము చేయదలచి ఆ సందర్భములో యీ భవనముపై "బ్రహ్మయ్య" గారి పేరుతో ఒక 'హాలు'ను నిర్మించిన యెడల యెంతో ఉపయోగముగా

నుండగలదని, మండలి వెంకట కృష్ణారావుగారి నాయకత్వమున కొందరు యువకులు శ్రీ బ్రహ్మయ్యగారిని దర్శించి యీ ప్రస్తావన చేశారు. అది ప్రజోపయోగమైన పనిగనుక తమ సుముఖతను వారు తెలియజేశారు.

వెంటనే శ్రీ మండలి వెంకట కృష్ణారావుగారి అధ్యక్షతన బ్రహ్మయ్యగారి షష్ఠిపూర్తి సన్మాన సంఘం ఏర్పడినది. ఈ సంఘం షుమారు రు 60 వేలు విరాళములు వసూలుచేసి, పట్టాభి భవనముపై బ్రహ్మయ్యా హాలును నిర్మించినారు. శ్రీ బ్రహ్మయ్యగారి షష్ఠిపూర్తి ఉత్సవముతోపాటు ది 31-12-1958న ఈ భవన ప్రవేశోత్సవమును జరిపించుటకూడ జరిగినది.

అప్పటికి ఉభయ కృష్ణాజిల్లా కాంగ్రెసు సంఘాలు ఒకటిగా కలిపి వేయబడినవి. ఆనాటినుండి ఈనాటివరకు కృష్ణాజిల్లా కాంగ్రెసు పట్టాభి భవనములోను, సమావేశములు 'బ్రహ్మయ్య హాలు'లోను జరుగుచున్నవి.

## గ్రంథావిష్కరణ మహోత్సవము

"కృష్ణాజిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర" గ్రంథం ఆవిష్కరణ, జిల్లా కాంగ్రెసు మాజీఅధ్యక్షులకు సన్మానాలు, ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ, ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావు, రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ వీరమాచనేని వెంకటనారాయణగార్ల చిత్రపటావిష్కరణ, జిల్లా కాంగ్రెసు మాజీ అధ్యక్షుల చిత్రాల ఆవిష్కరణ ది 4-12-75 తేదీన బందరులో కృష్ణాజిల్లా కాంగ్రెసు కార్యాలయములోని 'శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య షష్ఠిపూర్తి హాలు'లో జరిగినది.

జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠి గారు స్వాగతం పలికారు. సర్దార్ పేట బాపయ్య జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

సభకు అధ్యక్షత వహించిన శాసనమండలి సభ్యులు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ వీరమాచనేని వెంకట నారాయణగారు స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ కలపాల సూర్యప్రకాశరావు, ఎమ్. ఎల్. సి. గారిచే సంకలనం చేయబడిన "కృష్ణాజిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర" గ్రంథాన్ని ఆవిష్కరించారు.

కాంగ్రెసు కార్యకర్త, జిల్లా కాంగ్రెసు సభ్యులు శ్రీ చాపరాల బ్రహ్మానందరావుగారిచే బహూకరించబడిన భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి చిత్రపటాన్ని పార్లమెంటు సభ్యులు శ్రీ మాగంటి అంకినీడు, రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ వీరమాచనేని వెంకట నారాయణగారి చిత్రాన్ని శాసన మండలి మాజీ అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారి చిత్రాన్ని జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు, జిల్లాకాంగ్రెసు మాజీఅధ్యక్షుల చిత్ర పటాలను స్వాతంత్ర్య సమర యోధులు శ్రీ తంగిరాల వీరరాఘవ రావుగారలు ఆవిష్కరించారు.

జిల్లా కాంగ్రెసు సంఘం తరపున గ్రంథ సంకలనకర్త శ్రీ కలపాల సూర్యప్రకాశరావుగారిని రాజ్యసభ మాజీ సభ్యులు శ్రీ కాశీనాధుని పూర్ణ మల్లికార్జునుడుగారు, జిల్లా కాంగ్రెసు మాజీ అధ్యక్షులైన సర్వశ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య, కానూరి చిన వెంకట దాసయ్య, వల్లభనేని రామ బ్రహ్మం, మాగంటి అంకినీడు, ఈడ్పుగంటి లింగయ్య, కాశీనాధుని పూర్ణ మల్లికార్జునుడు, తుమ్మల వెంకట కృష్ణారావు, పిన్నెంటి పమిడేశ్వరరావు, పెదర్ల వెంకట సుబ్బయ్య, పేట బాపయ్య, బండి తిరుపతయ్య, కలపాల సూర్యప్రకాశరావుగార్లను శ్రీ బుచ్చిరామ శేషయ్య శ్రేష్ఠిగారు ఖద్దరు శాలువలతో సత్కరించారు. ప్రస్తుత జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ రేపాల బుచ్చిరామ శేషయ్య శ్రేష్ఠిగారిని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాజ ముద్రికను రూపొందించిన బందరు పట్టణ నివాసి శ్రీ సూరిశెట్టి ఆంజనేయులుగారిని దుశ్శాలువలతో రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ వీరమాచనేని వెంకట నారాయణగారు సత్కరించారు.

శ్రీ వెంకట నారాయణగారు ప్రసంగిస్తూ భారత రాజకీయ చరిత్రకు శ్రీకారం చుట్టిన బందరుపట్టణంలో ఇంతమంది మహనీయులకు సన్మానాలు జరగడం గర్వకారణమన్నారు. కృష్ణాజిల్లా స్వాతంత్ర్య పోరాట చరిత్ర భారతీయ చరిత్ర కాగలదని అంటూ, ఈ చరిత్ర వ్రాసిన శ్రీ కలపాల సూర్యప్రకాశరావును అభినందించారు. దేశభక్తిని, జాతీయతను, సంస్కృతిని విడనాడకూడదని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెసు కార్యకర్తలలో నైతిక విలువలు పెరిగితే కాంగ్రెసు ప్రభుత్వంలో నైతిక శక్తి పెరగగలదని హెచ్చరించారు.

శాసన మండలి మాజీ అధ్యక్షులు, కాంగ్రెసు కురువృద్ధులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు కాంగ్రెసు చరిత్రను సాకల్యంగా వివరిస్తూ వుంటే స్వాతంత్ర్య పోరాటం యిప్పుడే జరుగుచున్నదా అనిపించింది. లోక్ సభా సభ్యులు శ్రీ మాగంటి అంకినీడు ప్రసంగిస్తూ పీడిత ప్రజోద్ధరణకు దీక్షాకంకణధారియైన మన ప్రియతమ ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధి నాయకత్వాన్ని బలపర్చవలెనని విజ్ఞప్తి చేశారు. ఎన్ని అధికార పదవులు చేపట్టినా భారత జాతిని దాస్య శృంఖలాలనుండి విముక్తులగావించి స్వాతంత్ర్యం సంపాదించిన స్వాతంత్ర్య సమర యోధులను విస్మరించరాదని జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ పిన్నమనేని కోటేశ్వర రావుగారన్నారు.

ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెసు అధ్యక్షులు శ్రీ కొమ్మినేని శేషగిరిరావు, సర్దార్ శ్రీ పేట బాపయ్య, శ్రీమతులు సూర్యదేవర అన్నపూర్ణమ్మ, వల్లభనేని సీతామహాలక్ష్మమ్మ, శ్రీ అప్పికట్ల జోసెఫ్ ప్రభృతులు కాంగ్రెసు ఆశయాలను అభివర్ణిస్తూ ప్రసంగించారు.

స్వాతంత్ర్య పోరాటగాథను భావితరముల కందించాలనే సత్సంకల్పముతో తలపెట్టిన ఈ కార్యక్రమం జయప్రదమగుటకు విచ్చేసిన పెద్దలకు, సహకరించిన మిత్రులకు, కార్యకర్తలకు శ్రీ శ్రేష్ఠిగారి కృతజ్ఞతలతో కార్యక్రమము ముగిసింది.



# తూర్పు కృష్ణాజిల్లా అధ్యక్ష - కార్యదర్శులు

## అధ్యక్షులు

సర్వశ్రీ

ముట్నూరు కృష్ణారావు పంతులుగారు
గొట్టిపాటి బ్రహ్మయ్య - ఘంటసాల
కామూరి చిన వెంకట దాసయ్య - కవుతరం
కొల్లిపర సూరయ్య - కపిలేశ్వరపురం
ఆత్మూరి నాగేశ్వరరావు - నెమ్మలూరు
కామినేని వెంకటప్పయ్య - భట్లపెనుమర్రు
దుగ్గిరాల బలరామ కృష్ణయ్య - అంగలూరు
వల్లభనేని రామబ్రహ్మం - జమిగొల్వేపల్లి
మాగంటి అంకినీడు - తమిరిశ
ఈడ్పుగంటి లింగయ్య - గుడివాడ
యెర్నేని వెంకటేశ్వరరావు - ముదినేపల్లి
కాశీనాదుని పూర్ణమల్లికార్జునుడు - మచిలీపట్టణం
తుమ్మల వెంకటకృష్ణారావు - కొడాలి
పిన్నెంటి పమిడేశ్వరరావు - మునిపెడ

## కార్యదర్శులు

సర్వశ్రీ

డా॥ భోగరాజు పట్టాభి సీతారామయ్య
దుగ్గిరాల రాఘవ చంద్రయ్య
సూరపనేని గోపాల కృష్ణయ్య
దిట్టకవి వీరరాఘవయ్య
బొడ్డా వెంకట శేషయ్య
కొడాలి ఆంజనేయులు
చిన్నకోట వెంకటస్వామి నాయుడు
నమ్మెట అక్కయ్య నాయుడు
కోడే గోపాలకృష్ణయ్య
పర్లల హనుమంతరావు
మొవ్వ వీరభద్రరావు

వల్లభనేని రామబ్రహ్మం
పామిరెడ్డి సుబ్బారావురెడ్డి
తంగిరాల వీరరామవరావు
కామూరి బలరామయ్య
వీరవనేని గోపాలకృష్ణయ్య
వేరేశ్వరపు కృష్ణమూర్తి
తమ్మా నాగిరెడ్డి
మండలి వెంకట కృష్ణారావు

## పశ్చిమ కృష్ణా జిల్లా

### అధ్యక్షులు

సర్వశ్రీ

ధన్వాద రామచంద్రరావు - విజయవాడ
అయ్యదేవర కాళేశ్వరరావు - విజయవాడ
దాసు మధుసూదనరావు -
రాజా కోటగిరి వెంకట కృష్ణారావుబహద్దూర్ - గంపలగూడెం
కాకుమాను లక్ష్మయ్య చౌదరి
పెదర్ల వెంకట సుబ్బయ్య - గుంటుపల్లి
నూకల వీరరాఘవయ్య — కానుమోలు
పేట బాపయ్య - తిరువూరు
మద్దాలి జగన్నాధం - పునాదిపాడు
కాకాని వెంకటరత్నం - ఆకునూరు

### కార్యదర్శులు

సర్వశ్రీ

మంటపాల సీతారామశర్మ
దిగువ నారాయణరావు
పెదర్ల వెంకట సుబ్బయ్య
కాకాని వెంకటరత్నం
వోలేటి గణపతిరావు పాత్రుడు
పేట బాపయ్య
కలపాల సూర్యప్రకాశరావు
రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠి

## తూర్పు - పశ్చిమ కృష్ణాజిల్లాలు కలసిన తదుపరి
## అధ్యక్ష - కార్యదర్శులు

సర్వశ్రీ

గొట్టిపాటి బ్రహ్మయ్య - అధ్యక్షుడు
చెన్నుపాటి రామకోటయ్య - కార్యదర్శి
తమ్మాబత్తుల లక్ష్మీనరసయ్య - ..
మేకా రంగయ్యప్పారావు - అధ్యక్షుడు
చెన్నుపాటి రామకోటయ్య - కార్యదర్శి
తమ్మాబత్తుల లక్ష్మీనరసయ్య - కార్యదర్శి
బంది తిరుపతయ్య - అధ్యక్షుడు
కొండపల్లి కృష్ణారెడ్డి - కార్యదర్శి
ఆలపాటి లక్ష్మయ్య - ..
రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠి - అధ్యక్షుడు
ఎదిగళ్ల వెంకటేశ్వరరావు - కార్యదర్శి
ఉండెమొదటి నాగభూషణం - ..
M. G. M. బాబర్ అలీ ఖాన్ - కార్యదర్శి
కలపాల సూర్య ప్రకాశరావు - అధ్యక్షుడు
ఈవని వీరరాఘవరావు - కార్యదర్శి
వాకిరెడ్డి మంజుశ్రీ - కార్యదర్శి
M. G. M. బాబర్ అలీ ఖాన్ - కార్యదర్శి
రేపాల బుచ్చిరామ శేషయ్యశ్రేష్ఠి - అధ్యక్షుడు
లింగంనేని పెదకుటుంబరావు - కార్యదర్శి
వాకిరెడ్డి మంజుశ్రీ - కార్యదర్శి
ఈవని వీర రాఘవరావు - కార్యదర్శి

## పశ్చిమ కృష్ణాజిల్లాలో వందేమాతరం ఉద్యమంలో అరెస్టయి శిక్షలు పడిన వారి పేర్లు

శ్రీ గాదివర్ల హరిసర్వోత్తమరావు - 3 సం॥.
శ్రీ బోడి నారాయణరావు - 3 మా॥

# అనుబంధం 2

## 1920 మొదలు 1923 వరకు అసహాయోద్యమములో శిక్షలు పొందినవారు

సర్వశ్రీ

రాజా కోటగిరి వెంకట కృష్ణారావు బహద్దూర్ - గంపలగూడెం - 1 సం॥
అయ్యదేవర కాళేశ్వరరావు - విజయవాడ - 1 సం॥
అద్దేపల్లి వెంకటగురునాధరామశేషయ్య - 1 సం॥.
లక్కరాజు సత్యనారాయణ ఆత్కూరు - 1 సం॥
మఠం బాలసుబ్రహ్మణ్యంగుప్త - విజయవాడ - 6 మా॥ - రెండవసారి 1 సం॥ 6 మా॥
- మూడవసారి 6 మా॥ - నాల్గవసారి 1 సం॥
కనగవరపు సుబ్బయ్యశాస్త్రి - కొండూరు - 8 మా॥
కనగవరపు ఆంజనేయశాస్త్రి - కొండూరు - 6 మా॥
మాదిరాజు సత్యనారాయణశాస్త్రి - విజయవాడ - 9 మా॥
రొయ్యూరు అమృతరామయ్య - రొయ్యూరు - 6 మా॥.
వేదాంతం శంభుశాస్త్రి - విజయవాడ - 1 సం॥
కొత్వాల్ అబ్బానల్లీ సాహెబ్ - మాజీవీడు 1 సం॥.
భట్టు వెంకోజి - మాజీవీడు - 1 సం.
తటవర్తి రంగయ్య - మాజీవీడు - 1 సం.
కల్లూరి రామారావు - మాజీవీడు - 1 సం.
దీక్షిత సూర్యప్రకాశరావు - మాజీవీడు - 1 సం.
చలమాల నారాయణ - మాజీవీడు - 6 మా.
భట్టు గోవిందరాజులు - మాజీవీడు - 6 మా.
చలమాల పెదకోటయ్య - మాజీవీడు - 6 మా.
మొహిద్దీన్ బేగ్ సాహెబ్ - మాజీవీడు - 6 మా.
గుజ్జులవల్లి రంగనాధం - మాజీవీడు - 6 మా.
పిల్లి సర్వయ్య - మాజీవీడు - 6 మా.
కంతేటి రామభోగయ్య - మాజీవీడు - 6 మా.
మాదేపల్లి వెంకయ్య - మాజీవీడు - 6 మా.
గరికపర్తి నాగభూషణదేవర - మాజీవీడు - 6 మా.

సర్వశ్రీ

మరింగంటి నాగభూషణాచార్యులు - నూజివీడు - 6 మా.
పేట బావయ్య - గంపలగూడెం - 6 మా.
సంతపురి నారాయణరావు - గంపలగూడెం - 6 మా.
ఊటుకూరు వెంకటప్పయ్య - డిటో - 6 మా.
సువారపు వెంకయ్య - డిటో - 6 మా.
రామవరపు వెంకయ్య - డిటో - 6 మా.
సీమలపాటి సుందరరామయ్య - డిటో - 6 మా.
గాయత్రి అనంతరామయ్య - ఉయ్యూరు - 1 మా. 50 రూ. జరిమానా.
వంగల బుచ్చన్న దీక్షితులు - డిటో - 1 మా. 50 రూ. జరిమానా.
వల్లభనేని వెంకట్రావు - డిటో - 2 మా.
చిమ్మగడ్డ లక్ష్మీనరసింహం - గొడవర్రు - 1 మా.
కూనపులి వెంకటేశ్వరశర్మ - డిటో 1 మా.
మద్దూరి శ్రీరామమూర్తి - డిటో 4 మా.
మారేపల్లి శ్రీరామచంద్రశాస్త్రి - డిటో 1 మా. 50 రూ. జరిమానా.
కొన్నవిత్తుల కుటుంబ సుబ్బారావు - గొడవర్రు - 1 మా.
వెంకటప్పారెడ్డి - బొడ్డపాడు - 4 మా.

## అనుబంధం 3

### 1923 నాగపూరు జెండా సత్యాగ్రహంలో శిక్షలు పొందినవారు

సర్వశ్రీ

| | | |
|---|---|---|
| మతం బాలసుబ్రహ్మణ్యంగుప్త | - విజయవాడ | - 6 నెలు |
| పోతిన గణపతిరావు పాత్రుడు | - డిటో | డిటో |
| బంకా అప్పయ్య పాత్రుడు | - డిటో | డిటో |
| తమ్మన నరసింహం | - డిటో | డిటో |
| పినపాటి మన్మధరావు | - డిటో | డిటో |
| కొన్నంగడ్డ సీతారామయ్య | - డిటో | డిటో |
| తాడికొండ పార్వతీశం | - డిటో | డిటో |
| కోట నాగభూషణం గుప్త | - డిటో | డిటో |

# అనుబంధం 4

## నెహ్రూ కమిటీ గుంటూరు వచ్చినప్పుడు అరెస్టుచేసి 3 రోజులు రిమాండులో వుంచినవారు

సర్వశ్రీ

కాకుమాను లక్ష్మయ్య - విజయవాడ - రు. 25 జరిమానా.
నల్లూరు బావయ్య - పరదుటం - రు. 15 జరిమానా.
కాట్రగడ్డ రఘురామయ్య - మొగల్రాజపురం రు. 15 జరిమానా.
పెదర్ల వెంకట సుబ్బయ్య - గుంటుపల్లి - రు. 15 జరిమానా.

# అనుబంధం 5

## 1932 లో లాఠీచార్జీచేసి వదలివేయబడిన సత్యాగ్రహులు

సర్వశ్రీ

అన్నే నాగయ్య - ముదునూరు
ఆలపాటి రాధాకృష్ణమూర్తి - విజయవాడ
భీమవరపు రామచంద్రరావు - విజయవాడ
బసవ వెంకట రమణయ్య - విజయవాడ
బంక ఏడుకొండలు - విజయవాడ
బావివల్లి అప్పంస్వామి - విజయవాడ
పువ్వుల భక్తవత్సలుడు - ముదునూరు
తుమ్మల వెంకట సుబ్బయ్య తండ్రి నాగయ్య ముదునూరు
బావివల్లి సూర్యనారాయణ - విజయవాడ
బుద్ధిరాజు సోమరాజు - వేరేరుపల్లి
దైపాని సుబ్బారాయుడు - మాటిపీడు
దైపాని సూర్యనారాయణ - పటమటలంక
దంపాని కోటయ్య - భట్లపెనుమర్రు
దంపాని సీతయ్య - భట్లపెనుమర్రు
దంపాని నారాయణమూర్తి - భట్లపెనుమర్రు
దంపాని శ్రీరాములు - భట్లపెనుమర్రు
చేకూరి వీరయ్య - భట్లపెనుమర్రు
చిమటా మల్లికార్జునుడు - ఉనికిలి

చలసాని గంగయ్య - పోలుకొండ - 2 పార్లు
దాగర్లమూడి బ్రహ్మయ్య - మేడూరు
చెన్నుపాటి రాఘవయ్య - పటమటలంక - 2 పార్లు
దాస రామమూర్తి - పటమటలంక - 2 పార్లు
చలమలశెట్టి కోటేశ్వరరావు - కానుమోలు
చలమలశెట్టి చన్నయ్య - కానుమోలు
దండిభొట్ల చంద్రయ్య - ఏలూరు
దండిప్రోలు సోమయ్య - ఏలూరు
దండిప్రోలు సన్యాసి - ఏలూరు
దేవరపల్లి నాగయ్య - చేబ్రోలు
భట్టు సీతారామయ్య - విజయవాడ
దేవినేని కోటయ్య - భట్లపెనుమర్రు
దేవినేని వెంకట్రామయ్య - భట్లపెనుమర్రు
దేవినేని నరసింహం - భట్లపెనుమర్రు
గవ్వ సూర్యనారాయణ - విజయవాడ
గుళ్లపల్లి సుబ్రహ్మణ్యం - మేడూరు
చల్లపల్లి వెంకట సుబ్బయ్య - గొడవర్రు
గవర ఆనందరావు - బాదంపూడి
గండిబోయిన పెంటయ్య - బాదంపూడి
గరికపాటి సత్యనారాయణ - పటమట
గూడూరు వీరభద్రరావు - పటమట
గూడ జగన్నాధశాస్త్రి - విజయవాడ
గుళ్లపల్లి వీరరాఘవయ్య - విజయవాడ
ఉప్పుగంటి రామకోటయ్య - నందమూరు
శాస్త్రి సూర్యనారాయణ - పటమట
కాట్రగడ్డ శ్రీనివాసరావు - మొగల్రాజపురం
కేసనరాజు బ్రహ్మయ్య - వెంట్రప్రగడ
కంభంపాటి వెంకటరత్నం - ఈడుపుగల్లు
కొల్లి శ్రీరాములు (రామకుమారవర్మ) - కనుమూరు
కడియాల పిచ్చయ్య - కాటూరు
కంభంపాటి వెంకటేశ్వరరావు - పైడిముక్కల
కాటంనేని కృష్ణయ్య - పైడిముక్కల
కొమ్మా బసవలింగం - పటమటలంక
కనుమూరి శ్రీరాములు - పటమటలంక

కొవరాజు బసవయ్య - తాడేపల్లి
కె. వీరభద్రయ్య - జంపన
మద్దుకూరి చంద్రశేఖరరావు - వెంట్రప్రగడ
మున్నే కనకయ్య - కాటూరు
మేరుగు దేవయ్య - మంటాడ
మేడిచర్ల ఆంజనేయులు - నరసారావుపేట
ముత్తేవి కేశవాచార్యులు - కురుమద్దాలి
మహమ్మద్ నజీరుద్దీన్ - విజయవాడ
మూల్పూరు లక్ష్మీనారాయణ - కేసరపల్లి
యమ్. కనకదుర్గయ్య - ఇంటూరు
నెక్కలపూడి శివరామ కృష్ణయ్య - కనుమూరు
నార్ల శీతారామయ్య - కాటూరు
నందరాజు భీమారావు - ఏలూరు
నాదెళ్ల రామసుబ్బయ్య - ఈడ్పుగల్లు
నాదెళ్ల కుటుంబయ్య - కాటూరు - 2 సార్లు
నాదెళ్ల వెంకటప్పయ్య - ముదునూరు
పాలడుగు సుబ్బారావు - ముదునూరు
పోలగాని రామలింగం - ఉయ్యూరు
పాలడుగు సత్యనారాయణ - ముదునూరు
పోతుల యర్రయ్య - విజయవాడ
పురుషోత్తం లక్ష్మయ్య - ఏలూరు
నాదెళ్ళ పూర్ణానందం - ముదునూరు
పురుషోత్తం వెంకటేశ్వరరావు - ఏలూరు
పొట్లూరు రామస్వామి - పార్వతీపురం
పర్వతనేని వీరరాఘవయ్య - నెప్పల్లి
పాలడుగు సూర్యనారాయణ - ముదునూరు
పర్వతనేని రాఘవయ్య - గురజాడ
పి. నరసింహరాజు - భీమవరం
పి. భాస్కరరాజు - మెట్లపాలెం
సుంకర వీరభద్రరావు - ఈడుపుగల్లు
సుంకర బలరామ కృష్ణయ్య - ఈడుపుగల్లు
సూరపనేని గోపాలకృష్ణయ్య - పెదసనగల్లు
సూరపనేని రంగారావు - పెదసనగల్లు
యస్. సుందరం - పైడిముక్కల

చుక్కా వెంకటస్వామిరెడ్డి - పైడిముక్కలం
యస్. బలరామమూర్తి - అంగలూరు
కాశీనేని రామచంద్రయ్య - అంగలూరు
వి. వెంకట సుబ్బయ్య - ముదునూరు
వి. చిన్న - ముదునూరు
త్రిపురనేని రాధాకృష్ణమూర్తి - అంగలూరు
తోటకూర వెంకటేశ్వరరావు - కాటూరు
వేములపల్లి వెంకట సుబ్బయ్య - కాటూరు
వెల్లంకి నరసయ్య - కాటూరు
తెన్నేరు నరసయ్య - ముదునూరు
తూమాటి నందేశ్వరశర్మ - ముదునూరు
వీరమాచనేని వెంకట్రామయ్య - ఈడుపుగల్లు
వెల్లంకి రాఘవయ్య - కలవపాముల
వంగవోలు వెంకట్రామయ్య - ఏలూరు
వల్లూరు వెంకటేశ్వరరావు - తోట్లవల్లూరు
వారణాసి సూర్యనారాయణ - తోట్లవల్లూరు
వెంట్రప్రగడ మాధవరావు - వెంట్రప్రగడ
యండూరు వీరరాఘవయ్య - గూడపాడు
యెర్లపెద్ది సుబ్రమణ్యం - నూజివీడు
యార్లగడ్డ వెంకటనారాయణ - నందివాడ
యార్లగడ్డ వెంకటరత్నం - నందివాడ
యలమంచిలి వెంకటప్పయ్య - పైడికొండలపాలెం
మహమ్మదు పెంటు - పైడికొండలపాలెం
యుప్పలి సుబ్బారావు - విజయవాడ
రుద్రరాజు సూరపరాజు - జన్నూరు
వాసిరెడ్డి రామారావు - వీరుళ్ళపాడు

## అనుబంధం - 6

### 15-6-30 రాజమండ్రి జైలులో దెబ్బలు తిన్నవారు

సర్వశ్రీ

వెలిదండ్ల హనుమంతరావు - విజయవాడ
ఘంటసాల సీతారామశర్మ - విజయవాడ
రాయప్రోలు సీతారామశాస్త్రి - విజయవాడ

మూకల వీరరాఘవయ్య - కాముమోలు
వేలూరు యజ్ఞనారాయణశర్మ - చిరివాడ

# అనుబంధం - 7

## 1930 లో అరెస్టుచేసి వదలి వేయబడిన స్త్రీ సత్యాగ్రహుల పేర్లు

శ్రీమతులు

అన్నే దుర్గాంబ - ముదునూరు
గుత్తికొండ సీతమ్మ - చిన్నకళ్ళేపల్లి
కాళంగి వెంకట రత్నమాంబ - విజయవాడ
కోగంటి లక్ష్మమ్మ - విజయవాడ
మైనేని రాజేశ్వరమ్మ - కనుమూరు
కొల్లిపర సీతమ్మ - కపిలేశ్వరపురం - 6 నెలలు
నాదెళ్ళ నాంచారమ్మ - ముదునూరు
పర్వతనేని వీరరాఘవమ్మ - నెప్పల్లె
వీరమాచనేని సీతమ్మ - ముదునూరు
వల్లభనేని అన్నపూర్ణమ్మ - ఉదుటూరు
యార్లగడ్డ రత్తమ్మ - పురిటిగడ్డ
ఎర్నిగళ్ళ లక్ష్మమ్మ - గరికపర్రు

## జైలుకెళ్లిన స్త్రీ సత్యాగ్రహులు

శ్రీమతులు

చెరుకూరి వియ్యమ్మ - 1 సం॥
గుత్తికొండ రాఘవమ్మ - 6 నెలలు జరిమానా 200 రు.
గుత్తికొండ లక్ష్మమ్మ - 6 నెలలు జరిమానా 200 రు.
గెల్లి కొండరామమ్మ - 1 సం॥
గాదె సుబ్బమ్మ 1 సం॥
కోగంటి లక్ష్మమ్మ 6 నెలలు జరిమానా 200రు.
కాట్రగడ్డ రామసీతమ్మ - 1 సం॥ జరిమానా 400 రు.
కొల్లిపర లక్ష్మీకాంతమ్మ - 1 సం॥
కోనేరు అనసూయ - 6 నెలలు

మైనేని శ్రీరామమ్మ - 1 సం॥
మిక్కిలినేని వరలక్ష్మమ్మ - 6 నెలలు జరిమానా 100 రు.
నాదెళ్ళ మహాలక్ష్మమ్మ - 6 నెలలు జరిమానా 100 రు.
పాలడుగు వరలక్ష్మమ్మ - 6 నెలలు జరిమానా 100 రు.
పాదుర్తి సుందరమ్మ - 6 నెలలు మరల 6 నెలలు
రామినేని రాజమ్మ - 1 సం॥
సూరపనేని అన్నపూర్ణమ్మ - 6 నెలలు జరిమానా 200 రు.
తుమ్మల సత్యవతమ్మ - 6 నెలలు జరిమానా 100 రు.
యక్కల పున్నమ్మ - 6 నెలలు
పెరంబూరి సుభద్రమ్మ - 6 నెలలు
కమలాదేవి చటోపాధ్యాయ - 1 సం॥

# అనుబంధం - 8

## 1930 మొదలు 1933 వరకు శిక్షలు పొందిన సత్యాగ్రహులు

సర్వశ్రీ

స్వామి నారాయణానంద సరస్వతి - 1 సం॥
అయ్యదేవర కాళేశ్వరరావు - 1 సం మరల 1 సం॥
కోటగిరి వెంకట కృష్ణారావు బహద్దూర్ - 1 సం॥
కాకుమాను లక్ష్మయ్య చౌదరి - 1 సం॥
మతం బాల సుబ్రమణ్యం గుప్త - 1 సం॥
దుగ్గిరాల రాఘవ చంద్రయ్య - 1 సం॥
పొమ్మూరి వీర రాఘవరావు గుప్త - 1 సం॥ మరల 1 సం॥
పేట బాపయ్య - 1½ సం॥ రెండవసారి 1 సం॥ జరిమానా 200
శనగవరపు సుబ్బయశాస్త్రి - 1½ సం॥
మరుపిళ్ళ చిట్టి అనే అప్పలస్వామి - 5 నెలలు
తొత్తిరి శ్రీరాములు - 5 నెలలు
పైడిబోతు అప్పలస్వామి - 5 నెలలు
వావిరెడ్డి వీరయ్య - 4 నెలలు
తుల్లపాటి సత్యనారాయణ - 4 నెలలు
వల్లభనేని వెంకటాపుచౌదరి - 9 నెలలు రెండవసారి 6 నెలలు
మైనేని వెంకట సుబ్బయ్య - 9 నెలలు రెండవసారి 1 సం॥ జరిమానా 400 రు.

అన్నే కేశవార్య - 9 నెలలు
తుమ్మల కోటయ్య - 9 నెలలు రెండవసారి 2 సం॥
తుమ్మల పెద సత్యనారాయణ - 9 నెలలు
కుర్ర వెంకట రత్నం - 9 నె॥ రెండవసారి 1 సం॥ + లాఠీదార్జి
వేదాంతం శంభుశాస్త్రి - 2 సం॥ రెండవసారి 6 నెలలు
వేమ వెంకట దుర్గా మల్లిఖార్జునరావు - 1½ సం॥
వెల్లంకి పూర్ణచంద్రయ్య - 1½ సం॥ రెండవసారి 6 నెలలు
జరిమానా 100 రు. మూడవసారి 1 సం॥ జరిమానా 200 రు.
గెల్లి రాజగోపాలం - 1½ సం॥ 2 వ సారి 1 సం॥ జరిమానా 200
అనుముకొండ సుబ్బయ్య—గుడివాడ - 6 నెలలు
వెలిదండ్ల హనుమంతరావు - 1½ సం.
వేలూరి యజ్ఞనారాయణశాస్త్రి - 1 సం. 6 మాసాలు.
మాకల వీరరాఘవయ్య - 1 సం. 6 మాసాలు.. రెండవసారి 1 సం.
పోతిన రాములు - 6 నెలలు.
మరుపిళ్ళ రామస్వామి - 6 నెలలు.
ఈదుప్పగంటి వెంకటనారాయణ - 6 నెలలు. రెండవసారి 1 సం.
శిరం రామమూర్తి - 6 నెలలు.
పిల్లా నారాయణమూర్తి - 6 నెలలు.
బైపిళ్ళ నన్నయ్య - 6 నెలలు.
గుజ్జారి నారాయణ - 6 నెలలు.
కాట్రగడ్డ మధుసూధనరావు - 1 సం. 6 నెలలు.
డా॥ రాయప్రోలు శితారామశాస్త్రి - 1 సం.
విశ్వనాథుని లక్ష్మీ నరశింహ శర్మ - 1 సం. 6 నెలలు.
కృత్తివెంటి కుటుంబరావు - 1 సం. 6 నెలలు.
రెండవసారి 1 సం. రు. 100 జరిమానా.
డుక్కా కనకయ్య - 4 నెలలు. రు. 100 జరిమానా.
రాంపిళ్ళ తాతయ్య - 4 నెలలు. రు. 100 జరిమానా.
వారణాసి అప్పలస్వామి - 4 నెలలు. రు. 100 జరిమానా.
బోయన రాములు - 4 నెలలు. రు. 100 జరిమానా.
మాగులూరి రామచంద్రయ్య - 1 సం. 6 నెలలు.
రాపూరి నరశింహారావు - 1 సం: 6 నెలలు.
వెంగపూడి సూర్యనారాయణ - 2 సం.
కొవ్వురాపూరి సత్యనారాయణ - 2 సం.

కాటిగడ్డ నారాయణరావు - 1 సం. 6 నెలలు.
రెండవసారి - 1 సం. 6 నెలలు. రు. 500 జరిమానా.
గార్లపాటి చిన సుబ్రహ్మణ్యం - 1 సం. 6 నెలలు.
రావులపల్లి సత్యనారాయణ - 7 నెలలు.
వేములపల్లి వెంకటసుబ్బయ్య - 7 నెలలు.
వానపల్లి సుబ్బారావు - 9 నెలలు.
లంకా గోవిందరాజులు - 9 నెలలు.
దశిక సూర్యప్రకాశరావు - 9 నెలలు;
రెండవసారి 6 నెలలు. రు. 100 జరిమానా.
తటవర్తి రంగయ్య - 9 నెలలు
పరిమిశెట్టి నీలాచలం - 9 నెలలు
మేకల రాములు - 9 నెలలు
మల్లెల రాములు (దర్జీ) - 9 నెలలు
సముద్రాల సత్యనారాయణ 9 నెలలు
సిరికొండ వల్లభరాయుడు - 9 నెలలు
పలివేటి రామకోటయ్య - 9 నెలలు
భట్టి గోవిందరాజులు - 9 నెలలు
కూరెళ్ల సత్యనారాయణ - 9 నెలలు
కొపిమి నరసింహం - 9 నెలలు
నండూరి వెంకటేశ్వరరావు - 2 సం. 2 వ సారి 1 సం.
మేదరమెట్ల సీతారామయ్య - 2 సం.
గుడివాడ వెంకటేశ్వర్లు - 2 సం. రెండవసారి 6 నెలలు జరిమానా రు 200
కొల్లిపర వెంకటరత్నం - 2 సం.
అన్నవరపు సుబ్బారావు - 2 సం.
శ్రీరాములు వెంకటేశ్వరరావు - 2 సం.
బొలిశెట్టి సత్యనారాయణ - 2 సం. రెండవసారి 1 సం.
కొమ్మూరి చెంచురామయ్య - 2 సం.
పేరెపు వెంకట రామయ్య - 2 సం. రెండవసారి 1 సం.
కొల్లూరి నాగేశ్వరరావు - 1 సం. 6 నెలలు
రెండవసారి - 1 సం జరిమానా 200 రు.
అద్దేపల్లి రామకృష్ణశాస్త్రి - 1 సం 6 నెలలు
ఐతల రామకృష్ణబ్రహ్మం - 6 నెలలు
వేదాంతం శివసుబ్రహ్మణ్యశాస్త్రి - 2 సం.
మోదిశెట్టి బసవరాజు - 2 సం

అనుమల రామగోవిందవర్మ - 2 సం 6 నెలలు
నందూరి వెంకటరంగాచార్యులు ,,
పైనూరి సుబ్రహ్మణ్యం - 2 సం
పిరాట్ల వెంకటరామారావు - 2 సం
శంకర వెంకట్రామయ్య - 1 సం
పులివెందల తిరుమలరావు - 6 నెలలు
కొండపల్లి వెంకటేశ్వరరావు - 2 సం
పాతూరి శీతారామయ్య 2 సం
పొన్నలూరి రాధాకృష్ణమూర్తి - 2 సం - రెండవసారి 1 సం
కతారు వీరాస్వామి - 2 సం
కోటగిరి పార్థసారధి - 2 సం
కాసులపాటి వెంకటేశ్వర్లు - 2 సం
కోటగిరి సూర్యప్రకాశరావు - 2 సం
కతారు రంగనాయకులు - 2 సం
కతారు గోవిందరావు - 2 సం
పూటుకూరు రామకృష్ణారావు - 2 సం
మురుకుట్ల వెంకటప్పయ్య - 2 సం
దారగుండ్ల సీతారామగుప్త - 2 సం
రామవరపు వెంకయ్య - 2 సం
అంకరాజు సుబ్బరాయశర్మ - 1 సం
పాంచాలవరపు నరసింహారావు - 1 సం
అట్లూరి బ్రహ్మానందం - 2 సం
శంకర హనుమంతరావు - 6 నెలలు
డాక్టరు ఘంటసాల సీతారామశర్మ - 1 సం 6 నెలలు
కందా వెంకటప్పయ్య - 6 నెలలు
తాతినేని వెంకటేశ్వరరావు - 6 నెలలు - రెండవసారి - 6 నెలలు
చల్లా లక్ష్మీనారాయణ - 6 నెలలు
భువనకదియం నాగభూషణం - 2 సం
సుంకర సత్యనారాయణ - 2 సం. రెండవసారి 1 సం.
శివలెంక మల్లికార్జునరావు - 2 సం. జరిమానా రు 200
చొప్పదంటు భద్రియ్య 2 సం. జరిమానా రు 200
దెందుకూరి శ్రీరామమూర్తి - 2 సం.
కూచిభొట్ల సీతారామశర్మ - 2 సం.
పెద్దిభొట్ల సీతారామశర్మ - 1 సం.

ఈదుర్వగంటి రామకోటయ్య - 2 సం.
మల్లాది శ్రీరామచంద్రశాస్త్రి - 2 సం.
పుచ్చా కుటుంబరావు - 2 సం.
చింతమనేని శ్రీరాములు - 1 సం.
వెలగల నరసయ్య - 1 సం.
భాగవతుల సుబ్బరామయ్య - 2 సం   రెండవసారి 6 నెలలు
నల్లూరి పాపయ్య - 2 సం. జరిమానా రు 200
కొవ్వవిత్తుల కుటుంబ సుబ్బారావు - 2 సం. జరిమానా రు 500
పిడికిటి రామకోటయ్య - 2 సం. జరిమానా రు 500
రెండవసారి జరిమానా రు 1000
కాకాని వెంకటరత్నం - 2 సం.   రెండవసారి 6 నెలలు
జరిమానా రు. 200
కాట్రగడ్డ భవానీ శంకరరావు - 1 సం.
కోకా నాగేంద్రరావు - 1 సం.
జాగర్లమూడి వెంకట్రామయ్య - 1 సం-   రెండవసారి 1 సం.
జరిమానా రు 100
ముప్పవరపు లక్ష్మీపతి - 1 సం.
చలమలశెట్టి కోటేశ్వరరావు - 1 సం. రెండవసారి 1 సం. జరిమానా రు 100
చెన్నుపాటి మురహరిరావు - 1 సం. జరిమానా రు 100
రెండవసారి 1 సం. లాఠీఛార్జి
రామినేని రాఘవయ్య - 1 సం. జరిమానా రు 100
పిడికిటి మాధవరావు - 1 సం.
కలపాల దశరథరామయ్య - 1 సం.
కోటగిరి పార్థసారథి - 2 సం.
గాదిరాజు వెంకటేశ్వరరావు - 6 నెలలు   రెండవసారి 6 నెలలు
రావర్ల వెంకట నరసింహారావు - 6 నెలలు   జరిమానా రు 50
కోట నాగభూషణం - 6 నెలలు   జరిమానా రు 50
హేమాద్రి వెంకట మురళీధరశర్మ - 6 నె.   జరిమానా రు 50
తాడేపల్లి వేణుగోపాలరావు - 6 నెలలు   జరిమానా రు 50
బోడివ గణపతిరావు - 6 నెలలు   జరిమానా రు 1
లొల్లా పేరిశాస్త్రి - 6 నెలలు   జరిమానా రు 50
వంకా విశ్వానందం - 6 నెలలు   జరిమానా రు 50
ఆనంతుని శరిపశరరాజస్వామి - 6 నెలలు జరిమానా రు 50

ఇంటూరి వెంకటేశ్వరరావు - 6 నెలలు జరిమానా రు 50
 రెండవసారి 2 సం. 6 నెలలు - జరిమానా రు 300
తాతినేని రామచంద్రయ్య - 6 నెలలు జరిమానా రు 50
పెదర్ల ఆదినారాయణ - 6 నెలలు జరిమానా రు 50
 రెండవసారి 6 నెలలు జరిమానా రు 100
 మూడవసారి 4 నెలలు జరిమానా రు 25
పెదర్ల వెంకట సుబ్బయ్య - 6 నెలలు జరిమానా రు 100
శిరివరపు వీరభద్రయ్య - 4 నెలలు జరిమానా రు 50
మల్లెల శ్రీరామమూర్తి - 4 నెలలు జరిమానా రు 50
గన్నె గంగాధరరావు - 1 సం.
పొనుకుమాటి నాగభూషణం - 1 సం.
కురాఖ పుల్లయ్య - 6 నెలలు
కురాఖ వెంకట్రామయ్య - 6 నెలలు
త్రిపురనేని వెంకయ్య - 6 నెలలు
అన్నె మల్లికార్జునరావు - 6 నెలలు రెండవసారి 6 నెలలు
జాలాది సత్యనారాయణ - 6 నెలలు
పాకలపాటి వెంకటరత్నం - 6 నెలలు
గూడపాటి వెంకట సుబ్బయ్య - 6 నెలలు
గుళ్లపల్లి లక్ష్మయ్య - 6 నెలలు
గోపరాజు బ్రహ్మానందం - 6 నెలలు
యలమంచిలి లక్ష్మయ్య - 6 నెలలు
అన్నె అంజయ్య 6 నెలలు రెండవసారి 6 నెలలు
 జరిమానా రు 200
తుమ్మల సీతారామయ్య - 6 నెలలు జరిమానా రు 100
మొవ్వా సత్యనారాయణ - 6 నెలలు రెండవసారి 1 సం.
దర్భా వెంకట కృష్ణమూర్తి - 2 సం॥
బులుసు లక్ష్మీపతి - 6 నెలలు
నరసింహరాజు - 6 నెలలు
రేపాల బుచ్చిరామశేషయ్య శ్రేష్టి - 6 నెలలు
కాటూరి వెంకటేశ్వరరావు - 6 నెలలు
మందరపు బాల వీరరాఘవయ్య. కొణకంచి - 6 నెలలు
అన్నె సుబ్రహ్మణ్యం - 1 సం॥ జరిమానా రు 400
అన్నె లక్ష్మయ్య 1 సం॥
ఆట్లూరి జయరామయ్య - 1 సం॥ జరిమానా రు 100

అరుమళ్ళ సుబ్బారెడ్డి - 6 నెలలు జరిమానా రు 100
అట్లూరి శ్రీరాములు - 1 సం॥ జరిమానా రు 100
అయినంపూడి శ్యామ సుందరశాస్త్రి - 1 సం॥ జరిమానా 100
బి. సుబ్బారావు - 6 నెలలు జరిమానా రు 80
బొమ్మిడి నరసింహం - 1 సం
భట్టర్ వెంకటాచార్యులు - 6 నెలలు జరిమానా రు 50
చలసాని రాజగోపాలం - 6 నె రు 100 రెండవసారి రు 25
చలసాని రామచంద్రరావు - 1 సం
సి హెచ్. రాఘవయ్య - 6 నెలలు
సి. పాపయ్య సోమయాజులు - 1 సం. జరిమానా రు 100
దుందూరి నాగభూషణం - 1 సం జరిమానా రు 100
దాసరాల వెంకట నారాయణ - 1 సం జరిమానా 75
ఈమని వెంకట రాజరత్నశర్మ - 6 నెలలు జరిమానా రు 100
రెండవసారి రు 25
గద్దె లింగయ్య - 6 నెలలు జరిమానా రు 200
హబిబుల్లా సాహెబ్ - 1 సం. జరిమానా రు 100
జాస్తి వెంకట్రామయ్య - 1 సం. జరిమానా రు 100
జీవి రాములు - 6 నెలలు
కేశిరెడ్డి సూర్యనారాయణ - 1 సం
కొల్లి వెంకట కృష్ణయ్య - 6 నెలలు జరిమానా 100
కృత్తివెంటి సీతారామయ్య - 1 సం.
కొమ్మూరి నరసయ్య - 1 సం. జరిమానా రు 75
కారుమూరి సుబ్బారెడ్డి - 6 నెలలు జరిమానా రు 50
కామినేని పున్నయ్య - 1 సం జరిమానా రు 100
కొడాలి శ్రీరాములు - 7 సం 6 నెలలు జరిమానా రు 1000
మామిళ్లపల్లి సూర్యప్రకాశరావు - 6 నెలలు జరిమానా రు 100
మొవ్వ వెంకటప్పయ్య - 1 సం జరిమానా రు 75
మొవ్వ కోటయ్య - 1 సం. జరిమానా రు 75
రాంపిళ్ల నాగేశ్వరరావు - 1 సం.
పిడికిటి నారాయణమూర్తి - 1 సం. జరిమానా 250
పర్వతనేని వెంకయ్య - 6 నెలలు
వల్లపోతు భగవానులు - 1 సం జరిమానా రు 75
పిళ్ళా సన్యాసి - 1 సం
పొట్లూరి గోపాలరావు - 1 సం

ప్రతాప సత్యనారాయణ - 1 సం జరిమానా రు 100
రామినేని కోటయ్య - 6 నెలలు జరిమానా రు 200
ఆర్. సత్యనారాయణ - 1 సం
రావర్ల విశ్వానందశర్మ - 6 నెలలు
రామకృష్ణయ్య - 1 సం
మంకర సుబ్బారావు - 1 సం జరిమానా 100
మంకర రాజయ్య - 6 నెలలు జరిమానా రు 200
మంకర కృష్ణమూర్తి - 6 నె
టి. యన్. వి. నారాయణ - 6 నె జరిమానా రు 25
రుద్రరాజు వెంకట కృష్ణరాజు - 1 సం. జరిమానా రు 100
వీరమాచనేని రామకోటయ్య - 1 సం
కాటుకూరు లక్ష్మీనరసింహారావు - 1 సం
అయ్యదేవర కాళేశ్వరరావు - 3 వ - సారి 3 నె
కాకుమాను లక్ష్మయ్య చౌదరి - 2 వ సారి 1 సం
కాట్రగడ్డ మధుసూదనరావు - 2 వ సారి 1 సం
తుమ్మల వెంకట సుబ్బయ్య - 6 నె జరిమానా రు 50
తుమ్మల రాజారామమోహనరావు - 6 నె జరిమానా రు 50

## అనుబంధము - 9

### తూర్పు కృష్ణాజిల్లా

### 15-3-1930 బందరు నల్లజెండాల కేసులో అరెస్టుచేసి జైలుకు పంపబడినవారు

సర్వశ్రీ
పల్లూరు రామారావు
కొడాలి ఆంజనేయులు
మునగంటి వెంకట్రావు
తల్లాప్రగడ రామారావు
గొట్టిపాటి బ్రహ్మయ్య
బొబ్బా వెంకటశేషయ్య
అన్నే వెంకటరత్నం
గూడూరు వెంకటచలం
పర్లమూడి సత్యనారాయణ
బొబ్బా ఆదినారాయణమూర్తి

బొబ్బా రంగారావు
ఉ. ఆదినారాయణ

## వీరిని రోడ్డుమీదనే ఆపివేసిరి

సర్వశ్రీ
గొర్రెపాటి వెంకట సుబ్బయ్య
గొర్రెపాటి వెంకట్రామయ్య
తుమ్మల వెంకట్రామయ్య
సివపాల నాగభూషణం
వేమూరు వెంకట్రామయ్య
మూల్పూరు లక్ష్మీకాంతం
అంవసల్లి వెంకటాద్రి
నార్ల వెంకటేశ్వరరావు
పోచిరాజు కృష్ణారావు
కార్లి మాధవరావు
ఏలామహూరి సత్యనారాయణమూర్తి
అరికపూడి కోటయ్య
పిన్నమనేని వీరయ్య
ధూళిపాటి సుబ్బారావు
దండమూడి పట్టాభిరామయ్య
శ్రీపతి పండితారాధ్యుల శరభయ్యశర్మ
దండమూడి పూర్ణయ్య
వేమూరి శివరామ కృష్ణారావు
ముత్తేవి సీతారామానుజాచార్యులు
పిన్నమనేని వీరభద్రయ్యచౌదరి
కామినేని వెంకటప్పయ్యగారు

# అనుబంధం 10

## 1930-31 ఉద్యమంలో శిక్షలు అనుభవించినవారు

సర్వశ్రీ
వెలకపాటి వెంకట నరసింహము - బందరు - 1 సం.
భోగరాజు పట్టాభి సీతారామయ్య - బందరు - 1 సం.

కాశీనాధుని వీరమల్లయ్య - యలమర్రు - 9 నెలలు
కామినేని వెంకట్రామారావు - యలమర్రు - 6 నెలలు.
కోఠే గోపాలకృష్ణయ్య - యలమర్రు - 6 నెలలు.
అదనంగా రు. 100 జరిమానా. లేక 4 వారాలు శిక్ష.
పం. శరభయ్య శర్మ - యలమర్రు - 1 సం.
మిక్కిలినేని వెంకట సుబ్బయ్య - యలమర్రు - 6 నెలలు.
కొల్లిపర కుటుంబయ్య - డిటో 6 నెలలు.
కనకమేడల వెంకట సుందరం - డిటో 1 సం.
తాడికొండ వీరభద్రయ్య అయ్యవారు డిటో 9 నెలలు.
దూదగడప నరసింహారావు - గూడూరు - 1 సం.
అరికెపూడి హరిదాసులు - అంగలూరు - 9 నెలలు.
అదనంగా రు. 50 జరిమానా లేక 4 వారాలు శిక్ష.
అరికెపూడి నాగభూషణం - అంగలూరు - 6 నెలలు. రెండవసారి 6 నెలలు.
చలసాని నాగభూషణం - అంగలూరు - 9 నెలలు.
అరికెపూడి కోటయ్య - అంగలూరు - 9 నెలలు. రెండవసారి 6 నెలలు.
దుగ్గిరాల వరప్రసాదరావు - డిటో 9 నెలలు.
గొట్టిపాటి శివాజీరావు - డిటో 9 నెలలు.
త్రిపురనేని హరిప్రసాదరావు డిటో 6 నెలలు. రెండవసారి 6 నెలలు.
త్రిపురనేని నాగభూషణ చౌదరి - అంగలూరు - 1 సం.
కొవరాజు సత్యనారాయణ చౌదరి - అంగలూరు - 6 నెలలు. రెండవసారి 6 నెలలు
ఎర్నేని బ్రహ్మయ్య - అంగలూరు - 6 నెలలు. రెండవసారి 6 నెలలు.
దుగ్గిరాల వెంకట సుబ్బయ్య - అంగలూరు - 6 నెలలు.
దుగ్గిరాల నాగయ్య - డిటో 6 నెలలు.
అక్కినేని లక్ష్మి పెరుమాళ్లు డిటో 6 నెలలు.
గొట్టిపాటి పున్నయ్య - డిటో 6 నెలలు.
గొట్టిపాటి శ్రీరాములు - డిటో 6 నెలలు.
త్రిపురనేని రామశాస్త్రులు - డిటో 6 నెలలు.
ఎర్నేని సుబ్రహ్మణ్యం - డిటో 6 నెలలు.
ఎర్నేని సూర్యనారాయణ - డిటో 6 నెలలు.
త్రిపురనేని కోటయ్య - డిటో 6 నెలలు.
త్రిపురనేని అనసూయ - డిటో 6 నెలలు.
అరికెపూడి సుందరరామయ్య - డిటో 6 నెలలు.
త్రిపురనేని జయలక్ష్మి - డిటో 6 నెలలు.
గొట్టిపాటి వెంకటరత్నం - డిటో 6 నెలలు.

ఎర్నేని పుల్లమ్మ - డిటో 6 నెలలు

దగ్గిరాల బలరామకృష్ణయ్య డిటో సం

శ్రీమతి దగ్గిరాల కమలమ్మ డిటో 6 నెలలు

సర్వశ్రీ

వల్లభనేని రామబ్రహ్మం - జమీగొల్వేపల్లి - 6 నెలలు రెండవసారి 3 నెలలు

వల్లభనేని వెంకట కృష్ణయ్య - జమీగొల్వేపల్లి - 6 నెలలు

సన్నపనేని పున్నయ్య - డిటో 6 నెలలు

మోటూరు చలపతిరావు - డిటో 6 నెలలు 2వ సారి 6 నెలలు

తమ్మారెడ్డి సుందరరామయ్య - బల్లిపర్రు 6 నెలలు

గుళ్ళపల్లి రామబ్రహ్మం - కురుమద్దాలి - 6 నెలలు రెండవసారి 3 నెలలు

గుళ్ళపల్లి దాసయ్య - కురుమద్దాలి - 6 నెలలు

గుళ్ళపల్లి శ్రీరాములు - డిటో 6 నెలలు

చిన్నమనేని వీరయ్య - డిటో 6 వారాలు (నల్లజెండాలు) 2వ సారి 6 నెలలు

ముత్తేవి కేశవశర్మ - కురుమద్దాలి - 6 నె

గుళ్లపల్లి దాసయ్య (3వ సారి) - కురుమద్దాలి 6 నె

పొట్లూరి కృష్ణయ్య - కొమరవోలు - సం

రాళ్లబండి దుర్గానాగేశ్వరరావు - కొమరవోలు - 6 నె

కొమ్మ సత్యనారాయణ .

పింగవరపు అప్పారావు సం

అరికెపూడి కోటయ్య 6 నె

పొట్లూరి ఆంజనేయులు

పొట్లూరి సీతారామయ్య . .

ఈడుపుగంటి వెంకటనారాయణ - పెదమద్దాలి - 6 నె

మిక్కిలినేని రామకోటయ్య . సం

మాగంటి సత్యనారాయణ - గోపవరం - 6 నె

మాగంటి నాయుడమ్మ - సం

చింతపల్లి అంకినీడు - ముదినేపల్లి 6 నె

కోడూరు వెంకటశేషయ్య - ముదినేపల్లి 6 నె

కోడూరు వెంకట్రామయ్య - 6 నె

చింతపల్లి అర్జునుడు అనే రామయోగి 6 నె

చింతపల్లి హరిశ్చంద్రుడు 6 నె

మామిడి శ్రీరామమూర్తి - కైకలూరు 6 నె

అరికెపూడి రామదాసు - వైవాక 6 నె

దొప్పన సుబ్బయ్య - చిరుచింతల 1 సం

పారేపల్లి వెంకట రామారావు - జనార్ధనపురం 1 వం
చిట్టా శ్రీమన్నారాయణమూర్తి - గుడివాడ 1 వం
దేవులపల్లి స్వామినాధశాస్త్రి - .. 1 వం
భాగవతుల పూర్ణానందం .. 1 వం
బొగ్గవరపు వెంకటకృష్ణయ్య - .. 6 వె
చిట్టావఝల రంగారావు - .. 6 వె
గోమగుంట్ల సుబ్రహ్మణ్యంగుప్త - .. 8 వె
చెఱువు మల్లికార్జునుడు - .. 1 వం 8 వె
వెలతంపల్లి సత్తెయ్య - .. 1 వం
వెలతంపల్లి సీతయ్య - .. 1 వం
సున్నం నరసింహం - దెందులూరు 1 వం
అయినంపూడి సుబ్బారావు - అయినంపూడి 1 వం
అయినంపూడి శ్రీరాములు - .. 6 వె
అట్లూరి రంగయ్య - పారుపూడి 1 వం 8 వె
మారపనేని ప్రభాకరరావు - చింతకుర్రు 1 వం 8 వె
రెడ్డిపల్లి వెంకటరత్నం - దొండపాడు 1 వం
కొల్లిపర సుబ్బారావు - బందారం 6 వె
అన్నే రామబ్రహ్మం - బొమ్ములూరు 3 వె
అన్నే వెంకట శివుడు - .. 3 వె 16 రో
వల్లభనేని వెంకటకృష్ణయ్య - .. 6 వె
అట్లూరి నగేశ్వరరావు - నెమ్మలూరు 6 వె
నరామపూడి భాస్కరరావు - .. 1 వం
బొప్పన సీతారామయ్య - వనమర్రు 1 వం
దావులూరి సూర్యనారాయణ - వనమర్రు 1 వం
కాజ బుచ్చి గంగయ్య - వనమర్రు 1 వం
వడ్డికట్ల వెంకట లక్ష్మీనరసింహమూర్తి - వనమర్రు 6 వె
యలమంచిలి వెంకయ్య - వనమర్రు 6 వె
కొల్లి రామస్వామి - .. 2 వం
అట్లూరి రామదాసు - పెరిశేపల్లి - 6 వె
చెరుకూరి చంద్రమౌళి - .. - 6 వె
గొట్టిపాటి సూర్యనారాయణ - పెరిశేపల్లి 6 వె
చెరుకూరి లక్ష్మణస్వామి - పెరిశేపల్లి - 6 వె
పామిరెడ్డి వెంకటారెడ్డి - కోలవర్రు 1 వం
పామిరెడ్డి శేషారెడ్డి - .. 6 వె

పోలవరపు రామారావు - .. - 6 నె
పోలవరపు గోపాలకృష్ణయ్య .. - 1 సం
నిమ్మగడ్డ వెంకటకృష్ణయ్య - .. - 1 సం
నిడిమూడి కాళహస్తిలింగం - .. - 6 నె
పామిరెడ్డి సుబ్బారావు రెడ్డి - .. - 1 సం
చెఱువు సుబ్బారావు - వడుపూరు అగ్రహారం - 6 నె
చెఱువు వెంకటాచలం - .. - 1 సం
సమ్మెట అక్కయ్యనాయుడు - ముక్కొల్లు - 6 నె
సమ్మెట రాధాకృష్ణయ్య - .. - 1 సం
సమ్మెట సత్యనారాయణ - .. - 6 నెలలు
సమ్మెట వెంకట్రామయ్య - .. - 6 నెలలు
సమ్మెట వెంకటరత్నం - .. - 6 నెలలు
ఉపా నాంచారయ్య - .. - 6 నెలలు
కంచికొండ వెంకటసుబ్రహ్మణ్యం .. - 6 నెలలు
కామూరి చిన వెంకట దాసయ్య - కవుతరం - 1 సం
కామూరి వెంకట రత్నం - .. - 1 సం
కామూరి బ్రహ్మయ్య - .. - 6 నెలలు
పత్తి అర్జునుడు - .. - 6 నెలలు
కొమ్మారెడ్డి సుబ్బయ్య - .. - 6 నెలలు
వడ్లమూడి శ్రీకృష్ణమూర్తి - .. - 2 సం
కొల్లి మాధవరావు - .. - 6 నెలలు
వడ్లమూడి వెంకట్రామయ్య - .. - 1 సం
తాట్యారి దుర్గాప్రసాదరావు - .. - 1 సం
కామూరి రామానందం - .. - 1 సం
దొప్పా వీరభద్రుడు - .. - 1 సం
దొప్పా వెంకట శేషయ్య - .. 1 సం 4 నెలలు వల్లతెలదాలు
దొప్పా సత్యనారాయణ - .. - 4 నెలలు
దొప్పా ఆదినారాయణమూర్తి - .. - 4 నెలలు
దొప్పా రంగయ్య - .. - 4 నెలలు
దొప్పా మధుసూదనరావు - .. - 2 సం
వీరమాచనేని వెంకటప్పయ్య - పైడికొండలపాలెం - 1 సం
మాగంటి రామచంద్రరావు - కపిలేశ్వరపురం - 1 సం
తాతినేని వీరరాఘవయ్య - .. - 1 సం
చివులూరి సత్యనారాయణ - .. - 1 సం

కొల్లివర సూరయ్య - - నం
కాతినేని కుటుంబయ్య - - సం
కాతినేని కోటయ్య - - నం
కాకర్ల కోటయ్య - - 6 నెలలు
చిగురుపాటి కుటుంబయ్య - కపిలేశ్వరపురం - నం
దండమూడి పూర్ణయ్య - పెనుమత్స - 6 నెలలు
సూరపనేని వీరయ్య - పెదసనగల్లు - 6 నెలలు
సూరపనేని వెంకటరత్నం - పెదసనగల్లు - 6 నెలలు
పొలడుగు సుబ్బారావు చౌదరి - ముసునూరు - సం
పాలడుగు సూర్యనారాయణ - - 9 నెలలు
గుత్తికొండ సత్యనారాయణ - చినకళ్ళేపల్లి - 6 నెలలు
అచ్యుతస వెంకట హనుమంతరావు - - సం
కోనేరు బసవయ్య - - 6 నెలలు
మసియాడపు సాంబయ్య - పామర్రు - 6 నెలలు
దేవినేని భీమయ్య - ఘట్లపెనుమర్రు - 6 నెలలు
చలసాని నారాయణమూర్తి - - 6 నెలలు
గొట్టిపాటి పద్మనాభయ్య - , - 6 నెలలు
గొట్టిపాటి నాగభూషణం - ,, - 6 నెలలు
కామినేని వెంకటప్పయ్య - ,, - 6 నెలలు
గొట్టిపాటి సూర్యనారాయణ - - నం
కుదరవల్లి వెంకటరత్నం - నెమ్మకూరు - నం
అడుసుమిల్లి సీతారామయ్య - - నం
గురజాడ రాఘవశర్మ - గుడ్లవల్లేరు - 9 నెలలు
మాదికొండ సత్యనారాయణశాస్త్రి - బందరు - 9నెలలు రెండవసారి - 6 నెలలు
తత్వానందస్వామి - బందరు 9 నెలలు
టి పి ఆళ్వారు - 9 నెలలు
తూములూరి వెంకటప్పయ్య - బందరు - సం
వారణాసి వెంకటాచలం - బందరు 6 నెలలు రెండవసారి - 6 నెలలు
తంగిరాల వీరరాఘవరావు - బందరు - 6 నెలలు
ధూళిపాటి వెంకట సుబ్బారావు - బందరు - 6 నెలలు
ముట్నూరి కృష్ణారావు పంతులు ,, ,,
నుసర్ల నాగేశ్వరశాస్త్రి ,, ,,
కాన్కర్ల గోపాలకృష్ణమూర్తి ,, ,,
మంగళపల్లి రాజేశ్వరరావు - బందరు - 6 నె

పురాణం సూరిశాస్త్రి - బందరు - 6 నె - రెంగవపాడు - 6 నె
పెనుమర్తి లక్ష్మీపతిశాస్త్రి - బందరు - 6 నె
పోచిరాజు కృష్ణారావు - బందరు - 1 సం.
తోట నరసయ్య - డిటో 1 సం.
అశ్వపాటి రామదాసు - డిటో 1 సం.
మేడూరు వెంకటసంపతిరావు - డిటో 1 సం.
మేకల ఆదినారాయణ - డిటో 2 నెలలు.
పురాణం నాగభూషణం - డిటో 6 నెలలు.
కంభంపాటి సాంబయ్య - డిటో 6 నెలలు.
కొడాలి ఆంజనేయులు - డిటో 1 సం. 4 వారాలు. (నల్లజెండాలకేసు)
పల్లాకి రామారావు - డిటో 6 నెలలు.
తిల్లాప్రగడ రామారావు - బందరు 6 నె
గుమ్మడి సూర్యప్రకాశరావు - దోసపాడు 2 నె
దొయిపాటి వీరభద్రయ్య .. 1 సం
మూల్పూరు సుబ్బారావు .. 2 నె
వల్లభనేని సోమయ్య - తోట్లవల్లూరు - 1 సం.
సూరిశెట్టి కృష్ణమూర్తి - దేవరం - 2 నె
వీరమాచనేని సత్యనారాయణ - చల్లపల్లి - 6 నె
మొవ్వ రాజగోపాలరావు - మొవ్వ - 9 నె
తాతినేని వీరరాఘవయ్య .. 9 నె
మొవ్వ వీరభద్రరావు .. 6 నె
అడిశెట్టి గోపయ్య - మొవ్వపాలెం - 6 నె
గుర్రా భద్రయ్య - గూడవాడు - 9 నె
గుర్రా కృష్ణారావు .. 6 నె
కొల్లి వెంకటకృష్ణయ్య - వరవంపాలెం - 9 నె
వీరపనేని చినబసవపున్నంబయ్య - వరవంపాలెం - 9 నె
సూరపనేని గోపాలకృష్ణయ్య - పాములపాడు - 6 నె
గొట్టిపాటి బ్రహ్మయ్య - ఘంటసాల - 6 నె
కాజ వెంకటరత్నం - అప్పికట్ల - 6 నె
గొర్రెపాటి వెంకటసుబ్బయ్య (నల్లజెండాల కేసు)
ఘంటసాల 9 నెలలు
దోనేపూడి సీతారామయ్య - .. - 9 నెలలు
వేమూరి వెంకట్రామయ్య - .. - 9 నెలలు
గొర్రెపాటి నరసింహం - .. - 6 నెలలు

బోయపాటి కృష్ణారావు - .. - 9 నెలలు
బోనేపూడి వెంకట సుబ్బయ్య - .. - 6 నెలలు
ఆకురాతి వీర రాఘవయ్య - కోసూరు - 9 నెలలు
రెండుచింతల వెంకట్రామయ్య - .. - 1 సం
మేకా వెంకయ్య - .. - 9 నెలలు
గుళ్లపల్లి నాగయ్య (జైలులో చనిపోయిరి) పేసూరు - 6 నె
కామరాజుగడ్డ వెంకట సుబ్బయ్య - .. - 6 నె
యార్లగడ్డ సూర్యనారాయణ - వానపాముల - 9 నెలలు
పొట్రు రామయ్య - పెంట్రప్రగడ - 6 నెలలు
గొనరాజు నాగభూషణం - .. - 6 నెలలు
పద్దుకూరి చంద్రశేఖరరావు - పెంట్రప్రగడ - 6 నెలలు
కొల్లి శ్రీమన్నారాయణ - చింతకుర్రు - 6 నె
గరికపాటి నాగభూషణం - పెంట్రప్రగడ 6 నె
లంక శేషయ్య - కపిలేశ్వరపురం - 6 నె
చెరుకూరి కాళహస్తీశ్వరశర్మ - వీరంకిలాకు - 6 నె
రాతినేని రామమూర్తి - పైవాక - 6 నె

## అనుబంధం - 11

### 1932 - 1934 ఉద్యమంలో జైలుశిక్షలు - లాఠీదార్జీలు పొందినవారు

సర్వశ్రీ

ప్రయాగ సత్యనారాయణ - గంజాం జిల్లా - 1 సం
కొడాలి బసవయ్య - గుడివాడ - 6 నె
చెరుకువాడ వెంకట నరసింహం - బందరు - 1 సం
దిగుమర్తి రామస్వామి - బందరు - 2 సం జరిమానా రు 200
భోగరాజు పట్టాభి సీతారామయ్య - బందరు - 2 సం
ముట్నూరి కృష్ణారావు పంతులు - బందరు - 2 సం
పేమూరి దుర్గా నాగేశ్వరరావు - బందరు - 2 సం
పై ముగ్గురికి గుడివాడ కోర్టులో శిక్షలు
కామూరి చినవెంకట దాసయ్య - కవుతరం - 1 సం
కేశవరపు నరసింహారావు - గుడివాడ - 18 నె జరిమానా 500
మదుసూరి గుర్రాజు - .. 18 నె ..

గుళ్లపల్లి రామబ్రహ్మం - 6 నె జరిమానా రు 500
రావికొండ వీరభద్రాచార్యులు - తైకలూరు 1 వం తీవ్రమైన లాఠీచార్జి
కొడాలి ఆంజనేయులు - బందరు
వల్లభనేని రామబ్రహ్మం - జమిగోల్వేపల్లి
పామిరెడ్డి వెంకట సుబ్బారావురెడ్డి - దో.వద్రి
గోనుగుంట్ల సుబ్రహ్మణ్యంగుప్త - గుడివాడ
పై నలుగురికి గుడివాడలో తీవ్రమైన లాఠీచార్జిచేసిరి
గొట్టిపాటి బ్రహ్మయ్య - బందరులో అరెస్టుచేసిరి
కొడాలి ఆంజనేయులు
కొల్లిపరసూరయ్య - బందరు హోటల్లో అరెస్టు చేసిరి
పామిరెడ్డి వెంకట సుబ్బారావురెడ్డి
పేకేటి వీరారెడ్డి
పేకేటి రంగారెడ్డి
రామిరెడ్డి సుబ్బారెడ్డి
పై నలుగురిని కాజలో కొట్టి అరెస్టుచేసిరి సుబ్బారెడ్డిగారికి 2వం శిక్ష
గోవిందలూరు సూర్యప్రకాశరావు - బందరు - కొట్టి వదలివేసిరి
ఎర్నేని సుబ్రహ్మణ్యం - అంగలూరు - వం॥ జరిమానా రు 100
